www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 21
సంచిక (Issue) : 358

మంగళవారం | 26-3-2024

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి మ. 2.57 తదుపరి విదియ; నక్షత్రం: హస్త మ. 1.34 తదుపరి చిత్త; వర్జ్యం: రా.10.24-12.14; దుర్ముహూర్తం: ఉ.8.44-9.32, రా.10.18-11.04; అమృతఘడియలు: ఉ.6.50-8.37; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.18; సూర్యాస్తమయం: 6.24

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నా ఇంటిని ఎర్రబెల్లి లాక్కొన్నారు

ఆయన బంధువు పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు



- పోలీసులతో కిడ్నాప్ చేయించి, హింసించారు
- అప్పటి టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు..
- సీసీఎస్ ఏసీపీ ఉమా మహేశ్వర్‌రావు బెదిరించారు
- సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో థర్డ్ డిగ్రీ ప్రయోగించారు
- రూ.50 లక్షల నగదు వసూలు చేశారు
- సీఎం రేవంత్‌కు వ్యాపారి శరణ్‌చౌదరి ఫిర్యాదు
- దుబాయ్ నుంచి ఈ-మెయిల్.. ప్రభుత్వం సీరియస్
- దర్యాప్తు చేయాలంటూ డీజీపీకి ఆదేశాలు జారీ?

వరంగల్/హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుపై బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు, హైదరాబాద్ బంజారాహిల్స్‌కు చెందిన వ్యాపారి శరణ్ చౌదరి తీవ్ర ఆరోపణలు చేశారు. ఏడాది క్రితం అప్పట్లో మంత్రిగా ఉన్న ఎర్రబెల్లి తనను బెదిరింపులకు గురిచేసి, తన ఇంటిని ఆయన బంధువు పేరిట రాయించుకున్నారని, ఇందుకు అప్పటి పోలీసు ఉన్నతాధికారులు ఎర్రబెల్లికి సహకరించారని ఆరోపించారు. ఇల్లును బంధువు పేరిట రిజిస్ట్రేషన్ చేయించడంతో పాటు తనను సీపీఎస్‌లో ఉంచి.. బలవంతంగా రూ.50 లక్షల నగదును ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారని వాపోయారు. ఈ మేరకు దుబాయ్ నుంచి శరణ్ చౌదరి... సీఎం రేవంత్, డీజీపీ రవి గుప్తాకు వేర్వేరుగా ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఎస్ఐబీ ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ పరారీలో ఉన్న అప్పటి టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు, అప్పట్లో హైదరాబాద్ సీసీఎస్ ఆర్థిక నేరాల విభాగాన్ని పర్యవేక్షించిన ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు తనను తీవ్రంగా హింసించారని ఫిర్యాదులో శరణ్ పేర్కొన్నారు. అప్పటి ఏసీపీ ఉమామహేశ్వర్ రావు తనను కింద పడేసి బూటు కాళ్లతో తన్నారని

మిగతా 13వ పేజీలో...

రేవంత్ ఇంటిపై ప్రణీత్ నిఘా



ఇజ్రాయెల్ నుంచి ట్యాపింగ్ పరికరం కొనుగోలు

- రేవంత్ నివాసం సమీపంలోనే అడ్డా
- ప్రతి సంభాషణనూ విన్న అప్పటి అధికారులు
- సహకరించిన ఎస్ఐబీ కన్సల్టెంట్ రవిపాల్
- ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు ముమ్మరం
- సినీ, రియల్టీ, నగల వ్యాపారుల ఫోన్లు ట్యాప్!
- ఇదే పద్ధతిలో వ్యాపారులను బెదిరించి.. ఎలక్టోరల్ బాండ్లను కొనిపించి.. సేకరణ!!
- మూసీ వంతెన కింద లభ్యమైన హార్డ్‌డిస్కులు
- భుజంగరావు, తిరుపతన్నను కస్టడీకి కోరే చాన్స్
- కలిపి విచారించేందుకు ప్రణీత్‌రావును కూడా
- కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ నేతల ఫోన్ల ట్యాప్

హైదరాబాద్ సిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) కేంద్రంగా జరిగిన అక్రమ ఫోన్ ట్యాపింగ్‌ల కేసులో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టీపీసీసీ చీఫ్‌గా, విపక్ష నేతగా ఉన్నప్పుడు ఆయనను టార్గెట్‌గా చేసుకుని, ఇజ్రాయెల్ నుంచి తెప్పించిన ప్రత్యేక డివైజ్‌తో ఇంట్లో ఏం మాట్లాడుకుంటున్నారో కూడా తెలుసుకున్నట్లు దర్యాప్తు అధికారుల దృష్టికి వచ్చింది. ఇందుకోసం రవిపాల్ అనే సాంకేతిక నిపుణుడి సేవలను కన్సల్టెంట్ పేరుతో ఎస్ఐబీ అధికారులు వినియోగించుకున్నట్లు సమాచారం. మావోయిస్టులపై నిఘా పేరుతో ఇజ్రాయెల్ ఓ పరికరాన్ని దిగుమతి చేసుకున్నట్లు తెలిసింది. నిజానికి ఇలాంటి పరికరాల వినియోగానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి అవసరం. రవిపాల్ సాయంతో.. కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా.. ఇజ్రాయెల్ నుంచి ప్రత్యేక పరికరాన్ని తెప్పించినట్లు తెలుస్తోంది. ఆ పరికరం 300 మీటర్ల మేర ఉండే ఎలక్ట్రానిక్ డివైజ్‌లలోకి చొరబడి.. వాటి మైక్రోఫోన్‌ను ఆన్ అయ్యేలా చేస్తుంది. ఆ పరిధిలో వైఫై, ఇంటర్నెట్ డేటాతో కనెక్ట్ అయిన ఎన్ని ఫోన్లు, స్మార్ట్‌టీవీలు, అలెక్సా వంటి టూల్స్ కూడా ఆ డివైజ్ పరిధిలోకి వస్తాయని సమాచారం. జూబ్లీహిల్స్‌లోని రేవంత్‌రెడ్డి ఇంటి సమీపంలో ఓ కార్యాలయాన్ని అద్దెకు తీసుకున్న ప్రణీత్‌రావు, రవిపాల్.. ఆయన కుటుంబ సభ్యులు ఏం మాట్లాడుకుంటున్నారు? ఎన్నికల వ్యూహాలేంటి? పార్టీ ముఖ్యుల సమావేశంలో

మిగతా 13వ పేజీలో...

అమెరికా నుంచి ప్రభాకర్‌రావు ఫోన్



ట్యాపింగ్ వ్యవహారం ముదరడంతో అమెరికాలో ఉన్న ప్రభాకర్ రావు రాష్ట్ర పోలీసులకు టచ్‌లోకి వచ్చినట్లు తెలిసింది. ఓ ఉన్నతాధికారికి ఫోన్‌కాల్ చేసి.. "నేను క్యాన్సర్ చికిత్స కోసం అమెరికాకు వచ్చాను. జూన్ లేదా జూలైలో తిరిగొస్తా. మీరు ప్రస్తుత ప్రభుత్వం చెప్పినట్లు చేస్తున్నారు. నేను గత ప్రభుత్వం చెప్పినట్లు చేశా. మనం అంతా పోలీసులం" అని తాను చేసిన పనిని సమర్థించుకునే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. తమ ఇళ్లలో సోదాలను వెంటనే ఆపాలని కోరినట్లు సమాచారం.

అభ్యర్థులపై అస్పష్టతే!

- ఇంకా పెండింగ్‌లోనే 8 పార్లమెంట్ స్థానాలు.. కాంగ్రెస్ టికెట్ల కోసం తీవ్ర పోటీ
- మూడు చోట్ల తెరపైకి బీసీ నేతల పేర్లు!.. రేపు ఢిల్లీలో ఏఐసీసీ సీఈసీ సమావేశం
- హాజరుకానున్న రేవంత్, భట్టి, ఉత్తమ్.. మెజారిటీ సీట్లకు అభ్యర్థులు ఖరారయ్యే చాన్స్

హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రత్యర్థి పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్ 17 సీట్లలోనూ అభ్యర్థులను ప్రకటించి, ప్రచారానికి రంగం సిద్ధం చేసుకుంటే.. కాంగ్రెస్ పార్టీ మాత్రం అభ్యర్థుల ఎంపికపై మల్లగుల్లాలు పడుతోంది. పెండింగ్‌లో ఉన్న ఎనిమిది సీట్లకు అభ్యర్థులను ఎంపిక చేయడం ఆ పార్టీకి కత్తిమీద సాములా మారింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే లోక్‌సభ ఎన్నికల్లోనూ పునరావృతమైతే మెజారిటీ సీట్లు కాంగ్రెస్ పార్టీకి దక్కే పరిస్థితులు ఉండడంతో.. టికెట్ల కోసం పోటీ తీవ్రంగా ఉంది. అయితే సామాజిక సమీకరణాలు, ఆర్థిక పరిస్థితి, స్థానికంగా నేతల నుంచి అందే సహకారం, సర్వేలు, ఇతర అంశాల ఆధారంగా కసరత్తు

మిగతా 12వ పేజీలో...



గోవాలో పాలమూరు 'స్థానిక' ప్రజాప్రతినిధులు

- ఎమ్మెల్సీ ఎన్నికతో క్యాంపులకు తరలింపు
- కుటుంబాలు, దోస్తులతో సహా పయనం
- ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో బీచ్‌లలో విహారం



గోవా బీచ్‌లో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డితో గద్వాల నియోజకవర్గం ప్రజాప్రతినిధులు

మహబూబ్‌నగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వారంతా ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, మునిసిపల్ కౌన్సిలర్లు. ప్రస్తుతం వారి కుటుంబసభ్యులతో, స్నేహితులతో కలిసి గోవా బీచ్‌లలో ఎంజాయ్ చేస్తున్నారు. అక్కడి క్యాంపుల్లో సేద తీరుతున్నారు. అయితే ఇదేదో అందరూ కలిసి వేసవిలో వెళ్లిన విహారయాత్ర కాదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వీరంతా ఓటర్లుగా ఉన్నందున రాజకీయ పార్టీలు వీరిని అక్కడికి తరలించాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నిక పోలింగ్ ఈ నెల 28న జరగనుండడంతో ఓటర్లుగా ఉన్న వీరెవరూ చేజారిపోకుండా

మిగతా 12వ పేజీలో...



హైదరాబాద్‌లోని హైటెక్‌సిటీలో హోలీ సంబరాల్లో యువత



రంగుల రుద్ర.. సంబరాల రేవంత్

ఇంట్లో మనవడితో సీఎం హోలీ.. పాలన, రాజకీయానికి కాస్త విరామం అంటూ ట్వీట్

హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): హోలీ పండుగను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మనవడితో కలిసి జరుపుకొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో భార్య గీతారెడ్డితో కలిసి మనవడు రుద్రదేవ్(రేయాన్స్)పై రంగులు చల్లారు. తాత రంగులు పూస్తుండడంతో మనవడు నవ్వులు చిందించాడు. మనవడిని ఒళ్లో కూర్చోబెట్టుకుని మరీ రేవంత్ రంగులను పూయించుకున్నారు. మనవడితో కలిసి హోలీ జరుపుకొన్న ఫొటోలను సీఎం ఎక్స్‌లో పోస్టు చేశారు. "పరిపాలన, రాజకీయం, విజ్ఞప్తులు, పరిష్కారాలు, సమావేశాలు, తీరిక లేని షెడ్యూల్... అన్నిటికి కొంచెం విరామం. హోలీ నాడు మనవడితో ఆట విడుపు" అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.

పండుగ పూట విషాదం 14

- నీట మునిగి పలుచోట్ల 12 మంది మృతి
- ఇద్దరి గల్లంతు.. ట్యాంక్ కూలి చిన్నారి బలి
- రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి దుర్మరణం

అనారోగ్య టెకీలు!

- ఐటీ ఉద్యోగుల్లో 61% మందిలో హై కొలెస్ట్రాల్
- 37 శాతం మందిలో ఏదో ఒక దీర్ఘకాలిక రుగ్మత
- పాతికేళ్లలోపు వారిలో కొవ్వు స్థాయిలు అస్తవ్యస్తం
- 25-40 లోపు ఉన్న 56 వేల మందిపై అధ్యయనం
- 8 అంశాలపై హెచ్‌సీఎల్ హెల్త్ కేర్ పరీక్షలు
- యాంత్రిక జీవనశైలితో 40 ఏళ్లలోపే ఇబ్బందులు
- చాలామందిలో సంతానలేమి: వైద్య నిపుణులు



హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మీరు ఐటీ ఉద్యోగులా? మీ ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉంటున్నారా? తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్నారా? ఇవన్నీ ఎందుకంటే.. ఐటీ ఉద్యోగులు తీవ్ర ఆరోగ్య పరమైన సమస్యలు ఎదుర్కొంటున్నట్లు.. వారి హెల్త్ పారామీటర్స్ అస్తవ్యస్తంగా ఉన్నట్లు హెచ్‌సీఎల్ హెల్త్ కేర్ సంస్థ హెచ్చరిస్తోంది. దేశవ్యాప్తంగా 56వేల మంది ఐటీ ఉద్యోగుల ఆరోగ్య స్థితిగతులపై ఈ సంస్థ అధ్యయనం చేసింది వీరిలో 77 శాతం మంది ఆరోగ్య విలువలు చాలా అస్తవ్యస్తంగా ఉన్నట్లు తేల్చింది. ముఖ్యంగా 61 శాతం మంది అధిక కొవ్వు సమస్యతో బాధపడుతున్నట్లు పేర్కొంది. క్లినికల్ స్టడీ చేసిన

మిగతా 2వ పేజీలో...

టికెట్ రాలేదని ఎంపీ ఆత్మహత్యాయత్నం

- పురుగు మందు తాగిన ఎండీఎంకే నేత గణేశమూర్తి
- తమిళనాడులోని ఈరోడ్ నియోజకవర్గంలో ఘటన
- పరిస్థితి విషమం: వైద్యులు

2

తప్పుకోనున్న బోయింగ్ సీఈవో కాల్‌హౌన్

12

పట్నం గొంతెండుతోంది..!

- మండుతున్న ఎండలతో మునిసిపాలిటీల్లో నీటి కటకట
- మార్చి నెలాఖరుకే భారీగా తగ్గిపోయిన సరఫరా
- కోదాడ మునిసిపాలిటీలో 69%.. నిర్మల్‌లో 44% తగ్గుదల
- ఖమ్మం, కరీంనగర్‌లో 20 నుంచి 30 శాతం దాకా లోటు
- మునిసిపాలిటీల్లో తాగునీటి సమస్యపై నేడు సీడీఎంఏ సమీక్ష
- హైదరాబాద్ నగరానికి ఇబ్బంది లేకుండా కార్యాచరణ
- ఏప్రిల్ తొలి వారం నుంచి సాగర్ నీటి అత్యవసర పంపింగ్



సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణం ద్వారకుంటలో మంచినీటి సమస్య కొన్ని రోజుల నుంచి తీవ్రంగా ఉంది. దీంతో ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నారు.

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఎండాకాలం మొదట్లోనే భానుడు భగ్గుమంటున్నాడు! రోజురోజుకూ ఇలా ఎండమంటలు పెరుగుతుంటే.. మరోపక్క, భూగర్భజలాలు తగ్గిపోయి తగినంత తాగునీరు దొరక్క పట్నాల గొంతులు ఎండుతున్నాయి. దీంతో అధికారులు అప్రమత్తమవుతున్నారు. ప్రజలకు తాగునీటిని అందించడానికి రకరకాల ప్రణాళికలతో సిద్ధమవుతున్నారు. వేసవి ఆరంభంలోనే పెరుగుతున్న ఎండమంటలతో.. పట్టణాల గొంతెండిపోతోంది. మార్చి నెలాఖరుకే భూగర్భజలాలు గణనీయంగా తగ్గిపోయి.. చెరువులు, నదుల్లో నీరెండిపోతుండడంతో.. ప్రజలకు తాగునీటి లభ్యత తగ్గుతోంది. ఈ నేపథ్యంలో పట్టణ ప్రజల గొంతు తడిపేందుకు ప్రత్యామ్నాయ

మిగతా 3వ పేజీలో...

దాహం.. దాహం

- 2 ఈసారి తాగునీటికి ఎద్దడే
- దక్షిణాది, పలు రాష్ట్రాల్లోనూ..
- అడుగంటుతున్న జలాశయాలు
- పదేళ్ల సగటు కన్నా తక్కువ
- వర్షాభావ పరిస్థితులే కారణం
- జల సంక్షోభం దిశగా దేశం

2 తాగునీటితో కార్లు కడిగారని బెంగళూరులో

22 మందికి 5వేల చొప్పున ఫైన్

ఏప్రిల్, మేలో 4-5 డిగ్రీలు అధికం

ఎండలపై వాతావరణ శాఖ అధికారి 3

శరణ్ పాత్ర ఏంటి?

- ఢిల్లీ మద్యం స్కామ్‌లో డబ్బులెలా చేతులు మారాయి?
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై ఈడీ అధికారుల ప్రశ్నల వర్షం
- నేడు కోర్టులో హాజరు.. కస్టడీ పొడిగింపు కోరే అవకాశం
- 23న కవిత వేసిన బెయిల్ పిటిషన్‌పైనా నేడే విచారణ



న్యూఢిల్లీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో ఈడీ కస్టడీలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోమవారం ప్రశ్నల వర్షం కురిపించింది. హోలీ సందర్భంగా విచారణకు విరామం ఇస్తారని.. ఒకవేళ విచారించినా గంటో, రెండు గంటలో ప్రశ్నిస్తారని కవితతోపాటు కుటుంబసభ్యులు భావించారు. కానీ.. కస్టడీ చివరిరోజు సోమవారమే కావడంతో ఈడీ అధికారులు ఆమె నుంచి

మిగతా 13వ పేజీలో...

పిల్ల దొంగలు



- 2 బ్యాంకును దోచేసిన 'లిటిల్ రాస్కెల్స్'
- అమెరికాలో ఘటన.. వారం తర్వాత అరెస్టు
- నిందితులు ముగ్గురూ 16 ఏళ్లలోపు వారే

జేఎన్‌యూకు 30 ఏళ్ల తర్వాత దళిత ప్రెసిడెంట్



» విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన ధనంజయ్

న్యూఢిల్లీ, మార్చి 25: ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) విద్యార్థి సంఘం ఎన్నికల్లో దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఓ దళితుడు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్‌ఏ) తరఫున పోటీ చేసిన ధనంజయ్ తన సమీప ప్రత్యర్థి అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ)కు చెందిన ఉమేశ్ సి అజ్మీరాపై 922 ఓట్ల తేడాతో గెలుపొందారు. 1996-97లో లెఫ్ట్ కూటమికి చెందిన బట్టీలాల్ బైర్వా తర్వాత ఓ దళితుడు జేఎన్‌యూ విద్యార్థి సంఘానికి ప్రెసిడెంట్‌గా ఎన్నికవడం ఇదే తొలిసారి. అలాగే జేఎన్‌యూ విద్యార్థి సంఘం వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్‌ఎఫ్‌ఐకి చెందిన అవిజిత్ ఘోష్ గెలుపొందగా, జనరల్ సెక్రటరీగా బిర్సా అంబేడ్కర్ పూలే స్టూడెంట్స్ అసోసియేషన్ (బాప్సా)కు చెందిన ప్రియాంశీ ఆర్యా ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీగా లెఫ్ట్ కూటమికి చెందిన మహమ్మద్ సాజిద్ గెలుపొందారు. నాలుగేళ్ల విరామం తర్వాత జేఎన్‌యూలో జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో వామపక్ష కూటమికి చెందిన అభ్యర్థులు క్లీన్ స్వీప్ చేశారు.

పిల్ల దొంగలు

బ్యాంకును దోచేసిన 'లిటిల్ రాస్కెల్స్'

అమెరికాలో ఘటన.. వారం తర్వాత అరెస్టు

టెక్సస్, మార్చి 25: వాళ్లు ముగ్గురూ పిల్లలే. ఒకడి వయస్సు 11 ఏళ్లు. మరొకడికి 12, ఇంకొకడికి 16 ఏళ్లు. ఇంట్లో అడిగితే తల్లిదండ్రులు డబ్బులివ్వలేదో.. మరే వ్యసనానికైనా అలవాటు పడ్డారో.. అవసరాల కోసం ఏకంగా బ్యాంకులోనే దొంగతనానికి పాల్పడ్డారు. క్యాషియర్‌ను బెదిరించి చేతికి అందిన డబ్బులతో ఉడాయించారు. ఈ నెల 14వ తేదీన టెక్సస్‌లోని వెల్స్ ఫార్గో బ్యాంకులో ఈ ఘటన జరిగింది. ఇదంతా అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయింది. ఈ ముగ్గురి ఫొటోలను ఎఫ్‌బీఐ 'ఎక్స్'లో పోస్టు చేస్తూ "ఈ లిటిల్ రాస్కెల్స్‌ను గుర్తించడానికి సాయం చేయండి" అని ప్రజలను కోరింది. అయితే, ఈ ముగ్గురిలో ఇద్దరిని వాళ్ల తల్లిదండ్రులే గుర్తించి ఎఫ్‌బీఐకి ఫోన్ చేసి పట్టించారు. మరో బాలుడిని పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. మొత్తానికి దొంగతనం జరిగిన వారం రోజుల తర్వాత ఈ నెల 21న ఎఫ్‌బీఐ ఆ ముగ్గురు పిల్ల దొంగలను అరెస్టు చేసింది.

ముంబై ఎయిర్‌పోర్టులో రూ.19.79 కోట్ల కొకైన్!

» విదేశీ మహిళ నుంచి స్వాధీనం

న్యూఢిల్లీ, మార్చి 25: ముంబై ఎయిర్‌పోర్టులో నిషేధిత మత్తు పదార్థం కొకైన్‌తో దిగిందో విదేశీ మహిళ! ఆమె వద్ద రూ.19.79 కోట్ల విలువైన 1979 గ్రాముల విలువైన కొకైన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలు పశ్చిమ ఆఫ్రికాలోని సియెర్రా లియోన్ దేశస్తురాలని.. కెన్యా రాజధాని నైరోబీ నుంచి ముంబైలో దిగిందని నిర్ధారించారు. ఆమె లగేజీలోని షూ, మాయిశ్చరైజర్ బాటిల్, షాంపూ బాటిళ్లు బరువుగా ఉండటంతో అనుమానించి తనిఖీ చేయగా పొట్లాల రూపంలో భారీగా కొకైన్ బయటపడినట్లు వెల్లడించారు. ఆమెను అరెస్టు చేశారు.

లోకం తీరు



లండన్‌లో రోడ్డు ప్రమాదం.. భారతీయ విద్యార్థిని మృతి



లండన్, మార్చి 25: లండన్‌లో ఓ భారతీయ విద్యార్థిని రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. హరియాణాకు చెందిన చేష్టా కొచర్(33) ప్రఖ్యాత లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేస్తున్నారు. ఈనెల 19న వర్సిటీ నుంచి సైకిల్‌పై ఇంటికి వస్తున్న ఆమెను ఓ ట్రక్కు బలంగా ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. చేష్టా కొచర్ గతంలో నీతి ఆయోగ్‌లో పనిచేశారు. చేష్టా మృతికి నీతిఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్‌కాంత్ ఎక్స్(ట్విటర్)లో సంతాపం తెలిపారు. చేష్టా భర్త ప్రశాంత్ గౌతమ్ లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు.

ఉజ్జయినీ ఆలయంలో అగ్ని ప్రమాదం!

» పూజారులు సహా 14 మందికి గాయాలు

ఉజ్జయినీ, మార్చి 25: హోలీ పర్వదినాన మధ్యప్రదేశ్ ఉజ్జయినీ మహాకాళేశ్వర్ ఆలయంలో విషాదం చోటు చేసుకుంది. పండుగ కావడంతో సోమవారం తెల్లవారుజాము నుంచే గర్భగుడిలో పూజలు ప్రారంభించారు. ఉదయం 5.55 గంటల సమయంలో 'భస్మహారతి' ఇస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పూజారులు, ఆలయ సేవకులు సహా మొత్తం 14 మంది అందులో చిక్కుకొని గాయపడ్డారు. హారతి సమయంలో కర్పూరం వెలుగుతుండగా గులాల్ చల్లడంతో అగ్గి రాజుకుందని.. గర్భగుడిలో రంగులు పడకుండా కట్టిన వస్త్రాలకు మంటలు అంటుకొని ప్రమాదం జరిగిందని ఉజ్జయినీ కలెక్టర్ నీరజ్ కుమార్ వివరించారు. గాయపడినవారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. క్షతగాత్రులకు ఒక్కొక్కరికి రూ.లక్ష సాయంతో పాటు వారికి అత్యుత్తమ చికిత్స ఉచితంగా అందిస్తామని సీఎం మోహన్‌యాదవ్ అన్నారు. ఘటనపై ప్రధాని మోదీ విచారం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ఆరో జాబితా విడుదల

న్యూఢిల్లీ, మార్చి 25: కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రహ్లాద్ గుంజాల్‌ను పోటీకి దించింది. ఆ పార్టీ సోమవారం ఐదుగురు లోక్‌సభ అభ్యర్థులతో ఆరో జాబితా విడుదల చేసింది. రాజస్థాన్‌లోని కోట నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న స్పీకర్ ఓం బిర్లాపై ప్రహ్లాద్ గుంజాల్‌ను బరిలోకి దింపింది. అలాగే అజ్మేర్ నియోజకవర్గం నుంచి రామచంద్ర చౌధరి, రాజ్‌సమంద్ నుంచి సుదర్శన్ రావత్, భిల్వారా నుంచి దామోదర్ గుర్జర్, తిరునల్వేలి నుంచి సి. రాబర్ట్ బ్రూస్‌లను అభ్యర్థులుగా ప్రకటించింది. ప్రహ్లాద్ గుంజాల్ గురువారమే కాంగ్రెస్‌లో చేరారు. ఈయన రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే అనుచరుడు. ఆయన చేరికతో రాజస్థాన్‌లోని హదోతి ప్రాంతంలో కాంగ్రెస్ బలోపేతం అవుతుందని అంచనా. సోమవారం ప్రకటించిన ఆరో జాబితాతో లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ మొత్తం 190 మంది అభ్యర్థులను ప్రకటించినట్లయ్యింది.

వయనాడ్‌లో రాహుల్‌పై సురేంద్రన్ పోటీ

న్యూఢిల్లీ, మార్చి 25: కేరళలోని వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీకి గట్టి పోటీనివ్వాలని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నిర్ణయించుకుంది. ఈమేరకు రాహుల్‌కు పోటీగా బలమైన అభ్యర్థిని వ్యూహాత్మకంగా రంగంలోకి దింపింది. బీజేపీ కేరళ అధ్యక్షుడు కె.సురేంద్రన్.. వయనాడ్ నుంచి పోటీ చేయనున్నట్టు ఆ పార్టీ ప్రకటించింది. ప్రస్తుతం ఇదే నియోజకవర్గం నుంచి రాహుల్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మరోవైపు ఈ నియోజకవర్గం నుంచి సీపీఐ తరఫున అన్నీ రాజా పోటీ చేస్తున్నారు. ఉత్తర కేరళలో ప్రముఖనేతగా ఉన్న సురేంద్రన్.. 2020 సంవత్సరం నుంచి బీజేపీ కేరళ అధ్యక్షుడిగా ఉన్నారు.

అప్పిలేట్ కోర్టులో ట్రంప్‌నకు భారీ ఊరట

న్యూయార్క్, మార్చి 25: రానున్న ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా మరోసారి పోటీ చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించిన మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (77)కు సోమవారం మాన్‌హట్టన్‌లోని అప్పిలేట్ కోర్టులో భారీ ఊరట లభించింది. ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితికి వచ్చిన ఆయనకు లైఫ్ లైన్ దొరికినట్టయింది. ఆస్తుల విలువను ఎక్కువగా చూపించి బ్యాంకు రుణాలు పొందారన్న కేసులో ఆయనకు కింది కోర్టు 454 మిలియన్ డాలర్ల (సుమారు రూ.3,790 కోట్లు) జరిమానా విధించగా అప్పిలేట్ కోర్టు దాన్ని 175 మిలియన్ డాలర్ల (రూ.1460 కోట్లు)కు తగ్గించింది. జరిమానా చెల్లించడానికి గడువును కూడా ఇచ్చింది. మరో క్రిమినల్ కేసులో విచారణ నిమిత్తం ట్రంప్ కోర్టులో ఉండగానే ఈ తీర్పు వెలువడడం గమనార్హం.

టికెట్ నిరాకరించారని ఎంపీ ఆత్మహత్యాయత్నం

» విషమంగా ఈరోడ్ ఎంపీ గణేశమూర్తి ఆరోగ్యం



ఈరోడ్, మార్చి 25: సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ టికెట్ దక్కలేదని లోక్‌సభ సభ్యుడు ఆత్మహత్యకు యత్నించారు. తమిళనాడులోని ఈరోడ్ నియోజకవర్గంలో ఆదివారం జరిగిందీ ఘటన. ఈరోడ్ ఎంపీ ఎ.గణేశమూర్తి ఎండీఎంకే పార్టీ తరఫున లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన వయసు 76 సంవత్సరాలు. ప్రస్తుతం జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అధిష్ఠానం ఆయనకు టికెట్ నిరాకరించింది. దీంతో ఆయన పురుగుల మందును నీటిలో కలుపుకొని తాగారు. కుటుంబసభ్యులు ఆయనను హుటాహుటిన స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు కోయంబత్తూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. పార్టీ ప్రధానకార్యదర్శి వైగో ఆదివారం రాత్రి కోయంబత్తూరు ఆస్పత్రిని సందర్శించి వైద్యులతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆయనకు సీటు ఇవ్వడం కుదరకపోతే, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనను బరిలోకి దించుదామని నిర్ణయించామని, ఈలోపే ఆయన ఆత్మహత్యకు యత్నించారని చెప్పారు.



రష్యా చెరలో బందీలుగా ఉన్న నలుగురు ఉగ్రవాదులు

మాస్కోలో దాడి తజక్ ఉగ్రవాదుల పనే!

మాస్కో, మార్చి 25: మాస్కోలో సంగీత కచేరీపై కాల్పులకు తెగబడి.. 137 మంది మరణానికి కారకులైన నలుగురు ముష్కరులను రష్యా సెక్యూరిటీ సర్వీసెస్ అధికారులు ఆదివారం కోర్టులో ప్రవేశపెట్టారు. ఆ నలుగురిని తజకిస్థాన్‌కు చెందిన దలేర్డ్జాన్ మిర్జొయెవ్, సైదాక్రమీ రాచబలిజోవడా, షమ్సిదీన్ ఫరిదునీ, ముఖమ్మద్సోబిర్ ఫైజోవ్‌గా గుర్తించారు. వారందరికీ ముఖంపై ముష్టిఘాతాల గుర్తులున్నాయని, ముఖమ్మద్సోబిర్‌ను వీల్‌చైర్‌పై తీసుకువచ్చారని రష్యా మీడియా పేర్కొంది. ముఖమ్మద్సోబిర్ కోర్టులో ట్రయల్ జరుగుతున్నంతసేపు అపస్మారకస్థితిలో ఉన్నట్లు పేర్కొంది. మిగతా ముగ్గురు తమ నేరాన్ని అంగీకరించినట్లు వివరించింది. కోర్టు ఆ నలుగురు నిందితులను మే 22 వరకు దర్యాప్తు అధికారుల కస్టడీకి అప్పగిస్తూ.. విచారణను వాయిదా వేసింది. ఈ దాడి వెనక ఉక్రెయిన్ హస్తముందని పుతిన్ ఆరోపించిన విషయం తెలిసిందే. అయితే.. అమెరికా మాత్రం ఈ ఘటనకు ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులే కారణమని స్పష్టం చేసింది.

దాహం.. దాహం..

ఈసారి తాగునీటికి కటకటే

» దక్షిణాదితోపాటు పలు ఇతర రాష్ట్రాల్లోనూ సమస్య

» బెంగళూరుపై ఇప్పటికే కనిపిస్తున్న ప్రభావం

» రిజర్వాయర్లలో గణనీయంగా తగ్గిన నీటినిల్వలు



బెంగళూరులో ఓ ట్యాంకర్ వద్ద బారులు తీరిన మహిళలు

ఎండాకాలం వస్తోందంటే మండే ఎండలు, ఉక్కపోత, వడదెబ్బ గుర్తుకొస్తాయి. వాటి నుంచి తట్టుకోవటానికి రకరకాల చిట్కాలు, జాగ్రత్తలు పాటిస్తాం. కానీ, ఈసారి ఎండాకాలం వీటితోపాటు తాగునీటి ఎద్దడినీ తీసుకొచ్చే ప్రమాద సంకేతాలున్నాయి. తెలంగాణ, ఏపీతోపాటు ఇతర దక్షిణాది రాష్ట్రాలలో, అటు ఉత్తరాదిలో కూడా తాగునీటికి కటకట నెలకొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

దేశంలో తాగునీటి అవసరాలను తీర్చే ప్రధాన రిజర్వాయర్లు 150. ప్రస్తుతం వీటి మొత్తం సామర్థ్యంలో 38 శాతం మేర మాత్రమే నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ఇది గత దశాబ్ద కాలం సగటు కంటే తక్కువ. దీని ప్రభావం ఇప్పటికే బెంగళూరులో కనిపిస్తోంది. నగరానికి ప్రతి రోజూ 2,600 మిలియన్ లీటర్లు (ఎంఎల్‌డీ) అవసరం కాగా.. ప్రస్తుతం కనీసం 500 మిలియన్ లీటర్ల వరకూ కొరత ఉంటోంది. బెంగళూరుకు 1470 ఎంఎల్‌డీ నీళ్లు కావేరీ నది నుంచి లభిస్తుండగా, 650 ఎంఎల్‌డీ నీళ్లు బోరుబావుల ద్వారా అందుబాటులో ఉంటాయి. కానీ, నగరంలో ఉన్న 14 వేల బోరుబావుల్లో 6,900 ఎండిపోయాయి. అనేక చెరువులు కబ్జాలకు గురై కనుమరుగు కాగా, మిగిలినవి నీళ్లు లేక నెర్రెలు బారాయి. మరోవైపు కావేరి నదిలో నీటిమట్టం తగ్గిపోయింది. ఈ కారణాల నేపథ్యంలో బెంగళూరు దాహంతో కొట్టుమిట్టాడుతోంది. అయితే, ఈ సమస్య ఆ నగరానికే పరిమితమయ్యేలా లేదు. పొరుగునున్న దక్షిణాది రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడుతో పాటు హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, మధ్యప్రదేశ్, త్రిపుర, రాజస్థాన్, బిహార్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్ కూడా ఈ వేసవిలో నీటి ఎద్దడిని ఎదుర్కోవచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ రాష్ట్రాల్లోని రిజర్వాయర్లలో గత ఏడాదితో పోల్చితే ఈసారి నీటి మట్టాలు గణనీయంగా తగ్గాయి.

తాగునీటితో కార్లు కడుగుతారా?

బెంగళూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): తాగునీటికే కటకటలాడుతున్న పరిస్థితుల్లో.. కార్లు కడగడానికి కావేరీ నీటిని వాడేసిన 22 మందికి బెంగళూరు జలమండలి అధికారులు ఒక్కొక్కరికీ రూ.5 వేల చొప్పున రూ.1.1 లక్షల జరిమానా విధించారు. బెంగళూరు దక్షిణ విభాగం పరిధిలో.. కావేరి నీటిని కార్లు కడగడానికి వృథా చేస్తూ, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న 22 కుటుంబాల గురించి సోషల్ మీడియా ద్వారా స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో జలమండలి అధికారులు రంగంలోకి దిగి జరిమానా వసూలు చేశారు.

రిజర్వాయర్లలో 38 శాతం నీటి నిల్వలే!

దేశ ప్రజలు తాగు నీటి కోసం ఆధారపడే 150 ప్రధాన రిజర్వాయర్ల పూర్తి సామర్థ్యం 178.784 బిలియన్ క్యూబిక్ మీటర్లు (బీసీఎం). ఇది దేశంలో అన్ని వనరుల ద్వారా అందుబాటులో ఉండే మొత్తం తాగునీరు 257.812 బీసీఎంలో దాదాపు 69.35 శాతం. గురువారం నాటి రిజర్వాయర్ స్టోరేజీ బులిటన్ ప్రకారం.. ఈ రిజర్వాయర్లలో 67.591 బీసీఎం నీటి నిల్వలున్నాయి. అంటే వాటి మొత్తం సామర్థ్యంలో కేవలం 38 శాతం. గత ఏడాది ఇదే సమయంలో వీటిలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు 80.557 బీసీఎం. ఇక గత దశాబ్ద కాలంలో సగటున వీటిలో ఉన్న నీరు 72.396 బీసీఎం. అంటే ఈ ఏడాది రిజర్వాయర్లలో నీరు గణనీయంగా తగ్గిపోయింది. దక్షిణాది రాష్ట్రాల విషయానికొస్తే.. మొత్తం 53.334 బీసీఎంల నీటినిల్వ సామర్థ్యమున్న 42 రిజర్వాయర్లు ఈ రాష్ట్రాల తాగునీటి అవసరాలను తీరుస్తున్నాయి. కానీ, గురువారం నాటి రిజర్వాయర్ స్టోరేజీ బులిటన్ ప్రకారం.. ఈ రిజర్వాయర్లలో ఉన్న నీళ్లు కేవలం 12.287 బీసీఎం మాత్రమే. అంటే, వాటి మొత్తం సామర్థ్యంలో 23 శాతం మాత్రమే అందుబాటులో ఉన్నాయి. గత ఏడాది ఇదే సమయానికి ఈ రిజర్వాయర్లలో 39 శాతం నీటి నిల్వలు ఉండగా, గత పదేళ్ల సగటు 32 శాతం. తాగునీటికి కటకట పరిస్థితులు దేశవ్యాప్తంగా ఉన్నట్టుగానే దక్షిణాదిలోనూ నెలకొన్నాయని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

కారణాలేమిటి?

గత ఏడాది వర్షాలు సరిగా పడలేదు. 2018 తర్వాత అత్యల్ప వర్షపాతం 2023లోనే నమోదైంది. ఎల్‌నినో కారణంగా గత ఆగస్టు నెల.. గడిచిన వందేళ్లకుపైగా కాలవ్యవధిలో అత్యంత వర్షాభావం ఉన్న మాసంగా వాతావరణ రికార్డుల్లో నమోదైంది. గత ఏడాది రుతుపవనాలు కూడా అంతటా సమానంగా విస్తరించలేదు. కొన్ని ప్రాంతాల్లో వానలు బాగా పడగా.. మరికొన్ని ప్రాంతాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే, ఈసారి తాగునీటికి కటకట నెలకొంది. కాగా, భారత్‌లోని పలు ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు గణనీయంగా తగ్గిపోతున్నాయని ఐక్యరాజ్యసమితి ఇటీవల వెలువరించిన నివేదికలో హెచ్చరించింది. వచ్చే ఏడాదికి కశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, యూపీ, ఢిల్లీలతో కూడిన వాయువ్యప్రాంతంలో భూగర్భ జలాలు తీవ్రంగా తగ్గిపోతాయని తెలిపింది. - సెంట్రల్ డెస్క్

ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
రంగారెడ్డి	39.6	20.4
ఆదిలాబాద్	39.3	25.2
నిజామాబాద్	39.0	25.7
వరంగల్	38.0	20.9
నల్లగొండ	38.0	24.0
ఖమ్మం	38.0	24.0
హైదరాబాద్	37.0	24.6

ఎల్‌నినో తగ్గినా.. ఎండలే!

విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలపై తీవ్ర ప్రభావం చూపిన ఎల్‌నినో నెమ్మదిగా బలహీనపడుతోంది. కొద్ది రోజులుగా పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు క్రమేపీ తగ్గుతుండడం ఇందుకు సంకేతమని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. అయితే ఎల్‌నినో ఇప్పటికిప్పుడు కాకుండా నిదానంగా బలహీనపడుతుందని స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం ఎల్‌నినో తిరోగమన దశ మొదలైనా వచ్చే రెండు, మూడు నెలలు దేశంలో ఎండలు మాత్రం ఎక్కువగానే ఉంటాయని చెబుతున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో గరిష్ఠ స్థాయికి చేరుకున్న సూపర్ ఎల్‌నినో తన తీవ్రత తగ్గించుకునే దిశగా పయనిస్తోందని, అదే జరిగితే ఈ ఏడాది మే నాటికి తటస్థ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా వేసింది. అయితే ఒక్క ఎల్‌నినో బలహీనపడినంత మాత్రాన నైరుతి రుతుపవనాల సమయంలో మంచి వర్షాలు కురుస్తాయని ఒక అంచనాకు రాకూడదని వాతావరణవేత్తలు పేర్కొంటున్నారు. కాగా, గతేడాది జనవరిలో ఎల్‌నినో తీవ్రత మొదలై నైరుతి రుతుపవనాల సీజన్‌లో మరింత బలంగా కొనసాగింది. దీంతో భారత్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ యేడు జూన్ నాటికి లానినా ప్రారంభమై క్రమేపీ దాని ప్రభావం పెరుగుతుందని అంచనా.

కేజ్రీవాల్‌కు మద్దతుగా ఆప్ సోషల్ మీడియా ఉద్యమం

» రాజ్యాంగ పరిరక్షణ పేరిట పోరాటం



న్యూఢిల్లీ, మార్చి 25: మద్యం విధానం కేసులో అరెస్టయి కస్టడీలో ఉన్న ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఆమ్ ఆద్మీ పార్టీ అండగా నిలుస్తోంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చర్యలను ప్రశ్నిస్తుండడంతోపాటు రాజ్యాంగ రక్షణ కోసమంటూ సామాజిక మాధ్యమాల్లో ఉద్యమాన్ని ప్రారంభించింది. ఢిల్లీ మంత్రి ఆతిశీ సోమవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజ్యాంగ రక్షణ కోసం సోషల్ మీడియాలో పోరాటం ప్రారంభించామని చెప్పారు. ఆప్ కార్యకర్తలు, నాయకులు అందరూ డీపీ (డిస్‌ప్లే పిక్చర్) క్యాంపెయిన్ నిర్వహిస్తారని, డీపీ కింద కటకటాల వెనుక ఉన్న కేజ్రీవాల్ ఫొటో పెడుతారని చెప్పారు. దాని కింద 'మోదీ కే సబ్‌సే బడా డార్ కేజ్రీవాల్' (మోదీని ఎదిరించే మొనగాడు కేజ్రీవాల్) అన్న క్యాప్షన్ పెడుతారు. రెండేళ్ల క్రితం ఉపయోగించిన ఫోన్‌ను కేజ్రీవాల్ ధ్వంసం చేశారని, మద్యం కుంభకోణానికి సంబంధించిన కీలక సమాచారం అందులో ఉండి ఉండవచ్చని ఈడీ వర్గాలు చెప్పడంపైనా ఆతిశీ అభ్యంతరం చెప్పారు. ఆ ఫోన్ కనిపించడం లేదని దర్యాప్తులో కేజ్రీవాల్ చెప్పినట్టు పేర్కొన్నాయి. ఈ కేసులోని సాక్షులు మొత్తం 170 సెల్‌ఫోన్లను పారవేసి, ఆధారాలు నాశనం చేసినట్టు గతంలో ఈడీ వర్గాలు తెలిపాయి. ఇదే విషయాన్ని అఫిడవిట్ రూపంలో జడ్జి ముందు కోర్టులో చెప్పాలని ఆతిశీ డిమాండ్ చేశారు. మరోవైపు కేజ్రీవాల్ భార్య సునీత పలువురు కార్యకర్తలతో కలిసి సోమవారం ఈడీ ప్రధాన కార్యాలయానికి వెళ్లి అక్కడికి విచారణకు హాజరైన కేజ్రీవాల్‌తో మాట్లాడారు. కాగా జైలులో ఉన్న కేజ్రీవాల్‌కు ఎలాంటి కంప్యూటర్లు, కాగితాలు సమకూర్చలేదని ఈడీ స్పష్టం చేసింది. అలాంటప్పుడు ఢిల్లీలోని మంచినీటి సమస్య విషయమై జైలు నుంచే ఏవిధంగా ఆదేశాలిచ్చారో ఆరా తీస్తామని తెలిపింది. జైలు నుంచే ఉత్తర్వులు ఇచ్చారంటూ చెప్పిన మంత్రి ఆతిశీ నుంచి వివరాలు సేకరిస్తామని పేర్కొంది. జైలు నుంచే కేజ్రీవాల్ లేఖ ఇచ్చారని మంత్రి చెప్పడాన్ని బీజేపీ ఖండించింది. ముందే అనుకున్న ప్రకారం జరుగుతున్న నాటకమని విమర్శించింది.

అనారోగ్య టెకీలు!



(మొదటి పేజీ తరువాయి)

తర్వాత హెచ్‌సీఎల్ హెల్త్‌కేర్ ఈ వివరాలు వెల్లడించింది. ఈ స్టడీని 25-40ఏళ్లలోపువారిపై చేశారు. వీరందరికీ వారి పని ప్రదేశాల వద్దే వైద్యుల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. దేశంలోని కార్పొరేట్ వ్యవస్థల్లో పనిచేసే ఉద్యోగుల్లో పెరుగుతున్న అనారోగ్య పరిస్థితులను నివారించే లక్ష్యాన్ని నొక్కి చెప్పడమే ఈ అధ్యయన ప్రధాన ఉద్దేశమని హెచ్‌ఎస్‌ఎల్ పేర్కొంది. ఊబకాయం, ప్రిడయాబెటీస్, డయాబెటీస్, ప్రి హైపర్‌టెన్షన్, రక్తపోటు, రక్తహీనత, హైపోథైరాయిడిజమ్, అధిక కొవ్వులాంటి కీలకమైన 8 అంశాలను పరీక్షించారు. ఉద్యోగుల్లో 22%మంది ఊబకాయం, 17% ప్రిడయాబెటిస్‌తో, 11% రక్తహీనత, హైపో థైరాయిడిజంతో, 7% మధుమేహంతో ఇబ్బంది పడుతున్నట్లు అధ్యయనం తేల్చింది. ఉద్యోగుల్లో ప్రతి ఒక్కరూ ఒకటికంటే ఎక్కువ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. పాతికేళ్లలోపు వారిలో కొవ్వు స్థాయిలు చాలా అస్తవ్యస్తంగా ఉన్నట్లు, వీరిలో 14% రక్తహీనతతో, 13% ఊబకాయంతో, 8%హైపోథైరాయిడిజంతో, 7% ప్రిడయాబెటిస్‌తో బాధపడుతున్నట్లు వెల్లడైంది. ఇలాంటి దీర్ఘకాలిక ఆరోగ్య పరిస్థితులు చాలా వేగంగా పెరుగుతున్నట్లు కనిపిస్తున్నాయని అధ్యయన సంస్థ తెలిపింది. వయసు పెరిగే కొద్దీ ఈ సమస్యలు పెరిగే అవకాశాలున్నాయని.. ప్రధానంగా 40ఏళ్లు దాటిన వారిలో చాలా ప్రమాదకరస్థితిలో ఈ పారామీటర్స్ పెరుగుతున్నట్లు వెల్లడించింది. ప్రధానంగా అధిక కొవ్వు, ఊబకాయం, ప్రి డయాబెటీస్, డయాబెటీస్ ఎక్కువగా కనిపిస్తున్నట్లు తెలిపింది. కేవలం 23% మంది ఉద్యోగుల హెల్త్ పారామీటర్స్ తగిన స్థాయిల్లో ఉన్నాయని వెల్లడించింది. ఇక పరీక్షలు చేయించుకున్న వారిలో 37% మందికి ఒక దీర్ఘకాలిక ఆరోగ్య సమస్య ఉండగా 26% మందిలో రెండు, 11% మందిలో 3రకాల దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలున్నట్లు తెలిపింది. సాధారణంగా నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ (ఎన్‌సీడీ)లన్నీ కూడా 40ఏళ్ల తర్వాతే వస్తుంటాయి. కానీ ఐటీ ఉద్యోగుల్లో మాత్రం అవి 30ఏళ్లలోపే కనిపిస్తున్నాయి, ఇందుకు ప్రధాన కారణం వారి జీవనశైలేనని హెచ్‌సీఎల్ హెల్త్‌కేర్ సీఈవో, వైస్ ఛైర్మన్ శిఖర్ మల్హోత్రా పేర్కొన్నారు. ఐటీ ఉద్యోగులు తప్పక ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఐటీ ఉద్యోగులు ఎక్కువగా జంక్ ఫుడ్స్, రెడీమేడ్, ప్రాసెస్డ్ ఫుడ్స్ తీసుకుంటున్నారని, అలాగే గంటల కొద్దీ ఒకేచోట కదలకుండా కూర్చోవడం, జీవనశైలి విధానం వల్ల కూడా వారిలో ఇలాంటి అనారోగ్య సమస్యలు ఎక్కువ కనిపిస్తున్నాయని యశోద ఆస్పత్రికి చెందిన ప్రముఖ హృద్రోగ వైద్యనిపుణులు డాక్టర్ రాయిడి గోపీ కృష్ణ తెలిపారు.

ఐటీ ఉద్యోగుల్లో సంతానలేమి సమస్య తీవ్రం

ఐటీ ఉద్యోగులు ఎక్కువగా యాంత్రిక జీవన శైలిని గడుపుతున్నారు. రివర్స్ టైమ్‌లో పనిచేస్తుంటారు. అందుకే వారికి ఆరోగ్య సమస్యలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. వారి ఉద్యోగ స్థితే అందుకు కారణం. రేయింబవళ్లు పని, వ్యాయామం లేకపోవడం, సరైన డైట్ పాటించకపోవడం, స్మోకింగ్, మద్యపానం, సరిగానిద్రపోకపోవడం లాంటివాటితో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. హెచ్‌సీఎల్ అధ్యయనం కంటే కూడా ఇంకా ఎక్కువ సమస్యలే వారిలో ఉన్నాయి. ఇటీవలికాలంలో వారిలో సంతానలేమి సమస్య తీవ్రత చాలా ఎక్కువగా కనిపిస్తోంది. ఇది బాగా ఆందోళనకరమైన అంశం. అందుకే 25 రాకముందే ఏటా విధిగా అన్ని రకాల టెస్టులు చేయించుకోవాలి. బీపీ, షుగర్‌ను కనీసం 6 నెలలకొకసారైనా చెక్ చేయించుకోవాలి. ఐటీ కంపెనీల యాజమాన్యాలు సైతం విధిగా తమ ఉద్యోగులకు పరీక్షలు చేయించాలి. దాంతో ముందస్తుగా వారి ఉద్యోగుల్లోని అనారోగ్య సమస్యలు గుర్తించవచ్చు. తద్వారా వారి బీమా ఖర్చు తగ్గే అవకాశం ఉంది.

– డాక్టర్ ఎం.వీ.రావు, సీనియర్ కన్సల్టెంట్ జనరల్ ఫిజిషియన్, యశోద ఆస్పత్రి, హైదరాబాద్.

వివాదాస్పద నేతలకు టికెట్ కట్

బీజేపీ అధిష్ఠానం సంచలన నిర్ణయం

» ఐదుగురు సిటింగ్‌లకు నిరాకరణ

» వివాదాల నేపథ్యంలో వేరే వారికి చాన్స్



న్యూఢిల్లీ, మార్చి 25: ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఎన్డీఏ కూటమి 400 స్థానాల్లో విజయం దక్కించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ.. వివాదాస్పద సిట్టింగ్ ఎంపీలకు ప్రస్తుత ఎన్నికల్లో సీట్లు ఇవ్వరాదని నిర్ణయించింది. వీరిలో ఐదుగురు కీలక నేతలు ఉన్నారు. వీరంతా వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంలో దిట్టలుగా పేరొందారు. ఫలితంగా ఆయా సందర్భాల్లో బీజేపీ ఇరుకున పడింది. ఓ సందర్భంలో అయితే ఏకంగా ప్రధాని మోదీ వారి వ్యాఖ్యలను ఖండించాల్సిన పరిస్థితి వచ్చింది. పక్కన పెట్టిన వారిలో అనంతకుమార్ హెగ్డే(కర్ణాటక), ప్రజ్ఞాసింగ్(మధ్యప్రదేశ్), రమేశ్ బిధురి(ఢిల్లీ), పర్వేశ్ సాహిబ్ సింగ్(ఢిల్లీ), జయంత్ సిన్హా(జార్ఖండ్) ఉన్నారు. వీరిని పక్కన పెట్టడం ద్వారా వివాదాస్పద వ్యాఖ్యలతో పార్టీని ఇబ్బంది పెట్టేవారికి బలమైన సందేశాన్ని ఇచ్చినట్టయింది.

అనంతకుమార్ హెగ్డే: కర్ణాటకకు చెందిన బీజేపీ నేత, ఆరుసార్లు ఎంపీగా గెలిచిన అనంతకుమార్ హెగ్డే తాము(బీజేపీ) మరోసారి అధికారంలోకి రాగానే రాజ్యాంగాన్ని మార్చేస్తామని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు పెనుదుమారం రేపాయి. దీనిపై కొన్ని వారాల పాటు వేచి చూసిన బీజేపీ.. సదరు వ్యాఖ్యలు పార్టీకి నష్టం కలిగించేలా ఉన్నాయని భావించి, తాజాగా అనంతకుమార్‌ను ఉత్తర కన్నడ పార్లమెంటు స్థానం నుంచి తప్పించింది. ఈ స్థానాన్ని మరో సీనియర్ నేత విశ్వేశ్వర హెగ్డే కగేరికి కేటాయించింది.

సాధ్వి ప్రజ్ఞాసింగ్: మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే, మహాత్మాగాంధీని హత్య చేసిన నాథూరామ్ గాడ్సేని దేశభక్తుడిగా పేర్కొంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనిపై తీవ్ర దుమారం రేగింది. దీంతో ప్రధాని మోదీ రంగంలోకి దిగి ఆమె వ్యాఖ్యలను ఖండించారు. ఆమె క్షమాపణలు కోరినప్పటికీ క్షమించలేనని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఆమె స్థానాన్ని అలోక్ శర్మకు ఇచ్చారు.

రమేశ్ బిధురి: ఢిల్లీ దక్షిణ నియోజకవర్గం నుంచి రమేశ్ బిధురి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈయన కూడా వివాదాస్పద వ్యాఖ్యలతో దుమారం రేపారు. పార్లమెంటు లోపల ముస్లిం మైనారిటీ వర్గానికి చెందిన ఎంపీ డానిష్ అలీని దుర్భాషలాడారు. దీంతో రమేశ్ బిధురి స్థానాన్ని తొలిసారి పోటీకి సిద్ధమైన రామ్‌వీర్ సింగ్ బిధురికి కేటాయించారు.

పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ: ఢిల్లీ పశ్చిమ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వర్మ.. మాజీ సీఎం సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు. కానీ, 2022లో "ముస్లిం జాతిని దేశం నుంచి పూర్తిగా తరిమికొట్టాలి" అని చేసిన వ్యాఖ్యలు దేశంలో పెను సంచలనం సృష్టించాయి. దీంతో ఆయన టికెట్‌ను కమల్‌జిత్ సెహ్రావత్‌కు కేటాయించింది.

జయంత్ సిన్హా: జార్ఖండ్‌లోని హజారీబాగ్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే.. 2017లో జార్ఖండ్‌లోని రామ్‌గఢ్‌లో జరిగిన మాంసం వ్యాపారి దారుణ హత్య కేసులో నిందితులైన ఆరుగురికి ఆర్థిక సాయం చేశారు. అదేవిధంగా వారు బెయిల్‌పై బయటకు వచ్చినప్పుడు 2019లో నేరుగా తన ఇంటికి తీసుకువెళ్లి పూలమాలలు వేసి సత్కరించారు. ఇది బీజేపీని ఇరకాటంలోకి నెట్టింది. ఈ నేపథ్యంలో జయంత్ సిన్హా స్థానాన్ని హజారీబాగ్ ఎమ్మెల్యే మానిశ్ జైస్వాల్‌కు కేటాయించారు.



మళ్లీ కమలం గూటికి 'గాలి'

బీజేపీలో కల్యాణ కర్ణాటక ప్రగతి పక్ష విలీనం

బెంగళూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కల్యాణ కర్ణాటక ప్రగతి పక్ష పార్టీని స్థాపించి, ఇటీవల శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన గాలి జనార్దనరెడ్డి మళ్లీ కమలం గూటికి చేరారు. బెంగళూరులోని బీజేపీ కార్యాలయంలో సోమవారం జనార్దనరెడ్డి బీజేపీ తీర్థం తీసుకున్నారు. కల్యాణ కర్ణాటక ప్రగతి పక్ష పార్టీని బీజేపీలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర, సీనియర్‌నేత యడియూరప్ప ఆయనను సాదరంగా స్వాగతించి కండువాలుకప్పారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ సభ్యత్వం తీసుకున్నారు. తర్వాత జనార్దనరెడ్డి మాట్లాడుతూ 13ఏళ్ల తర్వాత బీజేపీ కార్యాలయానికి వచ్చానని, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా బీజేపీతో కలిసి పనిచేయాలని సూచించారన్నారు. తన ప్రతి రక్తపు బొట్టులోనూ బీజేపీ కణాలున్నాయని, అనివార్య కారణాలతో పార్టీని వీడాల్సి వచ్చిందన్నారు. గాలి జనార్దనరెడ్డి భార్య అరుణ, మాజీ మంత్రి టి.జాన్ కుమారుడు థామస్ జాన్ బీజేపీలో చేరారు. బళ్లారి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి శ్రీరాములు,ఎంపీలు పీసీ మోహన్, దేవేంద్రప్ప కార్యక్రమంలో పాల్గొన్నారు.



సచివాలయ నిర్మాణం.. రికార్డుల్లో వివరాలు తారుమారు?

- ఆర్‌అండ్‌బీ అధికారుల్లో హడల్
- ఇద్దరు ఎస్ఈ స్థాయి అధికారుల వీఆర్ఎస్
- ఉన్నతాధికారి వద్ద సీల్డ్ రికార్డులు
- నిర్మాణం పూర్తయి 11 నెలలు..

ఇప్పటికీ పూర్తికాని క్వాలిటీ చెకింగ్

హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కొత్త సచివాలయ నిర్మాణ అంచనా వ్యయం రెండింతలు కావడంపై కాంగ్రెస్ సర్కారు ఆరా తీస్తుండడంతో.. ఆర్‌అండ్‌బీ శాఖలోని కొందరు అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఇప్పటికే సూపరెంటెండింగ్ ఇంజనీరు(ఎస్ఈ) స్థాయిలో ఇద్దరు అధికారులు స్వచ్ఛంద పదవీ విరమణ(వీఆర్ఎస్) చేయగా.. మరికొందరు అదే బాటలో ఉన్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ పెద్దల మెప్పుకోసం ఓ కీలక అధికారి ఇష్టారీతిన నిర్ణయాలు తీసుకున్నారని, ఆ క్రమంలో రికార్డుల్లో ఆయా అంశాలను నమోదు చేయాలని అధికారులు, ఉద్యోగులకు సూచించినట్లు తెలుస్తోంది. అప్పట్లో సచివాలయ నిర్మాణంలో సదరు అధికారి కీలకం కావడంతో.. వీరంతా ఆయన చెప్పినట్లుగా విన్నారు. సచివాలయ నిర్మాణంపై సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కింద దరఖాస్తులు వచ్చినా.. వాటికి పాత జీవో(రూ.617 కోట్లు) ప్రకారం అంచనా వ్యయాన్ని చూపించారే తప్ప.. అసలు వ్యయాన్ని(రూ.1,140 కోట్లు) దాచిపెట్టారు. కాంగ్రెస్ సర్కారు ఈ విషయాన్ని గుర్తించాక.. సదరు ఉన్నతాధికారి ఆదేశాలతో రికార్డుల్లో వివరాలను తారుమారు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నారు. ఇప్పుడు ప్రభుత్వం అన్ని అంశాలపై ఆరా తీస్తుండడం.. ఇతర శాఖల్లో రూల్స్‌ను అతిక్రమించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటుండడంతో ఇంకా సర్వీస్ మిగిలి ఉన్నా.. వాలంటరీ రిటైర్మెంట్ దిశగా కొందరు అధికారులు, ఉద్యోగులు అడుగులు వేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ఉన్నతాధికారి వద్ద రికార్డులు!

రేవంత్ సర్కారు సచివాలయ నిర్మాణ ఖర్చు రెట్టింపవ్వడంపై సీరియస్‌గా దృష్టి సారించడంతో.. అధికారులు అందుకు సంబంధించిన రికార్డులకు సీల్ వేసినట్లు తెలుస్తోంది. ఆ ఫైళ్లను ఓ ఉన్నతాధికారి వద్ద భద్రపరిచినట్లు సమాచారం. ఈ రికార్డులనే కొందరు అధికారులు తారుమారు చేసినట్లు తెలుస్తోంది. ఆ సీళ్లను విప్పితే.. లోగుట్టు వెలుగులోకి వస్తుందని స్పష్టమవుతోంది. మరోవైపు.. సచివాలయంలాంటి బడా ప్రాజెక్టులు నిర్మాణంలో ఉంటే.. పిల్లర్ల దశ నుంచి.. ఎప్పటికప్పుడు నాణ్యత పరీక్ష జరిపించాల్సి ఉంటుంది. స్ట్రక్చరల్ ఇంజనీర్లతో దశలవారీగా ఈ పరీక్షలను నిర్వహించాలి. బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీమ్(బీఆర్ఎస్) అమలు సందర్భంలోనూ ప్రభుత్వం స్ట్రక్చరల్ ఇంజనీరు నివేదిక తప్పనిసరి అని స్పష్టం చేసిన విషయం తెలిసిందే.! అయితే.. సచివాలయం నిర్మాణ సమయంలో కాదుకదా.. ప్రారంభోత్సవం జరిగి 11 నెలలు గడుస్తున్నా.. ఇప్పటికీ నాణ్యత పరీక్షలు నిర్వహించలేదు. ప్రభుత్వం క్వాలిటీ చెకింగ్ చేస్తే.. నిర్మాణంలో లోపాలు కూడా బయటపడే అవకాశాలున్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

పట్నం గొంతెండుతోంది!

(మొదటి పేజీ తరువాయి)

మార్గాలను వెతకడంతోపాటు.. ఉన్న నీటి వనరులను పొదుపుగా వాడేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 142 పట్టణ ప్రాంతాల్లో నీటిలభ్యత గణనీయంగా తగ్గింది. మార్చి నెలాఖరులోనే తాగునీటికి ఇంత సమస్య ఎదురైతే.. రాబోయే రెండు నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళన పట్టణవాసుల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో.. ఏప్రిల్, మే నెలల్లో తాగునీటి సమస్య మరింత తీవ్రం కాకుండా ముందస్తు చర్యలు తీసుకునేలా క్షేత్రస్థాయి సిబ్బందిని సన్నద్ధం చేసేందుకు సీడీఎంఏ కసరత్తు చేస్తోంది. ఇందు కోసం మంగళవారం ప్రత్యేక సమావేశం కూడా నిర్వహించేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం రాష్ట్రంలో రోజువారీ అవసరాల కోసం గ్రామీణ ప్రాంతాల్లో ఒక వ్యక్తికి తలసరి 100 లీటర్లు, కార్పొరేషన్లలో 150 లీటర్లు, మునిసిపాలిటీల పరిధిలో 135 లీటర్ల చొప్పున సరఫరా చేయాల్సి ఉంది. కానీ.. నీటి లభ్యత లేక, విద్యుత్తు సరఫరాలో అంతరాయం, మోటార్ల రిపేర్లు, పైపులైన్ల మరమ్మతుల వంటి సాంకేతిక సమస్యల వల్ల కూడా వేసవి అవసరాలకు సరిపడా తాగునీటిని పట్టణ ప్రాంత ప్రజలకు అందించడం అధికారులకు సవాలుగా మారింది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు అందుబాటులో ఉన్న అన్ని వనరులనూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు భావిస్తున్నారు. పట్టణ ప్రజల గొంతు తడిపేందుకు సమీపంలోని గ్రామాల్లో ఉన్న బోరుబావుల నుంచి నీరు సేకరించి ట్యాంకర్ల ద్వారా కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరా చేస్తున్నారు.

ఇప్పుడే ఇలా ఉంటే..

రాష్ట్రవ్యాప్తంగా 103 మునిసిపాలిటీలలో ప్రస్తుతం రోజువారీ అవసరాలకు సరఫరా చేయాల్సినదానికన్నా 4.99 శాతం తక్కువ నీటిని సరఫరా చేస్తున్నారు. 12 మునిసిపాలిటీలలో 10 శాతం తక్కువగా.. మరో 10 మున్సిపాలిటీలలో 20 నుంచి 25 శాతం మేర తక్కువగా నీటిని సరఫరా చేస్తున్నారు. కోదాడ మునిసిపాలిటీలో అయితే రోజువారీ అవసరాల కన్నా 69 శాతం తక్కువ నీరు సరఫరా చేస్తున్నారు. ఖమ్మం, కరీంనగర్ నగరపాలక సంస్థల పరిధిలో ఈ లోటు 20 నుంచి 29 శాతం దాకా ఉండగా.. రాయికల్, అచ్చంపేట, హాలియా మునిసిపాలిటీల్లో సుమారు 20 శాతం తక్కువ నీరు సరఫరా అవుతోంది. ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ మునిసిపాలిటీలో రోజువారీ అవసరాల కోసం 18.8 ఎమ్ఎల్‌డీల నీరు సరఫరా చేయాల్సి ఉండగా.. ప్రస్తుతం అక్కడ 15.6 ఎమ్ఎల్‌డీల నీరు మాత్రమే సరఫరా చేస్తున్నారు. మార్చిలోనే ఇలా ఉంటే.. రాబోయే రెండు నెలల్లో పరిస్థితిని ఎలా చక్కదిద్దాలనేది ఇప్పుడు అధికారుల ముందున్న ప్రశ్న. ఏప్రిల్, మే నెలల్లో కొద్దిపాటి వర్షాలైనా పడకపోతే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

రాజధాని గొంతు తడపడానికి..

అసలే నీటి కొరతతో అల్లాడే రాజధాని హైదరాబాద్‌లోనూ పరిస్థితి దిగజారుతోంది. ఈ నేపథ్యంలో.. హైదరాబాద్ గొంతు తడపడానికి ఏప్రిల్ మొదటివారంలో అత్యవసర పంపింగ్ చేపట్టనున్నట్టు సమాచారం. నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం నీటి మట్టం 513.5 అడుగులుగా ఉంది. కానీ.. సాగర్ రిజర్వాయర్‌లో నీటిమట్టాలు రోజురోజుకూ పడిపోతున్నాయి. ఈ నెలాఖరుకు సాగర్‌లో నీటిమట్టం 511.5 అడుగులకు చేరుతుందని అంచనా. 510 అడుగులకు చేరగానే నగరానికి నీటి సరఫరా నిలిచిపోతుంది. అలా జరగకుండా అత్యవసర పంపింగ్ ప్రారంభించేందుకు వాటర్‌బోర్డు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే భారీ మోటారు పంపులను, విద్యుత్ సరఫరాకు ప్రత్యేక సబ్‌స్టేషన్ లాంటివాటిని సన్నద్ధం చేశారు. సాగర్‌లో నీటిమట్టాలు 512అడుగులకు చేరగానే గతంలో ఏర్పాటు చేసిన మోటర్లు నిలిపే కాంక్రీట్ దిమ్మలు బయటకురానున్నాయి. ఆ దిమ్మలపై మోటర్లను కూర్చోపెట్టి నీటిని పంపింగ్ చేసేందుకు వాటర్‌బోర్డు అధికారులు సంసిద్ధంగా ఉన్నట్లు తెలిసింది.


సూర్యాపేట జిల్లా కోదాడ మునిసిపల్ పరిధి ద్వారకుంటలో నీటి సమస్యపై మహిళల నిరసన

పంపింగ్ ఇలా..

అత్యవసర పంపింగ్ ప్రక్రియలో భాగంగా నాగార్జున్‌సాగర్ నుంచి రోజూ 900 క్యూసెక్కుల నీటిని పంప్ చేసేలా పది భారీ మోటార్లను ఏర్పాటు చేస్తారు. సాగర్ బ్యాక్ వాటర్ నుంచి పుట్టగండి చానల్ ద్వారా అక్కంపల్లి జలాశయంలోకి మోటర్ల ద్వారా పంపింగ్ చేస్తారు. ఎలిమినేటి మాధవరెడ్డి కెనాల్ నుంచి నీటిని సేకరించి కోదండపూర్ రిజర్వాయర్‌కు తరలిస్తారు. అక్కడ శుద్ధి చేసిన నీటిలో 275 ఎండీజీల నీటిని హైదరాబాద్ తరలించనున్నారు. హైదరాబాద్‌కు ప్రస్తుతం నెలకు 1.38 టీఎంసీల నీరు సరఫరా అవుతోంది. వచ్చే నాలుగు నెలలకూ ఆరు టీఎంసీల నీళ్లు కావాల్సి ఉంటుంది. అక్కంపల్లి రిజర్వాయర్‌లో 1.5 టీఎంసీల నీళ్లు అందుబాటులో ఉండగా.. నాగార్జున్‌సాగర్ నుంచి వచ్చే నాలుగు నెలలకూ 4.5 టీఎంసీలను అత్యవసరంగా పంపింగ్ చేసుకోవాల్సి ఉంటుందని వాటర్‌బోర్డు అధికారులు అంచనాలు వేస్తున్నారు.

ఈసారి ఎండలు ఎక్కువే

- ఏప్రిల్, మేలో సాధారణం కంటే 4-5 డిగ్రీలు అధికం
- బేగంపేట వాతావరణశాఖ డైరెక్టర్ నాగరత్న వెల్లడి



హైదరాబాద్ సిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఈ సంవత్సరం వేసవిలో ఎండలు సాధారణం కంటే అధికంగా నమోదయ్యే ప్రమాదం ఉందని బేగంపేట వాతావరణశాఖ డైరెక్టర్ డా.కె.నాగరత్న తెలిపారు. గడిచిన పదేళ్లలో ఏప్రిల్, మే నెలల్లో నమోదయిన గరిష్ఠ ఉష్ణోగ్రతల సరాసరిని సాధారణ ఉష్ణోగ్రతగా పరిగణిస్తారు. ఆ లెక్క ప్రకారం సాధారణ ఉష్ణోగ్రతలు 40-41 డిగ్రీలు. కానీ ఈ ఏడాది ఏప్రిల్ 15 తర్వాత.. ఎండలు సాధారణం కన్నా 4-5 డిగ్రీల మేర అధికంగా నమోదవుతాయని.. 45 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలతో తీవ్ర వడగాల్పులు వీస్తాయని ఆమె హెచ్చరించారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే సమయాల్లో సీనియర్ సిటీజన్లు, చిన్నపిల్లలు బయటకు తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆ సమయంలో బయట తిరిగితే వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వృత్తి, ఉద్యోగాల రీత్యా తప్పనిసరి పరిస్థితుల్లో ఆ సమయంలో బయటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాగా.. ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్‌లో సాధారణం కంటే 3- 4 డిగ్రీల మేర అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో వడగాల్పుల ప్రభావం కన్పిస్తోంది.

ఏపీలో టీడీపీ నేత దారుణ హత్య

- శ్రీసత్యసాయి జిల్లా కుటాలపల్లిలో ఘటన



నల్లమాడ, మార్చి 25: కీలకమైన ఎన్నికల వేళ.. ఏపీలో హత్యా రాజకీయాలు కొనసాగుతున్నాయి. ఇటీవలే మూడు జిల్లాల ఎస్పీలను పిలిచి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి హెచ్చరించినా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు. తాజాగా శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గంలో టీడీపీ నాయకుడు డి. అమరనాథ్‌రెడ్డి(42) దారుణ హత్యకు గురయ్యారు. నల్లమాడ మండలం కుటాలపల్లికి చెందిన ఆయన.. ఆదివారం ఉదయం టీడీపీ అభ్యర్థి ప్రచారంలో పాల్గొన్నారు. రాత్రి పొలం వద్దకు వెళ్లిన ఆయన.. సోమవారం ఉదయం అయినా ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా.. రక్తపు మడుగులో అమర్‌నాథ్ మృతదేహం కనిపించింది. ఆయన హత్య వెనుక రాజకీయ కోణం ఉందనే చర్చ జరుగుతోంది. తమకు ఎవరితోనూ వ్యక్తిగత తగదాలు, ఆస్తి గొడవలు లేవని బాధిత కుటుంబం పేర్కొంది.

రఘురామకు పశ్చిమలో సీటు!

- టీడీపీ నాయకత్వం నిర్ణయం
- అసెంబ్లీ బరిలో నిలిపే యోచన?
- ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిగా మాగుంటే

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నరసాపురం వైసీపీ ఎంపీ రఘురామరాజుకు బీజేపీ టికెట్ ఇవ్వని నేపథ్యంలో ఆయనకు తానే ఏదో ఒక చోట అవకాశమివ్వాలని టీడీపీ నాయకత్వం దాదాపు నిర్ణయానికి వచ్చింది. పశ్చిమ గోదావరిలో ఏదైనా అసెంబ్లీ స్థానంలో బరిలో దించాలని భావిస్తోంది. వాస్తవానికి ఆయనకు నరసాపురం లోక్‌సభ స్థానంలోనే బీజేపీ అభ్యర్థిగా అవకాశం లభిస్తుందని టీడీపీ వర్గాలు అనుకున్నాయి. ఆ దిశగా ముందుగానే సంకేతాలు వచ్చాయని తెలిపాయి. కానీ చివరకు ఆ పార్టీ శ్రీనివాస వర్మ అనే మరో నేతకు అవకాశం కల్పించింది. రఘురామరాజుకు సీటు దక్కకపోవడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దీంతో తామే టీడీపీ తరపున టికెట్ ఇవ్వడంపై టీడీపీ నాయకులు దృష్టి సారించారు. తొలుత విజయనగరం లోక్‌సభ స్థానంలో పోటీచేయిస్తే ఎలా ఉంటుందని ఆలోచించారు. కొందరు నేతలు ప్రతిపాదించగా.. ఉత్తరాంధ్ర నాయకులు అంగీకరించలేదు. తమ ప్రాంత సామాజిక సమీకరణల రీత్యా ఈ యోచన ఉపయుక్తం కాదని.. పార్టీకి ఇబ్బంది అవుతుందని అన్నట్లు తెలిసింది. చివరకు ప్రత్యామ్నాయంగా పశ్చిమ గోదావరి జిల్లాలో ఏదైనా అసెంబ్లీ సీట్లో ఆయనను నిలపాలన్న ప్రతిపాదన వచ్చింది. ఆ జిల్లాలో తమ కోటా కింద వచ్చిన అన్ని అసెంబ్లీ సీట్లకు టీడీపీ ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేసింది. వారిలో ఎవరినైనా ఆపి రఘురామరాజును నిలిపితే ఎలా ఉంటుందన్నదానిపై సమాచారం సేకరిస్తున్నారు. ఒంగోలు లోక్‌సభ స్థానానికి టీడీపీ అభ్యర్థి మారారు. తన కుమారుడు రాఘవరెడ్డి బదులు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డే బరిలోకి దిగనున్నారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసు తీవ్రత పెరగడంతో.. మొదట ఖరారుచేసిన రాఘవరెడ్డిని కాదని.. ఆయన తండ్రి మాగుంట శ్రీనివాసులరెడ్డిని నిలపాలని తాజాగా నిర్ణయించారు. ఈ కేసులో రాఘవరెడ్డి నిందితుడిగా ఉన్నారు. పోటీ నుంచి తప్పుకొంటున్నానని ఆయన సోమవారం బహిరంగంగా ప్రకటించారు కూడా.

‘పాలమూరు-రంగారెడ్డి’ పర్యావరణ అనుమతికి మార్గం సుగమం!

- అనుమతి రాగానే ఏఐబీపీ కింద దరఖాస్తు
- బీ-కేటగిరిలో సహాయం పొందడానికి అవకాశం

హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రెండో దశ పర్యావరణ అనుమతికి మార్గం సుగమం అవుతోంది. అనుమతి లేకుండా పనులు చేశారనే కారణంతో విధించిన జరిమానాతో పాటు పర్యావరణానికి జరిగిన నష్టం మొత్తాన్ని అభివృద్ధి పనుల కోసం వెచ్చించాలి. ఈ నిధులతో ఇప్పటిదాకా పనులు జరిగిన గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడితే ప్రాజెక్టుకు రెండో దశ పర్యావరణ అనుమతి రానుంది. రెండో దశ పర్యావరణ అనుమతి చేతికి వస్తే ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(పీఎంకేఎస్‌వై-ఏఐబీపీ)కింద కేటగిరి-బీలో సాయం అందే అవకాశాలున్నాయని అధికారులు గుర్తించారు. పథకం పనులు 50 శాతం దాకా జరిగి, రానున్న ఐదేళ్లలో గనుక పథకం పూర్తయ్యే అవకాశాలు ఉంటే, ఆ ప్రాజెక్టుకు బీ-కేటగిరిలో సాయం అందుతుంది. 90 టీఎంసీలతో చేపట్టే ఈ ప్రాజెక్టుకు 2022 ఆగస్టులో డీపీఆర్ సమర్పించారు. నాగర్‌కర్నూలు, మహబూబ్‌నగర్, వికారాబాద్, నల్గొండ, నారాయణపేట, రంగారెడ్డి జిల్లాల్లో కరువు పీడిత ప్రాంతాలకు సాగునీరుతో పాటు ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు తాగునీటిని అందించడానికి వీలుగా 90టీఎంసీలతో ఈ పథకాన్ని చేపట్టారు. తొలిదశలో ఆయా జిల్లాల్లోని 1226 గ్రామాలకు తాగునీరు, రెండో దశలో 12.30లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు పారిశ్రామిక అవసరాలు తీర్చడానికి వీలుగా.. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి 60 రోజుల్లో 90 టీఎంసీల జలాలను తరలించడానికి వీలుగా ఈ ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయి. ఈ పథకం గట్టెక్కాలంటే విధిగా కేంద్రం సాయం తీసుకోవాల్సిందే. దాంతో రెండోదశ పర్యావరణ అనుమతి లభించిన వెంటనే పీఎంకేఎస్‌వై-ఏఐబీపీ కింద సహాయం పొందడానికి వీలుగా తెలంగాణ దరఖాస్తు చేసుకునే అవకాశాలున్నాయి. ఈ ప్రాజెక్టులో ఒకటో దశలో నిర్మాణాల కోసం 27 వేల ఎకరాల భూములను ఇదివరకే సేకరించారు ప్రస్తుతం ప్రాజెక్టుపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి సారించలేదు. లోక్‌సభ ఎన్నికలు పూర్తవగానే ఈ ప్రాజెక్టులో అవసరం లేని లింకులు, ప్యాకేజీలను తొలగించి, విధిగా ఉపయోగపడే లింకులతోనే పనులు చేపట్టే అవకాశాలున్నాయి. రెండో దశ పర్యావరణ అనుమతి రాగానే, కేంద్ర సహాయం కోరి పనులు చేపడితే.. వచ్చే ఏడాది కల్లా పథకం పూర్తయ్యే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

పేదల పెన్షన్.. 4 వేలకు పెంచుతా

ఒకటో తేదీనే ఇంటికి పంపిస్తా.. బయటి ప్రాంతాలకు వెళ్తే.. ఒకేసారి 3 నెలల పింఛను: చంద్రబాబు


కుప్పంలో జరిగిన సభకు హాజరైన వారికి చంద్రబాబు అభివాదం

కుప్పం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పేదలకు సామాజిక పెన్షన్ మొత్తాన్ని రూ.4 వేలకు పెంచుతానని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. ఆ మొత్తాన్ని ఒకటో తేదీనే ఇంటికి పంపించేలా చేస్తానన్నారు. బయటి ప్రాంతాలకు వెళ్లినవారికి మూడు నెలల పెన్షన్ ఒకేసారి ఇచ్చేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సైకో పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడమే టీడీపీ, జనసేన, బీజేపీ ఎజెండాగా పేర్కొన్నారు. సోమవారం తన సొంత నియోజకవర్గమైన చిత్తూరు జిల్లా కుప్పంలో ఆయన పర్యటించారు. మధ్యాహ్నం మహిళలతో సమావేశం అనంతరం బస్టాండు సర్కిల్‌లో బహిరంగ సభలో ప్రసంగించారు. కుప్పం నుంచే ఎన్నికల శంఖం పూరిస్తున్నట్లు ప్రకటించారు. 175 నియోజకవర్గాల్లోనూ టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు రాష్ట్ర ప్రజలు సంకల్పం తీసుకోవాలన్నారు. కేంద్రంలో ఎన్డీయే 400 ఎంపీ సీట్లను గెలవాలని, రాష్ట్రంలో మూడు పార్టీల కూటమి 160కిపైగా అసెంబ్లీ స్థానాలు గెలవాలని లక్ష్యం పెట్టుకున్నట్లు చెప్పారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాలని, ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలకూడదని పవన్ కల్యాణ్ ముందుకొచ్చారని.. రాష్ట్ర పరిస్థితి చూసి మోదీ కూడా ముందుకొచ్చారని తెలిపారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాలనే తపన తప్ప వేరే ఆలోచన లేదని.. తమను ఆశీర్వదించి తమతో నడవాలని, టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపిచ్చారు. ఇంకా ఏమన్నారంటే..

పీటి కోసం ఎన్డీయే రావాలి..

రాష్ట్రంలో ఎన్డీయే ఎందుకు అధికారంలోకి రావాలంటే.. రాజధాని కట్టుకోవాలి, పెట్టుబడులు తెచ్చుకోవాలి, పోలవరం పూర్తి చేయాలి, రైతులకు సబ్సిడీలు ఇవ్వాలి, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఉద్యోగులకు, పెన్షనర్లకు ఒకటో తారీఖున జీతం ఇవ్వాలి. మాకు అధికారం ఇస్తే సహజ వనరుల దోపిడీ ఉండదు. ధరల బాదుడు ఉండదు. కక్షపూరిత రాజకీయాలుండవు. కూటమికి ఓటేస్తే ముస్లింలకు రక్షణ ఉండదని కొందరు రెచ్చగొడుతున్నారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లను కాపాడింది టీడీపీనే. వక్ఫ్ బోర్డు ఆస్తుల్ని కాపాడాం. ఉర్దూను రెండో భాషగా చేశాం. ముస్లింలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేశాం.

కిళ్లీ కొట్టులోనూ డ్రగ్స్

విశాఖకు ఇటీవల 25 వేల కిలోల డ్రగ్స్ విదేశాల నుంచి వచ్చాయి. కిళ్లీ కొట్టులో కూడా డ్రగ్స్, గంజాయి అందుబాటులో ఉన్నాయి. డ్రగ్స్‌ను ఇలాగే నిర్లక్ష్యంగా వదిలిస్తే జీవితాలు నాశనమవుతాయి. వైసీపీ డ్రగ్స్, గంజాయిని ప్రోత్సహిస్తోంది. ఇవి వాడినవారికి తల్లికి, చెల్లికి తేడా తెలియదు. నేను గతంలోనే డ్రగ్స్, గంజాయి గురించి మాట్లాడితే.. డీజీపీ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న టీడీపీ ప్రధాన కార్యాలయంపై దాడి చేశారు. ఎవరూ వైసీపీకి ఓట్లు వేయొద్దు. ఎన్‌డీఏ మిత్రపక్షాల అభ్యర్థులకే ఓటేయండి.. అని చంద్రబాబు కోరారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

భూటాన్ బంధం!

భూటాన్‌లో భారీ వర్షాల కారణంగా నిలిచిపోయిన భారతప్రధాని నరేంద్రమోదీ పర్యటన, వాతావరణం కాస్తంత మెరుగుపడటంతో మరుసటిరోజునే జరిగిపోయింది. స్వదేశంలో సార్వత్రిక ఎన్నికల ఒత్తిడి వంటివి పక్కనబెట్టి రెండురోజులపాటు ప్రధాని ఈ పర్యటన జరపడం భూటాన్‌కు భారతదేశం ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనం. ఇచ్చిన మాట ప్రకారం వచ్చినందుకు భూటాన్ ప్రధాని దాషో షెరింగ్ తోబ్గే దీనిని 'మోదీకి గ్యారంటీ'గా అభివర్ణించారు. బీజేపీ ఎన్నికల నినాదం భూటాన్ ప్రధాని నోటి నుంచి రావడం అటుంచితే, తోబ్గే భారత్ అనుకూలుడని అంటారు. భూటాన్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత భారత ప్రధాని పర్యటించడం ఇదే మొదటిసారి. జనవరిలో ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తోబ్గే తన తొలివిదేశీపర్యటన భారతదేశంలోనే జరిపారు. ఆయన తిరిగివెళ్ళిన నాలుగురోజుల్లోనే మోదీ ఆ సుహృద్భావానికి కొనసాగింపుగా తాను ఆ దేశంలో కాలూనారు. నరేంద్రమోదీని భూటాన్ పాలకులు ఘనంగా స్వాగతించారు, గౌరవించారు, 2021లో ప్రకటించిన భూటాన్ అత్యున్నత పౌరపురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేశారు.

స్వదేశంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ప్రధాని ఈ పర్యటనకు సంకల్పించడం విశేషం. ఆర్థికంగా బలోపేతమవుతున్న భారతదేశం నుంచి భూటాన్ మరింత ఆర్థిక సహకారాన్ని ఆశించడం సహజం కనుక, భూటాన్ పంచవర్ష ప్రణాళికకు భారత్ ఆర్థిక సహకారాన్ని రెట్టింపు చేయడానికి నిర్ణయించడం సరైన చర్య. భూటాన్ అభివృద్ధికి భారతదేశం కట్టుబడి ఉన్నదని ప్రధాని తన పర్యటనలో హామీ ఇచ్చారు. అక్కడి యువతలో నైపుణ్యాల మెరుగుపరచే శిక్షణాకార్యక్రమాన్ని భారతదేశం పూర్తిగా తన ఖర్చుతో నిర్వహిస్తున్నది. థింపూలో భారతదేశం నిర్మించిన ఆస్పత్రి ఆరంభమూ జరిగింది. అసోంను ఆనుకొని ఉన్న భూటాన్ ప్రాంతాల్లో గెల్పూ మైండ్‌ఫుల్‌నెస్ సిటీ ప్రాజెక్టు ఆ దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తుంది. భూటాన్ కొత్త ప్రధాని భారతదేశంలో పర్యటించడం, ఇప్పుడు నరేంద్రమోదీ ఆ దేశంలో కాలూని అనేక ఒప్పందాలు చేసుకోవడం ద్వారా ఉభయదేశాల మధ్యా సాన్నిహిత్యం పెరుగుతుంది, ఆర్థిక, వాణిజ్య బంధం హెచ్చుతుంది.

ఇటీవలికాలంలో చైనాకు భూటాన్ మరింత దగ్గరవుతున్న విషయం తెలిసిందే. భారతదేశానికి సాంస్కృతికంగానూ, సహజసిద్ధంగానూ ఉపఖండంలోని దేశాలతో ఉన్న సంబంధాలను చైనా తన ఆర్థికబలంతో ప్రభావితం చేస్తున్నది. వేగంగా ఎదిగి భారతదేశంకంటే ఆర్థికంగా నాలుగురెట్లు శక్తిమంతంగా తయారైన కారణంగా డబ్బు వెదజల్లి చాలా దేశాలను అది తనవైపునకు తిప్పుకోగలుగుతోంది. శ్రీలంక, నేపాల్, మాల్దీవులు, బంగ్లాదేశ్ ఇలా ప్రతీదేశానికీ అది అప్పులు ఇస్తోంది, ప్రాజెక్టులు కడుతోంది. భూటాన్ కూడా ఈ ప్రభావానికి అతీతంగా ఏమీ లేదు. చైనా—భూటాన్ సరిహద్దు చర్చలు ఆ సాన్నిహిత్యానికి ఓ ఉదాహరణ. సరిహద్దు ప్రాంతాల్లోని భూములను ఉభయదేశాలు పరస్పరం బదలాయించుకొనేందుకు ఉద్దేశించిన కార్యక్రమం ముందుకు కదిలిన పక్షంలో భారతదేశం రక్షణపరంగా చాలా సమస్యలు ఎదుర్కోవాల్సివస్తుంది. సిలిగురి కారిడార్‌ను, అరుణాచల్‌ప్రదేశ్‌లో సరిహద్దు ప్రాజెక్టులను ఇది ఇబ్బందుల్లో పడవేస్తుంది. చైనాతో తన చర్చలు ఒక కొలిక్కివచ్చేవరకూ కొన్ని ప్రాజెక్టుల విషయంలో కాస్తంత నెమ్మదిగా పోవాలంటూ భూటాన్ ఇటీవల భారతదేశానికి ఓ సందేశం పంపిందని కూడా వార్తలు వచ్చాయి.

చైనా తన ఆర్థికబలంతో భూటాన్‌ను తనవైపు తిప్పుకుంటున్న విషయం అందరికీ తెలిసిందే. దౌత్యసంబంధాలు అధికారికంగా లేనప్పటికీ భూటాన్‌ను చైనా ప్రభావితం చేయగలుగుతున్నది, సరిహద్దు ఒప్పందాల పేరిట కీలకమైన ప్రాంతాలను తన గుప్పిట్లోకి తెచ్చుకొని భారతదేశాన్ని ఆత్మరక్షణలో పడవేసేందుకు ప్రయత్నిస్తున్నది.

ఈ నేపథ్యంలో భారత ప్రధాని పర్యటనకు ఎనలేని ప్రాధాన్యం ఉంది. ఉభయదేశాల బంధాన్ని ఆయన బద్దలు కొట్టలేనిదిగా అభివర్ణించారు. రెండుదేశాల భద్రత పరస్పర సహకారం మీద ఆధారపడి ఉన్నదని ఆయన గుర్తుచేశారు. 'భారత్ కోసం భూటాన్, భూటాన్ కోసం భారత్ అన్నది ఏ మాత్రం తారుమారుచేయలేని ఈ ప్రాంతపు వాస్తవికత' అని సంయుక్త ప్రకటన వ్యాఖ్యానించడం సంతోషించదగ్గ విషయం.

కేజ్రీవాల్ అరెస్ట్‌పై యాగీ ఎందుకు?

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఎట్టకేలకు 9 సమన్ల తర్వాత ఈడీ అరెస్టు చేసింది. దీంతో దేశ వ్యాప్తంగా ప్రతిపక్ష నేతలందరికీ కాకపుట్టుకొచ్చినట్లున్నది. తన కుమార్తె కవితను అరెస్టు చేసినప్పుడు నోరు విప్పని తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నుంచి ఢిల్లీలో రాహుల్ గాంధీ వరకూ విపక్ష నేతలందరూ ప్రకటనలు గుప్పించారు. అవినీతిపరులను అరెస్టుచేయడం రాజ్యాంగ వ్యతిరేకమని, అప్రజాస్వామికమని రకరకాలుగా వ్యాఖ్యానిస్తున్నారు. ఎమర్జెన్సీలో ఇందిరాగాంధీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఏకమైతే ఈసారి విచిత్రంగా ప్రతిపక్షాలన్నీ తమ అవినీతిని సమర్థించుకోవడానికి ఏకమవుతున్నాయి. కాని అవినీతిపరులైన నేతలంతా దేశాన్ని కాపాడడం కోసం కాకుండా, తమను తాము కాపాడుకోవడానికి ఏకమవుతున్నందువల్ల 1975 నాటి పరిస్థితులకూ, 2024 నాటి పరిస్థితులకూ చాలా తేడా ఉన్నది. నాడు రాజ్యాంగాన్ని ఇష్టారాజ్యంగా ఉల్లంఘించినందుకు ప్రతిపక్షాలు ఏకమయ్యాయి. కాని ఇవాళ అవినీతిపరులకు వ్యతిరేకంగా రాజ్యాంగాన్ని ఖచ్చితంగా అమలు చేస్తున్నందుకు ప్రతిపక్షాలు ఏకమవుతున్నాయి. రాజ్యాంగసంస్థల్ని విమర్శిస్తున్నాయి. కోర్టులు అవినీతిపరులను జైలుకు పంపినప్పుడు వాటిని కూడా ఆక్షేపిస్తున్నాయి. ఏ రాజ్యాంగమూ, ఏ న్యాయవ్యవస్థ అవినీతిపరులను ఉపేక్షించాలని, చట్టాన్ని అమలు చేయకూడదని చెప్పదు.



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

నల్లధనాన్ని అరికట్టడం లేదేందుకు, అవినీతిని రూపుమాపడం లేదెందుకు. అని ప్రధానమంత్రిని నిలదీస్తున్న ప్రతిపక్షాలంతా ఇవాళ వారి అవినీతి సొమ్మునే ఈడీ, సీబీఐలు బహిర్గతం చేస్తున్నందుకు దిక్కులేని పరిస్థితిలో ఉన్నాయి. ఒకప్పుడు ప్రత్యర్థులుగా ఉన్న ప్రతిపక్ష నేతలు ఇప్పుడు మిత్రులుగా మారుతున్నారు. ఏ కేజ్రీవాల్ అయితే కాంగ్రెస్ అవినీతికి వ్యతిరేకంగా 2013లో పోరాడారో అదే కేజ్రీవాల్ తానే అవినీతిపరుడై అవినీతి కాంగ్రెస్‌తో చేతులు కలిపారు. ఢిల్లీ మద్యం కేసులో కేజ్రీవాల్ కూరుకుపోయారని, అవినీతిపరుడైన కేజ్రీవాల్ అధికారంలో ఉన్నంతవరకూ విచారణ సరిగా సాగదని కొద్ది రోజుల క్రితం విమర్శించిన కాంగ్రెస్ నేతలే ఇప్పుడు ఆయనపై సానుభూతి ప్రకటిస్తున్నారు.

2019 ఎన్నికలకు ముందు ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలపై మన వీరసైనికులు దాడులు చేసినప్పుడు కూడా ఇదే విధంగా మోదీ చిత్తశుద్ధిని, మన వీరసైనికుల పాటవాన్నీ శంకించిన ప్రతిపక్షాలు ఈ సార్వత్రిక ఎన్నికల ముందు తమ అవినీతినే ఒక ప్రచారాస్త్రంగా మార్చాయి. నిజానికి మోదీ అధికారంలోకి వచ్చిన రోజే అవినీతి పట్ల జీరో టాలరెన్స్ (ఏ మాత్రం సహించని) వైఖరిని అవలంబిస్తానని ప్రకటించారు. గత ఏడాది ముగిసిన జీ-20 సమావేశాల్లోనే కాదు, అనేక అంతర్జాతీయ సమావేశాల్లో నల్లధనాన్ని అరికట్టేందుకు దేశాల మధ్య సంఘటిత కార్యాచరణ గురించి మోదీ మాట్లాడుతూనే ఉన్నారు. ఆరు దశాబ్దాలకు పైగా ఉన్న కాంగ్రెస్ పాలన పుణ్యమా అని ఇవాళ దేశంలో సగానికి పైగా రాజకీయ నాయకులు అవినీతిపరులని ప్రజలు అనుకునే పరిస్థితి వచ్చింది. ఆ అభిప్రాయం మార్చేందుకే మోదీ శతధా ప్రయత్నిస్తున్నారు. ఆయన చేపట్టిన చర్యల వల్లే ఇవాళ ఒక కొలిక్కి వచ్చి అవినీతిపరులు ఆత్మరక్షణలో పడ్డారు. పెద్ద నోట్ల రద్దు, బినామీ ఆస్తుల బిల్లు, వెల్లడించని ఆదాయం, విదేశీ ఆస్తులపై పన్ను బిల్లు మొదలైన అనేక చర్యల ద్వారా లక్షలకోట్ల నల్లధనం వెల్లడైంది. ఒక్క మనీలాండరింగ్ నిరోధక చట్టం మూలంగానే దేశంలో దాదాపు రూ. లక్షన్నర కోట్ల మేరకు అక్రమ ఆస్తులను ఏజెన్సీలు స్వాధీన పరుచుకున్నాయి. మోదీకి ముందు పదేళ్ల పాటు పాలించిన యూపీఏ ప్రభుత్వ హయాంలో ఈ చట్టం ప్రయోగించి కేవలం రూ.5వేల కోట్లు మాత్రమే స్వాధీనపరుచుకున్న విషయం కాంగ్రెస్ నేతలకు తెలుసు. కాంగ్రెస్ హయాంలోనే బ్యాంకులను రూ.22 వేల కోట్ల మేరకు లూటీ చేసినవారు విదేశాలకు పారిపోయారు. మోదీ హయాంలో నాడు పారిపోయిన వ్యక్తుల నుంచే రూ20 వేల కోట్ల మేరకు ఆస్తులను స్వాధీన పరుచుకున్నారు.



నిజానికి నల్లధనాన్ని అరికట్టేందుకే అన్ని రాజకీయ పార్టీలకు కార్పొరేట్లు ఎన్నికల బాండ్ల ద్వారా నిధులు సమకూర్చే విధానాన్ని ప్రవేశపెట్టారు. అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ సహా ప్రాంతీయ పార్టీలు ఈ విధానాన్ని ఉపయోగించుకుని నిధులు తెచ్చుకున్నాయి. రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చేందుకు ఇంతకంటే మెరుగైన పద్ధతిని దేనినైనా సూచిస్తే మోదీ ప్రభుత్వం తప్పకుండా ఆమోదిస్తుంది. అంతేకాని తమ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు మోదీని అవినీతిపరుడని విమర్శించడం అర్థరహితం.

గత ఏడాది కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, బీఆరఎస్, రాష్ట్రీయ జనతాదళ్, సమాజ్‌వాది పార్టీ, శివసేన (యుబిటి), నేషనల్ కాన్ఫరెన్స్, ఎన్‌సీపీ, డీఎంకే, వామపక్షాలతో సహా 14 పార్టీలు తమను సీబీఐ, దర్యాప్తు సంస్థలు వేధిస్తున్నాయంటూ సుప్రీంకోర్టుకు వెళితే అలాంటిదేమీ లేదని ఆ సంస్థలు తమ పని తాము చేసుకుపోతున్నాయని త్రోసిపుచ్చింది. 'రాజకీయ పార్టీలు సామాన్య పౌరుల కంటే గొప్పవేం కావు. సామాన్యులూ, రాజకీయనేతలు ఒకటే అని న్యాయవ్యవస్థ భావిస్తుంది. అటువంటప్పుడు రాజకీయ నేతల అరెస్టులు ఉండకూడదని కోర్టులు ఎలా చెబుతాయి? నేతలు నేరాలు చేశారా లేదా అని చూడకుండా నిర్ణయం తీసుకోవడం ప్రమాదకరం' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ జెబి పర్దీవాలా అన్నారు. సుప్రీంకోర్టు వైఖరి గ్రహించిన కాంగ్రెస్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ తన పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. రాజకీయనాయకులైనంత మాత్రాన అవినీతిపరులు చట్టానికి అతీతులు కాలేరు. సామాన్య ప్రజలకు భిన్నమైన చట్టాలేవీ రాజకీయ నాయకులకు ఉండవు అని తెలిసినప్పటికీ ప్రతిపక్షాలు ఏజెన్సీలను తప్పుపట్టడం మానుకోలేదు. కేజ్రీవాల్ అరెస్టు కాగానే అవి నానా యాగీ చేస్తున్నాయి.

ఇవాళ ఎన్నికల బాండ్లలో అత్యధిక మొత్తం బీజేపీకి లభించాయని విమర్శిస్తున్నవారు దేశంలో బీజేపీయే అతి పెద్ద పార్టీగా మెజారిటీ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నదన్న వాస్తవాన్ని విస్మరిస్తున్నారు. ఎన్నికల బాండ్ల ద్వారా మోదీ ప్రభుత్వం నల్లధనాన్ని ఏమీ ప్రోత్సహించలేదు. వివిధ కార్పొరేట్ సంస్థలు చట్టబద్ధంగానే నిధులు సమకూర్చాయి. ఆ మొత్తాన్ని వారు తమ ఖాతాల్లో చూపించి, ఆదాయపన్ను శాఖ ద్వారా ఆడిట్ చేసుకోవాల్సి ఉంటుంది. నిజానికి నల్లధనాన్ని అరికట్టేందుకే అన్ని రాజకీయ పార్టీలకు కార్పొరేట్లు ఎన్నికల బాండ్ల ద్వారా నిధులు సమకూర్చే విధానాన్ని ప్రవేశపెట్టారు. అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్‌తో సహా ప్రాంతీయ పార్టీలు ఈ విధానాన్ని ఉపయోగించుకుని నిధులు తెచ్చుకున్నాయి. వాటి వాటి స్థాయి, విస్తృతిని బట్టి నిధులు లభించాయి. పోనీ రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చేందుకు ఇంతకంటే మెరుగైన విధానం ఏదైనా ఉంటే సూచిస్తే మోదీ ప్రభుత్వం తప్పకుండా ఆమోదిస్తుంది. అంతేకాని తమ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు మోదీని అవినీతిపరుడని విమర్శించడం అర్థరహితం. జాతీయవాద పార్టీ అయినందువల్లే బీజేపీ 2 సీట్ల నుంచి 303 సీట్ల వరకు పెరగగలిగింది. అలాంటి పార్టీని ఓడించేందుకు ఇవాళ అవినీతి పాలన చేసిన, వారసత్వ రాజకీయాల నుంచి వచ్చిన విచ్ఛిన్నకర శక్తులన్నీ ఏకం కావడాన్ని దేశ ప్రజలు గమనిస్తున్నారు. 2024 జూన్ 4న ఈ శక్తులకు చరమగీతం పాడనున్నారు.

ముసురుకుంటున్న రజాకార్ మనస్తత్వం!

ఫాసిస్టులు పోయారు! నాజీలు నాశనమొందారు! ఎంత గట్టిగా చెప్పుకొన్నా ఇది అర్థసత్యమే! భావజాలంగా ఫాసిజం పోలేదు. నాజీయిజమూ కనుమరుగు కాలేదు. కొత్తరూపాల్లో అవి కనపడుతూనే ఉన్నాయి. రజాకార్లు ఇప్పుడు లేరు. కానీ రజాకర్ మనస్తత్వం పుంజుకుంటోంది. జాతి, మత ఆధిక్యతా భావాలు.. ప్రజాస్వామ్యం— సామాజిక సమానత్వంపై వ్యతిరేకత.. అసమ్మతి అణచివేత కేంద్రంగా ఫాసిస్టు మనస్తత్వం ఉంటుంది. రజాకార్ మనస్తత్వానికి ఇదే పునాది. రజాకార్ల దురాగతాలపై ఎన్ని సినిమాలైనా తీయొచ్చు. ఎన్ని కథలైనా రాయొచ్చు. ఇప్పుడు ముసురుకుంటున్న ప్రమాదం రజాకార్ మనస్తత్వమే. రజాకార్ల ఆగడాల గురించి అలుపెరగకుండా మాట్లాడుతున్న వారే దీన్ని ప్రదర్శిస్తున్నారు.

గెలుచుకున్న రాజ్యం ఎల్లకాలం ముస్లింల ఆధిపత్యం కింద ఉండాలన్న భావన రజాకార్లను నడిపించింది. ఇందుకోసం చాలా వాదనలు తెరపైకి తీసుకొచ్చారు. పాలించే అధికారం నవాబుకు కాకుండా ముస్లిం ప్రజలకే చెందుతుందనేది అందులో ప్రధానమైంది. నిజాం నవాబు కేవలం ఆ అధికారానికి పరిరక్షకుడు మాత్రమే. ఆ పరిరక్షకుడికి ప్రమాదం వస్తే ముస్లింలందరూ పోరాడాలని ప్రచారం చేశారు. అందుకోసం ముస్లింలు స్వచ్ఛంద సైనికులుగా మారాలని పిలుపునిచ్చారు. రజాకార్ల పుట్టుకకు పూర్వరంగమిది. 1920ల నుంచి ప్రజాప్రాతినిధ్య పాలన కోసం దేశంలో ఉద్యమాలు ఊపందుకున్నాయి. నిజాం సంస్థానంలోనూ వాటి ప్రతిస్పందనలు తలెత్తాయి. ముస్లింలను సంఘటితపరచటానికి 1927లో ఏర్పాటైన ఇత్తెహాద్ ఉల్ ముస్లిమీన్ సంస్థ 1936 నాటికి రాజకీయ సంస్థగా మారింది. ఇత్తెహాద్ స్థాపకుల్లో నవాబ్ బహదూర్ యార్ జంగ్ ఒకరు. సార్వభౌమాధికారం ముస్లిం ప్రజలదే అన్న సిద్ధాంతానికి రూపకర్త ఆయనే. ప్రజల్లో పెరిగే ప్రజాస్వామ్య ఆకాంక్షలను, ప్రాతినిధ్య ప్రభుత్వ ఏర్పాటును అడ్డుకోవటమే క్రమేపీ ఇత్తెహాద్ అజెండాగా మారింది. 1946లో ఇత్తెహాద్ అధ్యక్షుడిగా ఖాసింరజ్వీ ఎన్నికయ్యాడు. అప్పటి నుంచి రజాకార్లు చెలరేగిపోయారు. మూడేళ్ల పాటు నిజాం సంస్థాన రాజకీయాలను రజ్వీ శాసించాడు. రాజ్యాధికారాన్ని కాపాడుకోవటానికి నిజాం కూడా రజ్వీకి చేదోడుగా నిలిచాడు. రజ్వీ నిజాం సంస్థానంలో పుట్టలేదు. ఇక్కడ చదవలేదు. కానీ స్థానిక ముస్లింలకు తిరుగులేని నాయకుడయ్యాడు. అతని పిలుపుతో వేలమంది స్వచ్ఛంద సైనికులయ్యారు. నైజాంను శాసించటమే గాక, ప్రధానిగా ఎవరు ఉండాలో అతనే నిర్దేశించాడు. భారత్‌తో వ్యవహరించాల్సిన తీరుపై ఆదేశాలిచ్చాడు. యూపీలో పుట్టి అలీఘడ్‌లో లా చదివిన రజ్వీకి నైజాం సంస్థానంపై ఇంతపట్టు ఎలా వచ్చింది? ఆపరేషన్ పోలో (పోలీసు చర్య) అనంతరం రజ్వీపై పెట్టిన కొన్ని కేసులు ఎందుకు వీగిపోయాయి. ఘోర దారుణాలకు ఏడేళ్ల శిక్షను మాత్రమే అనుభవించి పాకిస్తాన్ ఎలా వెళ్లిపోగలిగాడు? నిజాం సంస్థానం చివరి ప్రధానిగా వ్యవహరించిన లాయక్ అలీపై కేసులెందుకు పెట్టలేదు? గృహ నిర్బంధం నుంచి పాక్‌కు ఎలా పారిపోగలిగాడు? ఉక్కుమనిషి పటేల్ హోంమంత్రిగా ఉన్నప్పుడే ఇదెలా జరిగింది? ఇలాంటి ప్రశ్నలెన్నో ఉన్నాయి. బాంబే హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన నరేంద్ర చపల్‌గావ్‌కర్ వాటిల్లో కొన్నిటిని చాలా ఆసక్తికరంగా వివరించారు. 'ద లాస్ట్ నిజాం అండ్ హిజ్ పీపుల్' పేరుతో ఆయన రాసిన పుస్తకంలో అవన్నీ దొరుకుతాయి.



జాతి, మత ఆధిక్యతా భావాలు.. ప్రజాస్వామ్యం—సామాజిక సమానత్వంపై వ్యతిరేకత.. అసమ్మతి అణచివేత కేంద్రంగా ఫాసిస్టు మనస్తత్వం ఉంటుంది. రజాకార్ మనస్తత్వానికి ఇదే పునాది. రజాకార్ల ఆగడాల గురించి అలుపెరగకుండా మాట్లాడుతున్నవారే దీన్ని ప్రదర్శిస్తున్నారు.

1900 మే 31న పుట్టిన (కొన్నిచోట్ల 1902 జూలై 17గా ఉంది) రజ్వీ న్యాయవాదిగా లాతూర్ (మహారాష్ట్ర) వచ్చాడు. అక్కడే ఇత్తెహాద్‌లో చేరాడు. అతివాదిగా గుర్తింపు తెచ్చుకున్నారు. 1946 డిసెంబరులో ఇత్తెహాద్ అధ్యక్షుడు అయ్యాడు. ఇత్తెహాద్‌కు ఆనాటికి రెండు ముఖ్యమైన లక్ష్యాలు ఉండేవి. ముస్లిం పాలక రాజ్యంగా నిజాం సంస్థానాన్ని యథాతథంగా కొనసాగించటం అందులో మొదటిది. భారత్‌లో చేరకుండా స్వతంత్రంగా ఉండటం రెండోది. మొదటి దాని కోసం ముస్లింల్లో మతోన్మాదాన్ని రెచ్చగొట్టటం ప్రారంభించారు. రెండో దానికోసం భారత్‌తో విలీనం ఊసెత్తకుండా హిందువులను భయభ్రాంతులకు గురిచేశారు. కమ్యూనిస్టుల నేతృత్వంలో మొదలైన తెలంగాణ సాయుధపోరుపై కూడా రజాకార్లు విరుచుకుపడ్డారు. ముస్లిం పాలనను దెబ్బతీసే ఉద్యమంగానే రజాకార్లు దీన్ని భావించారు. రకరకాల దారుణాలు, ఉద్యమాలతో నిజాం సంస్థానం అట్టుడుకుతున్న పరిస్థితుల్లోనే దేశ విభజనకు రంగం సిద్ధమైంది. బ్రిటిష్ పాలకులు దేశాన్ని వీడటం ఖాయమైపోయింది. అప్పుడే నిజాం ప్రభుత్వం కొన్ని సంస్కరణలను ప్రకటించింది. వీటి ప్రకారం ప్రతి జిల్లా నుంచి ఒక హిందూ, ఒక ముస్లిం ప్రతినిధిని చట్ట సభలకు ఎన్నుకుంటారు. జాగీరుదార్లు, సర్దార్ల ప్రతినిధులూ ఎన్నికవుతారు. ప్రభుత్వమూ మరికొందరిని నామినేట్ చేస్తుంది. ఒకటి మాత్రం స్పష్టంగా కపడుతుంది. ముస్లింల ఆధిక్యతకు ఇబ్బంది లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. కాంగ్రెస్ వీటిని తిరస్కరించింది. ముస్లిం స్థానాలన్నిటినీ ఇత్తెహాద్ కైవసం చేసుకుంది. సభాపక్షం నేతగా రజ్వీ ఎన్నికయ్యాడు. ఉదారవాది, పాలనానుభవం ఉన్న ప్రధాని మీర్జా ఇస్మాయిల్‌ని రజాకార్లు పనిచేయనివ్వలేదు. విసిగిపోయి రాజీనామా చేశారు. 'రజాకార్ల ఆగడాల కట్టడికి మీ నుంచి ఒక్క మాట వస్తే చాలు' అని ఇస్మాయిల్ లేఖ రాసినా నిజాం నుంచి ఉలుకూపలుకూ లేదు.

1947 ఆగస్టు 15 నాటికి కశ్మీర్, జునాగఢ్, నిజాం సంస్థానాలు మాత్రమే భారత్‌లో విలీనానికి దూరంగా ఉన్నాయి. నిజాం ప్రతినిధి బృందం (ప్రధాని ఛత్తారీ, వాల్టర్ మాంక్టన్, సుల్తాన్ అహ్మద్)తో అప్పటికే ఢిల్లీలో పలుమార్లు చర్చలు జరిగాయి. ఇరుపక్షాలూ ఒక నిర్ణయానికి వచ్చాయి. రక్షణ, విదేశీ వ్యవహారాలు, కమ్యూనికేషన్లు మినహా మిగతా అంశాలన్నీ నిజాం ప్రభుత్వం కిందే ఉండేటట్లుగా ముసాయిదా తయారైంది. 1947 అక్టోబరు 26న నిజాం మంత్రివర్గం దానికి ఆమోదం తెలిపింది. నిజాం కూడా అందుకు సరేనని సంతకాన్ని ఒక రోజు వాయిదా వేస్తాడు. మరుసటి రోజు ఉదయానికి పరిస్థితి భయానకంగా మారుతుంది. రజ్వీ ఆదేశాలతో రజాకార్లు ప్రతినిధి బృందం ఇళ్లను చుట్టిముట్టి బీభత్సం సృష్టిస్తారు. అత్యవసర మంత్రివర్గ సమావేశాన్ని నిజాం తన ఇంట్లో ఏర్పాటుచేసి రజ్వీని దానికి ఆహ్వానించాడు. ఒప్పందాన్ని రజ్వీ మొత్తంగా వ్యతిరేకిస్తాడు. రజ్వీని నిలువరించలేని నిజాం వైఖరికి నిరసనగా ప్రధానితో పాటు ప్రతినిధి బృందం రాజీనామా చేస్తుంది. ఆ తర్వాత ఢిల్లీలో చర్చల కోసం కొత్త ప్రతినిధి బృందం ఏర్పాటవుతుంది. ఎట్టకేలకు 1947 నవంబరు 29న భారత—నిజాం ప్రభుత్వాల మధ్య యథాతథ ఒప్పందం కుదురుతుంది. ఏడాది పాటు అమల్లో ఉండాల్సిన దానిపై తొలి నుంచి ఉల్లంఘనలు ఆరోపణలు వెల్లువెత్తాయి. షరతుల ప్రకారం భారత సైన్యం హైదరాబాద్ నుంచి వైదొలగింది. ఇక ఒప్పందానికి విరుద్ధంగా నిజాం ప్రభుత్వం ఆయుధ సేకరణనూ మొదలుపెట్టింది. మరోవైపు పాక్‌తో సంప్రదింపులూ మానలేదు. రహస్యంగా రూ.20 కోట్ల సహాయాన్ని అందచేసింది. భారత్ కరెన్సీ నిజాం సంస్థానంలో చెల్లుబాటు కాదని ప్రకటించింది. ఐరాస భద్రతామండలి తలుపుతట్టింది. భారత సైన్యం సంస్థానంలోకి రాకుండా చూడాలని విజ్ఞప్తి చేసింది.. పాక్, బ్రిటన్‌లలో ప్రభుత్వం తరఫున ప్రతినిధులనూ నియమించింది. తొలి నుంచి తమకు చేదోడుగా ఉన్న ప్రధాని మీర్ లాయిక్ అలీ అండ చూసుకుని రజాకార్లు మరింతగా విజృంభించారు. విలీనం కోసం గవర్నర్ జనరల్ లార్డ్ మౌంటన్ బాటన్ చేసిన విన్నపాలనూ నిజాం లెక్కచేయలేదు. రజాకార్ల దారుణాలు, విస్తరిస్తున్న రైతాంగ సాయుధ పోరాటం, స్వతంత్రంగా ఉండేందుకు నిజాం చేస్తున్న ప్రయత్నాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఆపరేషన్ పోలోతో అయిదు రోజుల్లోనే నిజాం ప్రభుత్వం లొంగిపోతుంది. లాయిక్ అలీని గృహనిర్బంధంలో ఉంచుతారు. రజ్వీని అరెస్టుచేసి కేసులు పెడతారు. ఏడేళ్ల జైలు శిక్ష మాత్రమే పడుతుంది. 1957లో జైలు నుంచి విడులైన తర్వాత ఇత్తెహాద్ సమావేశంలో పాల్గొంటాడు. తాను పాక్‌కు వెళుతున్నాననీ కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవాలని కోరతాడు. ఎవరూ ముందుకు రారు. అబ్దుల్ వహీద్ ఓవైసీని రజ్వీ నామినేట్ చేస్తాడు. 1957లో కరాచీకి వెళ్లి 1970లో అక్కడే చనిపోతాడు.



■ రాహుల్ కుమార్

నెహ్రూ నిర్వాకం వల్ల కశ్మీర్ సమస్య జటిలమైందనీ, అసంబద్ధమైన విధానాలతో ఆర్టికల్ 370ని రూపొందించారనే విమర్శ ఇప్పటికీ వినిపిస్తూనే ఉంటుంది. పటేల్ సమర్థంగా వ్యవహరించి హైదరాబాదుకు ఆ పరిస్థితి లేకుండా చేశారన్న పొగడ్తలూ అందరికీ తెలిసినవే. జరిగిన పరిణామాలను చూస్తే హైదరాబాదు పట్ల కొంత ఉదారత ప్రదర్శించినట్లు కనపడుతుంది. సంస్థానానికి ఉన్న రాజకీయ ప్రాధాన్యం దీనికి కారణం కావచ్చు. విలీనానికి ఒప్పుకోని ఏ సంస్థానంతోనూ హైదరాబాదు తరహాలో యథాతథ ఒప్పందం జరగలేదు. ఇక లాయిక్ అలీతో 1948 మేలో ఢిల్లీలో జరిపిన చర్చల్లో వి.పి.మేనన్ కొన్ని ముఖ్య ప్రతిపాదనలను చేశారు. పటేల్ వాటిని ఆమోదించారు. వీటి ప్రకారం: 1) తాత్కాలిక క్యాబినెట్ వెంటనే ఏర్పాటుకావాలి. ఇందులో 50 శాతానికి తగ్గకుండా ముస్లిమేతరులు ఉండాలి. 2) ఓటు హక్కుని విస్తృతపరచి 1950 జనవరి 1 నాటికి రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నికలు జరపాలి. పరిషత్తులో 60 శాతం ముస్లిమేతరులు ఉండాలి. పరిషత్తుకు బాధ్యత వహించే ప్రభుత్వం ఏర్పడాలి 3) పరిషత్తు నూతన రాజ్యాంగాన్ని రూపొందిస్తుంది 4) భారత—హైదరాబాదు మధ్య సంబంధాలను కొత్త రాజ్యాంగం నిర్దేశిస్తుంది. 5) ఉద్యోగాల్లో ముస్లిమేతరుల సంఖ్య 1954 జనవరి 1 నాటికి 60 శాతానికి చేరుకోవాలి. వీటినీ నిజాం అంగీకరించలేదు. ఆమోదం తెలిపితే కొన్నేళ్లపాటు హైదరాబాదు స్వతంత్ర రాజ్యంగా కొనసాగేది. ఆ తర్వాతి పరిణామాలు ఏ మలుపులు తిరిగేవో ఇప్పుడు ఊహించనూలేం. విలీనం ఇంత హింసాత్మకంగా మారిన వ్యవహారం మరొకటి లేదు. అయినా నిజాంపైనా, లాయక్ అలీపైనా ఎలాంటి కేసులూ పెట్టలేదు. పైపెచ్చు నిజాంకు రాజ్‌ప్రముఖ్ పదవినీ కట్టబెట్టారు. పటేల్ ఆమోదంతో జరిగిన ఈ నిర్ణయాలపై చాలా వ్యాఖ్యానాలు చేయవచ్చు. అతిగా ఆలోచిస్తే హిందుత్వ రాజకీయ పరిభాషలో ముస్లిం బుజ్జగింపుగానూ భావించొచ్చు. మరోవైపు అతి ప్రాంతీయ మమకారం నిజాం పాలనపై నిష్పాక్షిక అంచనాను మసకబారుస్తోంది.

కరువు, జలగోస ఇంకెంతకాలం?

మానవజాతి చరిత్రలో కరువుకాటకాలు యుద్ధాలను మించి మానవ హననానికి కారణమయ్యాయి. పాలకులు చాలా సింపుల్‌గా కారణాలను ప్రకృతిమీదా, ఇరుగుపొరుగు మీదా నెట్టి అసలు కారణాలను, తమ వైఫల్యాలను మరుగుపరుస్తారు. ఈ రెండు సందర్భాలలో శ్రామిక జనాలు పెద్ద సంఖ్యలో బలవుతారు. పాలకులు బాధపడరు. పైగా యుద్ధసాంకేతికత మీద, తిరుగుబాట్ల అణిచివేత మీద ఆ పరికరాల పరికల్పన మీద, ఉపయోగ నైపుణ్యం మీద ఎంత శ్రద్ధ పెడతారో అందులో కాసింత కూడా కరువుకాటకాల నివారణ ప్రణాళికా రచన మీద, అమలు మీద, మూల కారణాల విశ్లేషణ మీద అస్సలు శ్రద్ధ వహించరు. సమాజానికి ఇది కూడా చరిత్ర అనుభవమే. అనుభవిస్తున్న విషాదమే.

2009 తరువాత ఎక్కువ సంవత్సరాలలో సగటుకన్నా ఎక్కువ వర్షపాతమే నమోదవుతూ వచ్చింది. కురిసిన వానను తమ ఘనతగా పాలకులు తమ తమ ఖాతాలలో జమ చేసుకోవటం కూడా మనం చూస్తూ వచ్చాం. విపరీతంగా కురిసి, అస్సలు కురవక వానలు కూడా సమాజానికి అనేక పాఠాలు నేర్పాయి. గత సమాజాలు ఆ పాఠాలు తీసుకుని స్థానికంగా తాము చేసుకోగల పనులన్నీ చేసుకున్నాయి. కాలాన్ని అర్థం చేసుకుంటూ ప్రజలు ఎక్కడికక్కడా సంపద మీదా, రోజుల మీద, రాజ్యాల మీద, సామ్రాజ్యవాదం మీద, దోపిడీ మీదా పోరాడుతూ వచ్చారు. ప్రత్యక్ష వలసపాలన తొలగి, స్వతంత్రం పేరిట ప్రభుత్వాలు బలపడిన తరువాత అస్వతంత్రులవుతున్న ప్రజల మీద కరువు కాటకాలు ప్రణాళికాబద్ధంగా దాడి చేస్తున్నాయి. గుర్తించవలసిన సిసలైన పాఠం ఏమిటంటే కరువుకాటకాలు తీవ్రమైన దోపిడీ ఫలితాలు. పీడిత ప్రజల జీవితాలకు చుట్టి చక్రీయ విషవలయాలు. పాలనా వైఫల్య ఫలాలు.

గత కొద్ది రోజులుగా తెలంగాణ కరువు, జలగోస చర్చనీయాంశం అవుతున్నాయి. దీనిని అర్థం చేసుకోవటానికి కొన్ని ప్రశ్నలు వేసుకుందాం. స్థూలంగా చూస్తే ఉత్తర తెలంగాణలో వర్షపాతం ఎక్కువ. దక్షిణ తెలంగాణలో తక్కువ. తెలంగాణ సగటు వర్షపాతం 860 మి.మీ. అయితే ఆదిలాబాదు జిల్లాలో ఏటా వెయ్యి మి.మీ. పైబడి వర్షం కురుస్తుంది. తెలంగాణలో అతి తక్కువ వర్షపాతం 550 మి.మీ. దాకా మహబూబ్‌నగర్ జిల్లాలో కురుస్తుంది. కరువులకి వానలే ప్రధాన కారణం అయితే ఆదిలాబాద్ జిల్లాలో కరువులు ఎందుకు? నిరుటి వానలు బాగానే కురిశాయి. ఈ ఏడాది తగ్గాయి. వెంటనే నీటి ఎద్దడి ఎందుకు? ఇంతగా భూగర్భజలాలు ఎందుకు తగ్గాయి? భూమి నిర్జల భూమిగా ఎడారిగా ఎందుకు మారిపోతున్నది?

వానలు కురవకపోతే వ్యవసాయరంగం కనీసంగా కూడా పనులు కల్పించలేకపోతుంది. వర్షాభావకాలం కాటువేయబోతున్నదనే వాతావరణ హెచ్చరికలు వినపడగానే రెక్కల కష్టపు రేటు తగ్గుతుంది. అన్ని జీవితావసరాల ధరలు పెరిగిపోతాయి. ఎందుకు? పారిశ్రామిక రంగం అరకొర జీతాలు విదుల్చుతూ అధునాతన యంత్రాల కోరలతో అసంఘటిత చిరుద్యోగుల, నవయవ్వన నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతుంది. నిరుడు పండిన పంటలకు, నిన్నటి పారిశ్రామిక ఉత్పత్తులకు మాఫియాలు నిలువచేసుకున్న ధాన్యాలకు, సరుకులకు ఒక్కసారిగా ధరలు పెరిగిపోతాయి. ఇది పాలకులకు ప్రభుత్వాలకు తెలుసు. అయినా పట్టించుకోరు.

ఇంకోవైపు కన్నీళ్ళతో ప్రజలు తమ స్థిరచరాస్తులను చవకగా కలవారికి కోల్పోతూ ఉరితాళ్ళను ముద్దాడుతుంటారు. పురుగుమందే పెరుగన్నమై జీవితాలు చాలిస్తుంటారు. ఈ కరువులు వీటి వల్ల ఉత్పన్నమై వ్యవస్థీకృతమై కొనసాగుతున్న వలసలు, ఆత్మహత్యలు, ఈ వైపరీత్యం మహబూబ్‌నగర్ గుండెల మీద పరుచుకున్న భీతావహమైన బీభత్సమైన అనుభవం. ప్రభుత్వంలో తలలు పండిన బ్యూరాక్రాటులుంటారు. సమాజంలో ప్రభుత్వాలకి అందివచ్చిన మేధావులుంటారు. వీరు అసలు కారణాలు చర్చకు రానీయకుండా తమ మేధో సామర్థ్యం చూపుతూ కార్పొరేట్ల సేవలో తలమునకలవుతారు. వీళ్ళకు తోడు దేవాలయాలు, మత, ధార్మిక సంస్థలు, పీఠాలు, పీఠాధిపతులు పూజారులు కర్మసిద్ధాంత వ్యాప్తిలో ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తారు. ఇంతలో పాలకులు మౌలిక సమస్యలను తాకని సరికొత్త హామీలతో అధికారానికి సమాయత్తమవుతారు.

తెలంగాణలో జరుగుతున్న జలగోస చర్చలోంచి ఈ సమస్యను పరిశీలిద్దాం. తెలంగాణ భూస్వరూపం, స్వభావం, పర్యావరణం, నీటి లభ్యత తీరుతెన్నులు, నీటి నిర్వహణ విధానాలు, ప్రజల ప్రధాన జీవనాధార రంగాలు పాలకులకు తెలుసునా? తెలిసినా పట్టని తనం ఎందుకు? వర్షపు నీరు ఎక్కడికక్కడా కాపాడుకోవటం, ఎత్తిపోసుకోవటం తప్ప తెలంగాణకు మరో మార్గం లేదు. వర్షపునీరు కాపాడటానికి, నదులలో పారే నీరు ఎత్తిపోసి అందుబాటులో ఉంచటానికి అవసరమైన ప్రజలు మెచ్చుకోగల ప్రణాళికే పాలకుల దగ్గర, ప్రభుత్వాల దగ్గర లేదు. ప్రజలు అప్పులపాలవుతూ బోర్లు వేసుకుని భూగర్భజలమే ఎత్తిపోసుకుంటున్నారు. ఆ భూగర్భ జలం కూడా అడుగంటి నీళ్ళు, పెట్టుబడులు, రెక్కల కష్ట ఫలితం ఏదీ దక్కక రైతాంగం, కూలీలు, వృత్తులు ధ్వంసమైన శ్రామికులు, వారి బిడ్డలు తెగించి చేసిన పోరాటమే ప్రత్యేక తెలంగాణ పోరాటమని పాలకులు అర్థం చేసుకున్నారా?



రాష్ట్రం సాధించుకున్న పదేండ్ల తరువాత కూడా తెలంగాణలో ప్రతి ఎకరాకు ఒక్క పంటకైనా నికరంగా నీరివ్వగల సాగునీటి ప్రణాళిక లేదు. వరద కాలంలో ప్రభుత్వమే నీరు ఎత్తిపోసి సేద్యాన్ని కాపాడగల నీటి నిలువ ప్రణాళిక లేదు. తెలంగాణకు అనువైన స్వావలంబనకు తోడ్పడగల పంటల ప్రణాళిక లేదు. లెక్కకు మిక్కిలిగా సలహాదారులు పనిచేసి బొక్కసం ఖాళీ అయి అప్పులు మిగిలినాయి తప్పితే ఏ జీవన రంగానికి సంబంధించి కూడా ప్రజాస్వామికమైన విధానపత్రం లేదు. ఆ దిశగా చర్చ కూడా జరగనీయలేదు. చాలా విలువైన పదేండ్ల కాలం తెలంగాణలో నిర్బంధంలో, అవినీతిలో, అబద్ధంలో మగ్గిపోయింది.


పదేండ్ల పాటు పాలించి ధనికరాష్ట్రం అని గొప్పలు పోయి, అన్ని సంస్థలను, వ్యవస్థలను ధ్వంసం చేసి తెలంగాణను అవమానాల పాలు చేసిన బీఆర్ఎస్‌వారు జలగోసను ఈ సంవత్సరపు అరిష్టంగా మాట్లాడటం హాస్యాస్పదం. రాష్ట్రం సాధించుకున్న పదేండ్ల తరువాత కూడా తెలంగాణలో ప్రతి ఎకరాకు ఒక్క పంటకైనా నికరంగా నీరివ్వగల సాగునీటి ప్రణాళిక లేదు. రైతులు బోర్లు వేసుకొని భూగర్భ జలంతో కాక వరద కాలంలో ప్రభుత్వమే నీరు ఎత్తిపోసి సేద్యాన్ని కాపాడగల నీటి నిలువ ప్రణాళిక లేదు. నిర్వహణ ప్రణాళిక లేదు. తెలంగాణకు అనువైన స్వావలంబనకు తోడ్పడగల పంటల ప్రణాళిక లేదు. లెక్కకు మిక్కిలిగా సలహాదారులు పనిచేసి బొక్కసం ఖాళీ అయి అప్పులు మిగిలినాయి తప్పితే ఏ జీవన రంగానికి సంబంధించి కూడా ప్రజాస్వామికమైన విధానపత్రం లేదు. ఆ దిశగా చర్చ కూడా జరగనీయలేదు. చాలా విలువైన పదేండ్ల కాలం తెలంగాణలో నిర్బంధంలో, అవినీతిలో, అబద్ధంలో మగ్గిపోయింది.

ఈ కఠిన సందర్భాన్ని ఏదో విధంగా అధిగమించటం కాదు. కరువులను, జలగోసను దాటడానికి తాత్కాలిక ఉపశమన చర్యలు చాలవు. సహజ వనరుల రక్షణకు, వికేంద్రీకరణకు, పర్యావరణ పరిరక్షణకు, శ్రమ దోపిడీ నివారణకు, పీడనను ఎదిరించగల, ఆకాంక్షలను నిర్భయంగా వ్యక్తపరచగల ప్రజాస్వామిక స్వేచ్ఛకు తోడ్పడగల విధాన రచన అవసరం. అందుకు ప్రస్తుత పాలకులు పూనుకుంటారా, గత పాలనా విధానాలను ఓడించిన ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తారా అనేది రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి గడ్డు పరీక్ష. జలగోస వరకే అయితే ప్రతి లక్ష ఎకరాల పరిధిలో నిర్వాసితులకు భూమికి భూమి ఇచ్చేవిధంగా జలాశయాలు నిర్మించి వరదల కాలంలో నీటితో నింపి సాగుకు, తాగటానికి నీరివ్వగల ప్రణాళిక చేసి అమలు చేయాలి. ఈ చిన్న చర్య రైతాంగానికి కరువులను ఎదుర్కోగల ధీమా ఇవ్వగలదు. భూమి ఎడారీకరణను ఆపగలదు. సమాజం కూడా ఈ దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.

● ఎ.రాఘవాచారి

కాలంలో నిలిచిన కమ్యూనిస్టు నేత

ధర్మ బిక్షం ఒక వ్యక్తి కాదు. ఉద్యమ శక్తి బాల్యం నుండి తేజవంతమైన రూపంతో డిబేట్స్‌లో, హాకీ, ఫుట్‌బాల్ ఇతర క్రీడల్లో ఆయన చురుకైన పాత్రను పోషించాడు. ఒకవైపు ఉపాధ్యాయుల మెప్పు పొందుతూ మరొకవైపు విద్యార్థులకు ఆదర్శ నాయకుడిగా, సమాజంలో ప్రజా సమస్యలపై పోరాటాల్లో కూడా ముందు ఉండేవాడు. ఎక్కడ ప్రజా సమస్యలు ఉంటే అక్కడికి ఆయన వెళ్లేవాడు. పోరాట కార్యక్రమాలను తన వ్యక్తిగత గుర్తింపు కోసం చేసేవాడు కాదు. సకల విద్యార్థిలోకం శ్రేయస్సు కోసం, సంక్షేమం కోసం, ప్రగతి కోసం, సమాజం మార్పు కోసం ఆలోచిస్తూ, ప్రజా పోరాటాలను నిర్వహించేవాడు.



భూస్వాముల, జమీందారుల, దొరల పేరు వింటేనే భయపడే రోజుల్లో దొరతనం గురించి, భూస్వాముల ఆగడాల గురించి, దోపిడీ గురించి, అధ్యయనం చేశాడు. ఈ విషయాలన్నింటినీ ప్రజలకు, విద్యార్థులకు, కార్మికులకు, రైతులకు వివరంగా మీటింగ్‌లు పెట్టి వివరించేవాడు. రైతులకు వ్యవసాయ కార్మికులకు రాత్రిపూట మోట బావుల కాడ కాగడాల వెలుగులో వారిలో భయాన్ని పోగొట్టి బానిసత్వ జీవితాన్ని వదలగొట్టి చైతన్య జ్వాలలను నింపి, మనిషి జీవితం గొప్పతనాన్ని, స్వాతంత్ర్య ప్రాధాన్యతను, వివరించాడు. వారిలో దేశ భక్తిని రగిలించాడు. నిజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాడడానికి యువతను మానసికంగా శారీరకంగా సంసిద్ధులను చేసిన మహాయోధుడు ధర్మ బిక్షం.

నిజాం నవాబు ప్రజా వ్యతిరేక పాలనపై రజాకార్ల రాక్షసకృత్యాలపై నిప్పులు కక్కిన ధర్మ బిక్షం జీవితం మాత్రం నిత్యం నిప్పుల గుండంలో నడుస్తున్నట్లు ఉండేది. నిజాం ప్రభుత్వం ఆయన్ని ఒక ప్రమాదకరమైన విప్లవకారుడిగా ప్రకటించింది. ధర్మ బిక్షం కనబడితే కాల్చివేయాలని ఆదేశాలు ఉన్నాయి. పోలీసులు ఆయనను పట్టుకొని కాల్చివేద్దామని ప్లాన్ చేశారు. కానీ ప్రజలు ఆయనకు కవచకుండలం లాగా ఉండటం వలన వారి పన్నాగం పటాపంచలయింది.

ధర్మ బిక్షం ఎమ్మెల్యేగా మూడుసార్లు, ఎంపీగా రెండుసార్లు విజయం సాధించారు. ప్రజల మనిషిగా పేరుపొందాడు. చట్టసభల్లో ప్రజల పక్షాన తన గొంతు వినిపించారు. సామాజిక, రాజకీయ, వ్యక్తిత్వ విలువలను పాటించి చట్టసభల గౌరవాన్ని పెంపొందించడంలో, కాపాడటంలో ఆయన ఆదర్శనీయమైన పాత్రను పోషించారు. ఓటును డబ్బులకు అమ్ముకుంటున్న ఈ రోజుల్లో, చట్ట సభల్లో వ్యక్తిగత దూషణలు, అసభ్యకరమైన మాటలతో పోటీలుపడుతున్న ఈ తరుణంలో ధర్మ బిక్షం జీవితాన్ని ఒక మంచి గ్రంథంగా ప్రతి ఒక్కరు చదువుకోవలసిన సామాజిక అవసరం ఉంది. సమాజ మార్పుకు ఆయన చేసిన పోరాటాలు, త్యాగాలు, చూపిన ధైర్యం, ఆదర్శ జీవితం సదాస్ఫూర్తిదాయకం.

– కె.వి.ఎల్
తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం

(నేడు ధర్మబిక్షం వర్ధంతి)



నిట్‌లో జరిగిన హోలీ వేడుకల్లో విద్యార్థుల సందడి

రంగు రబ్బ రబ్బా..

- అంబరాన్నంటిన హోలీ సంబరాలు
- వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు
- ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు



పోలీసు కమిషనరేట్‌లో జరిగిన హోలీ సంబరాల్లో పాల్గొన్న సీపీ



హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్, మార్చి 25 : వసంతరుతువు ఆగమనానికి చిహ్నంగా జరుపుకొనే హోలీ పండుగను సోమవారం హనుమకొండ, వరంగల్ జిల్లాల ప్రజలు ఆనందంగా జరుపుకొన్నారు. చిన్నా పెద్ద తేడా లేకుండా ఒకరిపై రంగులు చల్లుకుని.. సందడి చేశారు. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు పాలుపంచుకుకున్నారు. హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, పలు శాఖల ప్రభుత్వ అధికారులు, ఎన్‌జీవో సంఘం నాయకులతో కలిసి హోలీ వేడుల్లో పాల్గొన్నారు. పోలీసు కమిషనరేట్‌లో జరిగిన వేడుకల్లో ఉద్యోగులు సీపీ అంబర్ కిశోర్ ఝాను ఎత్తుకొని ఊరేగించారు. ఇక వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రజాభవన్ అయిన తన క్యాంపు కార్యాలయంలో అనేక మంది కార్పొరేటర్లు, నాయకులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం వరంగల్ ప్రెస్ క్లబ్‌లో పాత్రికేయులతో కలిసి హోలీ జరుపుకొన్నారు. వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ బీజేపీ కార్యకర్తలతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. హనుమకొండ ప్రశాంత్ నగర్‌లోని ఆయన నివాసంలో సందడి కనిపిచింది. అలాగే మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌తో పాటు ప్రస్తుత మేయర్ గుండు సుధారాణి కూడా పలుచోట్ల హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. హనుమకొండలోని దివ్యాంగుల హాస్టల్‌లోని దివ్యాంగులు హోలీ పండుగను ఉత్సాహంగా జరుపుకొన్నారు. అనేక అపార్టుమెంట్లలోనూ వేడుకలు హోరెత్తాయి. పలు ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు చేశారు. కాజీపేట పట్టణంతో పాటు పరకాల, హసన్‌పర్తి, ఆత్మకూరు, భీమదేవరపల్లి, కమలాపూర్, ఎల్కతుర్తి మండలాల్లో ప్రజలు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. హసన్‌పర్తి బుగులు వేంకటేశ్వరస్వామి జాతర కన్నుల పండువగా జరిగ్గా.. భక్తులు భారీ సంఖ్యలో తరలొచ్చారు. దామెరలో చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం, పున్నేలు రామాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. వరంగల్ నగరంలో సోమవారం హోలీ సంబరాలు అంబరాన్నంగా.. దేవాదాయ, ధర్మాదాయ శాఖకు చెందిన ఉమ్మడి జిల్లా ధార్మిక భవన్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో దేవాదాయ శాఖ జోన్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రావు, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ రాయల సునీత, అధికారులు పాల్గొన్నారు. అలాగే వరంగల్ కలెక్టరేట్‌లో హోలీ వేడుకలను ఉద్యోగులు ఉత్సాహంగా జరుపుకొన్నారు.



హోలీ వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

పండుగపూట విషాదం

- హోలీ రోజున ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ప్రమాదాలు
- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి
- మృతుల్లో ఇద్దరు బీటెక్ విద్యార్థులు
- చెరువులో మునిగి బాలుడు కన్నుమూత
- కాలువలో ముగ్గురి గల్లంతు.. ఒకరి మృతదేహం లభ్యం

ఉమ్మడి జిల్లావాసులంతా హోలీపండుగను ఎంతో ఆనందంగా జరుపుకోగా.. ఉమ్మడిజిల్లాలో జరిగిన ప్రమాదాలు పలు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ములుగు జిల్లా వెంకటాపూర్ (రామప్ప) మండలంలో, హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గోపాల్‌పూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. వీరు తమతమ స్నేహితులతో కలసి ఆనందంగా హోలీ జరపుకొన్న కాసేపటికే తుదిశ్వాస విడిచారు. హోలీ వేడుకల అనంతరం ఈతకు వెళ్లిన ఓ బాలుడు చెరువులో మునిగి కన్నుమూసిన సంఘటన మహబూబాబాద్ జిల్లా రామన్నగూడెంలో జరిగింది. అలాగే హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండకు చెందిన ముగ్గురు వ్యక్తులు స్నేహితులతో కలిసి ఆనందంగా హోలీ జరుపుకొన్న తర్వాత ఈత కొట్టేందుకని కేయూ పీఎస్ పరిధిలోని పలువేల్పుల వద్ద కాలువకు వెళ్లగా గల్లంతయ్యారు. వారిలో ఒకరి మృతదేహం లభ్యమైంది.

7




'ట్యాపింగ్'లో కొత్తమలుపు

- వ్యాపారులనూ బ్లాక్‌మెయిల్ చేసినట్టు వెలుగులోకి
- వరంగల్‌లోని వస్త్ర, బంగారు, స్థిరాస్థి, హవాలా వ్యాపారులే లక్ష్యంగా దందా
- వ్యక్తిగత, వ్యాపార బలహీనతలు అడ్డుపెట్టుకుని ఫోన్‌ట్యాపింగ్ గ్యాంగ్ బెదిరింపులు
- బీఆర్ఎస్ అనుకూల వర్తకులనూ వదల్లేదని సమాచారం
- బాధితులను గుర్తించే పనిలో పోలీసు ప్రత్యేక బృందం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కొత్త మలుపు తిరుగుతోంది. కేవలం అప్పటి ప్రతిపక్ష నేతల ఫోన్లను ట్యాప్ చేసేందుకే వార్‌రూమ్‌లు ఏర్పాటు చేశారని తొలుత భావించారు. కానీ ఈ వ్యవహారంలోని కీలక పాత్రధారులైన ఎస్ఐబీ మాజీ అధికారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారిస్తుంటే కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. ఫోన్ ట్యాపింగ్‌తో వ్యాపారులనూ బ్లాక్‌మెయిల్ చేసినట్టు విచారణలో నిందితులు వెల్లడించడం కలకలం రేపుతోంది. ఈ బ్లాక్‌మెయిల్ బాధితులు హైదరాబాద్‌తో పాటు వరంగల్‌లో కూడా అధిక సంఖ్యలో ఉన్నారని భావిస్తున్న పోలీసులు వారిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం ఎస్ఐబీ మాజీ అధికారులు ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతిరావు, రాధాకిషన్‌రావును అదుపులోకి తీసుకుని విచారిస్తుండగా.. తొలుత వరంగల్ జిల్లా పర్వతగిరిలో ఫోన్‌ట్యాపింగుల కోసం వార్‌రూమ్ ఏర్పాటు చేసినట్టు నిందితులు వెల్లడించినట్టు ప్రచారం జరిగింది. దీంతో పాటు హనుమకొండ జిల్లా నీరుకుళ్లకు చెంది న ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావును కీలక నిందితుడిగా పోలీసుల చేర్చటంతో పాటు వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం మేడపల్లికి చెందిన ప్రణీత్‌రావు, భూపాలపల్లి ఏఎస్పీ భుజంగరావును కూడా అరెస్ట్ చేయటంతో ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం తీవ్ర దుమారాన్ని రేపింది. కాగా, నిందితులను ఆదివారం న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచినా.. వీరిని మరోసారి మంగళవారం కస్టడీకి కోరుతూ కోర్టును ఆశ్రయించేందుకు పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. రెండోసారి విచారణలో పర్వతగిరి వార్‌రూమ్ వ్యవహారంతో పాటు అందులో కీలకపాత్రధారుల పేర్లు తెరపైకి రావచ్చనే ప్రచారం జరుగుతోంది. ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు కూడా పోలీసులతో ఫోన్‌లో మాట్లాడినట్టు తెలుస్తుండగా.. ఆయన నుంచి కూడా ఏమైనా సమాచారం సేకరించారా అనేది చర్చనీయాశంగా మారింది. ప్రభాకర్‌రావు వరంగల్‌వాసే కావటంతో కొంతమంది పోలీసులు ఈ ట్యాపింగ్‌లో పాల్గొన్నారా అనే చర్చ కూడా జరుగుతోంది.

36మంది వ్యాపారులకు బెదిరింపులు?



ఫోన్‌ట్యాపింగ్‌తో పాటు ఇతర బ్లాక్‌మెయిలింగ్ దందాకు పాల్పడ్డట్టుగా పోలీసుల విచారణలో నిందితులు వెల్లడించటం చర్చనీయాంశమైంది. అప్పటి ఎస్ఐబీ అధికారుల ఆదేశాల మేరకు ఫోన్‌ట్యాపింగ్‌తో 36మంది వ్యాపారులను కూడా బెదిరించినట్లుగా ప్రణీత్‌రావు వెల్లడించినట్లుగా పోలీసులు వెల్లడించారు. ఆ 36మందిలో వరంగల్ పట్టణానికి చెందిన ప్రముఖ బంగారు నగల వ్యాపారి ఉన్నట్లుగా సమాచారం. పాత బీఆర్ఎస్ నేత అయినా సదరు జ్యువెల్లరీ వ్యాపారిని బ్లాక్‌మెయిల్ చేసినట్టు ప్రచారం జరుగుతోంది. అలాగే వరంగల్‌కు చెందిన కొందరు చిట్‌ఫడ్, రియల్ ఎస్టేట్, నిర్మాణరంగ కాంట్రాక్టర్లు, హవాలా, ఇతర బడా వ్యాపారులే

మిగతా 8వ పేజీలో..



భారీగా వసూళ్లు!

స్టేషన్‌కు రూ.30వేల చొప్పున చెల్లించాల్సిందే..

- చేయి తడిపిన వారికే న్యాయం
- కమిషనరేట్ పరిధిలో ఓ పోలీసు అధికారి దందా
- కోర్టులో ఉన్న వివాదాలైనా ఆయనకు డోంట్ కేర్

వరంగల్ క్రైం, మార్చి 25: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఒక పోలీస్ అధికారి ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది. తన పరిధిలో ఉన్న దాదాపు 15స్టేషన్లపై ఆయన కర్రపెత్తనం చేస్తున్నారని, స్టేషన్ల వారీగా టార్గెట్‌లు పెట్టి మరీ భారీగానే వసూళ్లు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. నెలకు రూ.30వేల చొప్పున మామూళ్లు చెల్లించాలని నిబంధన పెట్టాడని.. ఇవ్వని స్టేషన్లు ఉంటే.. వాటి పరిధి నుంచి తన దృష్టికి వచ్చే ఫిర్యాదులను ఆసరగా చేసుకుని ఆ స్టేషన్ అధికారులను శాఖాపరంగా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంటాడనే విమర్శలున్నాయి. ఇక నోటి దురుసు కూడా కలిగిన సదరు అధికారి.. మాట వినని అధికారిపై తిట్ల దండకం మొదలెడతాడనే ప్రచారం ఉంది. దీంతో కాకులను కొట్టి గద్దలకు వేసినట్లు ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులు తమతమ స్థాయిల్లో ముడుపులు దండుకుని సదరు అధికారికి ముట్టచెప్పుతున్నారని తెలిసింది. ఈ క్రమంలో సదరు అధికారి వైఖరి శాఖకు మచ్చ తెచ్చేలా ఉందని పలువురు పోలీసు అధికారులే పేర్కొంటుండటం గమనార్హం.

చేయి తడిపిన వారి పక్షం ఈ అధికారి నైజం

అది ఎలాంటి సమస్యయినా పర్వాలేదు.. చేయితడిపిన వారి పక్షానే ఆయన నిలబడతారన్న ప్రచారం ఉంది. ప్రధానంగా భూ సమస్యల విషయంలో ఆయన వద్దకు వెళితే తనకు ముడుపులిచ్చిన వారి పక్షాన నిలుస్తాడని, ఆ సమస్య ఏ స్టేషన్ పరిధిలోకి వస్తుందో తెలుసుకుని ఆ స్టేషన్ అధికారికి హుకుం జారీ చేసి పనయ్యేలా చూస్తాడనే విమర్శలున్నాయి. నగరంలో చాలా భూ వివాదాల్లో ఈ అధికారి పేరే ప్రధానంగా వినిపిస్తుండటం విశేషం. భూ దందాలు చేసే వారిలో అధికశాతం మంది ఆయన వద్ద క్యూ కట్టి మరీ పనులు చక్కదిద్దుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. కోర్టులో ఉన్న వివాదాలనైనా ఈ అధికారి తన హోదాను అడ్డుపెట్టుకుని ఎంటర్ అవుతాడనే విమర్శలున్నాయి. కోర్టులో ఉందికదా అని చెప్పేందుకు ప్రయత్నించినా పట్టించుకోకుండా ముడుపులు ఇచ్చిన వారి పక్షాన నిలుస్తారనే ప్రచారం ఉంది. ఈ అధికారి బారిన పడిన బాధితులు ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితిలో ఆస్తులను కోల్పోతున్నట్టు సమాచారం.

సదరు అధికారి అక్రమాల్లో కొన్ని..

- కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక భూ వివాదం విషయంలో నకిలీ పత్రాలతో తన వద్దకు వచ్చిన వారికి అండగా నిలిచిన సదరు అధికారి కోర్టులో కేసు నడుస్తునా స్థలంలో గోడలు కట్టించాడు. దీనికి గతంలో ఈ స్టేషన్‌లో పనిచేసిన ఒక పోలీస్ అధికారి సహకరించారు. ఈ విషయమై ఉన్నతాధికారికి పట్టాదారులు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఈ విషయంలో అధికారికి భారీగానే ముట్టినట్టు తెలిసింది.
- ఇదే స్టేషన్ పరిధిలోని వడ్డెపల్లి శివారులో ఓ స్థలం విషయంలో ఇరువర్గాల మధ్య ఏర్పడిన వివాదం కోర్టులో ఉందని. ఈ స్థలంలో అర్ధరాత్రి సమయంలో గోడలు కట్టించేందుకు ఓ వర్గం వారికి సహకరించారు.
- పలివేల్పుల ప్రాంతంలో రెండు దశాబ్దాల క్రితం కొనుగోలు చేసిన స్థలానికి సంబంధించి తప్పుడు పత్రాలతో వచ్చిన రియల్టర్‌కు ఈ అధికారి సహకరించారు. ఆ స్థలంపైన రియల్టర్ పాగా వేయగా వాస్తవంగా కొనుగోలు చేసిన వారు వెళ్లలేని పరిస్థితి.
- పలివేల్పులలోని ముగ్గురి స్థలాల కాంపౌండ్‌లను ఈ అధికారి అండతో తప్పుడు పత్రాలతో వచ్చిన రియల్టర్లు కూల్చివేశారు. బాధితులు ఎంతగగ్గోలు పెట్టినా ఫలితం లేకుండా పోయింది.

నేడు రైతు వేదికల్లో రైతునేస్తం

వరంగల్ వ్యవసాయం, మార్చి 25: ఆరుగాలం కష్టపడి పంట పండించే రైతన్నలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా 110 రైతు వేదికలను ఎంపిక చేసి రైతునేస్తం కార్యక్రమాలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, హనుమకొండ జిల్లాలోని పలివేల్పుల, పరకాలలో ఉన్న రైతు వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి 10.45 గంటల వరకు ప్రధాన శాస్త్రవేత్త(అగ్రానమి) డాక్టర్ ఎస్.గోవర్ధన్, అఖిల భారత సమగ్ర వ్యవసాయ పద్ధతుల పరిశోధన విభాగం హెడ్(రాజేంద్రనగర్) సమగ్ర వ్యవసాయంపై వివరిస్తారు. అలాగే హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని వరి పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.రామగోపాలవర్మ (కీటకశాస్త్రం) డ్రోన్లతో వ్యవసాయంపై ఉదయం 10.45 నుంచి 11.30 గంటలకు వరకు రైతులకు వివరిస్తారు. ఈ అవకాశాన్ని అభ్యుదయ రైతులు వినియోగించుకోవాలని వ్యవసాయ అధికారులు కోరారు.

'కొమ్మాల'కు పోటెత్తిన భక్తజనం

- గోవింద నామస్మరణతో మార్మోగిన లక్ష్మీనృసింహుని క్షేత్రం
- ప్రభలు, కోలాటాలు, నృత్యాలతో పరవశించిన భక్తులు

గీసుగొండ, మార్చి 25: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రసిద్ధి గాంచిన మండలంలోని కొమ్మాల శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జాతర సోమవారం వైభవంగా ప్రారంభమైంది. మొదటి రోజు స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తజనంతో పోటెత్తింది. ఉదయం రంగుల హోలీని జరుపుకొన్న అనంతరం సాయంత్రం స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. నిండు పౌర్ణమిలో ఉప్పొంగిన భక్తిపారవశ్యంతో భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఒక్కసారిగా జాతర భక్తజనసంద్రంగా మారింది. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారమైన కొమ్మాల నరసింహుడిని (ఉత్సవమూర్తులను) చూసి తరించి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ వాహనాల్లో, ఎడ్లబండ్లపై ఒంటె, ఏనుగు, గుర్రం, మేక వంటి ప్రభలను అందంగా ముస్తాబు చేసుకొని కోలాటాలు, నృత్యాలతో జాతరకు తరలివచ్చారు. కాగా, సాయంత్రం ఆలయ గుట్ట చుట్టూ ఎడ్లబండ్లు తిరిగే ఘట్టం అత్యంత వైభవంగా జరిగింది. ఎడ్లబండ్లు తిరిగే సమయంలో భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. గీసుగొండ, దుగ్గొండి, నల్లబెల్లి, నర్సంపేట, సంగెం, చెన్నారావుపేట మండలాల్లోని గ్రామాలతో పాటు గ్రేటర్ వరంగల్ నుంచి పెద్ద సంఖ్యలో ఎడ్లబండ్లపై భక్తులు తరలివచ్చారు. వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిపై ఎడ్లబండ్ల సందడి కనిపించింది. ఆలయ ప్రధాన ఆర్చిగేటు నుంచి ఆలయం వరకు భక్తుల రద్దీ పెరగడంతో ఎటువంటి ఆటంకం కలుగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. భక్తులు క్యూలైన్‌లో బారులుతీరి దైవదర్శనం చేసుకున్నారు.



విద్యుత్ కాంతుల్లో కొమ్మాల జాతర ప్రాంగణం


భారీ ప్రభ బండిని ప్రారంభించిన ఎమ్మెల్యే

కాంగ్రెస్ నాయకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి ఏర్పాటు చేసిన 55 ఫీట్ల భక్తిప్రభ బండిని కొమ్మాల బస్‌స్టేజి వద్ద ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమగాని సౌజన్య, ఎంపీటీసీలు గోపాల్, అల్లం బాలకిశోర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు చాడా కొమురారెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు లావుడ్యా రాజు, కోల వేణు, మండల రాజు, మూడు వీరేందర్, లడే రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



దర్శనానికి క్యూలైన్లో వేచిఉన్న భక్తులు

సోమవారం ఉష్ణోగ్రతలు	గరిష్ఠం : 38.0° C	కనిష్ఠం : 20.9° C



రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	మంగళవారం	సా : 6.34 గం..
సహర్ :	బుధవారం	ఉ : 4.53 గం..

టెట్ దరఖాస్తు ఫీజు తగ్గించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 25 : ప్రభుత్వం భారీగా పెంచిన టెట్ దరఖాస్తు ఫీజు తగ్గించాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు చంద్రగిరి సునిల్‌కుమార్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గతంలో టెట్ దరఖాస్తుకు ఒక పేపర్‌కు రూ. 300, రెండు పేపర్లకు రూ. 400 ఫీజు ఉండేదని, ప్రస్తుత నోటిఫికేషన్‌లో మాత్రం ఫీజును ఏకంగా 5 రెట్లు పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. టెట్‌కు దరఖాస్తు చేసుకునే నిరుద్యోగులకు టెట్ ఫీజు భారంగా మారిందని పేర్కొన్నారు. గతంలో టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు సైతం ఎక్కువ మార్కుల కోసం మరోసారి టెట్ రాయాలనుకునే అభ్యర్థులకు ఫీజు గుదిబండగా మారిందని తెలిపారు. పోటీ పరీక్షలకు దరఖాస్తు ఫీజు ఉండదని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఫీజు పెంచడం సమంజసం కాదన్నారు. ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు ఫీజులో రాయితీ కల్పించాలని, ఫీజు తగ్గించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

రేపు డీసీసీ బ్యాంక్ మహాజన సభ

హనుమకొండ సిటీ, మార్చి 25 : వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మహాజన సభను బుధవారం నిర్వహించనున్నట్లు ముఖ్య కార్య నిర్వహణాధికారి మహ్మద్ వజీర్ సుల్తాన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటలకు హనుమకొండ నక్కలగుట్టలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో సమావేశం ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. బ్యాంక్ చైర్మన్ రవీందర్‌రావు అధ్యక్షతన జరిగే సమావేశానికి పాలకవర్గ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు హాజరు కానున్నారు.









లక్ష్మీ నర్సింహస్వామి జాతర ప్రారంభం



పూజలు చేస్తున్న భక్తులు

చెన్నారావుపేట మార్చి 25 : ప్రతీ సంవత్సరం హోలీ పర్వదినా న్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి జాతర సోమ వారం ప్రారంభమైంది. మం డలం లోని కోనాపురం శ్రీలక్ష్మీ నర్సింహ స్వామి జాతరకు చుట్టూ పక్కల గ్రామాల భక్తులు తమ మొక్కులు చెల్లించేందుకు భారీగా తరలివచ్చారు. ఆలయంలో రాత్రం తా అర్చకుడు క నివద్దుల వంశీకృష్ణస్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. గ్రామంతో పాటు కాల్‌నాయక్ తండా, ఉప్పరపల్లి, లింగాపురంతో పాటు పలు గ్రామాల నుంచి జాతరకు వందలాదిగా భక్తులు తరిలి వచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గుండాల మహేందర్, వెల్ది రఘు, మాజీ ఉప సర్పంచ్ ఎడ్ల నారాయణరెడ్డి, కల్లెపు ప్రణీత్ గౌడ్, పలువురు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కేశవాపురం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న భక్తులు

దుగ్గొండి, మార్చి 25 : మండలంలోని కేశవాపు రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో 18వ బ్రహ్మోత్సవాలు సోమ వారం వేదమంత్రో చ్చారణల మధ్య సాగా యి. యాగశాలలో ద్వారతో రణ ధ్వజకుంభ ఆరాధన చతు స్థానర్చన మహాకుంభ స్థాపన, అగ్నిప్రతిష్ఠ, మూలమం త్ర హవనపారాయణాదులు, హనమద్వాహన సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దంపతులు కంది జితేందర్‌రెడ్డి, సరళ, ఆలయ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, పూలమ్మ దంపతులు పాల్గొన్నారు.

పలువురు కాంగ్రెస్‌లో చేరిక



ఎమ్మెల్యే మాధవరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

దుగ్గొండి, మార్చి 25 : మండలంలోని శివాజీ నగర్‌కు చెందిన మాజీ ఉప సర్పం చ్ మోర్తాల గణేష్, మాజీ రైతు కోఆర్డినేటర్ సుకినె శ్రీనివాస్, బొరగాని తిరుమల్ రావు, గుండెకారి రామారావు, బుస్సారి రాజేశ్వర్‌రావు, మోహన్‌రావు లతోపాటు పలు వురు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో సోమవారం గిర్నిబావిలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, మండ ల వర్కింగ్ పార్టీ అధ్యక్షుడు ఒలిగె నర్సింగరావు, క్లస్టర్ ఇన్‌చార్జి మట్ట రాజు, జయ రాంనాయక్, కోరె రాజేష్, కొల్లూరి సుమంత్, పెండ్లి వెంకటేశ్వర్లులు పాల్గొన్నారు.













'కుడా' అస్తవ్యస్తం

పరిధి పెరిగినా.. పెరగని సిబ్బంది సంఖ్య

- నిధుల కొరతతో అసంపూర్తిగా పనులు
- ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లు, కాళోజీ కళాక్షేత్రం పనుల్లో ఎడతెగని జాప్యం
- పూర్తిగా అమలు కాని మాస్టర్ ప్లాన్
- విచ్చలవిడిగా అక్రమ లేఔట్లు
- కబ్జా అవుతున్న ప్రభుత్వ స్థలాలు

హనుమకొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ తర్వాత రెండో పెద్ద నగరంగా రోజురోజుకు విస్తరిస్తున్న వరంగల్‌లో.. సమస్యలు కూడా అదేస్థాయిలో పెరుగుతున్నాయి. నగరాన్ని అభివృద్ధి చేయాల్సిన కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) అనేక సమస్యలతో అస్తవ్యస్తంగా మారుతోంది. నగర అభివృద్ధికి మార్గదర్శనం చేయాల్సిన ఈ సంస్థే ఒడుదుకులతో నడుస్తోంది. ఓ వైపు నిధుల కొరత, మరో వైపు సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 1982లో ఏర్పాటైన కుడా పరిధిలో తొలినాళ్లలో 60 చదరపు కిలోమీటర్లు. ఆ మేరకు మొదటి ప్రణాళికను రూపొందించారు. ప్రస్తుతం కుడా పరిధి 1803 చదరపు కిలోమీటర్లు. 19 మండలాలకు చెందిన 181 గ్రామాలున్నాయి. వీటి పరిధిలో 3.30లక్షల ఇళ్లు, 14 లక్షల జనాభా ఉంది. వరంగల్ మహా నగర పాలక సంస్థ నగర ప్రజల మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టడంతో పాటు పెరుగుతున్న నగరవాసుల సంఖ్యకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించి అమలు చేయాల్సి ఉంటుంది. ఈ దిశగా ప్రయత్నాలు చేస్తున్నా అనేక ప్రతిబంధకాలు ఎదురవుతున్నాయి. ఫలితంగా నగరంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిధులు లేక కొన్ని పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఇక రాష్ట్ర ప్రభుత్వ నిధులను ఇవ్వాల్సిన పనులకు కూడా కుడానే నిధులు సమకూర్చి పూర్తి చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వివిధ పన్నుల రూపంలో రూ.కోట్లలో ఆదాయం సమకూరే వరంగల్ కార్పొరేషన్ కూడా నిధుల కోసం కుడా చేయిచాపుతోంది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం ఒత్తిడి మేరకు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడానికి రూ.50కోట్లను కుడానే ఇచ్చింది.

ఇన్నర్ రింగ్ రోడ్డు...

వరంగల్ నగరంలో కుడా చేపట్టిన ఇన్నర్ రింగ్ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాల్సిన బాధ్యత కుడాపై ఉంది. రూ.300కోట్లతో ఇన్నర్ రింగ్ రోడ్డు పనులకు గత సంవత్సరం జూన్ 17న అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఆర్టీవో ఆఫీసు జంక్షన్ నుంచి ఈఎస్ఐ మీదుగా ఎనుమాముల వరకు 200 అడుగుల వెడల్పు, 8 కిమీ పొడవుతో ఈ రోడ్డును అభివృద్ధి చేయడానికి ఈ ఐఆర్ఆర్ నిర్మించడానికి ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు కుడా ఆధ్వర్యంలో భూసేకరణ కూడా జరిగింది. అలైన్‌మెంట్ చేయడం కూడా పూర్తయింది. ఐఆర్ఆర్ పూర్తయితే ఖమ్మం హైవే నుంచి నేరుగా ఆర్టీవో కార్యాలయం జంక్షన్ మీదుగా నర్సంపేట రోడ్డు, ఎనుమాములకు అక్కడి నుంచి వరంగల్–ములుగు 163 ఎన్‌హెచ్‌కు చేరుకోవచ్చు. 13 కిమీ మేర ఈ రోడ్డు ప్రాజెక్టును గతంలో రోడ్లు భవనాల శాఖకు ఇచ్చినప్పటికీ ఎలాంటి పురోగతి లేదు. కొంత కాలం క్రితం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో సమావేశంలో ఈ పనులను కుడాకు అప్పగించారు. 69 కిమీ పొడవైన ఔటర్ రింగ్ రోడ్డును భారత జాతీయ రహదారుల సంస్థ, రాష్ట్ర ప్రభుత్వ రోడ్లు భవనాల శాఖ సంయుక్తగా నిర్మించాయి. 29 కిమీ ఎన్‌హెచ్‌ఏ చేపట్టగా, మిగిలిన 40 కిమీ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. అయితే రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పనుల్లో కొన్ని ఇంకా మిగిలి ఉన్నాయి. వీటిని సత్వరం పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ నిధుల కొరత వల్ల ముందుకు సాగడం లేదు. దీనిని పూర్తి చేయాల్సిన బాధ్యత కుడాపై ఉంది. ఇన్నర్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు పూర్తయితేనే ఇంటర్ కనెక్టివిటీ ఏర్పడి నగర ట్రాఫిక్ సమస్య పూర్తిగా తొలగుతుంది.

పదేళ్లుగా పూర్తవని కళాక్షేత్రం పనులు

హనుమకొండలోని హయగ్రీవచారి గ్రౌండ్‌లో కాళోజీ కళాక్షేత్రాన్ని త్వరగా పూర్తి చేయాల్సిన బాధ్యత కూడానేపైనే పడింది. 2015లో కేసీఆర్ శంకుస్థాపన చేసిన ఈ కళాక్షేత్రం పనులు నిధుల కొరతతో ముందుకు సాగలేదు. దీనిని నిర్మాణానికి రూ. 50కోట్లను ఇస్తానని గత ప్రభుత్వం వాగ్దానం చేసి రూ.10 కోట్లు మాత్రమే ఇచ్చింది. గతంలో పర్యాటక శాఖ ఈ పనులను పర్యవేక్షించినా.. ఆ తర్వాత చేతులెత్తేసింది. చాలా కాలం పాటు పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత కుడాకు అప్పగించడంతో ఇప్పటికే రూ.20కోట్ల వరకు దీనిపై ఖర్చు చేయాల్సి వచ్చింది. కళాక్షేత్రం పూర్తికావడానికి ఇంకా రూ.40కోట్ల వరకు అవసరమవుతాయని అధికారులు చెబుతున్నారు. నిర్మాణ వ్యయాన్ని అడ్డగోలుగా పెంచుతూపోతూ కాంట్రాక్టర్‌ను బతికిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కరోనా కాలంలో చేసిన పనులు నాసిరకంగా ఉండగా.. సంవత్సరాలు కావడంతో పిల్లర్లు దెబ్బతిన్నాయి. ఇవే పిల్లర్లపై మిగిలిన పనులు చేస్తే కళాక్షేత్రం భవనం కుప్పకూలే ప్రమాదం ఉందన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో పిల్లర్లను రెట్రోఫిట్ చేయాలన్న నిర్ణయానికి రాగా.. కళాక్షేత్రం పనుల అంచనాలు మరింత పెరిగాయి. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఉన్నతాధికారుల సమావేశంలో కళాక్షేత్రం సత్వరం పూర్తి చేసే బాధ్యతను కూడాకే అప్పగించారు.

భద్రకాళీ మాడవీధులు..

సుప్రసిద్ధ భద్రకాళీ దేవాలయం చుట్టూర మాడవీధుల నిర్మాణం బాధ్యతలను కూడానే చూస్తోంది. నిధులున్నా గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పనులు మొదలవలేదు. రెండు రోజుల క్రితం భూమి పూజ జరిగింది. మాడవీధుల నిర్మాణానికి రూ.10కోట్లను కుడా ఇప్పటికే విడుదల చేయగా.. మిగిలిన రూ.20 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం పనులు చేపట్టిన తర్వాత దశలవారీగా విడుదల చేయనుంది. నిజానికి మాడవీధుల పనులు ఎప్పుడో మొదలవ్వాల్సి ఉన్నా యాదాద్రి దేవాలయం అభివృద్ధి కమిటీ (వైటీడీసీ) చైర్మన్ కిషన్ రావు, ఆర్కిటెక్ట్ ఆనంద సాయిలకు గత ప్రభుత్వం బాధ్యతలు అప్పగించడంతో మాడవీధుల ప్రణాళికే మొత్తంగా మారే పరిస్థితి ఏర్పడింది. ఉన్న నిధులు చాలవని మరిన్ని నిధులు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే కొత్త ప్రణాళిక రూపొందించే పేరుతో ఈ ఇద్దరు కాలయాపన చేయడంతో పనుల ప్రారంభానికి జాప్యం జరిగింది. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చొరవతో ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో మాడవీధుల పనులను సత్వరం మొదలు పెట్టాలన్న ఆదేశాలు రావడంతో.. కుడా ప్రస్తుతంరూ.10కోట్లతో మొదటి విడత పనులను ప్రారంభించింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం మిగిలిన రూ.20కోట్లను విడుదల చేస్తే తప్పా కుడా పనులు పూర్తచేసే వీలుండదు.

శాటిలైన్ నగరాలు

వరంగల్ నగర జనాభా రోజు రోజుకు గణనీయంగా పెరుగుతోంది. నగరం కూడా శరవేగంగా విస్తరిస్తోంది. ఈ క్రమంలో నగరంలో ఇళ్ల స్థలాల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. నిరుపేద, మధ్య తరగతివారు నివేశన స్థలాలు కొనలేని పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో నగరం చుట్టూర శివారు ప్రాంతాల్లో శాటిలైట్ టౌన్‌షిప్పులను అభివృద్ధి చేయాల్సిన మౌలిక బాధ్యత కుడాపై ఉంది. నగరం చుట్టూ శాటిలైట్ షిప్పుల ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. అయితే ఈ దిశగా గత కుడా చైర్మెన్లు దృష్టి పెట్ట లేదు. దీనితో నగరం అస్తవ్యస్తంగా విస్తరిస్తోంది. శాటిలైట్ టౌన్ షిప్పులను అభివృద్ధి చేసినట్లయితే ఇళ్ల స్థలాల ధరలు తగ్గుతాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారుల దోపిడికి అడ్డుకట్ట పడినట్లవుతుంది.

దర్శనీయ స్థలాల అభివృద్ధి..

నగరం, చుట్టూప్రక్కల ప్రాంతాల్లో పలు దర్శనీయ స్థలాలు ఉన్నాయి. పర్యాటకుల ద్వారా కుడాకు ఆదాయం సమకూరడమే కాకుండా అనేక మందికి ఉపాధి కూడా లభిస్తుంది. నగర పర్యాటకాభివృద్ధిలో భాగంగా ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న భద్రకాళి గుడి నుంచి పద్మాక్షి గుడి వరకు రోప్‌వే నిర్మాణం, ఓరుగల్లు కోట, ధర్మసాగర్ చెరువు కట్ట, దేవుని గుట్టల వద్ద పర్యాటకుల కోసం వసతి సౌకర్యాలను చేపట్టాల్సి ఉంది. నగరంలోని పలు చెరువు బండ్లను సుందీకరించాలి. భద్రకాళి బండ్ రెండవ దశ పనుల సత్వర పూర్తికి చర్యలు తీసుకోవాలి.

సిబ్బంది కొరత తీరితేనే..

కుడా సిబ్బంది కొరతతో కూనారిల్లుతోంది. కుడా ఏర్పడినప్పటి ఉద్యోగులే తప్ప కొత్త నియామకాలు ఇప్పటి వరకు జరగలేదు. కుడా పరిధి విస్తరించింది.. పనిభారం పెరిగింది. కానీ ఆమేరకు సిబ్బంది సంఖ్య పెరగకపోవడంతో ప్రభుత్వ స్థలాల అన్యాక్రాంతం, అక్రమ లేఔట్లు, అనుమతి లేని వెంచర్లను కుడా పూర్తి స్థాయిలో అడ్డుకోలేకపోతోంది. పార్క్ స్థలాలు అన్యాక్రాంతం క్రాంతం కాకుండా నిరోధించే దిశగా పటిష్టమైన చర్యలు తీసుకోలేకపోతోంది. కుడా బలోపేతం చేస్తే తప్ప నగరం ఆశించిన మేరకు అభివృద్ధి జరగడం కష్టం.

నిధుల సమీకరణ సమస్య..

కుడాకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులేమి రావడం లేదు. గత ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. పైగా అసెంబ్లీ ఎన్నికలకు ముందు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడానికి రూ. 50 కోట్లను కుడా నుంచే ప్రభుత్వం తీసుకున్నది. దీనితో అభివృద్ధి పనులు చేపట్టాడానికి కుడా నిధులకు కటకటపడాల్సి వస్తోంది. గతంలో మూడు చోట్ల వెంచర్లు చేసి తద్వారా నిధులను కూడా స్వయంగా సమకూర్చుకున్నది. ఇప్పుడు కూడా ఆర్థిక వనరుల సమీకరణకు నగర శివార్లలో కుడా మరికొన్ని వెంచర్లను చేపట్టేలా చూడాల్సిన బాధ్యత కుడాపై ఉంది. ఇందు వల్ల పేద, మధ్య తరగతివారికి తక్కువ ధరకు ప్లాట్లు లభించి ప్రైవేటు రియల్లర్ల దోపిడికి కళ్లెం వేసినట్లవుతుంది.

మాస్టర్ ప్లాన్ అమలుకు ప్రత్యేక శ్రద్ధ అవసరం

కుడా కొత్త చైర్మెన్ ముఖ్యంగా కొత్త మాస్టర్ ప్లాన్ అమలుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవలసిన అవసరం ఉన్నది. నూతన మాస్టర్ ప్లాన్‌ను గత ప్రభుత్వం ఆమోదించడంలో తీవ్ర జాప్యం చేసింది. ఇప్పుడిప్పుడే అమలులోకి వస్తోంది. దీని గురించి అవగాహన నగర ప్రజలకు లేదు. దశల వారిగా అమలులోకి వస్తున్న మాస్టర్ గురించి విస్తృతంగా ప్రచారం చేయాల్సి ఉంది. పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం అమలులో ఉన్నా ఆచరణలోకి తీసుకురాలేదు.

పండుగపూట విషాదం

హోలీ రోజున ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ప్రమాదాలు

వెంకటాపూర్(రామప్ప)/కమలాపూర్ (ఎల్కతుర్తి)/నర్సింహులపేట/ వరంగల్ క్రైం, మార్చి 25: పండుగ వేళ తీవ్ర విషాదం నెలకొంది. ఓ వైపు జిల్లా వాసులు సోమవారం హోలీ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోగా.. మరోవైపు పలుచోట్ల జరిగిన ప్రమాదాలు పలు కుటుంబాల్లో విషాదాన్ని మిగిల్చాయి. ఉమ్మడిజిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందగా.. నీట మునిగి ఓ బాలుడు కన్నుమూశాడు. మరో చోట కాలువలో ముగ్గురు గల్లంతవగా ఒకరి మృతదేహం లభ్యమైంది.

ఆటోబోల్తా.. డ్రైవర్ మృతి


వంశీ (ఫైల్)

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గోపాల్‌పూర్ అనుబంధ గ్రామమైన బత్తివానిపల్లి గ్రామ శివారులో ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. హోలీ వేడుకల్లో మద్యం తాగి ఆటోలో వెళుతున్న క్రమంలో ఈ ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. కమలాపూర్ సీఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నడికూడ మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన నలుగురు యువకులు గంగారపు వినయ్ (ఆటో డ్రైవర్), బొల్లం ప్రశాంత్, శనిగరపు సాయి, శనిగరపు వంశీ (23) మండలంలోని శనిగరం గ్రామంలో గల మద్యం షాపునకు ఆటోలో చేరుకున్నారు. హోలీ సంబరాల్లో భాగంగా మద్యం తాగి.. తిరిగి స్వగ్రామమైన చర్లపల్లికి వెళుతున్న క్రమంలో వినయ్ ఆటోను అజాగ్రత్తగా నడుపడంతో ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో వంశీ అక్కడిక్కడే మృతి చెందాడు. మిగిలిన ముగ్గురికి తీవ్ర గాయాలవడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మృతుడి తండ్రి పోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

స్నేహితుల దుర్మరణం..


సుశాంత్, ఉమేష్ (ఫైల్)

బీటెక్ చదువుతున్న ఇద్దరు స్నేహితులు హోలీ వేడుకల్లో పాల్గొన్న కాసేపటికే రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు వదిలిన సంఘటన ములుగు జిల్లా వెంకటాపూర్(రామప్ప) మండలంలో జరిగింది. మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన ఎంబటి సుశాంత్(22), తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఉమ్మడి ఉమేష్(22) హనుమకొండలోని ఓ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నారు. రెండురోజులు హోలీ సెలవులు రావడంతో స్వగ్రామాలకు వచ్చిన ఆ ఇద్దరు స్నేహితులు స్వగ్రామాలకు చేరుకున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇద్దరూ తోటి స్నేహితులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్న అనంతరం రామప్ప సరస్సుకు చేరుకుని స్నానం చేశారు. అక్కడినుంచి ద్విచక్రవాహనంపై లక్ష్మీదేవిపేటకు బయలుదేరిన క్రమంలో పాలంపేట వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న చెట్టును వేగంగా ఢీకొట్టింది. దీంతో సుశాంత్, ఉమేష్ అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, బంధువులు సంఘటనాస్థలికి చేరుకుని గుండెలవిసేలా రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

ఈతకు వెళ్లి చెరువులో మునిగిన బాలుడు


రిత్విక్‌రెడ్డి (ఫైల్)

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని రామన్నగూడెంలో హోలీ పండుగవేళ ఈతకు వెళ్లి ఓ బాలుడు చెరువులో పడి మృతిచెందాడు. ఎస్ఐ గండ్రాతి సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నగూడేనికి చెందిన అబ్బోరి వినోద్‌రెడ్డి-పద్మ దంపతుల కుమారుడు రిత్విక్‌రెడ్డి (10) నర్సింహులపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. సోమవారం గ్రామంలోని కొందరు స్నేహితులతో కలిసి హోలీ ఆడిన అనంతరం ఊరు సమీపంలోని గణేష్ చెరువు వద్దకు వెళ్లి ఈతకు దిగాడు. అతడికి ఈత రాకపోవడంతో నీటిలో మునుగుతుండాన్ని చూసిన స్నేహితులు చెరువుకు సమీపంలో ఉన్న గుండగాని వెంకన్న, మంద వెంకట్‌రెడ్డి అనేవ్యక్తులకు సమాచారం అందించగా.. వారు చెరువు వద్దకు చేరుకుని రిత్విక్‌రెడ్డిని బయటకు తీయగా.. అప్పటికే మృతి చెందాడు. హోలీ ఆడేందుకు వెళ్లిన చిన్నారి తిరిగి రానిలోకాలకు వెళ్లడంతో గ్రామంలో విషాదం నెలకొంది. బాలుడి తండ్రి వినోద్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

గుండ్లసింగారంలో ముగ్గురు గల్లంతు.. ఒకరి మృతి


తక్కళ్ల కేదారీశ్వర్, రాపాక బ్రహ్మచారి, క్రాంతికుమార్ (ఫైల్)

హనుమకొండ జిల్లా గుండ్లసింగారం సమీపంలోని కెనాల్‌కు ఈతకు వెళ్లిన క్రమంలో ముగ్గురు గల్లంతవగా.. ఒకరి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దామెర మండలం ఊరుగొండకు చెందిన తక్కెళ్ల కేదారీశ్వర్(42), 35ఏళ్ల వయసున్న ముప్పు క్రాంతికుమార్‌లు స్నేహితులు సోమవారం హోలీ పండుగ సందర్భంగా స్నేహితులతో కలిసి ఎంజాయ్ చేసిన అనంతరం కేయూ పీఎస్ పరిధిలోని పలువేల్పుల వద్ద కెనాల్‌లో ఈతకు వెళ్లారు. యాదవనగర్ ప్రాంతంలో అద్దెకు ఉంటున్నారు ఈతకు వెళ్లి వీరు వరద ప్రవాహంలో ప్రమాదవశాత్తు గల్లంతయ్యారు. అలాగే మరో ఘటనలో కుమార్‌పల్లికి చెందిన 40ఏళ్ల రాపర్తి బ్రహ్మచారి సైతం గుండ్లసింగారం వద్ద ఈతకు వెళ్లి గల్లంతయ్యాడు. గల్లంతైన ముగ్గురిలో తక్కళ్ల కేదారీశ్వర్ మృతదేహం వరంగల్ ఆటోనగర్ ప్రాంతంలో లభ్యమైంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కేదారీశ్వర్, క్రాంతికుమార్ ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ నగరంలో నివాసం ఉంటున్నారు. కేదారీశ్వర్‌కు భార్య ఇద్దరు ఇద్దరు కూతుళ్లు కాగా ముప్పు క్రాంతికుమార్‌కు భార్య ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వెల్డింగ్ పనిచేసే బ్రహ్మచారి కుమార్‌పల్లిలో నివాసం ఉంటున్నాడు. ఇతడికి భార్య, కూతురు ఉన్నారు. ముగ్గురి కుటుంబాల్లో విషాదం నెలకొంది. వీరు గల్లంతైన విషయాన్ని కేయూ ఎస్ఐ రాజ్‌కుమార్ ధ్రువీకరించారు. ఒకరి మృతదేహం లభ్యం కాగా మరో ఇద్దరి ఆచూకి తెలియరాలేదని, గాలింపు చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు.



కమనీయం.. కల్యాణోత్సవం..

మంగళ సూత్రం చూపుతున్న అర్చకుడు

- వైభవంగా వేంకటేశ్వర, పద్మావతి అలివేలుమంగ కల్యాణం
- పాల్గొన్న ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్
- భారీగా తరలివచ్చిన భక్తులు

నర్సింహులపేట, మార్చి 25 : మండల కేంద్రం శివారు ఇంద్రకీలాద్రి పర్వతంపై కొలువుదీరిన పద్మావతి సహిత అలువేలుమంగ, వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ప్రధాన అర్చకుడు శ్రీనివాస చార్యులు, కేశవచార్యులు పర్యవేక్షణలో శ్రీనందనాచార్యులు, రామాచార్యులు, అజయ్ చార్యుల బృందం ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయం గర్భగుడి పైనుంచి కిందకు తీసుకువచ్చి పల్లకిపై ఎక్కించారు. ఖమ్మం పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి తల్లాడ రమేష్-ఉషారాణి తెప్పించిన అలంకరణ సామగ్రితో అలంకరించారు. డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ జాటోతు రాంచంద్రునాయక్ దంపతులు అతిథులుగా పాల్గొని, గరుడవాహనంపై స్వామివారిని ఊరేగిస్తూ ఎదుర్కోలు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అర్చక బృందం వేదమంత్రోచ్ఛరణ నడుమ పాల్గుణశుద్ధ నిండు పౌర్ణమి అర్ధరాత్రి వేంకటేశ్వర స్వామితో, పద్మావతి, అలువేలు మంగకు కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు మండలం నుంచే కాకుండా కురవి, మరిపెడ, నెల్లికుదురు, డోర్నకల్, కేసముద్రం, మహబూబాబాద్, వరంగల్, ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఎస్సై గండ్రాతి సతీష్ పర్యవేక్షణలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేష్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోతు దస్రూనాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు ఇర్రి లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్, అనీల్, యాదగిరిరి, ఉల్లి శ్రీను, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


వేంకన్న కల్యాణానికి హాజరైన భక్తులు

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

ఒకరి మృతి, మరొకరికి గాయాలు..


బొట్ల రమేష్ (ఫైల్)

గణపురం, మార్చి 25: ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన గణపురం మండలం చెల్పూరు అంబేద్కర్ సెంటర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలావున్నాయి. చిట్యాల మండలం జడలపేటకు చెందిన బొట్ల రమేష్ (30) భూపాలపల్లి మండలం గొర్లవీడులో మేస్త్రీ పనులు చేస్తూ జీవనం గడుపుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం చెల్పూరులోని వీరయ్యపల్లిలో ఉంటున్న తన బంధువుల ఇంటికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో చెల్పూరులోని అంబేద్కర్ సెంటర్ వద్ద ఎదురుగా వస్తున్న ధర్మరావుపేటకు చెందిన ప్రేం అనే యువకుడు ద్విచక్ర వాహనంపై చెల్పూరుకు వస్తుండగా ప్రమాదవశాత్తు రెండు ఢీకొనడంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే ప్రేంకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఏరియాలోని 100 పడకల ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య అనూష, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పేదల బండిపై చిన్న చూపు

- ఏడాదిగా నిలిచిన అజ్నీ ప్యాసింజర్ రైలు
- తీవ్ర ఇబ్బందుల్లో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



కాజీపేట, మార్చి 25 : ఆదాయమే ధ్యేయంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ప్రత్యేక రైళ్లు నడిపే రైల్వేశాఖ సాధారణ ప్రయాణికుల అవస్థలు పట్టించుకోలేదు. పేదలబండిపై చిన్న చూపు చూస్తూ సాధారణ ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందనే విమర్శలు తలెత్తుతున్నాయి. కరోనా కారణంగా రద్దుచేసిన (335) కాజీపేట జంక్షన్ నుంచి అజ్నీ, (336) అజ్నీ నుంచి కాజీపేట జంక్షన్ వరకు నడిచే అజ్నీ ప్యాసింజర్‌ను మాత్రం ఇప్పటివరకు పునరుద్ధరించడంలేదు. కాజీపేట- అజ్నీ ప్యాసింజర్ రైలు 17 బోగీలతో ప్రతీ రోజు కాజీపేట నుంచి రాత్రి 9 గంటలకు బయలుదేరి ఉదయం ఉదయం 9 గంటలకు నాగ్‌పూర్ సమీపంలోని అజ్నీకి చేరుకుంటుంది. దాదాపు అన్ని స్టేషన్లలో హాల్టింగ్ ఉంటూ ముఖ్యంగా బెల్లంపల్లి, మంచిర్యాల, సిర్పూర్‌కాగజ్‌నగర్, బల్లార్షా, చంద్రాపూర్, మాజిరి, వరోరా, సేవాగ్రామ్, నాగ్‌పూర్ వెళ్లే ప్రయాణికులకు ఈ రైలు సౌకర్యంగా ఉంటుంది. ఇన్ని సౌకర్యాలు ఉన్న ఈ రైలును రైల్వే అధికారులు కరోనా కారణంగా నిలిపివేసి ఇప్పటి వరకు పునరుద్ధరించలేదు. దీంతో సాధారణ ప్రయాణికుల తిప్పలు అన్నీ ఇన్నీకావు.

ప్రయాణికుల తిప్పలు ...

ఉత్తర దక్షిణ రైలు మార్గాలను కలిపే కాజీపేట జంక్షన్ మీదుగా బల్లార్ష వైపు వెళ్లే ప్రయాణికులకు తిప్పలు అన్నీ ఇన్నీ కావు. ఉదయం 11దాటితే మళ్లీ సిర్పూర్‌కాగజ్ నగర్ వైపు వెళ్లాలంటే సాయంత్రం 5 తర్వాతే వెళ్లాల్సి ఉంటుంది. న్యూ ఢిల్లీ వైపు వెళ్లే రైళ్లు హైదరాబాద్ నుంచి న్యూఢిల్లీ వెళ్లు తెలంగాణ ఎక్స్‌ప్రెస్ ఉదయం కాజీపేట నుంచి 8.20గంటలకు, సికింద్రాబాద్ నుంచి దానాపూర్ వెళ్లు దానాపూర్ ఎక్స్‌ప్రెస్ కాజీపేటలో ఉదయం 11గంటలకు అందుబాటులో ఉంటాయి. సాయంత్రం 5.20గంటలకు భాగ్యనగర్ ఎక్స్ ప్రెస్, రాత్రి 7.20ఇంటర్‌సిటీ, రాత్రి 12.20దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తాయి.. ఈ రైళ్లు అన్ని ఎక్స్‌ప్రెస్ కావడంతో పరిమితంగా ఉండే జనరల్ బోగీలతో నిత్యం ప్రయాణికులతో కిక్కిరిసి పోతుంటాయి. ఈ రైళ్లు అన్ని రైల్వేస్టేషన్లలో హాల్టింగ్ లేకపోగా కాజీపేట లాంటి జంక్షన్లలో రెండు నిమిషాల మాత్రమే హాల్టింగ్ ఉండడం, ఉన్న రైళ్లలో కాలు పెట్టే వీలుకాని ప్రయాణికులతో ప్రయాణికులు నరకం చూడాల్సి వస్తుంది.

రైల్వే అధికారులకు వినతులు ..

కాజీపేట అజ్నీ ప్యాసింజర్ రైలు తిరిగి పునరుద్ధరించాలని ప్రయాణికులు, చిరువ్యాపారులు ఏడాదిగా రైల్వే అధికారులకు వినతులు సమర్పించారు. ఎంపీలను సైతం కలిసి విన్నవించినా పట్టించుకోవడంలేదు. నాగపూర్ మీదుగా కాజీపేటకు వచ్చే వలస కూలీల జీవనోపాధికోసం అజ్నీ ప్యాసింజర్ రైలును ఆశ్రయిస్తారు. ఇక్కడ చిరువ్యాపారులు నాగ్‌పూర్‌కు వెళ్లి వరంగల్‌కు సరకులు రవాణా చేసుకుని వ్యాపారాలు చేస్తుంటారు. వీరంతా ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విమాన ప్రయాణానికి ఏమాత్రం తగ్గకుండా ఫుల్ ఏసీలతో వందేభారత్ లాంటి రైళ్లను నడిపించే రైల్వే శాఖ పేదలబండిపై చిన్నచూపు చూడకుండా అజ్నీ ప్యాసింజర్ రైలు కొనసాగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రేపటి నుంచి రెండు రోజుల జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్, మార్చి 25 : సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్‌కళాశాల కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం నేతృత్వంలో మార్చి 27,28 రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, ఆర్ట్స్ కళాశాల కామర్స్ విభాగాధిపతి డాక్టర్ మాదాసి కనుకయ్యలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిన్టెక్ రెవల్యూవేషన్- రీషేపింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్ డిజిటల్ ఏజ్ అనే అంశంపై 27న మొదటి రోజు ఉదయం 10 గంటలకు జరిగే ప్రారంభ సదస్సులో కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. అలాగే విశిష్ట అతిథిగా హైదరాబాద్ హెచ్‌సీయూ ప్రొఫెసర్ చేతన్ శ్రీవాస్తవ్, వరంగల్ సాఫ్ట్‌టెక్ డైరెక్టర్ నరీన్ కశ్యప్, టీఎస్ఎస్ఐసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్ఎన్‌చారి, కామర్స్ డీన్ ప్రొఫెసర్ అమరవేణి, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేశ్‌లు హాజరుకానున్నారని తెలిపారు.



ఆలయాల్లో పౌర్ణమి పూజలు



బిస్కెట్ల అలంకరణతో దత్తాత్రేయ స్వామి

వరంగల్ కల్చరల్, మార్చి 25 : నగరంలోని పలు ఆలయాల్లో పాల్గుణ మాసం పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. శ్రీవాసవి మాత దేవాలయం, రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం, శ్రీగణపతి సచ్చిదానంద వర ద దత్తక్షేత్రం, రామలింగేశ్వరాలయంతో పాటు పలు దేవాలయాల్లో పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. దత్తాత్రేయ హోమం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. దత్తాత్రేయ స్వామికి ప్రీతికరమైన పౌర్ణమి రోజు హోలీ కావడంతో బిస్కెట్లతో తయారు చేసిన మాలలతో అలంకరణ జరిపారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

వైభవంగా ప్రారంభమైన ఎర్రగట్టు జాతర



రథంపై తీసుకువస్తున్న వెంటేశ్వరస్వామి, అలివేలు మంగమ్మల ఉత్సవ విగ్రహాలు

హసన్‌పర్తి, మార్చి 25 : ఎర్రగట్టు వేంటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు (జాతర) సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. హసన్‌పర్తి నుంచి వెంకటేశ్వరస్వామి, భీమారం నుంచి అలివేలు మంగమ్మల ప్రతిమలను రథాలపై ఊరేగింపుగా తీసుకవచ్చారు. దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యులు ఆరెల్లి వెంకటస్వామి, వేల్పుల సదానందం, పెద్దమ్మ సురేష్, వింజమూరి రమణ, చల్లా సంపత్ యాదవ్, జన్ను శైలజ, మూల నరోత్తంరెడ్డి, సాయిచరణ్ పటేల్, కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను రథాలపై ప్రతిష్ఠించారు. భక్తుల మేళతాళాల మధ్యన, గోవింద నామ స్మరణలతో ఊరేగింపుగా వచ్చారు. వెంకటేశ్వర స్వామి భక్తి గీతాలతో, డీజే సౌండ్ సిస్టంతో, మహిళల కోలాటాల మధ్యన భక్తి పారవశ్యంతో రథోత్సవం సాగింది. దారి పొడవునా భక్తులు రథాలకు మంగళహారతులతో స్వాగతం పలికి స్వామి వార్లకు పూజలు చేశారు. ఇరు గ్రామాల నుంచి వచ్చిన ఉత్సవ విగ్రహాలను ఎర్రగట్టు దేవాలయంలో ప్రతిష్ఠించడంతో ఎర్రగట్టు జాతర ప్రారంభమైంది.

దుబాయ్‌లో గుండెపోటుతో ఉనికిచర్ల వాసి మృతి



తిరుమలేష్ (ఫైల్)

ధర్మసాగర్, మార్చి25 : మండలంలోని ఉనికిచర్లకు చెందిన వ్యక్తి దుబాయ్‌లో ఆదివారం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొనగిరి తిరుమలేష్ (34) బతుకు దేరువు కోసం కొన్ని సంవత్సరాల క్రితం దుబాయికి వెళ్లాడు. అక్కడ ఓ ప్రయివేటు కంపెనీలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి దుబాయిలోని కంపెనీలో విధులు నిర్వహిస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో తిరుమలేష్ వాహనంలోనే పడిపోయాడు. దీంతో అక్కడి వారు గమనించి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. బతుకు దెరువు కోసం వెళ్లి తిరుమలేష్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహం దుబాయ్ నుంచి స్వగ్రామానికి రావడానికి నాలుగు రోజులు పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

హోలీ..రంగుల కేళి...

వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న యువత

వివిధ డివిజన్లలో రంగులు పులుముకుని స్వీట్లు పంపిణీ చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు



నిట్ క్యాంపస్‌లో ఫ్యాకల్టీతో హోలీ ఆడుతున్న డైరెక్టర్ బిద్యాధర్ సుబుద్ధి



హోలీ వేడుకల్లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



బిర్లాఓపెన్ మైండ్ స్కూల్ పూర్వవిద్యార్థులు..



హనుమాన్‌నగర్‌లో హోలీ ఆడుతున్న యువకులు

వరంగల్ క్రైం, మార్చి 25 : వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. హోలీ పండుగను పురస్కరించుకుని సోమవారం కమిషనరేట్ కార్యాలయానికి చేరుకున్న పోలీస్ అధికారులు, సిబ్బంది కమిషనర్ అంబర్ కిషోర్ ఝూకు రంగులు పూశారు. కమిషనర్ సైతం పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. బ్యాండ్ వాయిద్యాల మధ్య సీపీతో పాటు పోలీసులు, మీడియా సభ్యులు నృత్యాలు చేశారు. తన హోదాను మరిచి అంబర్ కిషోర్ ఝూ హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సంబరాల్లో డీసీపీలు అబ్దుల్ బారి, రవిందర్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్‌తో పాటు ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంబురాల్లో ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ సిటీ, మార్చి 25 : హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్ కార్యాలయంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హోలీ సంబురాల్లో పాల్గొన్నారు. సోమవారం ఉదయం నుంచే ప్రజాభవన్‌కు పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు ఇతర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సంబురాల్లో నిమగ్నమయ్యారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అందరితో కలివిడిగా గడుపుతూ సంబురాల్లో మునిగితేలారు.

నిట్‌లో

వరంగల్ ఎడ్యుకేషన్ : నిట్‌లో హోలీ వేడుకలు అంబరాన్ని అంటాయి. సోమవారం ఉదయం నుంచే నిట్ క్యాంపస్‌లో విద్యార్థులు రంగులు చల్లుకుంటూ వేడుకల్లో మునిగి తేలారు. డైరెక్టర్ బిద్యాధర్ సుబుద్ధి ఫ్యాకల్టీ, విద్యార్థులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఫ్యాకల్టీతో రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు. నిట్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డి. శ్రీనిసాచార్య విద్యార్థులతో కలిసి కోలాహలంగా క్యాంపస్‌లో హోలీ ఆడారు.

హనుమాన్‌నగర్‌లో

వరంగల్ కార్పొరేషన్ : హనుమకొండ 5, 54 డివిజన్ హనుమాన్‌నగర్, కందికొండ కాలనీలో సోమవారం హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కాలనీలో ప్రజలు చిన్నా పెద్దా అనే తేడా లేకుండా రంగులు చల్లుకున్నారు. వివిధ కాల నీల ప్రజలు ఒక్క చోట చేరి రంగులు చల్లుకుని సంబరాలు జరుపుకున్నారు. హోలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

బీజేపీ వరంగల్ లోకసభ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న అరూరికి చార్టర్డ్ అకౌంట్ అసోసియేషన్ బృందం సభ్యులు మద్దతు తెలిపారు. ప్రశాంత్‌నగర్‌లోని ఆయన నివాసంలో కలిసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు. ఆరూరిని కలిసిన వారిలో అసోసియేషన్ సభ్యులు కొయ్యడ రాజు, భగవాన్, సుజిల్, వినీల్, వంశీ, రామకృష ఉన్నారు.

● వడ్డెపల్లి : గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లో స్థానిక కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్, విష్ణుపురి కాలనీలో కాంగ్రెస్ నేత కొంక హరిబాబు, జవహర్ కాలనీలో బీజేపీ నేత బండి హరీష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. డివిజన్‌లోని బృందావన కాలనీలో రచ్చ పద్మ నాగేశ్వర్‌రావు, కాకతీయ నగర్ కాలనీలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సోయం ఓదెలు, గౌరవ అధ్యక్షుడు సమ్మిరెడ్డి ఆధ్వర్యంలో కాలనీ కమిటీ ప్రతినిధులు, మహిళలతో కలిసి రంగులను పులుముకొని వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వడ్డెపల్లి ఎన్జీవోస్ కాలనీలో బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఏనుగుల రాకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో హోలీ సంబరాలు జరుపుకున్నారు. కార్పొరేటర్ రవినాయక్, బీఆర్ఎస్ నేతలు దేవయ్య, భూపతిరాజు, రాజేష్, అభిషేక్, సంతోష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

● హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్‌వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. సోమవారం జర్నలిస్టులు ప్రెస్‌క్లబ్‌లో సమావేశమై రంగులు పులుముకొని ఆనంద డోలికల్లో తేలియాడారు. అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝూతో హోలీ వేడుకలను ఆయా ప్రాంతాల్లో నిర్వహించుకున్నారు. ప్రెస్‌క్లబ్‌కు హాజరైన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జర్నలిస్టులతో హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, ఉపాధ్యక్షుడు గోకారపు శ్యామ్, సీనియర్ జర్నలిస్టులు దాసరి కృష్ణారెడ్డి, పీవీ మదన్‌మోహన్, తుమ్మ శ్రీధర్‌రెడ్డి, తోట సుధాకర్, సాయిరాం, కంకణాల సంతోష్‌తో పాటు ప్రెస్‌క్లబ్ కార్యవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు.

● మడికొండ : మడికొండలో సోమవారం హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. కాలనీ పెద్దలు మాట్లాడుతూ ప్రజల నిత్య జీవితంలో అన్ని రంగుల లాగే కష్టనష్టాలు, సుఖ, సంతోషాలతో జీవితం రంగుల మయంగా సాగిపోవాలనే ఉద్దేశంతో హోలీ సంబరాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

● కాజీపేట : కాజీపేటలో సోమవారం హోలీ సంబరాలు జరిగాయి. వివిధ కాలనీలలో మహిళలు రంగులు పూసుకుని మధ్యాహ్నం వరకు వేడుకలు నిర్వహించారు. మార్వాడీలు రోడ్లపైపైకి వచ్చి ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ వారి కుటుంభీకులను కలుసుకుని రంగులు పూసుకున్నారు.



మడికొండ టీఎన్‌జీవోస్ కాలనీలో హోలీ వేడుకలు జరుపుకొంటున్న కాలనీ వాసులు

సప్తవర్ణాలతో రుద్రేశ్వరుడు



హనుమకొండ కల్చర్, మార్చి 25 : నగరంలోని చారిత్రక వేయి స్తంభాల రుద్రేశ్వరాలయంలో పాల్గుణ శుద్ధ పౌర్ణమి సోమవారం హోలీ పర్వాన్ని పురస్కరించుకొని సప్తవర్ణాలతో రుద్రేశ్వరుడు దర్శమిచ్చాడు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహింప చేసి మోదుగు పూల రసంతో తయారు చేసిన రంగులతో రద్రేశ్వరుడిని అలంకరింప చేశారు. సోమవారం కలిసి రావడంతో పెద్ద ఎత్తున భక్తులు సప్తవర్ణాల రుద్రేశ్వరుని దర్శించుకొని పులకరించారు.

ప్రజలకు అరూరి హోలీ శుభాకాంక్షలు

హనుమకొండ టౌన్, మార్చి 25 : వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ప్రజలకు బీజేపీ లోకసభ అభ్యర్థి అరూరి రమేశ్ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. హోలీ పండుగను పురస్కరించుకొని సోమవారం అరూరి నివాసానికి పార్టీ శ్రేణులతో పాటు, ప్రజలు తరలొచ్చి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా పలు ప్రాంతాల్లో జరిగిన హోలీ వేడుకల్లో ఆయన ప్రత్యక్షంగా పాల్గొని ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతుడు సురేందర్

కాజీపేట, మార్చి 25: రోడ్డు ప్రమాదంలో స్విగ్గీలో పనిచేసే ఓ వ్యక్తి మృతి చెందాడు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా, చిట్యాల మండలం తిరుమలపురం గ్రామానికి చెందిన గోపగాని సురేందర్ (36) స్విగ్గీలో పని చేస్తూ కటుంబంతో కలిసి హనుమకొండ భీమారం వద్ద నివాసముంటున్నాడు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత నిట్ సమీపంలో ఓ ఆర్డరు ఇచ్చి కాజీపేట 100 ఫీట్ల రోడ్డు నుంచి భీమారం వెళ్లేందుకు నిట్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా హనుమకొండ వైపు నుంచి వచ్చిన ఓ యువకు డు కారుతో ఢీ కొట్టాడు. ఈ ఘటనలో సురేందర్ తల డివైడర్‌కు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంకు తరలించి పోస్ట్‌మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సోమవారం మృతుని భార్య గోపగాని సృజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మృతునికి ఇద్దరు మగపిల్లలు ఉన్నారు.

కల్లుగీత కార్మికుడి మృతి



యాదగిరిగౌడ్

ఐనవోలు, మార్చి 25: తాడిచెట్టుపై నుంచి పడి కల్లుగీత కార్మికుడు మృతిచెందిన సంఘటన మండలంలోని రాంనగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్లకొండ యాదగిరిగౌడ్ (54) వృత్తిలో భాగంగా సోమవారం సాయంత్రం గ్రామ శివారులోని తాడివనంలో కల్లు తీయడానికి తాడిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు వరంగల్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య సరోజన ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

‘ట్యాపింగ్’లో కొత్తమలుపు

(5వ పేజీ తరువాయి)

లక్ష్యంగా ఫోన్లు ట్యాప్ చేసి బెదిరించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో వీరి నుంచి భారీ మొత్తంలో రాబట్టినట్లు సమాచారం. అలాగే వరంగల్‌కు చెందిన ప్రముఖ వస్త్ర వ్యాపారిని కూడా బ్లాక్ మెయిల్ చేసినట్టు పోలీసులు గుర్తించారని, అలాగే మరో డజను మంది వరకు వ్యాపారులను ఫోన్ ట్యాపింగ్ గ్యాంగ్ బెదిరించినట్లు సమాచారం. ఈ విషయమై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకునేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారు. అయితే వ్యక్తిగత విషయాలు, వ్యాపారంలో లొసుగుల ఫోన్‌ట్యాప్ చేసి బ్లాక్‌మెయిల్ చేయడంతో ఫిర్యాదు చేసేందుకు సదరు వ్యాపారులు కూడా భయపడుతున్నట్లు తెలుస్తోంది. ఎలాగూ పోవాల్సిన డబ్బు పోయింది. ఇప్పుడు ఫిర్యాదు చేస్తే ఆ ఆడియోలు బయటకు వస్తే తాము ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కొందరు వ్యాపారులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదని, దీంతో పోలీసులే ఆ బాధితులెవరో వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. నేరుగా బాధితులతో మాట్లాడి, వారు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసేందుకు పోలీసులు సన్నద్ధమవుతున్నారు. దీంతో వరంగల్‌లో బాధిత వ్యాపారులు ఎవరెవరున్నారు..? ఎంత మొత్తంలో సమర్పించుకున్నారో అనే చర్చ జరుగుతోంది. మొత్తానికి ఫోన్‌ట్యాపింగ్ కోణం అటు రాజకీయ నాయకుల నుంచి ఇటు వ్యాపారుల వైపు తిరగడం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఫొటోరైటప్:25 ఐఎన్‌వి 01: పూజా కార్యక్రమములో పాల్గొన్న స్థానికులు

అక్రమంగా భూ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు..

అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు



ఉనికిచర్లలో దీక్ష వద్ద కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడుతున్న పురుషోత్తమరెడ్డి

ధర్మసాగర్, మార్చి25 : తమ వ్యవసాయ భూమిని గ్రామానికి చెందిన వారు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఈ విషయమై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండలంలోని ఉనికిచర్ల గ్రామానికి చెందిన వంగల పురుషోత్తమరెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆయన తండ్రి అయిన వంగల నారాయణ రెడ్డి పేరున గ్రామంలోని సర్వేనెంబరు 212/బీలో మూడు ఎకరాల ఎనిమిది గుంటల వ్యవసాయ భూమి ఉందన్నారు. గత యాభై ఐదు సంవత్సరాల నుంచి భూమిని సాగు చేస్తూ తాము పంటలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఈ భూమిని ఇదే గ్రామానికి చెందిన వంగాల మురళీధర్‌రెడ్డి, రాంరెడ్డిలు తమకు తెలియకుండానే వారి కుటుంబ సభ్యుల పేరున రిజిస్ట్రేషన్ చేసుకొని మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక పోలీసులకు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఈ విషయమై గత 12 రోజుల నుంచి గ్రామంలో కుటుంబసభ్యులతో కలిసి రీలే దీక్షను కొనసాగిస్తున్నామని, న్యాయం జరిగే వరకు ఈ పోరాటం కొనసాగిస్తామన్నారు.

వైభవంగా సాముహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

ఐనవోలు, మార్చి 25: టీటీడీ హిందు ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం పున్నేలు రామాలయంలో సాముహిక సత్యనారాయణ వ్రతములు వైభవంగా నిర్వహించారు. పూజారి శివకుమార్ శాస్త్రి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో సుమారు 150 మంది మహిళలు పాల్గొన్నారు. మండల ధర్మప్రచార కన్వీనర్ అమరవాది సారంగపాణి, ఎస్. ప్రభాకర్‌రావు, ఎస్. దేవేందర్‌రావు, పిన్నింటి గోపాల్‌రావు, సంపత్‌రావు, రాజు, మోహన్‌రావు, శ్రీధర్ పాల్గొన్నారు.



బియబానీ నగర్‌లో సమస్యల మోత

పారిశుధ్య సమస్యలతో సతమతం

వెంటాడుతున్న వీధి కుక్కల భయం

వీధి దీపాల కొరతతో ఇబ్బందులు

పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు



డ్రెయినేజీ నిర్మాణానికి నోచుకోని మురుగుకాలువ



రైల్వే ట్రాక్ కింద మురుగుకాలువలో పేరుకుపోయిన చెత్త

కాజీపేట టౌన్, మార్చి 25 : కాజీపేట పట్టణం 48వ డివిజన్ పరిధిలోని రైల్వే ట్రాక్ అవతలి కాలనీపై నగర పాలక సంస్థ శీతకన్ను ప్రదర్శిస్తోంది. దీనికి రైల్వే ట్రాక్ అవతలివైపు ఉన్న బియాబానీ నగర్ కాలనీయే నిదర్శనంగా నిలుస్తోంది. రైల్వే ట్రాక్ అవతల భట్టుపల్లి వైపు వెళ్లే దారిలో గాంధీనగర్, బోడగుట్టకు వెళ్లే మార్గంలో బియాబానీనగర్, ఇందిరా నగర్, పవన్‌నగర్‌తో పాటు పలు కాలనీలు ఉన్నాయి. అత్యంత పేద ప్రజలు ఈ కాలనీల్లో నివసిస్తుంటారు. అందులో బియాబానీ నగర్‌లో పేరుకుపోయిన సమస్యలు స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ప్రధానంగా పారిశుధ్య సమస్యలతో కాలనీవాసులు సతమతమవుతున్నారు. మంచినీటి పైపులైన్లు లీకేజీకి గురై రోడ్డంతా బురదమయమవుతోందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. వర్షాకాలంలో వరద అంతా రోడ్డుపైకి చేరుతోందని వాపోయారు. వర్షపు నీరు బయటికి వెళ్లేలా రైల్వే ట్రాక్ కింద ఉన్న మురుగుకాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించే వారే లేరని ఆరోపించారు. ఫాగింగ్ చేయకపోవడంతో దోమల దాడులతో అనారోగ్యానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వీధి దీపాలను ఏర్పాటు చేయడం లేదని, రాత్రి వేళ చీకట్లో వీధి కుక్కలు వెంటపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలనీలోని పలు వీధుల్లో మట్టిరోడ్లే ఉన్నాయని, రోడ్లను, డ్రెయినేజీలను నిర్మించాలనే విన్నపాలకు కార్పొరేషన్ అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. మంచినీటి సరఫరా కూడా సరిగా చేయడం లేదని మండిపడుతున్నారు.

సమస్యలను పరిష్కరించాలి

మణికుమార్, బియాబానీనగర్ వాసి



రైల్వే ట్రాక్ అవతలికాలనీలపై కార్పొరేషన్ వివక్ష చూపుతోంది. బియాబానీనగర్‌లో పలు సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. వీధి కుక్కల భయం వెంటాడుతున్నా వాటి బారినుంచి కాపాడే వారే లేరు. వీధికుక్కలు గుంపులు గుంపులుగా తిరగడంతో భయపడి చిన్నారులను బడులకు పంపించాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఉన్న వీధిదీపాల్లో చాలావరకు పనిచేయడం లేదు. మెయిన్‌రోడ్డులో నూతనంగా వీధి దీపాలను ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందించడం లేదు. ఎండాకాలం సమీపిస్తున్నా మంచి నీటి సరఫరా మెరుగవడం లేదు. పైపులైన్ లీకేజీల నివారణ లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను తీర్చాలి.



మధుమేహం, రక్తపోటు అదుపు తప్పితే బ్రెయిన్ స్ట్రోక్ రావచ్చు. ఈ సమస్యకు కూడా రక్తస్రావమే కారణమైనా, ఈ రక్తస్రావం మెదడు లోపల జరుగుతుంది.

తలలో రక్తం గడ్డకట్టడంతో సద్గురు జగ్గీ వాసుదేవ్, ఆస్పత్రి పాలైన సంగతి అందరికీ తెలిసిందే! ఈ సమస్య ఎవరికి, ఎందుకొస్తుందో, ఆలస్యం చేయడం ఎంత ప్రమాదకరమో వైద్యులు వివరిస్తున్నారు.

మెదడులో రక్తస్రావం... ప్రమాదం

బ్రెయిన్ హెమరేజ్

బ్రెయిన్ స్ట్రోక్ వేరు, బ్రెయిన్ హెమరేజ్ వేరు. రక్తనాళాలు చిట్లి మెదడు లోపల రక్తస్రావం జరగడం బ్రెయిన్ స్ట్రోక్. మెదడులోని రక్తనాళాలు చిట్లి క్రమక్రమంగా రక్తాన్ని స్రవిస్తూ ఉండడం మూలంగా రక్తం గడ్డలు ఏర్పడే సమస్య బ్రెయిన్ హెమరేజ్. కొందర్లో అకస్మాత్తుగా రక్తస్రావం జరిగి అక్యూట్ బ్రెయిన్ హెమరేజ్ జరగవచ్చు. ఇంకొందర్లో క్రమేపీ రక్తస్రావం పెరిగి, క్రానిక్ బ్రెయిన్ హెమటోమా పరిస్థితి ఉండవచ్చు. సద్గురుకు జరిగింది ఇదే! అయితే రెండు రకాల హెమరేజ్‌ల్లో మెదడుకూ, పుర్రెకూ మధ్య ఉండే ఖాళీ జాగాలో రక్తం పేరుకుంటూ ఉంటుంది. మరీ ముఖ్యంగా 60 ఏళ్లు పైబడిన పెద్దల్లో మెదడు పరిమాణం తగ్గడం వల్ల ఈ జాగాలో రక్తం గడ్డకట్టే అవకాశాలు పెరుగుతాయి. చర్మానికి చిన్న చిన్న దెబ్బలు తగిలినప్పుడు, ఆ ప్రదేశాన్ని వేళ్లతో కొద్దిసేపు నొక్కి ఉంచితే రక్తస్రావం ఆగిపోతుంది. మెదడులో కూడా ఇదే పరిస్థితి ఉంటుంది. ఏదైనా దెబ్బ తగిలి రక్తస్రావం మొదలైతే, మెదడు వ్యాకోచించి, ఆ ప్రదేశంలో ఒత్తిడిని పెంచడం ద్వారా రక్తస్రావాన్ని ఆపే ప్రయత్నం చేస్తుంది. దాంతో బ్లీడింగ్ ఆగిపోయి, సమస్య సర్దుకుంటుంది. కానీ కొందర్లో ఇలా జరగదు.

తలకు దెబ్బలు తగలకుండా...

విపరీతంగా మద్యపానం చేసేవారిలో, పెద్దల్లో మెదడు పరిమాణం తగ్గుతుంది. కాబట్టి మెదడు వ్యాకోచించి, రక్తస్రావాన్ని ఆపే పరిస్థితి ఉండదు. కాబట్టి వీళ్లలో బ్రెయిన్ హెమరేజ్ తలెత్తే ముప్పు ఎక్కువ. మూత్రపిండాల వ్యాధులు, లివర్ ఫెయిల్యూర్, ఎముక మజ్జ సమస్య, రక్త కేన్సర్ ఉన్నవాళ్లలో కూడా రక్తస్రావ సమస్యలు ఎక్కువ. గుండె జబ్బులు, గుండె కవాట మార్పిడి చేయించుకున్న వాళ్లు రక్తం పలుచనయ్యే మందులతో పాటు రక్తం గడ్డకట్టకుండా నియంత్రించే యాంటీ కాగ్యులెంట్స్ కూడా వాడుతూ ఉంటారు. ఈ కోవలకు చెందిన వాళ్లకు కూడా ముప్పు ఎక్కువే! తల గోడకు కొట్టుకోవడం లేదా కింద పడిపోయి తలకు చిన్నపాటి దెబ్బలు తగలడం జరిగినప్పుడు సాధారణంగా వాటిని నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. కానీ ఆ దెబ్బ తగిలిన సమయంలో మెదడులోని రక్తనాళం చిట్లి కొద్దికొద్దిగా రక్తం స్రవిస్తూ, గడ్డకట్టడం మొదలుపెడుతుంది. అలా కొంత కాలానికి మెదడుకూ, పుర్రెకూ మధ్య ఉండే జాగాలో రక్తం గడ్డ నిర్దిష్ట పరిమాణానికి పెరిగిపోయినప్పుడు లక్షణాలు మొదలవుతాయి. కాబట్టి ఈ కోవలకు చెందిన వాళ్లు తలకు దెబ్బలు తగలకుండా చూసుకోవాలి.

హెచ్చరించే లక్షణాలు ఇవే!

- **తల నొప్పి:** తలనొప్పికి ఎన్నో కారణాలుంటాయి. కాబట్టి సాధారణ తలనొప్పికీ, బ్రెయిన్ హెమరేజ్ తలనొప్పికీ వ్యత్యాసాన్ని తెలుసుకోవాలి. హెమరేజ్ వల్ల తెల్లవారుఝామున విపరీతమైన తలనొప్పి మొదలవుతుంది. తలనొప్పితో నిద్ర మెలవువ అయిపోతూ ఉంటుంది.
- **వాంతులు:** వాంతి అయిపోవడం లేదా అలా అనిపించడం
- **కళ్లు:** కళ్ల ముందు చీకటి ఆవరించడం
- **కాళ్లు:** నడుస్తున్నప్పుడు కాళ్లు ఈడ్చవలసి రావడం అనిపించడం, నడవడంలో ఇబ్బంది
- **ఫిట్స్:** మూర్ఛలు మొదలు కావచ్చు
- **అయోమయం:** అయోమయానికి గురవుతూ, పరాకుగా మాట్లాడడం. పెద్దల్లో ఈ లక్షణాన్ని గమనించాలి.
- **మాటలు:** ముద్దగా మాట్లాడడం, మాటలు తడబడడం



ప్రమాదకరమే!

మెదడులో ఏ సమస్య తలెత్తినా ప్రమాదకరంగానే భావించాలి. తల నిర్దిష్ట పరిమాణానికి పరిమితమై ఉంటుంది కాబట్టి గడ్డ, రక్తస్రావం, ఇన్‌ఫెక్షన్... ఇలా పుర్రె లోపల అదనంగా ఏ చిన్న సమస్య తలెత్తినా మెదడు మీద ఒత్తిడి పెరిగి, పరిస్థితి ప్రమాదకరంగా మారుతుంది. ఆలస్యం చేస్తే, రోగి మత్తులోకి జారుకుని, కోమాలోకి వెళ్లిపోవచ్చు. ఒక వైపు శరీరం పక్షవాతానికి గురి కావచ్చు. కాబట్టి లక్షణాలను గుర్తించిన వెంటనే ఆస్పత్రికి తరలించాలి.

సత్వర చికిత్స కీలకం

మెదడులో ఎటు వైపు రక్తస్రావం జరిగినా, కుడి, లేదా ఎడమ సగభాగం మెదడు పైన రక్తం గడ్డ కట్టుకుంటుంది. దీన్ని వీలైంత త్వరగా సర్జరీతో తొలగించి, మెదడు మీద ఒత్తిడిని తగ్గించాలి. ఆలస్యం జరిగేకొద్దీ మెదడుకు శాశ్వత నష్టం జరిగిపోతూ ఉంటుంది. రక్తపు గడ్డల వల్ల మెదడుకు రక్తస్రావం లోపించి, మెదడు కణాలకు ఆక్సిజన్ అందక కణ నష్టం జరుగుతుంది. అలాంటప్పుడు పక్షవాతం శాశ్వతంగా ఉండిపోవచ్చు. శాశ్వతంగా మాటలు పడిపోవచ్చు. శరీరంలో బలహీనత శాశ్వతంగా మిగిలిపోవచ్చు. కొన్ని సందర్భాల్లో పరిస్థితి ప్రాణాంతకంగా కూడా మారవచ్చు. కాబట్టి మెదడు కణాలు చనిపోయేలోగా వీలైనంత త్వరగా సర్జరీ చేసి రక్తపు గడ్డలను తొలగించాలి. ఇలా సత్వరంగా స్పందించగలిగితే ఫలితాలు కూడా మెరుగ్గా ఉంటాయి.

నియంత్రణ మార్గాలు

- దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు క్రమం తప్పకుండా మందులు వాడుకుంటూ ఉండాలి.
- తీవ్ర మద్యపానం మానేయాలి.
- తలకు దెబ్బలు తగలకుండా చూసుకోవాలి
- పార్కిన్‌సన్ ఉన్న పెద్దలు కింద పడిపోయే అవకాశాలు ఎక్కువ. కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

సర్జరీ ఇలా...

సిటి స్కాన్‌తో మెదడులోని రక్తపు గడ్డను, దాని వయసును తేలికగా, త్వరగా కనిపెట్టవచ్చు. రక్తపు గడ్డ వయసు మూడు వారాలుంటే, ఆ రక్తం ద్రవరూపంలో ఉంటుంది. ఇలాంటప్పుడు పుర్రెకు రంధ్రం చేసి, రక్తాన్ని తలగించవచ్చు. కొందర్లో రక్తం ద్రవ, ఘన రూపాల్లో ఉంటుంది. ఇలాంటప్పుడు తలను తెరిచి రక్తాన్ని డ్రెయిన్ చేయవలసి ఉంటుంది. కొందరో ఘనరూప రక్తం ఎక్కువగా ఉంటుంది. ఇలాంటప్పుడు కూడా పుర్రెను తెరిచి, రక్తపు గడ్డను తొలగించవలసి ఉంటుంది.

అయితే అన్నిటికంటే ముందు, రక్తపు గడ్డ ఏర్పడడానికి కారణాలను కూడా తెలుసుకోవాలి. బ్లడ్ థిన్నర్లు, యాంటీ కాగ్యులెంట్లు వాడుకుంటున్న వాళ్లు, కిడ్నీ, లివర్ పనితీరు క్రమం తప్పిన వాళ్లు, మద్యపానం చేసేవాళ్లు, రక్తస్రావ సమస్యలున్నవాళ్లలో సమస్య తిరగబెట్టే అవకాశాలు ఎక్కువ. కాబట్టి వైద్యులు సూచించిన జాగ్రత్తలు పాటిస్తూ వారి పర్యవేక్షణలో ఉండాలి. సర్జరీ తర్వాత మూర్ఛలు వచ్చే అవకాశాలు ఎక్కువ. వాటికి అవసరమైన మందులు కూడా వాడుకోవాలి. కొందరికి రెండు నుంచి మూడు వారాల పాటు రీహ్యాబిలిటేషన్ అవసరం అవుతుంది.

డాక్టర్ కౌశల్ ఇప్పిలి
న్యూరో సర్జన్,
అపోలో హాస్పిటల్స్,
హైదరాబాద్.



మీకు తెలుసా?

చద్ది రొట్టె తింటే...

పొద్దున్నే చద్దన్నం తినడం మన పూర్వీకుల అలవాటు. వాళ్ల ఆరోగ్య రహస్యాల్లో అదొకటి. కానీ ఇప్పుడు చద్దన్నం తినే వాళ్లను వేళ్ల మీద లెక్క పెట్టవచ్చు. పేగుల్లో ఉండే గుడ్ బ్యాక్టీరియాను పెంచే మహత్తర శక్తి చద్ది పదార్థాల్లో ఉంటుంది. కాబట్టి చద్దన్నం ఇష్టపడని వాళ్లు చద్ది రొట్టెలు తినొచ్చు.

- తాజా రోటీలు, చపాతీల కంటే చద్ది రోటీలు, చపాతీలు రెట్టింపు తేలికగా జీర్ణమవుతాయి. ఏజింగ్ ప్రాసెస్ వల్ల వాటిలోని తేమ తగ్గి, తేలికగా జీర్ణమవుతాయి. అజీర్తితో బాధపడేవారికి చద్ది రొట్టె అద్భుతమైన అల్పాహారం.
- పొడిగా, తేలికగా ఉండే చద్ది చపాతీ, రోటీతో శరీరంలోని దోషాలు కూడా సమం అవుతాయని ఆయుర్వేదం చెప్తోంది. కఫ దోషాన్ని తగ్గించి, వాత దోషాన్ని సంతులనం చేసే చద్ది రొట్టె అన్ని రకాల శరీర తత్వాలకూ సరిపోతుంది.



- చద్ది రోటీల్లో ఉండే పీచు ఆకలిని అద్భుతంగా తీరుస్తుంది. ఎక్కువ సమయం పాటు పొట్టను నిండుగా ఉంచి ఆకలిని నియంత్రిస్తుంది. కాబట్టి ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో చద్ది రొట్టెను తినడం అలవాటు చేసుకోవాలి.
- చద్ది రోటీని పాలతో కలిపి తినడం ఆరోగ్యకరం. రాత్రి పూట తయారుచేసిన రోటీ చద్దిగా మారడానికి 12 నుంచి 15 గంటల సమయం పడుతుంది. ఆ లోపు తినడం ఆరోగ్యకరం. మధుమేహులకు కూడా చద్ది రోటీ ప్రయోజనకరంగా ఉంటుంది.

గుడ్ డైట్

ఆహారంలో ఆరోగ్యం!

భారతీయ ఆహారం భిన్నమైనది, విలక్షణమైనది. భౌగోళిక పరిస్థితులు, జీవనశైలులకు తగిన పోషక అవసరాలు తీర్చగల ఆహారంగా పేరు పొందింది. అయితే ఆ ఆహారాన్ని వండే పద్ధతి, తినే శైలులు మీదే మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది.

- **విభిన్న ఆహారం:** శరీరంలోని కోట్లకొద్దీ కణాలకు పోషకాలు అవసరం. భారతీయ భోజనంలోని రుచులు ఈ పోషకాలన్నిటినీ కలిగి ఉంటాయి. ఆయా రుతువుల్లో కాచే కాయలు, పండ్లు, కూరగాయలను ఆహారంలో చేర్చుకోవడం ద్వారా పోషకాలన్నీ సమంగా అందేలా చూసుకోవచ్చు. రాగులు, సజ్జలు, జొన్నలు, అరికలు... మొదలైన ధాన్యాలు ఆరోగ్యకరం. బియ్యం శరీర బరువు పెంచుతుందని భయపడేవాళ్లు దంపుడు బియ్యం తినవచ్చు. మినుములు, పెసలు, కందులు మొదలైన పప్పుదినుసులు అవసరమైన మాంసకృత్తులను అందిస్తాయి. కాబట్టి కూరగాయలతో కలిపి తింటే శక్తి సమకూరుతుంది.
- **భారతీయ థాలీ:** దీన్లో రెండు మూడు రకాల పప్పులు, అన్నం, రెండు లేదా మూడు కూరలు, ఒక రోటీ పచ్చడి, ఊరగాయ, పెరుగు, కొద్దిగా తీపి కూడా ఉంటుంది. వీటన్నిటి మేళవింపుతో రోజుకు సరిపడా పోషకాలు శరీరానికి అందుతాయి.



- **వంటనూనెలు:** ఆవనూనె, వేరుసెనగ నూనె, నువ్వుల నూనె, పొద్దుతిరుగుడు నూనె... ఇలా ఎన్నో రకాల వంటనూనెలు మార్కెట్లో ఉన్నాయి. అయితే వాటి తయారీలో తేడాల వల్ల పోషకాల నష్టం జరుగుతోంది. పూర్వం గానుగ పట్టించి స్వచ్ఛమైన నూనెను తీసేవారు. ఇలాంటి పద్ధతి వల్ల తాజా నూనె పొందేవాళ్లు. మిషన్ల ద్వారా నూనెను తీసి, వాటికి నిల్వ పదార్థాలు కలిపి, ప్లాస్టిక్ డబ్బాలు, కవర్లలో ప్యాక్ చేసే పద్ధతుల వల్ల ఆ నూనెల్లోని పోషకాలు నష్టపోతున్నాం. కాబట్టి గానుగ పట్టించి తీసిన నూనెను వంటలో వాడే ప్రయత్నం చేయాలి.
- **కూరలు:** సమమైన రుచులు, దినుసులు, నూనెలు వాడి తయారుచేసిన భారతీయ వంటకాలు, కూరలు ఆరోగ్యకరమైనవి. మధుమేహం, అధిక రక్తపోటు లాంటి ఇన్‌ఫ్లమేషన్ సంబంధిత రుగ్మతలకు అడ్డుకట్ట వేయాలంటే ఇలాంటి కూరలే తినాలి. కరివేపాకు, టమాటాలు, నల్లమిరియాలు, పసుపు, ఇతర సుగంధ ద్రవ్యాలతో వండిన కూరల్లో ఎన్నో పోషకాలు ఉంటాయి.
- **గోధుమలు:** గోధుమల్లో అలర్జీ కారకాలు ఉంటాయని నమ్ముతున్న కాలంలో ఉన్నాం. అయితే అలర్జీ కారకాలు గోధుమల్లో కాదు, ఆ గోధుమలను పాలిష్ చేయడానికి అనుసరించే పద్ధతుల్లో ఉంటాయి. పాలిష్ పట్టని, దంపుడు గోధుమలు కడుపుబ్బరం, అజీర్తి లాంటి ఇబ్బందులను కలిగించవు. హానికారక రసాయనాలు ఉపయోగించి తయారుచేసే బ్రెడ్‌కు దూరంగా ఉంటూ, దంపుడు గోధుమలను ఆహారంలో చేర్చుకోవచ్చు.
- **నిల్వ పచ్చళ్లు:** సరిపడా రాతి ఉప్పు, నూనె వేసి తయారుచేసిన నిల్వ పచ్చళ్లు చక్కని ప్రొబయాటిక్స్

మలి వయసులో గర్భం

దివంగత పంజాబీ గాయకుడు సిద్ధు మూసేవాలా తల్లితండ్రులు, లేటు వయసులో బిడ్డను కనడంతో అందరి దృష్టి ఐవిఎఫ్ వైపు మళ్లింది. అయితే ఈ దంపతుల్లాగే పెద్ద వయసులో తల్లితండ్రులయ్యే ప్రయత్నం చేసే పెద్దలు కొన్ని అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి.

ఐవిఎఫ్



2021 కృత్రిమ పునరుత్పత్తి ప్రక్రియ నియంత్రణ చట్టం (ఆర్టిఫిషియల్ రిప్రొడక్టివ్ టెక్నిక్ రెగ్యులేషన్ యాక్ట్) ఈ చికిత్సను ఆశ్రయించే దంపతుల్లో మహిళల వయో పరిమితిని 50 ఏళ్లకూ, పురుషుల వయో పరిమితిని 55 ఏళ్లకూ పరిమితం చేసింది. తల్లీబిడ్డల ఆరోగ్యభద్రత కోసం, బిడ్డ భవిష్యత్తు కోసం ప్రభుత్వం సూచించిన నియమాలను లెక్క చేయకుండా, మలి వయసులో ఐవిఎఫ్ ద్వారా బిడ్డలను కనే వాళ్లున్నారు. కెరీర్ పరంగా ఒంటరిగా మిగిలిపోయిన మహిళలు, అదే పనిగా పెళ్లి వాయిదా వేస్తూ వయసు మీరిపోయిన మహిళలు, సంతాన నిర్ణయాన్ని వాయిదా వేస్తూ, సహజసిద్ధంగా గర్భం దాల్చలేని లేటు వయసు మహిళలు పెద్ద వయసులో గర్భం దాల్చడంలో ఉండే ఆరోగ్యపరమైన ఇబ్బందులు, తల్లీబిడ్డలకు పొంచి ఉండే సవాళ్ల గురించి తెలుసుకోవడం అవసరం.

దుష్ప్రభావాలు లేకపోలేదు

ఐవిఎఫ్‌కు నిర్దిష్ట వయో పరిమితి లేకపోయినప్పటికీ, 40 ఏళ్లు దాటిన మహిళల్లో అండాల నాణ్యత, మోతాదులు తగ్గిపోతాయి. అలాగే ఐవిఎఫ్ విజయమయ్యే అవకాశాలు కూడా పెరిగే వయసుతో పాటు తగ్గిపోతూ ఉంటాయి. మన దేశంలో మహిళలు మెనోపాజ్‌కు చేరుకునే సగటు వయసు 46 ఏళ్లు. ఈ దశకు 13 ఏళ్ల ముందు నుంచే అండాల నాణ్యత దిగజారడం మొదలవుతుంది. అలాగే పెద్ద వయసు మహిళల్లోని అండాల్లో క్రోమోజోమ్‌ల లోపాలు, జన్యుపరమైన లోపాలు తలెత్తుతాయి. గర్భస్రావాలు కూడా ఎక్కువే! కాబట్టి పిల్లలు డౌన్స్ సిండ్రోమ్‌తో పుట్టే ప్రమాదం ఉంటుంది. కాబట్టి లేటు వయసులో ఐవిఎఫ్‌ను ఆశ్రయించేవాళ్లు దానంగా పొందిన అండాలతో గర్భం దాల్చడం ఉత్తమం.

బిడ్డను పెంచే శక్తి ఉంటుందా?

దానంగా పొందిన అండాలతో గర్భం దాల్చినప్పటికీ, పెద్ద వయసు మహిళల్లో అధిక రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ సమస్యలుంటాయి. వీటి మూలంగా గర్భం దాల్చిన తర్వాత, జెస్టేషనల్ డయాబెటిస్, హైపర్‌టెన్షన్, నెలలు నిండకుండా పిల్లలు పుట్టడం లాంటి సమస్యలు తలెత్తే అవకాశాలు ఎక్కువ. ఐవిఎఫ్ ద్వారా బిడ్డ పుట్టడంతోనే దంపతుల కథ ముగిసిపోదు. నిజానికి బిడ్డ శ్రేయస్సు కోసం దంపతుల జీవితకాలపు నిబద్ధత బిడ్డ పుట్టుకతోనే మొదలవుతుంది. పిల్లల శ్రేయస్సుకు ఆరోగ్యకరమైన, దీర్ఘాయుష్షు కలిగి ఉన్న తల్లితండ్రులు అవసరం. కాబట్టి పెద్ద వయసులో పిల్లలను కనాలనుకునే దంపతులు బిడ్డను పెంచే ఓపిక, వయసుతో పాటు క్షీణిస్తుందనే విషయాన్ని కూడా గుర్తు పెట్టుకోవాలి.

ఫుడ్ ఫ్యాక్ట్

ఎర్ర అరటిలో...

ఎరుపు రంగు అరటిపండులో పోషకాలు ఎక్కువ. శరీర జీవక్రియలకు తోడ్పడే కీలకమైన సూక్ష్మ పోషకాలు, విటమిన్ల కోసం పసుపు అరటి బదులుగా ఎరుపు అరటి ఎంచుకోవాలి.

- **ఇమ్యూనిటీ బూస్టర్:** దీన్లోని మెగ్నీషియం, పొటాషియం అధిక రక్తపోటును నియంత్రించి, రక్తనాళాలకు సాంత్వననిస్తాయి. వీటిలోని విటమిన్ సి ఇమ్యూనిటీని పెంచుతుంది. ఈ విటమిన్‌తో చర్మపు ఆరోగ్యానికి అవసరమైన కొల్లాజన్ కూడా పెరుగుతుంది.
- **కళ్లకు మేలు:** వీటిలోని కెరోటినాయిడ్లు కంటి ఆరోగ్యానికి తోడ్పడతాయి. ల్యూటీన్, బీటా కెరోటీన్ అనే ఈ కెరోటినాయిడ్లు మాక్యులర్ డీజనరేషన్ అనే చత్వారాన్ని వాయిదా వేస్తాయి.
- **అధిక బరువు:** ఈ పండ్లలోని అత్యధిక పీచు, కీలకమైన పోషకాలు ఆకలిని నియంత్రించి, అదనపు చిరుతిళ్ల వైపు మనసు మళ్లకుండా చేస్తాయి. ఫలితంగా అధిక బరువు తగ్గే అవకాశాలు పెరుగుతాయి.
- **మానసికోల్లాసం:** ఎర్ర అరటిపండ్లలోని విటమిన్ బి6 ట్రిప్టోఫాన్‌ను సెరటోనిన్‌గా మారుస్తుంది. ఈ ఫీల్ గుడ్ హార్మోన్ పెరగడం వల్ల డిప్రెషన్ దూరమై మనసు హుషారుగా మారుతుంది.
- **యాంటీ ఆక్సిడెంట్లు:** అన్ని పండ్లలాగే ఎరుపు అరటిలో కూడా యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. 11 రకాల ఖనిజ లవణాలు, 6 రకాల విటమిన్లతో పాటు, లెక్కలేనన్ని ప్రయోజనకరమైన పిండిపదార్థాలను కలిగి ఉండే ఎరుపు అరటి పండును తరచూ తింటూ ఉండడం ఆరోగ్యకరం.



అవగాహన

పోషకాలతో ప్రమాదాలు

కొన్ని రకాల ప్యాకేజ్డ్ ఫుడ్స్, మందుల తయారీల్లో ఉపయోగించే పోషకాలు ఆరోగ్యానికి మేలుకు బదులుగా హానినే ఎక్కువగా తలపెడుతూ ఉంటాయి. ఆశ్చర్యకరమైన ఈ విషయాన్ని లోతుగా పరిశీలిస్తే....

యాంటీ ఏజింగ్ సప్లిమెంట్‌గా, చర్మం, మెదడు ఆరోగ్యాన్ని పెంచే పోషకంగా విటమిన్ బి, నయాసిన్ పేరు పొందింది. బ్రేక్‌ఫాస్ట్ సిరీల్స్, బ్రెడ్, కార్న్‌ఫ్లేక్స్, బేబీ ఫార్ములాల తయారీలో దీన్ని కలుపుతూ ఉంటారు. అయితే నయాసిన్ గుండె జబ్బుల ముప్పును పెంచుతుందని తాజా అధ్యయనాల్లో తేలింది. సప్లిమెంట్లు, కొన్ని మందులు, పదార్థాల తయారీల్లో అదనంగా జోడించే అడిటివ్స్‌లో ఎలాంటి దుష్ప్రభావాలు దాగి ఉంటాయో ఎవరికీ తెలియదు. ఉదాహరణకు చాక్లెట్, ఐస్‌క్రీమ్‌లు ఎక్కువ సమయం పాటు కరిగిపోకుండా ఉండడం కోసం వాటిలో కలిపే, క్యారాజీనన్ అనే అడిటివ్, రక్తంలో చక్కెర మోతాదులను విపరీతంగా పెంచేస్తుంది. సాధారణంగా మనం అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్‌ను జంక్ ఫుడ్‌గా పరిగణిస్తూ ఉంటాం. అయితే ఆరోగ్యానికి తోడ్పడే కొన్ని సప్లిమెంట్లలో కూడా అంతే మోతాదుల్లో అడిటివ్స్ స్టెబిలైజర్లు ఉంటాయి.



పెద్ద మొత్తాల్లో మాత్రలను తయారు చేసే సమయంలో, అవన్నీ ఒకదానికొకటి అంటుకుపోకుండా ఉండడం కోసం, మాత్రాలకు రంగును అద్దడం కోసం పౌడర్లను కలుపుతూ ఉంటారు. అలాగే టెక్చర్ కోసం జెలటిన్లను కూడా జోడిస్తూ ఉంటారు. వీటి వల్ల దీర్ఘ కాలంలో ఛాతీ మంట, తలతిరుగుడు, అలర్జీ రియాక్షన్లు తలెత్తుతాయి.

కొన్ని రకాల సప్లిమెంట్లు, యాంటీబయాటిక్స్ పేగుల్లోని మంచి బ్యాక్టీరియాను చంపేస్తాయి. దాంతో కడుపు ఉబ్బరం, డయేరియాలు మొదలవుతాయి. క్రాస్కార్‌మెలోజ్ అనే పౌడరు పొట్టలోకి చేరుకున్న తర్వాత స్పాంజిలా ఉబ్బిపోయి, పేగుల్లో అడ్డు పడుతుంది. డైసోడియం ఫాస్ఫేట్, పొట్టలో నొప్పి, కడుపు ఉబ్బరం లాంటి సమస్యలను తెచ్చి పెడుతుంది. గ్లూటెన్ ఫ్రీ బేకింగ్ ఉత్పత్తుల్లో ఉపయోగించే గ్జాంథాన్ గమ్‌తో, నీళ్ల విరోచనాలు అవుతాయి. వంటకాల్లో ఉపయోగించే జెలటిన్‌తో ఛాతీలో మంట, అలర్జిక్ రియాక్షన్లు వేధిస్తాయి. వాడుతున్న మందులతో చర్మ సమస్యలు మొదలైతే, వాటిలో గ్లిసరిల్ డైబిహెనేట్, పాలీవినైల్ పైరోలైడోన్, లనోలిన్‌లు ఉన్నాయేమో గమనించుకోవాలి. పొటాషియం సార్బేట్, సోడియం, స్టెరీల్ ఫ్యూమరేట్‌లతో కళ్లు, చర్మం మండుతాయి. మూత్రపిండాలు దెబ్బ తింటాయి. కాబట్టి యాంటీబయాటిక్స్, రక్తాన్ని పలుచన చేసే మందులు వాడుతున్న వాళ్లు, వాటి మీద, సోడియం ప్రభావం ఉంటుందనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
మంగళవారం • 26 మార్చి 2024
cinema@andhrajyothy.com

ఇండియన్ 3 కూడా ఉంటుంది



భారతీయ సినీ రంగంలో విశిష్ట నటుల్లో కమల్ హాసన్ ఒకరు. లోకనాయకుడిగా, వెర్సటైల్ జీనియస్‌గా అభిమానుల నుంచి కితాబులందుకునే కమల్, తన మల్టీ టాలెంట్‌తో సినీ ప్రియుల్ని ఎప్పటికప్పుడు అలరిస్తుంటారు. తాజాగా శ్రుతీహాసన్, డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ నటించిన 'ఇనిమెల్' సాంగ్‌కు లిరిక్స్ అందించారు. ఇటీవలే, ఓ మీడియా ఇంటర్వ్యూలో తను నటిస్తున్న సినిమాల గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. నేను ఎన్ని పనులు చేసినా నా ఫస్ట్ లవ్ సినిమానే. 'విక్రమ్' రిలీజ్ అయ్యి రెండేళ్లు దాటినా, ఇంతవరకూ నా నుంచి మరో సినిమా రాలేదని అభిమానులు ఆశతో ఎదురుచూస్తున్నారు. కొంచెం ఆలస్యమైనా, నా ప్రాజెక్టులు ఒక్కొక్కటి థియేటర్లలో పలకరించడానికి సిద్ధమవుతున్నాయి. నేను టైటిల్ రోల్‌లో నటిస్తున్న ఇండియన్-2 (భారతీయుడు-2) షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఆ తర్వాత వెంటనే ఇండియన్-3 పనులు మొదలవుతాయి. ఈ చిత్రంలో నేను పోషించే సేనాపతి (సినిమాలో కమల్ పాత్ర)లుక్‌కు మేకప్ వేయడానికి నాలుగ్గంటలు, తీయడానికి మరో రెండుగంటలు పట్టేది. పార్ట్-2లో మొదటి భాగంలోలాగే రెండు పాత్రల్లో కనిపిస్తాను. మే 9న రిలీజ్ అయ్యే 'కల్కి 2898 ఏ.డీ'లో ఓ అతిథి పాత్రలో నటించాను. అత్యాధునిక సాంకేతికతతో తెరకెక్కుతున్న ఈ చిత్రం భారతీయులు గర్వించే విధంగా ఉంటుంది. ఎలక్షన్లు ముగిశాక మణిరత్నం దర్శకత్వంలో నటిస్తున్న 'థగ్ లైఫ్' షూటింగ్‌లో పాల్గొంటాను. అలాగే ధనుశ్ నటిస్తున్న ఇళయరాజా బయోపిక్‌కు స్ర్కీన్‌ప్లే అందిస్తున్నాను. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహించే ఈ సినిమాలో నేను నా నిజ జీవిత పాత్ర పోషించడం ఎంతో ఆనందంగా ఉంది" అని చెప్పారు.

ముచ్చటగా మూడోసారి!



నాని హీరోగా 'జెంటిల్ మన్', సుధీర్‌బాబుతో 'సమ్మోహనం' చిత్రాలను ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో నిర్మించిన శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్ ముచ్చటగా మూడోసారి నిర్మించే చిత్రానికి సోమవారం శ్రీకారం చుట్టారు. ప్రియదర్శి, రూప కొడువాయూర్ ఇందులో హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. దేవుని ఫొటోలపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు దర్శకుడు మోహనకృష్ణ సతీమణి ఉమా మహేశ్వరి కెమెరా స్విచ్ ఆన్ చేయగా, నిర్మాత సతీమణి అనిత తొలి క్లాప్ ఇచ్చారు. అనంతరం నిర్మాత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ 'మా సంస్థకి ఆత్మీయుడు, నాకు అత్యంత సన్నిహితుడు, ప్రతిభాశాలి మోహన్‌కృష్ణతో మూడో సినిమా చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. 'బలగం'తో హీరోగా పేరు తెచ్చుకున్న ప్రియదర్శికి ఇది యాప్ట్ సబ్జెక్ట్. తెలుగమ్మాయి రూప హీరోయిన్‌గా నటిస్తోంది. ఇదో క్యూట్ ఫిల్మ్. స్వీట్ ఎంటర్‌టైన్. చక్కటి వినోదంతో పాటు మంచి భావోద్వేగాలు ఉంటాయి. ఈ రోజు నుంచి హైదరాబాద్‌లో షూటింగ్ ప్రారంభించాం' అన్నారు. నరేశ్, తనికెళ్ల భరణి, అవసరాల శ్రీనివాస్, వెన్నెల కిశోర్, వైవా హర్ష, శివన్నారాయణ, వడ్లమాని శ్రీనివాస్, కల్పలత, రూపలక్ష్మి, హర్షిణి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి పాటలు: రామజోగయ్య శాస్త్రి, ఫొటోగ్రఫీ: పి.జి. విందా, సంగీతం: వివేక్ సాగర్, లైన్ ప్రొడ్యూసర్: విద్య శివలెంక, లిపక ఆళ్ల, రచన, దర్శకత్వం: మోహనకృష్ణ ఇంద్రగంటి.



హోలీ అంటే భయపడేవాణ్ణి

విజయ్ దేవరకొండ నటిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' చిత్రం నుంచి థర్డ్ సింగిల్ 'మధురం కదా' విడుదలైంది. సోమవారం హోలీ వేడుకల్లో గ్రాండ్‌గా జరిగిన కార్యక్రమంలో విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్, నిర్మాత దిల్‌రాజు పాల్గొన్నారు. మూవీ టీమ్‌తో హోలీ ఆడుతూ కలసి డాన్సులు చేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ 'తన కుటుంబాన్ని గొప్ప స్థాయిలో నిలబెట్టేందుకు కష్టపడే ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ స్టారే. ఈ కథ మొదట విజయ్ విన్నాడు. నాకు ఫోన్ చేసి పరశురామ్ మంచి కథ చెప్పాడు. మీరు వింటారా? అని అడిగారు. నేను ఆ కథ విని 15 నిముషాల్లో ఓకే చెప్పేశాను. ఎందుకంటే ఇది మిడిల్ క్లాస్ కథ. మిమ్మల్ని మీరు చూసుకుంటున్నట్లుగా సినిమా ఉంటుంది. ఏప్రిల్ 5న ఫ్యామిలీస్ సినిమా చూడడానికి రండి' అన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'చదువుకొనే రోజుల్లో హోలీ అంటే రంగులు పూస్తారని, అవి అలాగే ఉంటాయనీ భయపడేవాణ్ణి. అదే టైమ్‌లో ఎగ్జామ్స్ జరుగుతుంటే చాలా మంది ముఖాల నిండా రంగులతో వచ్చే వారు. కానీ ఇప్పుడు ఇక్కడ మీ అందరితో కలసి హోలి సెలబ్రేట్ చేసుకుంటుంటే పండగంటే ఇలాగే ఉండాలనిపిస్తోంది. మనలాంటి ఫ్యామిలీస్ నుంచి వచ్చిన ఒక వ్యక్తి కథ మా సినిమా. మీరు బాగా ఎంజాయ్ చేస్తారు' అన్నారు. 'ఎప్పుడూ హోలీ పండుగను ముంబైలో చేసుకుంటూ ఉంటాను. ఈసారి మీ మధ్య 'ఫ్యామిలీ స్టార్' టీమ్‌తో కలసి సెలబ్రేట్ చేసుకోవడం ఆనందంగా ఉంది' అని మృణాల్ ఠాకూర్ అన్నారు.

మోత... మోత



విభిన్న పాత్రలతో ప్రేక్షకుల్ని ఆకట్టుకొంటున్న విశ్వక్ సేన్ నటిస్తున్న తాజా చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రం విడుదల కోసం తుదిమెరుగులు దిద్దుకుంటోంది. ఇందులో విశ్వక్ సేన్ మాస్‌ని మెప్పించే గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు. హోలీ సందర్భంగా 'మోత' పాటను విడుదల చేసి, పండగ వాతావరణాన్ని మరింత సందడిగా మార్చింది చిత్ర బృందం. అందాల తార ఆయేషా ఖాన్ ఈ ప్రత్యేక పాట కోసం విశ్వక్ సేన్‌తో కలసి చిందులు వేయడం అదనపు ఆకర్షణ. చంద్రబోస్ రాసిన ఈ మాస్ సాంగ్‌ను ఎం.ఎం. మానసి అభిమానుల్లో ఉత్సాహం నింపేలా పాడారు. థియేటర్లలో ఈ పాట మోత మోగించడం ఖాయం అంటున్నారు. నేహా శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో అంజలి కీలక పాత్ర పోషిస్తున్నారు. మే 17న విడుదలయ్యే ఈ చిత్రానికి సహ నిర్మాతలు: వెంకట్ ఉప్పుటూరి, గోపీచంద్ ఇన్నమూరి , నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య, రచన, దర్శకత్వం: కృష్ణ చైతన్య

అద్భుత కలయిక... ఇంకోసారి!



రామ్‌చరణ్ కెరీర్‌లో కలకాలం గుర్తుండిపోయే చిత్రం 'రంగస్థలం'. అంతవరకూ కమర్షియల్ క్యారెక్టర్స్ చేస్తూ అల్ట్రామోడరన్ హీరోగా గుర్తింపు పొందిన రామ్‌చరణ్‌తో పక్కా పల్లెటూరి యువకుడు చిట్టిబాబు పాత్ర చేయించి, సాహసం చేశారు దర్శకుడు సుకుమార్. అభిమానులు ఉప్పొంగే విదంగా, ప్రేక్షకులు మెచ్చుకొనే రీతిలో ఆ చిత్రంలో నటించి 'రంగస్థలం' అద్భుత విజయానికి కారణమయ్యారు రామ్‌చరణ్. ఇక అప్పటినుంచి వీరిద్దరి కాంబినేషన్‌లో మరో చిత్రం ఎప్పుడెప్పుడా అని ఆశగా ఎదురు చూస్తున్న ప్రేక్షక అభిమానులకు సోమవారం ఓ గుడ్ న్యూస్ చెప్పారు మైత్రీ మూవీ మేకర్స్ అధినేతలు నవీన్ యర్నేని, రవిశంకర్. సుకుమార్ రైటింగ్స్ సంస్థతో కలసి రామ్‌చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో ఓ భారీ చిత్రం తీయనున్నట్లు ప్రకటించారు. ఈ ఏడాదిలోనే షూటింగ్ ప్రారంభించి, 2025 చివరిలో విడుదల చేస్తామని వెల్లడించారు. ఈ సినిమాకు దేవిశ్రీప్రసాద్ సంగీతం అందిస్తారని తెలిపారు. ఈసారి కూడా రామ్‌చరణ్ కోసం అత్యద్భుతమైన స్క్రిప్ట్‌ను సుకుమార్ తయారు చేశారని నిర్మాతలు చెప్పారు.

సీక్రెట్‌గా పెళ్లి చేసుకున్న తాప్సీ





సొట్టబుగ్గల సుందరి తాప్సీ పెళ్లి పీటలెక్కుతోందంటూ కొంత కాలంగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. వాటిని నిజం చేస్తూ తాప్సీ తన ప్రియుడు మథియాస్ బో ను రెండు రోజుల క్రితం పెళ్లాడారు. డెన్మార్క్‌కు చెందిన బ్యాడ్మింటన్ ప్లేయర్ మథియాస్ బోతో పదేళ్లుగా డేటింగ్‌లో ఉన్నారు తాప్సీ. పెద్దలను ఒప్పించి సిక్కు, క్రిష్టియన్ సంప్రదాయాల ప్రకారం వీరిద్దరూ ఉదయ్‌పూర్‌లో పెళ్లి చేసుకున్నారు. గుట్టు చప్పుడు కాకుండా జరిగిన ఈ వివాహానికి కుటుంబ సభ్యులు, సన్నిహితులే హాజరయ్యారు. అయితే తన పెళ్లి విషయాన్ని తాప్సీ ఇంతవరకు వెల్లడి చేయలేదు, ఫొటోలు కూడా రిలీజ్ చేయలేదు. కాగా, 2013లో జరిగిన ఇండియన్ బ్యాడ్మింటన్ లీగ్ ప్రారంభ కార్యక్రమంలో మొదటిసారి వీళ్లిద్దరూ కలుసుకున్నారు. అక్కడి నుంచే వారిద్దరి మధ్య ప్రేమ చిగురించింది. నటి తాప్సీ ఎప్పటికప్పుడు వారి ప్రేమాయణంపై మీడియా అడిగిన ప్రశ్నలను దాటేసేవారు. తమ ప్రేమ బంధాన్ని ఎంతో గోప్యంగా ఉంచిన తాప్సీ ఈ మధ్య ఒక ఇంటర్వ్యూలో మథియాస్‌తో తన పరిచయం గురించి తొలిసారిగా వెల్లడించారు.

ఆనందంగా ఉంది

తెలుగువారి ఆత్మీయ నటుడు, దివంగత గుమ్మడి వెంకటేశ్వర రావుకు బంధువుగా ఎన్నో అంచనాలతో సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టారు నటుడు నరేన్ రామ. తెలుగువారైనా, తమిళంలో సినీ కెరీర్‌ను ఆరంభించి పలు యాడ్స్‌లో, నాలుగు సినిమాల్లో నటించారు. ఈ నెల 29న విడుదలవుతున్న 'కలియుగం పట్టణంలో' సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇస్తున్నారు. ఈ చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా నరేన్ రామ మీడియాతో ముచ్చటించారు.



"తెలుగులో నా సినీ ప్రయాణాన్ని 'కలియుగం పట్టణంలో' సినిమాతో ప్రారంభించడం ఆనందంగా ఉంది. ఇందులో నేను ఓ కీలక పాత్రలో నటించాను. ఇది మంచి సస్పెన్స్ థ్రిల్లర్. దర్శకుడు రమాకాంత్ రెడ్డి ఈ సినిమాను ఎంతో చక్కగా తీర్చిదిద్దారు. హీరోహీరోయిన్లు విశ్వ కార్తికేయ, ఆయూషీ పటేల్ వారి నటనతో ఈ చిత్రానికి ప్రాణం పోశారు. ఈ సినిమాలోని టైటిల్ సాంగ్, అమ్మ సాంగ్ చాలా బాగా నచ్చాయి. అజయ్ అరసాద మంచి మ్యూజిక్ అందించారు. ఈ చిత్రాన్ని థియేటర్స్‌లో చూసిన వారందరూ తప్పక ఎంజాయ్ చేస్తారు. టీజర్, ట్రైలర్స్‌తో సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమా ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. ప్రస్తుతం నేను తెలుగులో డబ్లుహెచ్‌ఓ(హూ) అనే చిత్రంలో, తమిళంలో మరికొన్ని చిత్రాల్లో నటిస్తున్నాను" అని చెప్పారు.









సంబరాల హోలీ

వయసుని మరిచిపోయి చిన్నా పెద్దా అన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఆనందంగా చేసుకునే వేడుక హోలీ. ప్రతి ఏడాదిలాగే ఈ సారి కూడా టాలీవుడ్ తారలు రంగులు జల్లుకుంటూ ఈ పండుగను గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను రష్మిక, పాయల్ రాజ్‌పుత్, కాజల్ అగర్వాల్, రుక్సార్ థిల్లాన్ సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకున్నారు.

చెన్నైలో ఫైనల్

- అహ్మదాబాద్‌లో రెండు ప్లేఆఫ్‌లు
- ఐపీఎల్ రెండో దశ షెడ్యూల్ విడుదల
- మ్యాచ్‌లన్నీ భారత్‌లోనే..



న్యూఢిల్లీ: మెగా లీగ్ ఐపీఎల్ ఫైనల్ మే 26న చెన్నై వేదికగా జరగనుంది. ఈ మేరకు అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్న ఐపీఎల్ పూర్తిస్థాయి షెడ్యూల్‌ను బీసీసీఐ సోమవారం విడుదల చేసింది. సార్వత్రిక ఎన్నికల కారణంగా ఐపీఎల్ రెండోదశను యూఏఈకి తరలిస్తారన్న ఊహాగానాలకు చెక్ పెడుతూ.. భారత్‌లోనే మిగిలిన మ్యాచ్‌ల వేదికలను ఖరారు చేసింది. 2011, 2012 తర్వాత చెన్నైలో ఫైనల్‌ను షెడ్యూల్ చేయడం ఇదే తొలిసారి. డిఫెండింగ్ చాంప్ హోదాలో టైటిల్ ఫైట్‌కు ఆతిథ్యం ఇచ్చే అవకాశం చెన్నైకు దక్కింది. ఒకవేళ సీఎస్‌కే ఫైనల్‌కు చేరితే సొంత ప్రేక్షకుల ముందు ధోనీ ఘనంగా వీడ్కోలు పలికే అవకాశం ఉంది. అంతేకాకుండా మే 24న రెండో క్వాలిఫయర్ మ్యాచ్‌కు కూడా చెపాక్ వేదిక కానుంది. అహ్మదాబాద్‌లోని మొతేరా స్టేడియంలో మే 21న క్వాలిఫయర్-1, 22న ఎలిమినేటర్ మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. తొలి దశలో 21 మ్యాచ్‌ల షెడ్యూల్‌ను విడుదల చేయగా.. వచ్చే నెల 8 నుంచి జరిగే రెండో దశలో మొత్తంగా 52 మ్యాచ్‌లు జరగనున్నాయి. పోలింగ్‌ను దృష్టిలో ఉంచుకొని భద్రతా సమస్యలు తలెత్తకుండా ఉండే విధంగా మ్యాచ్‌ల తేదీలను ఖరారు చేశారు. పంజాబ్ కింగ్స్ రెండో హోంగ్రౌండ్ ధర్మశాలలో, రాజస్థాన్ రాయల్స్ రెండో సొంత మైదానంగా భావిస్తున్న గువాహటిలో రెండేసి మ్యాచ్‌లను షెడ్యూల్ చేశారు. ఢిల్లీ క్యాపిటల్స్ తమ సొంతమైదానం అరుణ్ జైట్లీ స్టేడియంలో తొలి మ్యాచ్‌ను ఏప్రిల్ 20న సన్‌రైజర్స్‌తో ఆడనుంది. మే 19న రాజస్థాన్- కోల్‌కతా మ్యాచ్‌తో లీగ్ దశ ముగియనుంది. ఒక రోజు విరామం తర్వాత మే 21 నుంచి ప్లేఆఫ్స్ జరగనున్నాయి.

ఐపీఎల్ రెండో దశ షెడ్యూల్

తేదీ	మ్యాచ్	వేదిక	సమయం
ఏప్రిల్ 8	చెన్నై x కోల్‌కతా	చెన్నై	రా.7.30
ఏప్రిల్ 9	పంజాబ్ x హైదరాబాద్	ముల్లాపూర్	రా.7.30
ఏప్రిల్ 10	రాజస్థాన్ x గుజరాత్	జైపూర్	రా.7.30
ఏప్రిల్ 11	ముంబై x బెంగళూరు	ముంబై	రా.7.30
ఏప్రిల్ 12	లఖ్‌నవూ x ఢిల్లీ	లఖ్‌నవూ	రా.7.30
ఏప్రిల్ 13	పంజాబ్ x రాజస్థాన్	ముల్లాపూర్	రా.7.30
ఏప్రిల్ 14	కోల్‌కతా x లఖ్‌నవూ	కోల్‌కతా	మ.3.30
ఏప్రిల్ 14	ముంబై x చెన్నై	ముంబై	రా.7.30
ఏప్రిల్ 15	బెంగళూరు x హైదరాబాద్	బెంగళూరు	రా.7.30
ఏప్రిల్ 16	గుజరాత్ x ఢిల్లీ	అహ్మదాబాద్	రా.7.30
ఏప్రిల్ 17	కోల్‌కతా x రాజస్థాన్	కోల్‌కతా	రా.7.30
ఏప్రిల్ 18	పంజాబ్ x ముంబై	ముల్లాపూర్	రా.7.30
ఏప్రిల్ 19	లఖ్‌నవూ x చెన్నై	లఖ్‌నవూ	రా.7.30
ఏప్రిల్ 20	ఢిల్లీ x హైదరాబాద్	ఢిల్లీ	రా.7.30
ఏప్రిల్ 21	కోల్‌కతా x బెంగళూరు	కోల్‌కతా	మ.3.30
ఏప్రిల్ 21	పంజాబ్ x గుజరాత్	ముల్లాపూర్	రా.7.30
ఏప్రిల్ 22	రాజస్థాన్ x ముంబై	జైపూర్	రా.7.30
ఏప్రిల్ 23	చెన్నై x లఖ్‌నవూ	చెన్నై	రా.7.30
ఏప్రిల్ 24	ఢిల్లీ x గుజరాత్	ఢిల్లీ	రా.7.30
ఏప్రిల్ 25	హైదరాబాద్ X బెంగళూరు	హైదరాబాద్	రా.7.30
ఏప్రిల్ 26	కోల్‌కతా x పంజాబ్	కోల్‌కతా	రా.7.30
ఏప్రిల్ 27	ఢిల్లీ x ముంబై	ఢిలీ	మ.3.30
ఏప్రిల్ 27	లఖ్‌నవూ x రాజస్థాన్	లఖ్‌నవూ	రా.7.30
ఏప్రిల్ 28	గుజరాత్ x బెంగళూరు	అహ్మదాబాద్	మ.3.30
ఏప్రిల్ 28	చెన్నై x హైదరాబాద్	చెన్నై	రా.7.30
ఏప్రిల్ 29	కోల్‌కతా x ఢిల్లీ	కోల్‌కతా	రా.7.30
ఏప్రిల్ 30	లఖ్‌నవూ x ముంబై	లఖ్‌నవూ	రా.7.30
మే 1	చెన్నై x పంజాబ్	చెన్నై	రా.7.30
మే 2	హైదరాబాద్ x రాజస్థాన్	హైదరాబాద్	రా.7.30
మే 3	ముంబై x కోల్‌కతా	ముంబై	రా.7.30
మే 4	బెంగళూరు x గుజరాత్	బెంగళూరు	రా.7.30
మే 5	పంజాబ్ x చెన్నై	ధర్మశాల	మ.3.30
మే 5	లఖ్‌నవూ x కోల్‌కతా	లఖ్‌నవూ	రా.7.30
మే 6	ముంబై x హైదరాబాద్	ముంబై	రా.7.30
మే 7	ఢిల్లీ x రాజస్థాన్	ఢిల్లీ	రా.7.30
మే 8	హైదరాబాద్ x లఖ్‌నవూ	హైదరాబాద్	రా.7.30
మే 9	పంజాబ్ x బెంగళూరు	ధర్మశాల	రా.7.30
మే 10	గుజరాత్ x చెన్నై	అహ్మదాబాద్	రా.7.30
మే 11	కోల్‌కతా x ముంబై	కోల్‌కతా	రా.7.30
మే 12	చెన్నై x రాజస్థాన్	చెన్నై	మ.3.30
మే 12	బెంగళూరు x ఢిల్లీ	బెంగళూరు	రా.7.30
మే 13	గుజరాత్ x కోల్‌కతా	అహ్మదాబాద్	రా.7.30
మే 14	ఢిల్లీ x లఖ్‌నవూ	ఢిల్లీ	రా.7.30
మే 15	రాజస్థాన్ x పంజాబ్	గువాహటి	రా.7.30
మే 16	హైదరాబాద్ x గుజరాత్	హైదరాబాద్	రా.7.30
మే 17	ముంబై x లఖ్‌నవూ	ముంబై	రా.7.30
మే 18	బెంగళూరు x చెన్నై	బెంగళూరు	రా.7.30
మే 19	హైదరాబాద్ x పంజాబ్	హైదరాబాద్	మ.3.30
మే 19	రాజస్థాన్ x కోల్‌కతా	గువాహటి	రా.7.30
మే 21	క్వాలిఫయర్-1	అహ్మదాబాద్	రా.7.30
మే 22	ఎలిమినేటర్	అహ్మదాబాద్	రా.7.30
మే 24	క్వాలిఫయర్-2	చెన్నై	రా.7.30
మే 26	ఫైనల్	చెన్నై	రా.7.30

నేటి మ్యాచ్

చెన్నై x గుజరాత్ — రాత్రి 7.30 గం. నుంచి

దీప్తికి స్వర్ణం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): భారత ఓపెన్ పారా అథ్లెటిక్స్ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్‌లో తెలుగు అథ్లెట్ జి.దీప్తి పసిడి పతకంతో మెరిసింది. సోమవారం బెంగుళూరులో జరిగిన ఈ పోటీల్లో దీప్తి 400 మీటర్ల పరుగును 1 నిమిషం 2 సెకన్లలో పూర్తిచేసి ప్రథమ స్థానంలో నిలిచింది. జయంతి (ఒడిశా) రజతం, భువీ అగర్వాల్ (హరియాణా) కాంస్యం సాధించారు.



దినేశ్ కార్తీక్ (10 బంతుల్లో 28 నాటౌట్)

విరాట్ మెరిసె..

బెంగళూరుకు తొలి గెలుపు ● ఆఖర్లో అదరగొట్టిన దినేశ్ ● 4 వికెట్లతో ఓడిన పంజాబ్



విరాట్ కోహ్లీ (49 బంతుల్లో 77)

బెంగళూరు: విరాట్ కోహ్లీ (49 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సలతో 77) అర్ధ శతకంతో అదరగొట్టడంతో.. ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) గెలుపు ఖాతా తెరిచింది. సోమవారం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో బెంగళూరు 4 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై నెగ్గింది. తొలుత పంజాబ్ 20 ఓవర్లలో 176/6 స్కోరు చేసింది. ధవన్ (45), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (25), జితేష్ (27) రాణించారు. సిరాజ్, మ్యాక్స్‌వెల్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో బెంగళూరు 19.2 ఓవర్లలో 6 వికెట్లకు 178 పరుగులు చేసి గెలిచింది. దినేశ్ కార్తీక్ (10 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సలతో 28 నాటౌట్) మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. రబాడ, హర్‌ప్రీత్ బ్రార్ చెరో 2 వికెట్లు దక్కించుకొన్నారు. విరాట్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

ఆఖర్లో అదరగొట్టారు..: కోహ్లీ ఎడాపెడా షాట్లతో విరుచుకుపడడంతో.. ఛేదనను బెంగళూరు ధాటిగా ఆరంభించింది. కర్రాన్ బౌలింగ్‌లో ఇన్నింగ్స్ రెండో బంతికి బతికి పోయిన విరాట్ నాలుగు బౌండ్రీలతో మోతెక్కించాడు. డుప్లెసి (3), గ్రీన్ (3)ను కూడా రబాడ పెవిలియన్ చేర్చినా.. కోహ్లీ కుదురుకోవడంతో పవర్‌ప్లే ముగిసేసరికి బెంగళూరు 50/2తో నిలిచింది. మధ్య ఓవర్లలో విరాట్, రజత్ పటీదార్ (18) వీలుచిక్కినప్పుడల్లా షాట్లు ఆడుతూ స్కోరు బోర్డును నడిపించారు. అయితే, పటీదార్‌ను హర్‌ప్రీత్ బౌల్డ్ చేయడంతో.. మూడో వికెట్‌కు 43 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మ్యాక్స్‌వెల్ (3)ను కూడా హర్‌ప్రీత్ బౌల్డ్ చేసి షాకిచ్చాడు. చివరి 5 ఓవర్లలో ఆర్సీబీ విజయానికి 59 పరుగులు కావాల్సి ఉండగా.. విరాట్‌ను అవుట్ చేసిన హర్షల్ జట్టుకు కావాల్సిన బ్రేక్‌ను అందించాడు. ఆ వెంటనే అనూజ్ రావత్ (11)ను కర్రాన్ ఎల్బీ చేయడంతో ఉత్కంఠ రేగింది. కానీ, కార్తీక్, ఇంపాక్ట్ ప్లేయర్ మహిపాల్ లోమ్రోర్ (17 నాటౌట్) 18 బంతుల్లో 48 రన్స్ జోడించడంతో.. ఆర్సీబీ మరో 4 బంతులు మిగిలుండగానే నెగ్గింది. ఆఖరి ఓవర్‌లో 10 పరుగులు అవసరమవగా.. కార్తీక్ 6, 4తో ఫినిష్ చేశాడు.

తడబడినా.. పుంజుకొని: బెంగళూరు బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసినా.. ఓపెనర్ ధవన్‌తోపాటు మిడిలార్డర్‌లో కర్రాన్ (23), జితేష్ పోరాడడంతో పంజాబ్ మెరుగైన స్కోరు నమోదు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కింగ్స్.. స్వల్ప స్కోరుకే ఓపెనర్ బెయిర్‌స్టో (8) వికెట్‌ను కోల్పోయింది. అయితే, ప్రభ్‌సిమ్రన్, ధవన్ ఆచితూచి ఆడడంతో.. పవర్‌ప్లే ముగిసేసరికి పంజాబ్ 40/1 స్కోరు చేసింది. అయితే, ఏడో ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్ సిక్స్ బాదగా.. ఆ తర్వాతి ఓవర్‌లో ధవన్ కూడా భారీ షాట్‌తో బ్యాట్‌కు పని చెప్పాడు. స్కోరు వేగం పుంజుకొంటున్న సమయంలో సింగ్‌ను మ్యాక్స్‌వెల్ క్యాచవుట్ చేయడంతో.. రెండో వికెట్‌కు 55 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. నిలకడగా సాగుతున్న పంజాబ్ బ్యాటింగ్ 98 పరుగుల స్కోరు వద్ద ఒక్కసారిగా కుదుపులకు గురైంది. జోసెఫ్ బౌలింగ్‌లో లివింగ్‌స్టోన్ (17) వెనుదిరగ్గా.. క్రీజులో కుదురుకున్న ధవన్‌ను మ్యాక్స్‌వెల్ అవుట్ చేశాడు. ఈ దశలో కర్రాన్-జితేష్ ఐదో వికెట్‌కు 52 పరుగులతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. దాగర్ వేసిన 15వ ఓవర్‌లో జితేష్ రెండు వరుస సిక్స్‌లతో 17 పరుగులు రాబట్టాడు. కానీ, డెత్ ఓవర్లలో బెంగళూరు బౌలర్లు పట్టు బిగించడంతో.. పంజాబ్ బ్యాటర్లు ఆశించిన రీతిలో షాట్లు ఆడలేక పోయారు. కర్రాన్‌ను యష్.. జితేష్‌ను సిరాజ్ అవుట్ చేశారు. అయితే, ఆఖరి ఓవర్‌లో శశాంక్ (8 బంతుల్లో 21 నాటౌట్) 6,6,4తో 20 పరుగులు రాబట్టడంతో.. టీమ్ స్కోరు 170 మార్క్ దాటింది.

స్కోరుబోర్డు

పంజాబ్: ధవన్ (సి) కోహ్లీ (బి) మ్యాక్స్‌వెల్ 45, బెయిర్‌స్టో (సి) కోహ్లీ (బి) సిరాజ్ 8, ప్రభ్‌సిమ్రన్ (సి) రావత్ (బి) మ్యాక్స్‌వెల్ 25, లివింగ్‌స్టోన్ (సి) రావత్ (బి) జోసెఫ్ 17, కర్రాన్ (సి) రావత్ (బి) యశ్ దయాల్ 23, జితేశ్ (సి) రావత్ (బి) సిరాజ్ 27, శశాంక్ (నాటౌట్) 21, హర్‌ప్రీత్ బ్రార్ (నాటౌట్) 2, ఎక్స్‌ట్రాలు: 8; **మొత్తం: 20 ఓవర్లలో 176/6; వికెట్ల పతనం:** 1-17, 2-72, 3-98, 4-98, 5-150, 6-154; **బౌలింగ్:** సిరాజ్ 4-0-26-2, యశ్ దయాల్ 4-0-23-1, అల్జారీ జోసెఫ్ 4-0-43-1, గ్రీన్ 2-0-19-0, దాగర్ 3-0-34-0, మ్యాక్స్‌వెల్ 3-0-29-2.

బెంగళూరు: కోహ్లీ (సి) హర్‌ప్రీత్ బ్రార్ (బి) హర్షల్ 77, డుప్లెసి (సి) కర్రాన్ (బి) రబాడ 3, గ్రీన్ (సి) జితేశ్ (బి) రబాడ 3, పటీదార్ (బి) హర్‌ప్రీత్ బ్రార్ 18, మ్యాక్స్‌వెల్ (బి) హర్‌ప్రీత్ బ్రార్ 3, అనూజ్ రావత్ (ఎల్బీ) కర్రాన్ 11, దినేశ్ కార్తీక్ (నాటౌట్) 28, మహిపాల్ (నాటౌట్) 17, ఎక్స్‌ట్రాలు: 18; **మొత్తం: 19.2 ఓవర్లలో 178/6; వికెట్ల పతనం:** 1-26, 2-43, 3-86, 4-103, 5-130, 6-130; **బౌలింగ్:** సామ్ కర్రాన్ 3-0-30-1, అర్ష్‌దీప్ 3.2-0-40-0, రబాడ 4-0-23-2, హర్‌ప్రీత్ బ్రార్ 4-0-13-2, హర్షల్ పటేల్ 4-0-45-1, రాహుల్ చాహర్ 1-0-16-0.

లంకదే తొలి టెస్టు

328 రన్స్‌తో బంగ్లా చిత్తు

సిల్హెట్ (బంగ్లాదేశ్): బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో శ్రీలంక ఏకంగా 328 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. 511 పరుగుల భారీ ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 47/5తో నాలుగోరోజైన సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లా.. లంక బౌలర్ కసున్ రజిత (5/56) ధాటికి 182 పరుగులకే కుప్పకూలింది. బంగ్లా బ్యాటర్లలో మోమినుల్ హక్ (87 నాటౌట్) చివరిదాకా పోరాడినా ఫలితం లేకపోయింది. తొలి ఇన్నింగ్స్‌లోనూ మూడు వికెట్లు తీసిన రజిత.. ఓవరాల్‌గా 8 వికెట్లతో బంగ్లా పతనాన్ని శాసించాడు. శ్రీలంక మొదటి ఇన్నింగ్స్‌లో 280, రెండో ఇన్నింగ్స్‌లో 418 పరుగులు చేసింది. బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 188 రన్స్‌కు ఆలౌటైంది.

ఇక.. ఐదు టెస్టుల సిరీస్

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ

న్యూఢిల్లీ: ప్రతిఏటా భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే ప్రతిష్ఠాత్మక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో అనూహ్య మార్పు. గత 32 ఏళ్లుగా నాలుగు టెస్టుల సిరీస్‌గా నిర్వహిస్తూ వస్తున్న ఈ సిరీస్‌ను ఇకనుంచి ఐదు టెస్టులకు మార్చారు. ఈ ఏడాది ఆఖర్లో ఆస్ట్రేలియా వేదికగా జరిగే ఈ సిరీస్‌లో ఐదు టెస్టులను ఆడించనున్నట్టు క్రికెట్ ఆస్ట్రేలియా తెలిపింది. కాగా, చివరిసారిగా 1991-92 సీజన్‌లో ఈ సిరీస్‌లో ఐదు టెస్టులను ఆడించారు.

ఇక్కడైనా.. దక్కేనా?

ట్రోఫీ వేటలో సింధు, శ్రీకాంత్

నేటినుంచి స్పెయిన్ మాస్టర్స్

మాడ్రిడ్: పారిస్ ఒలింపిక్స్ దగ్గరపడుతున్నా.. ఇప్పటికీ ఫామ్ అందుకునేందుకు తంటాలు పడుతున్న తెలుగు స్టార్ షట్లర్లు పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్ మరో కీలక టోర్నీకి సిద్ధమయ్యారు. మంగళవారం నుంచి జరిగే స్పెయిన్ మాస్టర్స్ చాలెంజ్ బ్యాడ్మింటన్ ఈవెంట్‌లో టైటిలే లక్ష్యంగా ఈ ఇద్దరూ బరిలోకి దిగుతున్నారు. గతేడాది ఫైనలిస్టు అయిన రెండోసీడ్ సింధు ఆరంభరౌండ్లో వెన్ యూ జాంగ్ (కెనడా)తో తలపడనుండగా.. ఏడోసీడ్ శ్రీకాంత్ క్వాలిఫయర్‌తో తన పోరు ఆరంభించనున్నాడు. సింధు, శ్రీకాంత్‌తో పాటు అస్మిత, మాళవిక, కిరణ్, సతీశ్ సింగిల్స్‌లో పోటీపడుతున్నారు. డబుల్స్‌లో అశ్విని/తనీషా, గాయత్రి గోపీచంద్/ట్రీసా జాలీ ఆడనున్నారు.

బిజినెస్

లోక్‌సభ ఎన్నికల తర్వాత టెలికాం చార్జీల బాదుడు!?

15-20 శాతం పెంపు తప్పదు



న్యూఢిల్లీ: దేశంలో టెలికాం సేవలు మరింత ప్రియం కానున్నాయి. ఒక్కో వినియోగదారు నుంచి సగటు ఆదాయాన్ని (ఏఆర్‌పీయూ) మెరుగుపరుచుకునే ప్రయత్నాల్లో భాగంగా టెలికాం కంపెనీలు ఈ లోక్‌సభ ఎన్నికల తర్వాత చార్జీలు పెంచే అవకాశాలున్నాయి. దాదాపు రెండున్నరేళ్లపాటు చార్జీలను స్థిరంగా కొనసాగించిన టెల్కోలు.. ఈసారి 15- 20 శాతం వరకు పెంచవచ్చని బ్రోకరేజీ కంపెనీలు అంచనా వేస్తున్నాయి. జులై-అక్టోబరు మధ్యకాలంలో ఈ పెంపును ప్రకటించవచ్చని భావిస్తున్నాయి. అయితే, అల్పాదాయ వర్గ వినియోగదారులు సైతం భరించగలిగేలా కంపెనీలు చార్జీల పెంపు ప్రణాళికను రూపొందించుకోవాల్సిన అవసరం ఉందని విశ్లేషకులంటున్నారు. 2021 నవంబరులో టెల్కోలు టారిఫ్‌ను 20-25 శాతం వరకు పెంచాయి. భారతీ ఎయిర్‌టెల్ తొలుత చార్జీల పెంపును ప్రకటించవచ్చని బ్రోకరేజీ సంస్థలంటున్నాయి. మిగతా ప్రైవేట్ ఆపరేటర్లు జియో, వొడాఫోన్ ఐడియా పెంపుపై భిన్నాభిప్రాయాలున్నాయి. మిగతా కంపెనీలూ ఎయిర్‌టెల్ బాటను అనుసరించనున్నాయని కొందరంటుండగా.. జియో మాత్రం తన వినియోగదారుల డేటా వినియోగం పెంపు ద్వారా ఆదాయాన్ని పెంచుకునే వ్యూహాన్ని అనుసరించవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతినెలా కస్టమర్లను కోల్పోతున్న వొడాఫోన్ ఐడియా.. చార్జీలను పెంచే సాహసం చేయకపోవచ్చన్న వాదనలూ విన్పిస్తున్నాయి. అయితే, 5జీ స్పెక్ట్రమ్, నెట్‌వర్క్ విస్తరణ కోసం భారీగా పెట్టుబడులు పెట్టిన టెల్కోలకు ఆదాయాన్ని పెంచుకోవడం అత్యవసరంగా మారింది. గత డిసెంబరుతో ముగిసిన త్రైమాసికం నాటికి ఎయిర్‌టెల్ ఆర్పూ రూ.208కి చేరింది. జియో ఆర్పూ రూ.182, వొడా ఐడియా సగటు రెవెన్యూ మాత్రం కనిష్ఠంగా రూ.145గా నమోదైంది. ఈసారి చార్జీల పెంపుతో ఎయిర్‌టెల్ ఆర్పూ రూ.260 స్థాయికి చేరుకోవచ్చని బెర్న్‌స్టీన్ అంచనా వేసింది.

పదేళ్లలో నిఫ్టీ వృద్ధి 240%

సూచీలోని 50 కంపెనీల్లో 47 మల్టీబ్యాగర్లు



ముంబై: గడిచిన పదేళ్లలో స్టాక్ మార్కెట్ సూచీలు భారీ వృద్ధిని కనబరిచాయి. 2014 హోలీ నాటికి 6,494 పాయింట్ల వద్దనున్న నిఫ్టీ-50 సూచీ.. 2024 హోలీ నాటికి 240 శాతం వృద్ధితో 22,096 పాయింట్ల స్థాయికి చేరుకుంది. అలాగే, సెన్సెక్స్ కూడా 22,096 పాయింట్ల స్థాయి నుంచి 230 శాతం పెరుగుదలతో 72,831 వద్దకు చేరుకుంది. 2015 మినహా మిగతా అన్ని సంవత్సరాల్లో నిఫ్టీ పాజిటివ్ వృద్ధిని నమోదు చేసింది. 2021లో అత్యధికంగా 24 శాతం రిటర్న్‌లు పంచింది. 2023లో సూచీ 20 శాతం పుంజుకుంది. గత ఏడాదిలో నిఫ్టీ తొలిసారిగా 19, 20, 21 వేల కీలక మైలురాళ్లను అధిగమించింది. కాగా, ఈ పదేళ్లలో నిఫ్టీ-50లోని 47 కంపెనీలు మల్టీ బ్యాగర్ రిటర్నులు పంచాయి. అందులో 14 కంపెనీల షేర్ల ధరలు 500 నుంచి 3,900 శాతం వృద్ధిని నమోదు చేశాయి.

అత్యధికంగా వృద్ధి చెందిన నిఫ్టీ-50 షేర్లు

కంపెనీ	వృద్ధి (%)
బజాజ్ ఫైనాన్స్	3,913
బజాజ్ ఫిన్‌సర్వ్	2,103
టైటన్	1,353
బ్రిటానియా ఇండస్ట్రీస్	1,029
అదానీ ఎంటర్‌ప్రైజెస్	856

ఐదో అతిపెద్ద ఈక్విటీ మార్కెట్‌గా భారత్

2014 డిసెంబరులో తొలిసారిగా రూ.100 లక్షల కోట్ల మైలురాయిని దాటిన మార్కెట్ సంపద (బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్).. గత ఏడాది నవంబరు 29న రూ.333 లక్షల కోట్లకు (4 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. ప్రస్తుతం రూ.382 లక్షల కోట్ల స్థాయికి పెరిగింది. అంతేకాదు, మార్కెట్ క్యాప్ పరంగా గత ఏడాది హాంకాంగ్‌ను వెనక్కి నెట్టి ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఈక్విటీ మార్కెట్‌గా అవతరించింది. 2030 నాటికి భారత ఈక్విటీ మార్కెట్ సంపద 10 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోవచ్చని అంతర్జాతీయ బ్రోకరేజీ సంస్థ జెఫ్రీస్ అంచనా వేసింది.

అమెరికా మార్కెట్‌కు అమూల్ పాలు



న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద పాల ఉత్పత్తుల బ్రాండ్ అమూల్.. అతి త్వరలో అమెరికా మార్కెట్లోకి అడుగు పెట్టబోతోంది. వారం రోజుల్లో కంపెనీకి చెందిన తాజా పాల ఉత్పత్తులను అమెరికాలో విడుదల చేయనున్నట్లు అమూల్ బ్రాండ్ నిర్వహణదారైన గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ (జీసీఎంఎంఎఫ్) తెలిపింది. దశాబ్దాలుగా డైరీ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేస్తున్నప్పటికీ తాజా పాలను విదేశాల్లో లాంచ్ చేయడం మాత్రం ఇదే తొలిసారని జీసీఎంఎంఎఫ్ ఎండీ జయేన్ మెహతా అన్నారు. యూఎస్‌లోని భారతీయులు, మిగతా ఆసియా దేశాల వారి కోసం వీటిని అందుబాటులోకి తెస్తున్నట్లు ఆయన చెప్పారు. అమూల్ తాజా, గోల్డ్, శక్తి, స్లిమ్ అండ్ ట్రిమ్ పాలప్యాకెట్లను న్యూయార్క్, న్యూజెర్సీ, షికాగో, వాషింగ్టన్, డల్లాస్, టెక్సాస్ తదితర నగరాల్లో విక్రయించనున్నట్లు కంపెనీ పేర్కొంది. భవిష్యత్‌లో అమూల్ పనీర్, పెరుగు, బటర్‌మిల్క్‌ను సైతం లాంచ్ చేయాలనుకుంటున్నట్లు మెహతా తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో జీసీఎంఎంఎఫ్ టర్నోవర్ వార్షిక ప్రాతిపదికన 18.5 శాతం వృద్ధితో రూ.55,000 కోట్లకు చేరుకుంది. ఈ సంస్థ ఇప్పటికే 50 దేశాలకు డైరీ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది.

గుండె జబ్బుకు లీహెల్త్ ఔషధం లిఫోస్టెరాల్

హైదరాబాద్: న్యూట్రాస్యూటికల్స్ తయారీలోని హైదరాబాద్‌కు చెందిన లీ హెల్త్ డొమైన్ గుండెకు సమర్థవంతమైన రక్షణ కల్పించే పోలీపిల్ లిఫోస్టెరాల్ తయారుచేసింది. హృద్రోగంపై విస్తృత పరిశోధన అనంతరం ఈ సాఫ్ట్‌జెల్ క్యాప్సూల్ తయారుచేసినట్టు కంపెనీ ప్రకటించింది. పాత వెల్లుల్లి రసం, గామా ఒరైజెనాల్, ఫైటోస్టెరాల్, లికోపిన్, నానో కర్క్యుమిన్, ఫెనూగ్రీక్, పైపరిన్ వంటి ప్రకృతిసిద్ధమైన పదార్థాలతో ఇవి తయారుచేసినట్టు కంపెనీ డైరెక్టర్ ఆళ్ల లీలారాణి తెలిపారు. ఇది కొలెస్టరాల్, ట్రైగ్లిసరైడ్స్‌ను సమతూకం చేస్తూ గుండెకొట్టుకోవడాన్ని క్రమబద్ధం చేయడానికి ఉపయోగపడుతుందని ఆమె చెప్పారు. ఇది అమెజాన్, లీ హెల్త్ డొమైన్ పోర్టళ్లలోను, అన్ని ప్రధాన ఫార్మసీల్లోను అందుబాటులో ఉంటుందని ఆమె వెల్లడించారు.

పేటీఎం ఆదాయం 24 శాతం క్షీణిత

మోతీలాల్ ఓస్వాల్

న్యూఢిల్లీ: పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై (పీపీబీఎల్) ఆర్‌బీఐ విధించిన ఆంక్షల కారణంగా 2025 ఆర్థిక సంవత్సరంలో పేటీఎం ఆదాయం 24 శాతం, లాభం 30 శాతం మేరకు తగ్గవచ్చునని మోతీలాల్ ఓస్వాల్ అంచనా వేసింది. అయితే ప్రస్తుతం పేటీఎం వ్యాపార పరివర్తన తీరుతెన్నులను తాము నిశితంగా గమనిస్తున్నామని తాజా విశ్లేషణలో తెలియచేసింది. అయితే నాలుగో త్రైమాసికం ఆర్థిక ఫలితాల అనంతరం తమ రేటింగ్‌ను సమీక్షిస్తామని, ఈ లోగా న్యూట్రల్ రేటింగ్‌లో పెడుతున్నట్టు వెల్లడించింది.

అంతర్జాతీయ సంకేతాలే కీలకం..!

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు వస్తే మెరుగ్గా రాణించే అవకాశం ఉంది. ఈ ఏడాది మూడుసార్లు వడ్డీరేట్లు తగ్గించనున్నట్లు అమెరిక్ ఫెడ్ రిజర్వ్ చేసిన ప్రకటన సూచీలకు దన్నుగా మారింది. అంతకుముందుతో పోల్చితే మార్కెట్ ట్రెండ్ క్రమంగా మెరుగుపడుతోంది. ఫియర్ ఇండెక్స్ సైతం తగ్గుతోంది. నిఫ్టీ మార్చి ఫ్యూచర్స్ మద్దతు 22,050 వద్ద, నిరోధం 22,300 వద్ద ఉన్నాయి. సోమవారం హోలీ సందర్భంగా స్టాక్ మార్కెట్లు పనిచేయలేదు. కాగా శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా మార్కెట్లకు సెలవు. మొత్తంగా ఈ వారం మార్కెట్ మూడు రోజులు మాత్రమే పనిచేయనుంది.

స్టాక్ రికమండేషన్స్

హిందాల్కో: కొన్నాళ్ల క్రితం గ్యాప్‌డౌన్ అయిన ఈ కౌంటర్ ప్రస్తుతం నిలదొక్కుకుంటోంది. రూ.520 స్థాయిలో మంచి బేస్ ఏర్పడింది. నిఫ్టీతో పోలిస్తే మెరుగైన పనితీరును కనబరుస్తోంది. గత శుక్రవారంతఈ షేరు రూ.547 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.540 పై స్థాయిలో ప్రవేశించి రూ.600/625 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.520 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

సన్ ఫార్మా: ఈ కంపెనీ సుదీర్ఘకాలంగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తోంది. ఫిబ్రవరి నుంచి రూ.1,530 స్థాయిలో అక్యుములేషన్ జరుగుతోంది. ఈ కౌంటర్‌లో ఆటుపోట్లు సైతం తక్కువగా ఉన్నాయి. గత శుక్రవారం రూ.1,608 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ.1,600 స్థాయిలో ప్రవేశించి రూ.1,750/1,810 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,545 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఇండస్ టవర్: టెక్నికల్‌గా చూస్తే ఈ కౌంటర్‌లో చాలా సానుకూలతలు కనిపిస్తున్నాయి. గత వారం ఈ షేరు నెల గరిష్ఠ స్థాయిని అధిగమించింది. చివరి ఐదు రోజుల్లో డెలివరీ వాల్యూమ్ 2.2 రెట్లు పెరిగింది. పైగా అప్పర్ బొలింజర్ బ్యాండ్‌ను బ్రేక్ చేసింది. గత శుక్రవారం ఈ షేరు 8.43 శాతం లాభంతో రూ.271 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.260 స్థాయిలో ప్రవేశించి రూ.340 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.235 స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హీరో మోటోకార్ప్: ప్రస్తుతం ఆటో రంగ షేర్లు దూకుడును ప్రదర్శిస్తున్నాయి. నిఫ్టీతో పోలిస్తే మెరుగైన ప్రదర్శన కనబరుస్తోంది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ క్రమంగా పెరుగుతోంది. మోతీలాల్ ఓస్వాల్ 'బై' రేటింగ్ ఇవ్వటం సానుకూల అంశం. గత శుక్రవారం ఈ షేరు రూ.4,684 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.4,650 స్థాయిలో ఎంటరై రూ.4,800 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,620 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఫినోలెక్స్ ఇండస్ట్రీస్: గత కొన్ని నెలలుగా ఈ కౌంటర్ సైడ్‌వేస్‌లో సాగుతోంది. రూ.220 స్థాయిల్లో చక్కని రౌండ్ బాటమ్ ఏర్పడింది. ఇదే కీలక మద్దతుగా ఉంటోంది. గత వారం ఈ షేరు నెల గరిష్ఠాన్ని అధిగమించింది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.220 పై స్థాయిల్లో ప్రవేశించి రూ.285/310 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.205 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ		విజయవాడ	400
హైదరాబాద్	395	విశాఖపట్నం	415
26వ తేదీ		వరంగల్	397
చిత్తూరు	458		
గోదావరి	400	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	118	గోదావరి	116
వరంగల్	118	విజయవాడ	116
కరీంనగర్	118	గుంటూరు	117
మహబూబ్‌నగర్	118	ఒంగోలు	117
కర్నూలు	118	చిత్తూరు	125
విశాఖపట్నం	115		

హైదరాబాద్ అభ్యర్థిగా గడ్డం శ్రీనివాస్‌యాదవ్

» మొత్తం 17 స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థుల ఖరారు



హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ తరఫున హైదరాబాద్ లోక్‌సభ స్థానం అభ్యర్థిగా గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ను ఖరారు చేస్తూ ఆ పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సోమవారం ఆ పార్టీ ఓ ప్రకటన విడుదల చేసింది. హైందవీ కళాశాలల చైర్మన్‌గా ఉన్న శ్రీనివాస్ యాదవ్‌కు జంట నగరాల్లో ఆయనకు 17 కళాశాలలు ఉన్నాయి. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఆయన బీఆర్ఎస్‌లో చేరారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో గోషామహల్ నుంచి టికెట్ ఆశించినా.. ఆయనకు అవకాశం దక్కలేదు. తాజాగా ఇప్పుడు ఆయన్ను హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బరిలో దింపాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది. ఇప్పటికే 16 మంది అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్ పార్టీ.. తాజాగా హైదరాబాద్ అభ్యర్థిని ప్రకటించడంతో మొత్తం 17 లోక్‌సభ సీట్లకు అభ్యర్థులను ఖరారు చేసినట్లయింది. ఈ మేరకు పార్టీ తరఫున నామా నాగేశ్వర్‌రావు (ఖమ్మం), వినోద్‌కుమార్ (కరీంనగర్), కడియం కావ్య (వరంగల్), మాలోతు కవిత (మహబూబాబాద్), పద్మారావుగౌడ్ (సికింద్రాబాద్), కొప్పుల ఈశ్వర్ (పెద్దపల్లి), కాసాని జ్ఞానేశ్వర్ (చేవెళ్ల), అనిల్ కుమార్ (జహీరాబాద్), బాజిరెడ్డి గోవర్ధన్ (నిజామాబాద్), మన్నె శ్రీనివాస్‌రెడ్డి (మహబూబ్‌నగర్), రాగిడి లక్ష్మారెడ్డి (మల్కాజిగిరి), ఆత్రం సక్కు (ఆదిలాబాద్), క్యామ మల్లేశ్ (భువనగిరి), కంచర్ల కృష్ణారెడ్డి (నల్లగొండ), ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ (నాగర్‌కర్నూల్), వెంకట్రామిరెడ్డి (మెదక్), గడ్డం శ్రీనివాస్‌యాదవ్ (హైదరాబాద్) పోటీ చేయనున్నారు.

ఇసుక తరలించిన వారిపై కేసు

గోవిందరావుపేట, మార్చి 25: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీ, జేసీబీని పట్టుకోవడం తోపాటు నలుగురు వ్యక్తులపై పస్రా పోలీసులు కేసు నమోదు చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా మండలంలోని రంగాపూర్ అటవీ ప్రాంతంలోని వాగులనుంచి ఇదే గ్రామానికి చెందిన అంబాల నరేందర్ ఇసుకను సేకరించి చల్వాయి సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ ఫంక్షన్‌హాల్‌లో నిల్వ చేశాడు. అక్కడినుంచి ఇతర ప్రాంతాలకు లారీలలో తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. ఇదే క్రమంలో ఆదివారం అర్ధరాత్రి జేసీబీ సహాయంతో ఇసుకను లారీలలో లోడ్ చేస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై, పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని పట్టుకొని విచారించగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న విషయాన్ని ఒప్పుకున్నారు. ఈమేరకు ములుగు మండలం ఖాసిందేవిపేటకు చెందిన ఎడ్ల శ్రీకాంత్, జంగాలపల్లికి చెందిన గంగుల రాజు, వెంకటాపూర్(రామప్ప) మండలం లింగాపూర్‌కు చెందిన నాయిని నరేష్, గోవిందరావుపేట మండలం రంగాపూర్‌కు చెందిన అంబాల నరేందర్‌లపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు.

పార్టీ నిర్ణయాలపై మీడియాతో మాట్లాడితే వేటే

» పార్టీ నేతలకు టీపీసీసీ హెచ్చరిక

హైదరాబాద్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా మీడియాలో పార్టీ నేతలు ఎవరు మాట్లాడినా వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ హెచ్చరించారు. పార్టీ నిర్ణయాలను అందరూ ఆమోదించాల్సిందేనని, భిన్నాభిప్రాయాలు ఉంటే.. అంతర్గత వేదికలపైన తెలియజేయాలని సూచించారు. బీఆర్ఎస్ నుంచి వచ్చిన దానం నాగేందర్, పట్నం సునీతారెడ్డి, రంజిత్‌రెడ్డికి పార్టీ టికెట్లు ఇవ్వడాన్ని సీనియర్ నేత వి.హన్మంతరావు, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్, పార్టీ నేత బక్క జడ్సన్ మీడియా ముఖంగా తప్పు పట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వీహెచ్, నిరంజన్‌తో వ్యక్తిగతంగా మాట్లాడిన మహేష్‌కుమార్‌గౌడ్.. వారి నుంచి వివరణ తీసుకున్నారు. ఇక మీదట పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా మీడియా ముందు మాట్లాడితే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించి.. పోలీసులే సైబర్ నేరాలకు పాల్పడితే ఇక సామాన్యులకు భద్రత ఎక్కడని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ ప్రశ్నించారు. గత ప్రభుత్వ పానలో జరిగిన కుతంత్రంపై సమగ్ర విచారణ జరిపి.. దోషులను శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.

గోవాలో పాలమూరు స్థానిక ప్రజాప్రతినిధులు

(మొదటి పేజీ తరువాయి)

ఉండేందుకు రాజకీయ పార్టీలు గోవా క్యాంపులకు తరలించాయి. వీరికి నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు అక్కడ అన్ని వసతులు కల్పించారు. మహబూబ్‌నగర్ నుంచి బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్సీగా ఉన్న కసిరెడ్డి నారాయణరెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరి.. కల్వకుర్తి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందిన విషయం తెలిసిందే. దీంతో ఎమ్మెల్సీ పదవికి ఆయన రాజీనామా చేశారు. ఈ మేరకు ఎమ్మెల్సీ స్థానానికి తిరిగి ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఫిబ్రవరి 26న నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే పార్లమెంట్ ఎన్నికల ముంగిట స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతుండటంతో అటు బీఆర్ఎస్ ఇటు కాంగ్రెస్ గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. కొంత ఆర్థికబలం ఉండి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను మేనేజ్ చేసుకోగలిగే అభ్యర్థులనే రెండు పార్టీలూ ఎంపిక చేశాయి. కాంగ్రెస్ మన్నె జీవన్‌రెడ్డిని అభ్యర్థిగా ఖరారు చేయగా, బీఆర్ఎస్ నుంచి నవీన్‌కుమార్‌రెడ్డి బరిలోకి దిగారు. కాగా, ఎమ్మెల్సీ ఎన్నిక నోటిఫికేషన్ విడుదలయ్యే నాటికి ఎమ్మెల్సీ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు 825ఓట్లు ఉండగా, కాంగ్రెస్‌కు 327ఓట్లు ఉన్నాయి. మిగతా ఓట్లు బీజేపీ, స్వతంత్ర, సీపీఐ, సీపీఎం పార్టీలకు ఉన్నాయి. దీనిని గుర్తించిన కాంగ్రెస్ పార్టీ తమ ఎమ్మెల్యేలకు ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరలేపాలని సూచించింది. దీంతో ఎమ్మెల్యేలు ఇబ్బడిముబ్బడిగా చేరికలను ప్రోత్సహిస్తున్నారు. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డే పలువురు బీఆర్ఎస్ ముఖ్యనేతలను పార్టీలో చేర్చుకుంటున్నారు. అలాగే మునిసిపాలిటీలను కాంగ్రెస్ వశం చేస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు పోటాపోటీగా బలం ఉందనే చర్చ నడుస్తుండడంతో అత్యధిక నియోజకవర్గాల్లో పార్టీలు క్యాంపు రాజకీయాలు మొదలుపెట్టాయి. కాగా ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఓటర్లను గోవాకు తీసుకెళ్లగా.. వారంతా బీచ్‌లు, కాసినోలు, పబ్‌ల్లో ఎంజాయ్ చేస్తున్నారు. భార్యలు ప్రజాప్రతినిధులుగా ఉన్న చోట్ల భర్తలు కుటుంబాలతో సహా వెళ్తుంటే భర్తలు ప్రజాప్రతినిధులుగా ఉంటే స్నేహితులను తీసుకెళ్తున్నారు.



గోవా బీచ్‌లో గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డితో ఆ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు

అభ్యర్థులపై ఇంకా అస్పష్టతే!

మొదటి పేజీ తరువాయి

కొనసాగుతోంది. బీఆర్ఎస్, బీజేపీ నుంచి వచ్చిన రంజిత్‌రెడ్డి, పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, దానం నాగేందర్‌తోపాటు గడ్డం వంశీకృష్ణకు టికెట్ ఇవ్వడాన్ని కాంగ్రెస్ సీనియర్ నేతలు పలువురు తప్పుబట్టడంతో పెండింగ్ సీట్లలో అభ్యర్థుల ఎంపిక.. పార్టీ నాయకత్వానికి మరింత సవాల్‌గా మారింది. అయితే ఒకటి, రెండు మినహా.. మిగిలిన సీట్లకు అభ్యర్థుల ఎంపికపై తర్జన భర్జనకు బుధవారం తెర పడవచ్చని తెలుస్తోంది. తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో అభ్యర్థుల ఎంపికపై ఏఐసీసీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) బుధవారం ఢిల్లీలో సమావేశం కానుంది. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఈసీ సభ్యుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరు కానున్నారు. ఈ భేటీలో ఆరేడు సీట్లపై స్పష్టత వస్తుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

నీలం మధు ఆర్థిక సమర్థతపై సందేహాలు?

మెదక్ స్థానానికి ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన నీలం మధుకు టికెట్ దాదాపు ఖరారైనా.. బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులను ఎదుర్కొనడంలో ఆయన ఆర్థిక సమర్థతపై పార్టీ నేతలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. 2009 ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీ చేసిన చెంగల నరేంద్రనాథ్ పేరును కూడా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇక నిజామాబాద్ నుంచి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అభ్యర్థిత్వంపై నేతల్లో వ్యతిరేకత లేకపోయినా.. సామాజిక సమతుల్యత కోణంలో స్థానిక బీసీ నేత పేరును పరిశీలిస్తున్నారు. కాగా, కరీంనగర్‌లో ప్రవీణ్‌రెడ్డి, వెలిచాల రాజేందర్ మధ్యనే పోటీ నడుస్తోంది. ఆదిలాబాద్‌లో ఉపాధ్యాయురాలు ఆత్రం సుగుణ, రిమ్స్ డాక్టర్ సుమలత పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అయితే ఆత్రం సుగుణ వైపే పార్టీ నాయకత్వం మొగ్గు చూపుతున్నట్లు చెబుతున్నారు. నాగర్‌కర్నూలు, పెద్దపల్లి సీట్లు మాల సామాజికవర్గానికి చెందిన మల్లు రవి, వంశీకృష్ణలకు ఖరారు చేయడంతో.. వరంగల్ సీటును కచ్చితంగా మాదిగ సామాజిక వర్గానికి కేటాయించే అవకాశం ఉంది. పార్టీ నేత దొమ్మాటి సాంబయ్యకు సీఎం రేవంత్‌రెడ్డి మద్దతు పలుకుతుండగా.. స్థానిక విద్యావేత్త పరంజ్యోతి పేరును మంత్రి కొండా సురేఖ ప్రతిపాదిస్తున్నట్లు చెబుతున్నారు. అలాగే స్టేషన్‌ఘన్‌పూర్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయిన ఇందిర, స్థానిక మహిళా నేత బొడ్డు సునీత కూడా తమ వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు.


మనవడు రుద్రదేవ్‌తో కలిసి హోలీ వేడుకలు జరుపుకొంటున్న సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

ఖమ్మం, భువనగిరిలో ఎవరి పట్టు వారిదే!

ఖమ్మం, భువనగిరి స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారు.. క్లిష్టంగా మారింది. ఖమ్మంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క సతీమణి నందిని, మంత్రి పొంగులేటి సోదరుడు ప్రసాద్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తనయుడు యుగంధర్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కుసుమ్‌కుమార్ పేర్లు ప్రధానంగా పరిశీలనలో ఉన్నాయి. కమ్మ సామాజికవర్గం కోటాలో యుగంధర్, కుసుమ్‌కుమార్ ఈ సీటును ఆశిస్తున్నారు. అయితే ప్రధానంగా ప్రసాద్‌రెడ్డి, నందిని మధ్యే పోటీ ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కమ్మ సామాజికవర్గానికి ఇప్పటికే ఒక రాజ్యసభ సీటు, మూడు కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చిన విషయాన్ని తెరపైకి తెస్తున్నాయి. ఖమ్మం నుంచి బీసీ నేతకు అవకాశం కల్పించే అంశంపైనా పరిశీలన జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇక భువనగిరి టికెట్ కోసం రేవంత్ సన్నిహితుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి భార్య లక్ష్మి మధ్యే పోటీ తీవ్రంగా ఉంది. అయితే ఈ సీటును కూడా బీసీలకు కేటాయించాలన్న వాదనను రాజగోపాల్‌రెడ్డి తెరపైకి తెచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం జరగనున్న సీఈసీ భేటీలో ఈ సీట్లపై స్పష్టత వస్తుందా? లేదా? అన్నది అనుమానంగా మారింది.

ఎస్సీ వర్గీకరణకు సహకారం అందిస్తా

» సంపత్, చారుగొండతో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అంశంపై.. కాంగ్రెస్ చిత్తశుద్ధితో ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ విషయంలో తాను సైతం సహకారం అందిస్తానని చెప్పారు. ఈ మేరకు ఆదివారం తనను కలిసిన ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చారుగొండ వెంకటేష్‌కు హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని మాదిగల అభివృద్ధి, సంక్షేమం తన బాధ్యత అని అన్నారు.



తప్పుకోనున్న బోయింగ్ సీఈవో కాల్‌హౌన్

న్యూఢిల్లీ, మార్చి 25: ప్రఖ్యాత విమానాల తయారీ సంస్థ బోయింగ్ కంపెనీ సీఈవో డేవ్ కాల్‌హౌన్ పదవి నుంచి తప్పుకోనున్నారు. ఏడాది చివరిలోగా ఆయన రాజీనామా చేస్తారని సోమవారం ఆ కంపెనీ యాజమాన్యం ప్రకటించింది. విమానాల తయారీలో లోపాలు, నాణ్యత భద్రతాపరంగా విమర్శలు రావడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆయన 2020 జనవరిలో ఈ పదవిని చేపట్టారు. ఆయన రాజీనామా చేస్తారన్న సమాచారం తెలియగానే బోయింగ్ షేర్ల విలువ 2.8శాతం మేర పెరిగింది. నాణ్యత లోపాల కారణంగా ప్రమాదాలు జరగడంతో ప్రపంచవ్యాప్తంగా బోయింగ్‌పై విమర్శలు వచ్చాయి.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నేటి నుంచి పొలాల సందర్శన

» 20 లక్షల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

» పరిహారం ఇవ్వకుంటే సచివాలయ ముట్టడి: హరీశ్



హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సాగు నీరందక పంటలు ఎండుతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి పట్టింపు లేకుండా పోయిందని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు తెలుసుకునేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి పంటపొలాల సందర్శన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళ, బుధ, గురువారాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ఎక్కడికక్కడ పంట పొలాలను సందర్శించాలని పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు పడుతున్న ఇబ్బందులు, పంట నష్టం వివరాలను అంచనావేసి పూర్తి వివరాలను పార్టీ రాష్ట్ర కార్యాలయానికి పంపాలని సూచించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటిదాకా 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర పార్టీల నుంచి చేరికల గురించే తప్ప.. రైతుల గురించి ఆలోచించే పరిస్థితిలో సీఎం రేవంత్ లేరని ధ్వజమెత్తారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే లక్షమంది రైతులతో కలిసి సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. వరంగల్ జిల్లా దేవరుప్పుల మండలం లక్ష్మీబాయితండాలో ఆదివారం తాము క్షేత్రస్థాయిలో పర్యటించామని, అక్కడి రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. సాగు నీరు లేదని, కరెంటు ఎప్పుడు వస్తుందో తెలియదని రైతులు చెబుతున్నారన్నారు. అసలే రైతులు కష్టాల్లో ఉంటే.. బ్యాంకుల వాళ్లు అప్పులు చెల్లించాలంటూ ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. రైతు రుణమాఫీపైనే తొలి సంతకం చేస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టి వంద రోజులైనా.. దీనిపై నిర్ణయం తీసుకోలేదని ధ్వజమెత్తారు.

త్వరలో ఉమ్మడి నల్లగొండలో కేసీఆర్ పర్యటన

నల్లగొండ: మాజీ సీఎం కేసీఆర్ త్వరలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు సోమవారం తనను కలిసిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి కేసీఆరే స్వయంగా చెప్పారు. తెలిపారు. వారం రోజులుగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పర్యటించి ఎండిన పంట పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన జగదీశ్‌రెడ్డి అందుకు సంబంధించిన నివేదికను కేసీఆర్‌కు అందజేశారు. క్షేత్రస్థాయిలో జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు రావాలని ఆయన కోరగా.. కేసీఆర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. నల్లగొండ మండలం ముషంపల్లిలో అత్యధికంగా బోర్లు వేసి నష్టపోయిన రైతులను కలుస్తానని చెప్పారు. గడిచిన పదేళ్లలో లేనివిధంగా ఈ ఏడాది పొలాలు ఎందుకు ఎండిపోయాయో తెలుసుకుంటానన్నారు.

కమలం... మిషన్ సౌత్!

రాష్ట్రంలో 12 సీట్లు దక్కించుకునేలా ప్రణాళిక.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై విస్తృత ప్రచారం

» బీఆర్ఎస్ ఓట్లను కొల్లగొట్టాలని నిర్ణయం

» బూత్‌ల వారీగా ఓటు బ్యాంకుపై నజర్

» దళిత, యువ ఓటర్లే లక్ష్యంగా వ్యూహం

హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): 'మిషన్ సౌత్'లో భాగంగా తెలంగాణ నుంచి గణనీయంగా ఎంపీ స్థానాలు కైవసం చేసుకోవాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. ఐదేళ్ల కిందటితో పోలిస్తే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు బ్యాంకు భారీగా పెరిగిన నేపథ్యంలో... వచ్చే ఎంపీ ఎన్నికల్లో దీన్ని పునరావృతం చేసే దిశగా పావులు కదుపుతోంది. పార్లమెంటు ఎన్నికల వేళ తెలంగాణలోనూ సమీకరణాలు మారే అవకాశం ఉందని భావిస్తున్న కమలనాథులు.. డబుల్ ఇంజిన్ సర్కారుతోనే తెలంగాణ అభివృద్ధి వేగవంతమవుతుందన్న వాదనను విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కేంద్రంలో సొంతంగా 370 స్థానాలు సాధించాలన్న లక్ష్యం నెరవేరాలంటే తెలంగాణ అత్యంత కీలకమని బీజేపీ అగ్ర నాయకత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో కనీసం 12 ఎంపీ స్థానాలు, 35 శాతం ఓటుబ్యాంకు సాధించాలని ప్రణాళికలు రచిస్తోంది. ప్రత్యర్థుల కంటే ముందుగానే మెజారిటీ స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించిన పార్టీ.. ప్రచారంలోనూ ఇదే దూకుడు కనబరుస్తుండడం కేడర్‌లో జోష్ నింపుతోంది. ఇటీవల కేవలం 10 రోజుల వ్యవధిలోనే ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బహిరంగసభలు, రోడ్డు షోలు నిర్వహించడం పాజిటివ్ వాతావరణాన్ని సృష్టించిందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేలా..

ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్ర స్థాయిలో ఎండగడుతూ, మరోవైపు కేంద్ర ప్రభుత్వ పథకాలను, మోదీ ప్రభుత్వ విజయాలను విస్తృతస్థాయిలో ప్రచారం చేసేందుకు బీజేపీ రంగం సిద్ధం చేసింది. ఇదే సమయంలో బీఆర్ఎస్ ఓటు బ్యాంకుపై గురిపెట్టింది. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభావం పెద్దగా ఉండబోదని భావిస్తున్న కమలనాథులు.. ఆ పార్టీ పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని అంచనా వేస్తున్నారు. సదరు బీఆర్ఎస్ ఓటు బ్యాంకు కాంగ్రెస్ వైపు మళ్లకుండా ఉండేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ మేరకు 'ప్రశ్నిస్తున్న తెలంగాణ' పేరిట రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా ప్రచారం చేయాలని బీజేపీ నిర్ణయించింది. మరోవైపు, వికసిత భారత్‌కు ప్రధాని మోదీ గ్యారంటీ నినాదాన్ని ప్రజలకు చేరువ చేయాలని భావిస్తోంది. భారీ బహిరంగసభలు, జాతీయ అగ్రనేతల విస్తృత పర్యటనలకు బదులుగా పోలింగ్ బూత్ కేంద్రంగా ఓటు బ్యాంకును పెంచుకునేందుకు కసరత్తు చేస్తోంది. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో పార్టీ కేడర్‌ను ఎప్పటికప్పుడు క్రియాశీలక కార్యక్రమాల్లో భాగస్వాములు చేయడం ద్వారా ప్రతి గడపకూ కమలం గుర్తును చేర్చాలని భావిస్తోంది. ఆయా కార్యక్రమాలకు జిల్లా, మండల, రాష్ట్ర పార్టీ నాయకులను కూడా బాధ్యులుగా నియమించనుంది. ఇటీవలి పర్యటనలో పార్టీ అగ్రనేత అమిత్‌షా కూడా రాష్ట్ర పార్టీ నాయకత్వానికి ఇదే అంశంపై దిశానిర్దేశం చేశారు. ఇందులోభాగంగా కనీసం 20 మంది కార్యకర్తలతో కలిసి ప్రతీ రెండు, మూడు రోజులకు ఒక సారి పోలింగ్ బూత్ పరిధిలో బైక్‌ర్యాలీలు నిర్వహించనున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రధాని మోదీ ఘనతను వివరిస్తూ వాల్‌రైటింగ్‌లు, డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలోని ఓటర్లతో టెలీ కాన్ఫరెన్సులు నిర్వహించనున్నారు. ఇందుకు గాను అన్ని నియోజకవర్గాల పరిధిలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అంతేకాదు.. రాష్ట్రంలోని మహిళలు, దళితులు, యువ ఓటర్లపై బీజేపీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. కేంద్రం నుంచి మహిళలకు అందుతున్న పథకాలను వివరించడంతోపాటు యువ ఓటర్లను ఆకర్షించేందుకు ప్రత్యేకంగా సమ్మేళనాలు నిర్వహించనుంది. తద్వారా ప్రధానిగా మోదీ మూడోసారి ఎన్నిక కావాల్సిన అవశ్యకతను తెలియజేయనుంది. మరోవైపు, దళిత ఓటు బ్యాంకు గణనీయంగా పెంచుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఎస్సీ వర్గీకరణ పట్ల ప్రధాని మోదీ చిత్తశుద్ధిని పెద్దఎత్తున ప్రచారం చేయనుంది. "రాష్ట్రంలోని 17 పార్లమెంటు నియోజకవర్గాలకు ఎస్సీ మోర్చా తరఫున ఇన్‌చార్జిలను నియమించాం. ప్రతీ పార్లమెంట్ స్థానంలో 5వేల మంది ఎస్సీ ప్రతినిధులతో సమ్మేళనాలు, బస్తీ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ప్రతి గ్రామంలోని ఎస్సీ కాలనీల్లో కార్నర్ మీటింగ్‌లు నిర్వహించనున్నాం. ఎస్సీలకు మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించనున్నాం" అని పార్టీ ముఖ్య నేత ఒకరు పేర్కొన్నారు.

'హౌసింగ్' భూముల చుట్టూ కంచె!

» జియోగ్రాఫికల్ మ్యాపింగ్‌కు సర్కారు నిర్ణయం

» ప్రహరీలు నిర్మిస్తే మంచిదంటూ అధికారుల నివేదిక

» ఇందుకు రూ.13-15 కోట్ల దాకా ఖర్చయ్యే అవకాశం

హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హౌసింగ్ బోర్డు, డెక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హోల్డింగ్ లిమిటెడ్(దిల్) పరిధిలోని భూముల రక్షణపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఆయా భూములు కబ్జాలకు గురికాకుండా కాపాడుకోవాలని నిర్ణయించింది. ఇందుకోసం ఆ భూముల చుట్టూ కంచె నిర్మించాలని, జియో గ్రాఫికల్ మ్యాపింగ్ చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అధికారులు కూడా ఇప్పటికే ప్రాథమికంగా ఒక రిపోర్టును ప్రభుత్వానికి అందించినట్టు తెలిసింది. హౌసింగ్ బోర్డు, దిల్ పరిధిలో ఉన్న భూములిల చుట్టూ కంచె వేసినా కొంత కాలమే ఉంటుందని, ప్రహరీలు నిర్మిస్తేనే చాలా కాలం మన్నిక ఉండడంతోపాటు కబ్జాలకు ఆస్కారం ఉండదని అధికారులు చెప్పినట్టు సమాచారం. ప్రహరీల నిర్మాణానికి రూ.13-15కోట్ల వరకు ఖర్చు అవుతుందని ఆ నివేదికలో పేర్కొన్నట్టు తెలిసింది. జియోగ్రాఫికల్ మ్యాపింగ్.. సాంకేతికతతో కూడుకున్న అంశం కావడంతో ఏదైనా కంపెనీతో ఒప్పందం చేసుకోవాలా? లేక ప్రభుత్వ పరిధిలోని ఏదైనా సంస్థకు బాధ్యతలు అప్పగించాలా? అన్న దానిపై తర్జన భర్జన నడుస్తోంది. జియోగ్రాఫికల్ మ్యాపింగ్, భూముల చుట్టూ ప్రహరీల నిర్మాణం రెండు ఏకకాలంలో పూర్తయితేనే ఎలాంటి ఇబ్బంది ఉండదని, లేదంటే భూముల హద్దుల విషయంలో సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధరకే అనువైన ఇళ్లను నిర్మించి ఇవ్వాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం హౌసింగ్ బోర్డు పరిధిలో 5,045 ఎకరాలు, దీని పరిధిలో ఏర్పాటు చేసిన దిల్ కింద 1,800 ఎకరాలను సేకరించింది. హౌసింగ్ బోర్డు కింద మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డితోపాటు నిజామాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఇళ్ల నిర్మాణాల కోసం 4,230 ఎకరాలను వినియోగించారు. దాదాపు 124 ఎకరాల మేర లిటిగేషన్, కబ్జా వివాదాల్లో ఉండగా.. మరో 691 ఎకరాల భూమి మాత్రమే బోర్డు పరిధిలో ఉంది. మరోవైపు దిల్ పరిధిలోనూ 900-1000 ఎకరాల వరకు పలు వివాదాల్లో ఉన్నట్టు తెలుస్తోంది. అంటే.. 800 ఎకరాలు మాత్రమే వివాదాలు లేని భూమి ఉంది. ఏపీ, తెలంగాణ విభజన తరువాత ఈ భూముల పంపకాల్లో వివాదాలు తలెత్తడంతో అప్పటి కేంద్ర ప్రభుత్వం వీటిని షెడ్యూల్ 9లో చేర్చింది. రాష్ట్రాలు విడిపోయి పదేళ్లవుతున్నా ఈ సమస్యకు పరిష్కారం లభించలేదు. అయితే, హౌసింగ్, దిల్ భూములు కబ్జాల బారిన పడకుండా కాపాడుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.


బాధితులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్

తలలు పగిలేలా కొట్టినా.. మౌనమేనా!

» వధశాల మాఫియా గుప్పిట్లో పోలీసులు

» చెంగిచర్ల బాధిత కుటుంబాలకు కిషన్‌రెడ్డి, ఈటల పరామర్శ

ఉప్పల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయంగా హోలీ సంబరాలు జరుపుకుంటున్న మహిళలపై ఓ వర్గం తలలు పగిలేలా రాళ్లతో దాడి చేసి గాయపరిచినా పోలీసులు మౌనం వహించడం ఏంటని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలం చెంగిచర్లలో ఆదివారం రాత్రి జరిగిన దాడిలో గాయపడిన బాధిత కుటుంబాలను సోమవారం రాత్రి మల్కాజిగిరి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌తో కలిసి కిషన్‌రెడ్డి పరామర్శించారు. ఆధారాలతో బాధిత కుటుంబాలు పోలీసులకు ఫిర్యాదు చేసి ఇరవై నాలుగు గంటల గడిచినా దర్యాప్తు పేరుతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. చెంగిచర్ల వధశాల మాఫియా గుప్పిట్లో పోలీసు యంత్రాంగం పనిచేస్తుందని ఆరోపణలు చేశారు. ఓ వర్గం ప్రజలకు అధికార ప్రభుత్వం మద్దతు ఇవ్వడం సరికాదన్నారు. గతంలోనే చెంగిచర్లలోని వధశాల రద్దు చేయాలని పోరాటం చేశామని, పశువులను హత్య చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వంతోపాటు పోలీసులు పట్టించుకోవడం మానేశారని విమర్శలు చేశారు. తాజాగా జనంపై తెగబడి దాడులకు దిగినా ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు పోలీసులు వెనకడుగు వేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో తమకు రాజకీయాల కంటే బాధితులకు అండగా నిలబడి పోరాటం చేయడమే ముఖ్యమని పేర్కొన్నారు. 24 గంటల్లో నిందితులపై హత్యానేరం కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

ఎన్డీయేలో బీజేపీ తర్వాత తెలుగుదేశం 'టాప్'!

» కమలం పార్టీ తర్వాత అత్యధిక స్థానాల్లో పోటీ

న్యూఢిల్లీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల్లో బీజేపీ తర్వాత టీడీపీనే అత్యధిక స్థానాల్లో పోటీ చేస్తోంది. కమలం పార్టీ 450 స్థానాల్లో పోటీ చేస్తుండగా, టీడీపీ 17 స్థానాల్లో పోటీ చేస్తోంది. ఎన్డీయే భాగస్వామ్య పక్షాల్లో బీజేపీ, టీడీపీ తర్వాత బీహార్‌లో జేడీ(యు) 16 సీట్లు, మహారాష్ట్రలో ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన 13 సీట్లు, తమిళనాడులో పీఎంకే 10 సీట్లు, పంజాబ్‌లో శిరోమణి అకాలీదళ్ 9 సీట్లలో పోటీ చేయనున్నాయి. విగతా భాగస్వామ్యపార్టీలేవీ 5 స్థానాలకు మించి పోటీచేయడంలేదు. చిరాగ్ పశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి 5 సీట్లు, అజిత్ పవార్ నేతృత్వంలని ఎన్‌సీపీ 5 సీట్లు, తమిళ మనీలా కాంగ్రెస్ సీట్లు, ఎఎంఎంకె, ఆర్ ఎల్ డి, అప్నాదల్ చెరో రెండుసీట్లలో పోటీ చేస్తున్నాయి. ఇక ఒక్కో స్థానానికి పోటీచేసే పలు భాగస్వామ్యపార్టీలు ఎన్డీఏలో ఉన్నాయి.

ఇద్దరు డీఈల స్వచ్ఛంద పదవీ విరమణ

హైదరాబాద్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కోలో ఇద్దరు డివిజనల్ ఇంజనీర్లు(డీఈ) స్వచ్ఛంద పదవీ విరమణ(వీఆర్ఎస్)కు దరఖాస్తు చేసుకున్నారు. ఏప్రిల్ 30వ తేదీ నుంచి తాము విధుల్లోకి రాలేమని నివేదిస్తూ వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోగా... వాటిని ఆమోదిస్తూ ట్రాన్స్‌కో సీఎండీ ఎస్ఏఎం రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు. 400 కేవీ కన్‌స్ట్రక్షన్‌లో డీఈ(ఎలక్ట్రికల్)గా పనిచేస్తున్న సి.హెచ్.సత్యవాణి, మెట్రోజోన్‌లో డీఈ(ఎలక్ట్రికల్)గా పనిచేస్తున్న జె.జ్యోతిలు వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నవారిలో ఉన్నారు.

రూ. 1,718 కోట్ల అప్పు తీసుకోనున్న రాష్ట్రం

హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ. 1,718 కోట్ల రుణాన్ని తీసుకోనుంది. ఈ నెల 26న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించనున్న ఈ-వేలం ద్వారా ఈ అప్పును సేకరించనుంది. అప్పు కోసం 26 ఏళ్ల కాల పరిమితితో సెక్యూరిటీ బాండ్లను విడుదల చేసింది. రాష్ట్రంతో కలిపి ఈ సారి ఏకంగా 18 రాష్ట్రాలు రూ. 60,032 కోట్ల అప్పుల కోసం ఇండెంట్లు పెట్టాయి.

17 ఎంపీ స్థానాల్లో గెలిపించండి

- బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఆర్థిక వ్యవస్థ నాశనం
- ప్రధాన మంత్రికి ఓటు అడిగే హక్కు లేదు: మంత్రి పొన్నం



జహీరాబాద్, మార్చి 25 : పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైందని, 17 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయగలమని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. ఆయన మహారాష్ట్రలోని గాణ్‌గాపూర్‌లోని దత్తాత్రి ఆలయానికి ఆదివారం రాత్రి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వస్తూ జహీరాబాద్ పట్టణంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ విభజనను వ్యతిరేకించారని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుచేయలేదని ఆరోపించారు. అలాంటి వారికి తెలంగాణలో ఓటు అడిగే హక్కు లేదన్నారు. జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థికి నియోజకవర్గ హద్దులు తెలియవని, ఇక్కడి సమస్యలపై అవగాహన లేదని పొన్నం విమర్శించారు. ఇక్కడి ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న సురేష్‌కుమార్ షెట్కార్ కాంగ్రెస్ నుంచి జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, ఆయన్ను ఆశీర్వదించాలని పొన్నం కోరారు.

అడవుల్లో అగ్నిప్రమాదాలను అరికట్టండి


- అటవీశాఖకు మంత్రి కొండా సురేఖ ఆదేశాలు



హైదరాబాద్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): వేసవి మొదలయినప్పటి నుంచి రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లోని అడవుల్లో వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాదాలపై అటవీశాఖ మంత్రి కొండా సురేఖ ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని అటవీశాఖను ఆమె సోమవారం ఆదేశించారు. ఈ మధ్యకాలంలో అమ్రాబాద్, కవ్వాల్, తాడ్వాయి, ఇల్లందు తదితర ప్రాంతాల్లో ప్రమాదాలు సంభవిస్తున్నట్లు సమాచారం వచ్చిందని పేర్కొన్నారు. మానవ నిర్లక్ష్యం వల్లే అటవుల్లో అగ్నిప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నందువల్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అటవీ ప్రాంతాల గుండా ప్రయాణం చేసేవారు అప్రమత్తంగా ఉండాలని, అడవుల్లో సిగరెట్, బీడీ పీకల్లాంటివి పడేయవద్దని మంత్రి కోరారు. అటవీశాఖ చీఫ్ డోబ్రియాల్‌తో ఆమె ఫోన్‌లో మాట్లాడుతూ.. అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రేవంత్ ఇంటిపై నిఘా

(మొదటిపేజీ తరువాయి)



ఏం చర్చలు జరిగాయి? అనే సంభాషణలను నేరుగా విన్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఆ వివరాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదించేవారని స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో ఎస్ఐబీకి టెక్నికల్ కన్సల్టెంట్‌గా వ్యవహరించిన రవిపాల్‌ను దర్యాప్తు అధికారులు విచారించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ పరికరాన్ని ఇజ్రాయెల్ నుంచి తెప్పించి, రేవంత్ ఇంట్లో జరుగుతున్న విషయాలను చేరవేసినందుకు రవిపాల్‌కు రూ.కోట్లు చెల్లించినట్లు సమాచారం.

ఎలా సాధ్యం?

ఏదైనా సెల్‌ఫోన్‌ను ట్యాప్ చేయాలంటే.. హ్యాకర్లు అందులో మాల్‌వేర్‌ను చొప్పించాల్సి ఉంటుంది. స్మార్ట్ ఫోన్లలో భద్రతాఫీచర్లు పెరుగుతున్నా.. అదే స్థాయిలో లొసుగులు ఉంటున్నాయని సైబర్ సెక్యూరిటీ నిపుణులు చెబుతున్నారు. ఒకప్పుడు టార్గెట్ ఫోన్ హ్యాకర్ చేతికి వస్తేగానీ, మాల్‌వేర్ చొప్పించే అవకాశం ఉండేది కాదు. అయితే.. హ్యాకర్లు పంపే లింకులను క్లిక్ చేసినా.. మాల్‌వేర్ ఇన్‌స్టాల్ అయ్యే ప్రమాదముంటుంది. వాట్సాప్‌లో ఒక ఫొటోను పంపి, దాన్ని క్లిక్ చేయగానే మాల్‌వేర్ ఇన్‌స్టాల్(స్టాగినోగ్రఫీ) అయ్యేలా చేయవచ్చని వివరిస్తున్నారు. పెగాసస్ వంటి స్పైవేర్‌లు వచ్చాక.. స్మార్ట్‌ఫోన్ చేతికి రాకున్నా.. ఫొటో, లింకులు పంపకున్నా.. టార్గెట్‌గా చేసుకున్న స్మార్ట్‌ఫోన్‌లో వాడే ఏదైనా నిత్యావసర యాప్‌లో లొసుగులను ఆధారంగా చేసుకుని, మాల్‌వేర్‌ను చొప్పించవచ్చని నిరూపితమైందని గుర్తుచేస్తున్నారు. పైన పేర్కొన్న డివైజ్ కూడా అలాంటిదే అయ్యి ఉంటుందని అనుమానిస్తున్నారు. 300 మీటర్ల పరిధిలో ఉండే.. నెట్ కనెక్టివిటీ ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాల్లోకి చొచ్చుకుపోవడానికి ఆ డివైజ్ దోహదపడి ఉంటుందని పేర్కొంటున్నారు. "పబ్లిక్ వైఫైలో ఉంటే.. హ్యాకర్లు కొన్ని పేలోడ్స్ ద్వారా మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లలోకి చొరబడుతారు. ఇక్కడ కూడా ఆ డివైజ్ ఇలాంటి పనే చేసి ఉంటుంది. ఇజ్రాయెల్‌కు చెందిన సంస్థలు తయారు చేసే టూల్స్/డివైజ్‌లలో అన్నిరకాల ఆపరేటింగ్ సిస్టమ్‌లలో ఉండే లొసుగులు, వాటిలోకి చొరబడేందుకు దోహదపడే పేలోడ్స్(ఉదాహరణకు విండోస్ 7లో మీటర్‌ప్రిటర్, విండోస్ 10, 11లో ఎటర్నల్‌బ్లూ) ఉంటాయి. ఆపరేటింగ్ సిస్టమ్ అప్‌గ్రేడ్ అయినా.. కొత్త వెర్షన్ వచ్చినా.. వెంటనే వాటి అప్‌డేట్స్‌ను ఇజ్రాయెల్ సంస్థలు అందజేస్తాయి. ఇక ఆ డివైజ్‌లను ఉపయోగించడానికి ఎలాంటి సాంకేతిక/కోడింగ్ పరిజ్ఞానం అవసరం లేదు. ఇప్పుడు వస్తున్న టూల్స్/డివైజ్‌లు అన్నీ.. గ్రాఫిక్ యూజర్ ఇంటర్‌ఫేస్(జీయూఐ)గా.. యూజర్‌ఫ్రెండ్లీగా ఉంటున్నాయి" అని నగరానికి చెందిన సైబర్‌సెక్యూరిటీ నిపుణుడు ఒకరు 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

కర్ణాటక ఎన్నికల్లోనూ ట్యాపింగ్

గత ఏడాది జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ఎస్ఐబీ కేంద్రంగా ప్రభాకర్‌రావు అండ్ కో అక్కడి కాంగ్రెస్ నేతల ఫోన్లను ట్యాప్ చేసినట్లు అధికారులు గుర్తించారు. బీఆర్ఎస్ మద్దతిచ్చిన జనతాదళ్(సెక్యులర్)కు అనుకూలంగా.. కాంగ్రెస్ వ్యూహాలను, ఆర్థిక వనరులను తెలుసుకుని, ఆ సమాచారాన్ని జేడీఎస్ ముఖ్యులకు చేరవేసినట్లు సమాచారం. కాంగ్రెస్ నేతలకు నిధులు ఎలా వస్తున్నాయి? వాటిని ఎలా పంపిణీ చేస్తున్నారు? అనే సమాచారం ద్వారా అక్కడి ఎన్నికల అధికారులు దాడులు నిర్వహించినట్లు తెలుస్తోంది. కర్ణాటకలో పట్టుబడ్డ నగదు మొత్తంలో సింహభాగం కాంగ్రెస్ పార్టీకి చెందినదేనని తెలుస్తోంది. ఇక తెలంగాణ ఎన్నికల సమయంలోనూ.. కాంగ్రెస్ తరఫున ప్రచారానికి కర్ణాటక నేతలు కీలకంగా వ్యవహరించారు. ఆ సమయంలో కూడా వారి ఫోన్లు ట్యాప్ అయినట్లు దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

బెదిరించి.. ఎలక్టోరల్ బాండ్స్!

విపక్ష నేతల ఫోన్లతోపాటు.. వ్యాపారుల స్మార్ట్‌ఫోన్లను కూడా ప్రణీత్‌రావు ట్యాపింగ్ చేసినట్లు దర్యాప్తు అధికారులు ఇప్పటికే నిర్ధారించారు. అయితే.. విపక్ష నేతలకు సహకరించే రియల్‌ఎస్టేట్, ఫార్మా, సాఫ్ట్‌వేర్ సంస్థల అధినేతల ఫోన్ ట్యాపింగ్‌లతో సుమారు 36 మంది దిగ్గజ వ్యాపారులతో ప్రణీత్‌రావు టచ్‌లోకి వెళ్లినట్లు గుర్తించారు. ఈ క్రమంలో వారిని బెదిరించి, ట్యాప్ చేసిన వారి ఆడియో/వీడియో క్లిప్‌లతో లొంగదీసుకుని, బీఆర్ఎస్‌కు పెద్దమొత్తంలో ఎలక్టోరల్ బాండ్స్ వచ్చేలా చేసినట్లు అనుమానిస్తున్నారు.

మూసీ వంతెన కింద హార్డ్‌డిస్క్‌లు

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాతి రోజు ఎస్ఐబీలో హార్డ్‌డిస్క్‌లను కటర్‌తో ధ్వంసం చేసిన ప్రణీత్‌రావు.. వాటి ముక్కలను అనంతగిరి అడవుల్లో పారేసినట్లు వాంగ్మూలమిచ్చిన విషయం తెలిసిందే..! పంజాగుట్ట ఠాణాకు చెందిన ఓ బృందం అనంతగిరి అడవుల్లో వెతికినా.. వాటి జాడ దొరకలేదు. అయితే.. భుజంగరావు, తిరుపతన్నల విచారణలో.. హార్డ్‌డిస్క్‌ల ముక్కలను నాగోల్‌లోని మూసీ వంతెన కింద పారేసినట్లు పోలీసులు గుర్తించారు. సోమవారం ఆ ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి, రిట్రీవ్ చేయించే ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే.. హార్డ్‌డిస్క్‌ల సెక్టార్లు దెబ్బతిన్నా.. అవి ఎండలో ఎక్స్‌పోజ్ అయినా.. డేటా రికవరీ అసాధ్యమని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. గత వారం ప్రణీత్‌రావును కస్టడీకి తీసుకుని విచారించిన పోలీసులు.. ఇప్పుడు ఆయనను ఇంకా విచారించాల్సి ఉందని పేర్కొంటూ మరోమారు కోర్టులో పిటిషన్ వేసే సూచనలు కనిపిస్తున్నాయి. భుజంగరావు, తిరుపతన్నను కూడా వారంపాటు కస్టడీకి తీసుకుని, ఈ ముగ్గురినీ కలిపి విచారించే అవకాశాలున్నాయి.

దమ్కీ ఇచ్చిన నిందితులు?

ఈ కేసులో అరెస్టయిన అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నలను విచారించిన అధికారులకు దమ్కీ ఇచ్చినట్లు విశ్వసనీయవర్గాలు చెబుతున్నాయి. తాము ఉన్నతాధికారుల ఆదేశాలను మాత్రమే పాటించామని, సొంతంగా చేసిందేమీ లేదంటూ పదేపదే చెప్పినట్లు సమాచారం. వజ్రాల వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, సినీ ప్రముఖులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఫోన్లను కూడా ట్యాపింగ్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారా? అన్న ప్రశ్నకు వీరిద్దరూ మౌనం దాల్చినట్లు తెలిసింది. కొన్ని ప్రశ్నలకు వీరిద్దరూ దమ్కీ(బెదిరింపు)కి దిగినట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. "మమ్మల్ని మీరు ఇప్పుడు విచారిస్తున్నారు. ప్రశ్నలు వేస్తున్నారు. ఇప్పుడు మీరెలా చేస్తున్నారో.. మేం కూడా అప్పట్లో అలానే చేశాం" అంటూ ఓ అధికారిని నోటికి వచ్చినట్లుగా మాట్లాడినట్లు సమాచారం.

చంచల్‌గూడ జైల్లోనూ అదే సీన్?

ప్రణీత్ రావు, భుజంగరావు, తిరపతన్నను చంచల్‌గూడ జైలుకు తరలించిన విషయం తెలిసిందే. వీరికి వేర్వేరు సెల్స్‌ను కేటాయించారు. వీరు ఎవరినీ కలుసుకోకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నట్లు సమాచారం. వీరున్న మూడు సెల్స్‌లోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారని, హైప్రొఫైల్ కేసు కావడంతో 24 గంటలూ నిఘా కొనసాగుతోందని తెలుస్తోంది. భుజంగరావు, తిరుపతన్న జైలు సిబ్బందితో దురుసుగా ప్రవర్తించినట్లు తెలిసింది. "మేం అదనపు ఎస్పీ స్థాయి అధికారులం. మాకు ప్రత్యేక సౌకర్యాలు కావాలి" అని డిమాండ్ చేయడంతో వారు ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. దాంతో ఉన్నతాధికారులు అక్కడికి చేరుకున్నట్లు సమాచారం. "మేము నేరస్థులం కాదు. మాపై ఫిర్యాదు వస్తే.. అదుపులోకి తీసుకున్నారు" అంటూ వారితోనూ దురుసుగా అన్నట్లు తెలిసింది. దీనికి అధికారులు సీరియస్‌గా బదులిచ్చినట్లు చర్చ జరుగుతోంది. "జైలు మాన్యువల్స్ ప్రకారమే నడుచుకుంటాం. మీకు ప్రత్యేక వసతులు కల్పించలేం. మీ వ్యవహార శైలి సరిగ్గా లేదు" అని సీరియస్ అవ్వడంతో.. భుజంగరావు, తిరుపతన్న మిన్నకుండిపోయారని సమాచారం.

టచ్‌లోకి ప్రభాకర్‌రావు

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ముదరడంతో అమెరికాలో ఉన్న ప్రభాకర్ రావు పోలీసులకు టచ్‌లోకి వచ్చినట్లు తెలిసింది. ఆయన అమెరికా నుంచి ఓ ఉన్నతాధికారికి ఫోన్‌కాల్ చేసినట్టు సమాచారం. "నేను క్యాన్సర్ చికిత్స కోసం అమెరికాకు వచ్చాను. జూన్ లేదా జూలైలో హైదరాబాద్‌కు తిరిగి వస్తాను. మీరు ప్రస్తుత ప్రభుత్వం చెప్పినట్లు పనిచేస్తున్నారు. నేను కూడా గత ప్రభుత్వం చెప్పినట్లుగానే పనిచేశాను. మనం అంతా పోలీసులం. మనంమనం ఒక్కటి" అని తాను చేసిన పనిని సమర్థించుకునే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. తమ ఇళ్లలో జరుపుతున్న సోదాలను వెంటనే ఆపాలని కోరినట్లు సమాచారం. అయితే.. ప్రభాకర్‌రావు మాట్లాడిన అధికారి మాత్రం.. "మీరు ఏదైనా చెప్పదలుచుకుంటే.. అధికారిక ఈ-మెయిల్‌కు పూర్తి సమాధానం పంపండి" అని చెప్పినట్లు తెలుస్తోంది. ఆ వెంటనే ప్రభాకర్‌రావు ఫోన్ కట్‌చేసినట్లు సమాచారం. కాగా.. ప్రభాకర్‌రావు ఎస్పీ ర్యాంకులో తూర్పుమండలం డీసీపీగా ఉన్నప్పుడే గొంత క్యాన్సర్ బయటపడిందని, అప్పట్లోనే చికిత్స చేసుకున్నారని తెలుస్తోంది. ఆ తర్వాత డీఐజీ ర్యాంకులో హైదరాబాద్ సీసీఎస్ జాయింట్ సీపీగా పనిచేశారు.

బాధితులుంటే ఫిర్యాదు చేయొచ్చు

ప్రణీత్‌రావు పలువురు వ్యాపారులను బెదిరించినట్లు ఈ కేసు దర్యాప్తులో అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో.. ఈ కేసులో ఉన్న అధికారులు గతంలో బ్లాక్‌మెయిల్ చేసినా.. బెదిరింపులకు పాల్పడి ఉన్నా.. ధైర్యంగా ఫిర్యాదు చేయాలని పశ్చిమ మండలం పోలీసులు సూచిస్తున్నారు. ఓ మాజీ మంత్రి, ఆయన బంధువులను కూడా ఈ గ్యాంగ్ బెదిరించినట్లు దర్యాప్తు అధికారులు ఆధారాలను సేకరించారు.

బ్లాక్ గ్రానైట్ ఉన్నా..

భవిష్యత్తు లేదు

మానుకోటలో ఉత్పత్తి ఘనం.. ఉపాధి శూన్యం

- అనుబంధ పరిశ్రమలు లేక తరలుతున్న గ్రానైట్ ఆదాయం
- ప్రతిపాదనలకే పరిమితమైన గ్రానైట్ ఇండస్ట్రియల్ పార్క్
- రాష్ట్రంలోనే ప్రత్యేకం ఇక్కడి 'బ్లాక్ గ్రానైట్'
- జిల్లాలో 27 లక్షల ఘనపు మీటర్ల నిల్వలు
- పాలిషింగ్ యూనిట్లు నెలకొల్పితే బహుళ ప్రయోజనాలు



మహబూబాబాద్ జిల్లాలోని ఒక బ్లాక్‌గ్రానైట్ క్వారీ

మహబూబాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బ్లాక్ గ్రానైట్ నిల్వలు మహబూబాబాద్ (మానుకోట) జిల్లాలో అపారంగా ఉన్నప్పటికీ వాటిని వెలికితీయడం, అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేయడంలో అడుగు ముందుకు పడటం లేదు. వేల కోట్ల సంపద సృష్టికి, వేలాది మందికి ఉపాధి అవకాశాలకు అవకాశాలున్నా ఆచరణలోకి రావటం లేదు. ఏపీలో ఒంగోలు సమీపంలోని చీమకుర్తిలో 'గెలాక్సీ' రకం గ్రానైట్ లభిస్తుండగా.. బ్లాక్ గ్రానైట్ (నల్ల రాయి) రకం లభ్యమయ్యేది తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లాలోనే. కర్ణాటకలో కూడా బ్లాక్ గ్రానైట్ లభ్యమవుతున్నప్పటికీ.. మహబూబాబాద్ జిల్లా గ్రానైట్ అత్యంత నాణ్యమైనది కావడంతో ఈ రాయికి ఇతర దేశాల్లో విపరీతమైన డిమాండ్ ఉంది. జిల్లాలోని కేసముద్రం, డోర్నకల్, నెల్లికుదురు, కురవి, గూడూరు, మరిపెడ, తొర్రూరు, గార్ల మండలాల్లో అపారమైన బ్లాక్ గ్రానైట్ నిల్వలు ఉన్నట్లు ప్రభుత్వ రికార్డుల్లో నమోదై ఉంది. వీటిలో డోర్నకల్, కురవి, మరిపెడ, గార్ల మండలాల్లో వెలికితీసే ప్రయత్నాలు జరగడం లేదు. కాగా, జిల్లాలో ఖనిజ సంపదపై విధించే రాయల్టీ ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.18 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుండగా ఇందులో సింహభాగం గ్రానైట్ క్వారీల నుంచే వస్తోంది. మహబూబాబాద్ జిల్లా వైశాల్యం 2,87,670 హెక్టార్లు. ఇందులో 1,59,697 హెక్టార్లలో వివిధ పంటలను సాగు చేస్తుండగా మిగిలిన ప్రాంతంలో నివాసాలు, కొండలు, గుట్టలు ఉన్నాయి. జిల్లాలో 8.37 లక్షల జనాభా ఉండగా అధికశాతం వ్యవసాయంపై ఆధారపడిన వారే.

1759 ఎకరాల్లో క్వారీలు

మహబూబాబాద్ జిల్లాలో వివిధ రకాల ఖనిజాలు ఉత్పత్తి అయ్యే క్వారీలు 1759 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. వీటిపై ప్రభుత్వానికి ఏటా రూ.18 కోట్లకుపైగా ఆదాయం వస్తోంది. జిల్లాలో 27 లక్షల ఘనపు మీటర్ల బ్లాక్ గ్రానైట్ నిల్వలు, 53 లక్షల ఘనపు మీటర్ల రాతిఖనిజం (స్టోన్ అండ్ మెటల్), 21.6 లక్షల టన్నుల బరైటీస్, 10 లక్షల టన్నుల డోలమైట్, 30 వేల ఘనపు మీటర్ల కలర్ గ్రానైట్, 22 వేల టన్నుల క్వార్ట్ నిల్వలు జిల్లా భూగర్భంలో ఉన్నాయని ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి. అపారంగా ఉన్న ఈ ఖనిజ నిల్వలను వెలికితీసి వాటికి అనుబంధ పరిశ్రమలను నెలకొల్పితే ఖనిజ పరిశ్రమ ఎంతో అభివృద్ధి చెందుతోంది. కానీ, 30 ఏళ్లుగా ఇక్కడ గ్రానైట్ క్వారీల్లో ఉత్పత్తి జరుగుతున్నప్పటికీ వాటికి అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేయలేదు. ఇక్కడ ఉత్పత్తి అయిన ముడి బ్లాక్ గ్రానైట్ రాయి కాకినాడ, కృష్ణపట్నం ఓడరేవుల ద్వారా చైనా, బంగ్లాదేశ్, దక్షిణ ఆఫ్రికా, ఇరాన్ తదితర దేశాలకు ఎగుమతి అవుతోంది. ఈ ముడి గ్రానైట్‌ను ప్రాసెసింగ్ చేసేందుకు అనుబంధ పరిశ్రమలైన పాలిషింగ్ యూనిట్లను నెలకొల్పితే బహుళ ప్రయోజనాలు ఉంటాయి. గ్రానైట్ రాయి ఉత్పత్తి వ్యయం తగ్గడమేకాకుండా నేరుగా పాలిషింగ్ అయిన రాయినే ఉత్పత్తి చేయడం ద్వారా అధిక ఆదాయం సమకూరుతుంది. ముడి గ్రానైట్‌ను పాలిషింగ్ చేయటంతోపాటు రకరకాల ఉత్పత్తులుగా మారిస్తే వాటికి మార్కెటింగ్ వ్యవస్థ సైతం అభివృద్ధి చెందుతుంది. వేలాది మందికి ఉపాధి కూడా లభిస్తుంది.

పరిశ్రమలు లేక ఆదాయానికి గండి

మహబూబాబాద్ జిల్లాలో గ్రానైట్ కటింగ్ అండ్ పాలిషింగ్ పరిశ్రమలు లేకపోవడంతో ఆదాయం పరంగా గండి పడుతోంది. ఖమ్మం జిల్లాలో పెద్ద సంఖ్యలో ఉన్న గ్రానైట్ కటింగ్ ఫ్యాక్టరీలు.. రాయిని మహబూబాబాద్ జిల్లా నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి. కాగా, పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయల్టీ చెల్లింపులో ఫ్యాక్టరీలకు రాయితీ ఇస్తోంది. 270 సెంటీమీటర్ల పొడవు 150 సెంటీమీటర్ల ఎత్తు ఉన్న గ్రానైట్ రాయికి ఘనపు మీటరుకు రూ.2300, అంతకంటే ఎక్కువ సైజు రాయికి ఘనపు మీటరుకు రూ.3000 చొప్పున ప్రభుత్వానికి గ్రానైట్ క్వారీ చెల్లించాల్సి ఉంటుంది. ఇదే రాయిని ఫ్యాక్టరీ కోత కోసం క్వారీ నుంచి దిగుమతి చేసుకుంటే ఘనపు మీటరుకు కేవలం రూ.వెయ్యి రాయల్టీ చెల్లించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. దీంతో మహబూబాబాద్ జిల్లాలోని క్వారీల్లో ఉత్పత్తయ్యే గ్రానైట్ రాయికి క్వారీల వారు అధిక రాయల్టీ చెల్లించకుండా, ఖమ్మం జిల్లాలోని కటింగ్ ఫ్యాక్టరీలే తక్కువ రాయల్టీ చెల్లించి దిగుమతి చేసుకుంటున్నాయి. ఫలితంగా జిల్లాకు రావాల్సిన ఆదాయం పావువంతుకు పడిపోతోంది.

ప్రతిపాదనల్లోనే గ్రానైట్ ఇండస్ట్రియల్ పార్కు

నెల్లికుదురు-తొర్రూరు మండలాల మధ్య, మహబూబాబాద్-మరిపెడ మండలాల మధ్య గ్రానైట్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పేందుకు జిల్లా ఆవిర్భావ సమయంలో అప్పటి కలెక్టర్ ప్రీతీమీనా ప్రతిపాదనలు సిద్ధం చేసి గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి పంపించారు. అయితే, వాటిపై అడుగు ముందుకు పడలేదు. గ్రానైట్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తే రాష్ట్రంలోనే బ్లాక్ గ్రానైట్ పరిశ్రమలో జిల్లా నెంబర్ వన్ స్థానంలో నిలుస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు చర్యలు చేపట్టాలని జిల్లాకు చెందిన పలువురు కోరుతున్నారు.

శరణ్ పాత్ర ఏంటి?

(మొదటిపేజీ తరువాయి)

రాబట్టాల్సిన సమాచారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ముఖ్యంగా.. ఈ వ్యవహారంలో కవిత మేనల్లుడు మేక శరణ్ పాత్ర ఏమిటి? డబ్బులు ఎలా చేతులు మారాయి? ఎవరెవరి మధ్య లావాదేవీలు జరిగాయి? తదితర అంశాలపై ఈడీ ఆమెను ప్రశ్నించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అలాగే.. కవిత, ఆమె భర్త అనిల్, వ్యక్తిగత సహాయకుల నుంచి స్వాధీనం చేసుకున్న మూడు ఫోన్లలోని డేటాను కవిత ముందుంచి, ఆ సమాచారంపైన కూడా ప్రశ్నించారని.. మద్యం వ్యాపారి సమీర్ మహేంద్ర పాత్రపై ఆరా తీశారని తెలుస్తోంది. కాగా.. ఇప్పటికే రెండుసార్లు కవితను కస్టడీకి తీసుకుని విచారించిన ఈడీ అధికారులు మంగళవారం మధ్యాహ్నం 11 గంటలకు మరోసారి ఆమెను రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరచనున్నారు. కవిత నుంచి మరింత సమాచారం రాబట్టాల్సి ఉన్నందున ఆమెను మరో ఐదు రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని వారు కోరనున్నట్లు తెలిసింది.

బెయిల్ పిటిషన్ పైనా..

ఢిల్లీ మద్యం పాలసీ కేసు రాజకీయ కక్షసాధింపు చర్యలో భాగమేనని పేర్కొంటూ ఈ నెల 23న రౌస్ అవెన్యూ కోర్టులో కవిత బెయిల్ పిటిషన్ వేయగా.. 26న విచారిస్తామని న్యాయమూర్తి తెలిపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో.. కవితను ఈడీ కోరినట్టు కస్టడీకి ఇస్తారా? జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపుతారా? లేక బెయిల్‌పై విడుదల చేస్తారా? అనేది మంగళవారం తేలనుంది. కాగా, సోమవారం సాయంత్రం 7 గంటలకు కవితను ఆమె భర్త అనిల్‌తోపాటు న్యాయవాది మోహిత్ రావు కలిశారు. మంగళవారం కోర్టు ముందుకు రానున్న బెయిల్ పిటిషన్‌పై వారు చర్చించినట్టు తెలిసింది. ఈడీ అధికారులు మళ్లీ కస్టడీ కోరితే ఏం చేయాలి? బెయిల్ నిరాకరిస్తే భవిష్యత్తు కార్యాచరణ ఏమిటి? అనే అంశాలపై వారు చర్చించినట్టు సమాచారం.

నా ఇంటిని ఎర్రబెల్లి లాక్కొన్నారు

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. "2023 ఆగస్టు 21న నేను బీజేపీ ఆఫీసుకు వెళ్తుండగా.. మఫ్టీలో వచ్చిన పోలీసులు నన్ను అడ్డుకున్నారు. ప్రైవేటు వాహనాల్లో నన్ను హైదరాబాద్ సీసీఎస్‌కు తరలించారు. నేను పలువురి వద్ద అక్రమంగా డిపాజిట్లు తీసుకున్నానంటూ సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు నన్ను బెదిరించారు. ఆ తర్వాత అప్పటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు సూచన మేరకు నన్ను తీవ్రంగా కొట్టారు(థర్డ్ డిగ్రీ). అప్పటికప్పుడు నా ఇంటి ఒప్పంద పత్రాలను సిద్ధం చేసి.. సంతకాలు తీసుకొని మంత్రి ఎర్రబెల్లి బంధువు విజయ్ పేరిట రాయించారు. రెండ్రోజులు సీసీఎస్‌లోనే అక్రమంగా నిర్బంధించారు. బూటుకాలితో తన్నారు. చెప్పులతో కొట్టారు. రాధాకిషన్‌రావు, ఉమామహేశ్వర్‌రావు వేధింపులు తాళలేక.. తన ఇంటిని విజయ్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించడానికి అంగీకరించాను" అని శరణ్‌చౌదరి సీఎం, డీజీపీలకు పంపిన ఈ-మెయిల్‌లో వివరించారు. ఆ తర్వాత కూడా తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి, రూ.50 లక్షలు డిమాండ్ చేశారని చెప్పారు. తన స్నేహితుడి ద్వారా రూ.50 లక్షలు తెప్పించి, రాధాకిషన్‌రావు, ఉమామహేశ్వర్‌రావుకు ఇచ్చాకే తనను వదిలిపెట్టారని శరణ్ వాపోయారు. "ఈ వ్యవహారంపై హైకోర్టును ఆశ్రయించాను. రిట్ పిటిషన్ దాఖలు చేశాను. అయితే.. ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు నా వద్దకు పోలీసులను పంపి, బెదిరించారు. పిటిషన్ ఉపసంహరించుకునేలా చేశారు" అని ఆరోపించారు. ఎర్రబెల్లి, రాధాకిషన్‌రావు, ఉమామహేశ్వర్‌రావుపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా.. ఈ ఫిర్యాదుపై ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. వెంటనే దర్యాప్తు చేయాలంటూ డీజీపీకి ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. దాంతో హైదరాబాద్ పోలీసులు దర్యాప్తునకు రంగంలోకి దిగారని తెలిసింది.

5 నెలలుగా జీతాల్లేవ్

20 ఏళ్లుగా ఔట్ సోర్సింగ్ పద్ధతిలోనే విధులు

- చాలీ చాలని జీతాలతో 104 ఉద్యోగుల అవస్థ
- కొత్త సర్కారు కనికరిస్తుందని గంపెడాశలు
- 3 నెలలైనా స్పందించపోవడంతో తీవ్ర నిరాశ



జగిత్యాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అసలే ఔట్‌సోర్సింగ్ కొలువు. 20 ఏళ్లుగా అందులోనే మగ్గిపోతూ చాలీ చాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. గత 5 నెలలుగా ఆ కాస్త వేతనం కూడా రావడం లేదు. కొత్తగా ఏర్పడిన సర్కారు అయినా తమను పట్టించుకుంటుందేమోనని ఆ ఉద్యోగులు గంపెడాశలతో ఎదురుచూశారు. ప్రభుత్వం కొలువుదీరి మూడు నెలలైనా కనీస స్పందన లేకపోవడంతో 104 సంచార వైద్యశాలల ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి వద్దకే వెళ్లి ఆరోగ్య సేవలు అందించిన 104 సంచార వైద్య శాలలను పలు కారణాల వల్ల 2021 నుంచి సర్కారు బంద్ చేసింది. ఒక్కో వాహనంలో డ్రైవర్, డాటా ఎంట్రీ ఆపరేటర్, ఫార్మసిస్టు, సెక్యూరిటీ గార్డు పనిచేసే వారు. వీరందరినీ పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, డీఎంహెచ్‌వో కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ శాఖల్లోకి పంపించారు. 20 ఏళ్లయినా ఆ ఉద్యోగులను ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ పరిధిలోనే కొనసాగిస్తూ పనిచేయించుకుంటున్నారు. గతంలో 104 సంచార వైద్యశాలల్లో పనిచేసి, ప్రస్తుతం వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది రాష్ట్రంలో సుమారు 1,350 మంది ఉన్నారు. వీరందరికీ 2023 సెప్టెంబరు నుంచి వేతనాలు అందాల్సి ఉంది. ఈ విషయంలో అధికారులను అడిగితే నిధులు లేవని చెబుతున్నారని ఉద్యోగులు అంటున్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఇటీవల హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించామని జగిత్యాల జిల్లా 104 ఎంప్లాయీస్ నాయకులు తెలిపారు. ప్రస్తుతం తమకు ఈ పని తప్ప ఇతర పనులు చేసే అవకాశం లేదని చెబుతున్నారు. వివాహాలు కాకముందు విధుల్లోకి వచ్చామని, ఇప్పుడు తమ పిల్లలు పదో తరగతి, ఇంటర్ చదువుతున్నారని.. ఈ వయసులో అనారోగ్య సమస్యలతో అవస్థలు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. 20 ఏళ్లుగా సేవలందిస్తున్న తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని వేడుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించకపోతే నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.



వేతనాలు ఎప్పటికప్పుడు చెల్లించాలి

కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి వెంటనే 5 నెలల వేతనాలు చెల్లించాలి. గత సర్కారు మాదిరిగా కాకుండా ఇకనుంచైనా ఎప్పటికప్పుడు జీతాలు ఇవ్వాలి. చాలీ చాలని వేతనాలతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

- నక్క శేఖర్, 104 వాహన ఉద్యోగుల సంఘం కరీంనగర్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు



కుటుంబ పోషణ కష్టమవుతోంది

మాకు 5 నెలలుగా వేతనాలు అందడం లేదు. దీంతో కుటుంబ పోషణ కష్టమవుతోంది. 20 ఏళ్లుగా పనిచేస్తున్నప్పటికీ ఉద్యోగాలు రెగ్యులర్ కావడం లేదు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి మా కొలువులు పర్మినెంట్ చేయడంతో పాటు, సకాలంలో జీతాలు ఇవ్వాలి.

- కొప్పుల రాజు, డ్రైవర్, జగిత్యాల

బడ్జెట్ విడుదల కావాల్సి ఉంది



జగిత్యాల జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న 104 ఉద్యోగుల వేతనాల చెల్లింపునకు అవసరమైన బడ్జెట్ విడుదల కావాల్సి ఉంది. జీతాల చెల్లింపునకు అవసరమైన వివరాలను ఇప్పటికే ఉన్నతాధికారులకు అందించాం. బడ్జెట్ విడుదల కాగానే జీతాలు ఇస్తాం.

- పుప్పాల శ్రీధర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, జగిత్యాల

నర్సింగ్ విద్యార్థులకు ఊరట

» అన్‌ఫిల్డ్ సీట్లలో అడ్మిషన్లపై ప్రభుత్వ ఆదేశాలు పాటిస్తాం

» నర్సింగ్ కళాశాలలకు కాళోజీ వర్సిటీ సమాచారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరంగల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఎస్సీ నర్సింగ్ కోర్సులో మేనేజ్‌మెంట్ కోటాలో అడ్మిషన్లకు అడ్డంకిగా మారిన నీట్ ర్యాంకు అంశంపై వరంగల్‌లోని కాళోజీ హెల్త్‌యూనివర్సిటీ అధికారులు వెనక్కు తగ్గారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి' మెయిన్‌లో ప్రచురితమైన 'నర్సింగ్ విద్యార్థులకు నీట్ గండం' అనే కథనానికి అధికారులు స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరిలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేస్తామని, మిగిలిన (అన్‌ఫిల్డ్) సీట్లలో అడ్మిషన్లను కొనసాగిస్తామని నర్సింగ్ కళాశాలల యాజమాన్యాలకు సమాచారమిచ్చారు. ఐదారు రోజుల్లో నర్సింగ్ కోర్సులో అడ్మిషన్లకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను పరిశీలించి అమలు చేస్తామని హామీ ఇచ్చినట్లుగా ప్రైవేటు నర్సింగ్ కళాశాలల యాజమాన్యాల సంఘం ఓ ప్రకటనలో తెలిపింది. కాగా, హెల్త్‌వర్సిటీ అధికారుల నిర్ణయంపై అన్‌ఫిల్డ్ సీట్లలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల తర్వాత వైద్యశాఖ హెచ్‌వోడీ పోస్టుల భర్తీ

» 'ఆంధ్రజ్యోతి' కథనంపై సర్కారు స్పందన

హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే వైద్య ఆరోగ్యశాఖలోని విభాగాధిపతుల పోస్టులను భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున ఆ ప్రక్రియ వీలుకాదని తెలిపింది. "వైద్యానికి ఇంచార్జులు!" శీర్షికన ఆదివారం "ఆంధ్రజ్యోతి"లో ప్రచురితమైన కథనంపై సర్కారు స్పందించింది. హెచ్‌వోడీ పోస్టుల నియామకాలపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ వివరణ ఇచ్చింది. ఈ ఏడాది జనవరి 29న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైద్యశాఖపై సమీక్ష నిర్వహించారని, అందులోనే ప్రజారోగ్య సంచాలకులు, టీవీవీపీ కమిషనర్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేటివ్ హెచ్‌వోడీ పోస్టులను క్రియేట్ చేయని విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువచ్చామని తెలిపింది. అదే రోజు ఈ పోస్టుల క్రియేషన్‌పై సీఎం ఆదేశాలు జారీ చేశారని వెల్లడించింది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతో ఫిబ్రవరిలోనే ఆ మూడు పోస్టుల క్రియేషన్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి, మంత్రివర్గ ఆమోదం కోసం పంపినట్లు పేర్కొంది. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేదని వెల్లడించింది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున, అది ముగిసిన వెంటనే ఆ ప్రక్రియను మరింత వేగవంతం చేయనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది. అలాగే ఇప్పటికే డీఎంఈ పోస్టును క్రియేట్ చేశామని, రెగ్యులర్ వైద్యవిద్య సంచాలకులను డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ ద్వారా వీలైనంత త్వరగా ఎన్నికలు ముగిసిన తర్వాత భర్తీ చేపడతామని వెల్లడించింది. సీనియారిటీ, పెండింగ్ డిసిప్లినరీ కేసులను దృష్టిలో ఉంచుకొని ఆ పోస్టును భర్తీ చేస్తామని ప్రభుత్వం పేర్కొంది.

ఇంటర్ ఒకేషనల్‌తో ఫార్మసీ కోర్సులు చేసిన వారికి ఊరట

» 2020 ఫిబ్రవరి ముందు కోర్సులు పూర్తిచేసిన వారిని ఓటీఆర్ కింద ఫార్మసిస్టులుగా రిజిస్టర్ చేయాలి: హైకోర్టు

హైదరాబాద్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఇంటర్‌లో ఒకేషనల్ కోర్సు చదివి ఫార్మసీ కోర్సులు పూర్తి చేసిన వారికి తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. 2020 ఫిబ్రవరి కంటే ముందు ఆ కోర్సులు పూర్తి చేసిన వారిని ఫార్మసిస్టులుగా రిజిస్టర్ చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇంటర్‌లో ఒకేషనల్ కోర్సులు చదివిన వారు డీ- ఫార్మసీ, బీ- ఫార్మసీ కోర్సులకు అనర్హులని పేర్కొంటూ రెండు తెలుగు రాష్ట్రాల ఫార్మసీ కౌన్సిళ్లకు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(పీసీఐ) 2020 ఫిబ్రవరిలో లేఖ రాసింది. ఇంటర్‌లో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్(ఎంఎల్‌టీ) ఒకేషనల్ కోర్సు చేసి, ఇంటర్ బోర్డు నిర్వహించే బ్రిడ్జి కోర్సు పూర్తి చేసి ఫార్మసీ కోర్సు చేసిన తమను ఫార్మసిస్టులుగా రిజిస్టర్ చేయడం లేదని హైకోర్టులో దాదాపు 18 పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ ఇంటర్‌లో ఒకేషనల్ కోర్సు, బ్రిడ్జి కోర్సు చేసిన తమ పిటిషనర్లకు ఫార్మసీ కోర్సులో ప్రవేశాలు కల్పించారని, ఫార్మసీ యాక్ట్- 1948 ప్రకారం వారికి ఫార్మసిస్టుగా రిజిస్టర్ అయ్యే హక్కు ఉందని తెలిపారు. కేంద్ర తరఫు న్యాయవాది ఎడ్యుకేషన్ రెగ్యులేషన్- 1991లోని రెగ్యులేషన్ 5(5) ప్రకారం ఇంటర్ రెగ్యులర్ కోర్సులు చదివిన వారు మాత్రమే అందుకు అర్హులని పేర్కొన్నారు. ఇరువైపు వాదనలు విన్న ధర్మాసనం ఫార్మసీ కోర్సులకు ఇంటర్ ఒకేషనల్ కోర్సులు కనీస విద్యార్హత కిందకు రావని స్పష్టం చేసింది. అలాంటి వారికి ప్రవేశాలు కల్పించరాదని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఫార్మసీ కౌన్సిళ్లకు పీసీఐ స్పష్టం చేసిందని తెలిపింది. అయితే పీసీఐ లేఖకు ముందు ఫార్మసీ కోర్సులు పూర్తిచేసిన వారిని వన్ టైం రిలాక్సేషన్(ఓటీఆర్) కింద ఫార్మసిస్టులుగా రిజిస్టర్ చేయాలని తుదితీర్పు ఇచ్చింది.

50 మంది ఉద్యోగులుంటే క్రెచ్‌లు ఉండాల్సిందే

» ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలకు ఏఐసీటీఈ ఆదేశం

హైదరాబాద్ సిటీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): 50 మంది లేదా అంతకు మించి ఉద్యోగులుంటే వారి పిల్లల కోసం సంరక్షణ కేంద్రాన్ని(క్రెచ్) తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) స్పష్టం చేసింది. జాతీయ ప్రసూతి ప్రయోజనాల చట్టం మార్గదర్శకాలమేరకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్రంలోని ఇంజనీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ కళాశాలల యాజమాన్యాలకు ఏఐసీటీఈ సూచించింది. క్రెచ్‌ల ఏర్పాటుకు మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ రూపొందించిన సూచనలను విధిగా పాటించాలని ఇటీవల ఆయా కళాశాలల యాజమాన్యాలకు రాసిన లేఖలో పేర్కొంది. అలాగే, అన్ని అఫిలియేటెడ్ కళాశాలల్లో జాతీయ ప్రసూతి ప్రయోజనాల చట్టం అమలయ్యేలా చర్యలు చేపట్టాలని జేఎన్‌టీయూ అధికారులకు లేఖ రాసింది. అఫిలియేషన్ ప్రక్రియలో భాగంగా 50 మంది లేదా అంతకుమించి ఉద్యోగులున్న ఇంజనీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన క్రెచ్‌లను తప్పనిసరిగా తనిఖీ చేయాలని ఏఐసీటీఈ రెగ్యులేషన్స్ బ్యూరో సలహాదారు ఎస్‌హెచ్ సిద్ధ లింగస్వామి ఇటీవల రాసిన లేఖలో స్పష్టం చేశారు.



శ్రీవారి పున్నమి గరుడసేవలో జస్టిస్ ఎన్వీ రమణ

తిరుమల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): తిరుమలలో సోమవారం రాత్రి శ్రీవారికి పున్నమి గరుడసేవ వైభవంగా జరిగింది. రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య ఆలయ నాలుగు మాడవీధుల్లో గరుడసేవను నిర్వహించారు. సర్వాలంకార భూషితుడైన మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడుడిపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ కుటుంబ సమేతంగా గరుడసేవలో పాల్గొని ఉత్సవమూర్తిని దర్శించుకున్నారు.

శ్రీవారి సేవలో జస్టిస్ రోహిణి



ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రోహిణి సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు.



హైదరాబాద్‌లోని నాంపల్లిలో హోలీ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు



కలర్‌ఫుల్ ఫ్యామి(హో)లీ

విషాద.. హోలీ!

పండుగ పూట నీట మునిగి పలుచోట్ల 12 మంది మృతి

» మరో ఇద్దరి గల్లంతు..

» రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి దుర్మరణం.. ముగ్గురికి గాయాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



హనుమకొండ జిల్లా బత్తివానిపల్లి వద్ద బోల్తా కొట్టిన ఆటో..

హోలీ వేడుకలు.. కొన్ని కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపాయి. పండుగ సంబరాల్లో సంతోషంగా రంగులు జల్లుకున్న తర్వాత స్నానాల కోసం వాగులు, నదుల్లోకి దిగిన పలువురు ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ చోట్ల 12 మంది మృతి చెందారు. మరో ఇద్దరు గల్లంతయ్యారు. అలాగే రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మరణించగా.. వాటర్ ట్యాంక్ కూలి ఓ చిన్నారి దుర్మరణం చెందింది. ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలోని తాటిపల్లి వద్ద వార్దా నదిలో మునిగి నలుగురు యువకులు మృతి చెందారు. కౌటాల మండలం నదీమాబాద్‌కు చెందిన కమలాకర్ (23), ఉప్పుల సంతోష్ (22), ఎల్ములే ప్రవీణ్ (23), ఆలం సాయి(20), మరో ఇద్దరు స్నేహితులతో కలసి హోలీ ఆడుకున్న తర్వాత తాటిపల్లి సమీపంలో వార్దా నదిలో స్నానాలకు దిగారు. లోతు ఎక్కువగా ఉండటంతో ఒకరి తర్వాత ఒకరు.. నీటిలో మునిగి నలుగురు గల్లంతయ్యారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నందుపల్లిలో చెరువులో ఈత కొట్టేందుకు వెళ్లిన సంగం జగన్ (27), కొమ్ము సురేందర్ (29) నీట మునిగి గల్లంతయ్యారు. వారిని వెతికి వెలికితీసేలోపే ప్రాణాలు కోల్పోయారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలో నీట మునిగి ఓ ఇంటర్ విద్యార్థి మరణించాడు. జన్నారం మండలం ధర్మారం గ్రామానికి చెందిన కార్తీక్ (18) దండేపల్లి మండలం పాతమామిడిపల్లిలోని అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. అక్కడి స్నేహితులతో హోలీ ఆడిన కార్తీక్.. అనంతరం తానిమడుగులోని కడెం డిస్ట్రిబ్యూటరీ కాలువలోకి దిగడంతో మునిగిపోయాడు. అతడి స్నేహితులు బయటికి తీసుకొచ్చి ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదిలాబాద్‌లోని జైజవాన్‌నగర్‌కు చెందిన గుమ్ముల సాత్విక్ (14) హోలీ వేడుకల అనంతరం భీంసరి వాగుకు వెళ్లాడు. స్నానం చేస్తుండగా వాగులో మునిగి మరణించాడు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం మామిడిమాడ గ్రామానికి చెందిన గూడెం శ్రీకాంత్ (23) నేరేడు చెరువులోని గుండుబావిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన నర్ర నగేశ్ (21) బావిలో పడి మృత్యువాత పడ్డాడు. మహబూబాబాద్ జిల్లా రామన్నగూడెనికి చెందిన వినోద్‌రెడ్డి కుమారుడు రిత్విక్ రెడ్డి (10) ఊరి చెరువులో దిగాడు. ఈత రాకపోవడంతో నీటి మునిగి మృతిచెందాడు. హనుమకొండ జిల్లా ఊరుగొండకు చెందిన తక్కెళ్ల కేదారీశ్వర్ (42), ముప్పు క్రాంతికుమార్ (35) కేయూ పీఎస్ పరిధిలోని పలువేల్పుల వద్ద కెనాల్‌లో ఈతకు వెళ్లి గల్లంతయ్యారు. వీరిలో కేదారీశ్వర్ మృతదేహం లభ్యమైంది. మరో ఘటనలో కుమార్‌పల్లికి రాపర్తి బ్రహ్మచారి(40) సైతం గుండ్ల సింగారం వద్ద ఈతకు వెళ్లి గల్లంతయ్యాడు.

రోడ్డు ప్రమాదాల్లో..

పండుగ పూట వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో బైక్ అదుపు తప్పడంతో లక్ష్మీదేవిపేటకు చెందిన ఎంబటి సుశాంత్(22), తిమ్మాపూర్‌కు చెందిన ఉమ్మడి ఉమేశ్ (22) మరణించారు. వీరు హనుమకొండలోని ఓ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. హోలీ వేడుకల అనంతరం రామప్ప చెరువులో స్నానం చేసి వెళ్తుండగా ఘటన చోటు చేసుకుంది. కరీంనగర్‌లోని మానేరు బైపాస్‌రోడ్‌లో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పానుగంటి కృష్ణవంశీ (23), శివ (23) మృతి చెందారు. రాత్రి శ్రీనగర్ కాలనీ నుంచి అల్గునూర్‌కు బైక్‌పై వెళుతుండగా ఐటీ టవర్ వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. హనుమకొండ జిల్లా బత్తివానిపల్లి శివారులో ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందారు. నడికూడ మండలం చర్లపల్లికి చెందిన నలుగురు యువకులు గంగారపు వినయ్ (ఆటో డ్రైవర్), బొల్లం ప్రశాంత్, శనిగరపు సాయి, శనిగరపు వంశీ (23) హోలీ సంబరాల తర్వాత ఓ చోట మద్యం సేవించారు.. అనంతరం తిరిగి స్వగ్రామం వెళ్తుండగా వినయ్ నిర్లక్ష్యంగా ఆటో నడపడంతో బోల్తా కొట్టింది. దీంతో వంశీ అక్కడికక్కడే మృతి చెందాడు.

వాటర్‌ట్యాంక్ కూలడంతో..

నారాయణపేట జిల్లా కేంద్రంలోని గోపాల్‌పేటలో మునిసిపల్ వాటర్ ట్యాంక్ కూలి ఓ బాలిక మృతి చెందింది. ఆదివారం అర్ధరాత్రి వాటర్ ట్యాంక్ వద్దే కాముడిదహనం చేయడంతో ట్యాంకు వేడెక్కింది. సోమవారం ఉదయం బోరు నీటిని అందులో నింపడంతో ట్యాంకు కూలి అక్కడే ఉన్న లక్ష్మీ ప్రణతి (13), హరిప్రియ, నిహారికలపై పడింది. దీంతో లక్ష్మీ ప్రణతి తీవ్రగాయాలై రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందింది. హరిప్రియ, నిహారికలకు గాయాలయ్యాయి.

హున్సలో పిడిగుద్దులాట



బోధన్ రూరల్, కూసుమంచి, మార్చి 25 : నిజామాబాద్ జిల్లా సాలూర మండలంలోని హున్స గ్రామంలో సోమవారం పిడిగుద్దులాట జరిగింది. ఈ ఆట సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏటా హోలీ పండగ రోజు పిడిగుద్దులాట నిర్వహించడం హున్సలో ఆనవాయితీ. సోమవారం ఉదయం హోలీ పండగ, సాయంత్రం కుస్తీ పోటీలను నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన తాడును రెండు వైపులా పట్టుకుని గ్రామస్థులు పిడిగుద్దులాట ఆడారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని లోక్యా తండాలో రెండో రోజు సోమవారం హోలీ వేడుకలు సంప్రదాయబద్ధంగా కొనసాగాయి. తెల్లవారుజామున 4 గంటలకు కాముని దహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి కర్రలు తీసుకువచ్చి శివారులో పేర్చి కామదహనం నిర్వహించారు. యువకులు, మహిళలు, వృద్ధులు, చిన్నారులు మంటల చుట్టూ తిరిగి పాటలతో కేరింతలు కొట్టారు. హోలీని పురస్కరించుకుని డూండ్ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గత హోలీ తెల్లవారి నుంచి ఈ హోలీ వరకు ఏడాదిలో తండాలో మగబిడ్డ పుట్టిన ఇళ్లలో ఈ కార్యక్రమం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. డూండ్ వేడుకలు నిర్వహించే బిడ్డలకు ఎర్రని గుడ్డ కట్టారు. గిరిజన సంప్రదాయ పాటలు పాడి నృత్యం చేశారు. అనంతరం బిడ్డలకు నామకరణం చేశారు.



బాలికపై అత్యాచారం కేసులో ముగ్గురి అరెస్టు

» నిందితుల్లో ఒకరు మైనర్.. 140 గ్రాముల గంజాయి, 2 మొబైల్ ఫోన్లు సీజ్

» పోక్సో, ఎన్‌డీపీఎస్ యాక్ట్‌ల కింద కేసు నమోదు

జగిత్యాల టౌన్, మార్చి 25: జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగిన బాలికపై అత్యాచారం ఘటనలో సోమవారం ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల్లో ఒకరు మైనర్ ఉన్నాడు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా మల్యాల మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన ఆరెల్లి ప్రేమ్ కుమార్ అనే యువకుడు 2018-19లో జగిత్యాలకు వచ్చి వాటర్ ప్యూరిఫైయర్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. అప్పట్లో పదో తరగతిని మధ్యలోనే మానేసి ఇంటి వద్దే ఉంటున్న ఓ బాలికతో అతడికి పరిచయం ఏర్పడింది. ప్రేమ పేరుతో ఆ బాలిక వెంటబడ్డ ప్రేమ్, ఆ తర్వాత ఆమెకు గంజాయి అలవాటు చేశాడు. ఆమె ఆ మత్తులో ఉన్నప్పుడే పలుమార్లు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. తర్వాత 2022 సంవత్సరంలో మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన సురపాక వెంకటేశ్‌తో బాలికకు పరిచయం ఏర్పడింది. వెంకటేశ్ సైతం బాలికను ప్రేమిస్తున్నానంటూ వేధించడంతో పాటు అత్యాచారానికి పాల్పడి కొన్ని రోజులకు వదిలేశాడు. అదే సమయంలో జగిత్యాలకు చెందిన గంజాయికి బానిసైన ఓ బాలుడు సదరు బాలికతో సన్నిహితంగా ఉంటూ వచ్చాడు. ప్రేమపేరుతో అత్యాచారానికి పాల్పడ్డాడు.. బాలిక ప్రవర్తనలో మార్పు రావడంతో కుటుంబసభ్యులు ఆమెను స్థానిక వైద్యుడికి చూయించారు. అయినా బాలిక ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో స్త్రీ, శిశు సంక్షేమ అధికారులు, శిశు సంరక్షణ అధికారుల దగ్గరకు తీసుకెళ్లారు. ఆమె గంజాయికి అలవాటు పడినట్లు, పలు సందర్భాల్లో అత్యాచారానికి గురైనట్లు వారు గుర్తించారు. వారే బాధితురాలిని కరీంనగర్ లోని స్వధార్ కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటన నాలుగు రోజుల క్రితం వెలుగులోకి వచ్చి కలకలం రేపింది. దీనిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తు చేశారు. దర్యాప్తులో పలు అంశాలను గుర్తించారు. ప్రేమపేరుతో బాలికను మత్తులోకి దించి అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద 140 గ్రాముల గంజాయితో పాటు రెండు సెల్ ఫోన్లు సీజ్ చేశారు. నిందితులపై పోక్సో, ఎన్‌డీపీఎస్ యాక్ట్‌ల కింద కేసు నమోదు చేశారు.

మొబైల్ యాప్‌లో రీచార్జ్ చేస్తే.. 15 రోజుల్లో అధిక వడ్డీతో చెల్లింపు!

» గ్రామీణ ప్రజల్ని నమ్మించి సైబర్ నేరగాళ్ల మోసం

» 'ఐపీజీ' యాప్ పేరుతో రూ.5 కోట్లకు టోకరా

» మోసంపై గత ఏడాదే పోలీసు కేసు నమోదు

» బాధితుల ఘర్షణతో తాజాగా వెలుగులోకి



చౌటుప్పల్ టౌన్, మార్చి 25: ఐపీజీ అనే మొబైల్ యాప్‌లో కనీసం రూ.200తో రీచార్జ్ చేస్తే.. 15 నుంచి 20 రోజుల్లో అధిక వడ్డీతో అసలుతో సహా చెల్లిస్తామన్నారు. చెప్పినట్లుగానే నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. మూడు నెలలపాటు నమ్మకంగా చెల్లించారు. దీనిని నమ్మి.. గ్రామీణ ప్రాంత ప్రజలు రోజురోజుకూ రీచార్జ్ పెంచుకుంటూ పోయారు. రూ.వందల నుంచి రూ.లక్షలకు రీచార్జ్ చేరగానే మూడు రోజులపాటు భారీ వడ్డీని ప్రకటించి రూ.5 కోట్ల దాకా వసూలు చేసి సుమారు 1000 మందిని మోసం చేశారు సైబర్ నేరగాళ్లు. ఇంటర్ పబ్లిక్ గ్రూప్(ఐపీజీ) యాప్ పేరిట గత ఏడాది ఏప్రిల్‌లో ఈ సైబర్ మోసం చోటుచేసుకుంది. అప్పట్లోనే దీనిపై పోలీసు కేసు నమోదైనా.. తాజాగా బాధితులు ఘర్షణకు దిగటంతో విషయం వెలుగుచూసింది. ఐపీజీ యాప్‌లో రీచార్జ్ చేసిన వారికి రోజువారీగా అసలుతో పాటు వడ్డీ కూడా చెల్లిస్తామంటూ సైబర్ మోసగాళ్లు 2023 జనవరిలో యూట్యూబ్ ద్వారా విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ యాప్‌కు డబ్బును రీచార్జ్ చేసేందుకు ఒక లింక్‌ను ఏర్పాటుచేశారు. ఈ లింక్ ద్వారా రీచార్జ్ చేసిన వారికి 15 నుంచి 20 రోజుల్లో వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామని నమ్మించారు. యాప్‌లో మొదటగా రూ.200 నుంచి రీచార్జ్ చేసే వెసులుబాటును కల్పించారు. చాలా మంది యాప్‌ను ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుని రీచార్జ్ చేశారు. తక్కువ మొత్తాలను రీచార్జ్ చేసిన సందర్భంలో వెంట వెంటనే బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేవి. డబ్బులు ప్రతిరోజూ జమ అవుతుండడంతో అందరిలోనూ నమ్మకం పెరిగింది. యాప్‌కు రీచార్జ్ చేసే వ్యక్తుల సంఖ్య వందలకు చేరింది. అత్యాశకు పోయిన కొందరు రీచార్జ్ చేసే డబ్బును కూడా లక్షలకు పెంచేశారు. రీచార్జ్ వ్యవహారం రూ.2లక్షల వరకు చేరుకుంది.

మూడు రోజుల్లో పెద్దమొత్తం వసూలు చేసి..

అందరూ తమను నమ్మినట్లు తెలుసుకున్న సైబర్ నేరగాళ్లు ఏప్రిల్ 1, 2, 3వ తేదీల్లో బంపర్ ఆఫర్ అంటూ అధిక వడ్డీ ఆశ చూపించారు. వేర్వేరు మొత్తాలకు రూ.2.5 నుంచి రూ.4.5 వరకు వడ్డీ ఇస్తామని ప్రకటించడంతోపాటు 3 రోజులే అవకాశమని ప్రకటించారు. దీంతో ఎక్కువ మొత్తాల్లో గ్రామీణ ప్రజలు రీచార్జ్ చేశారు. స్నేహితులు, బంధువుల వద్ద అప్పులు తెచ్చి రూ.వేలు, రూ.లక్షల్లో ఐపీజీ యాప్‌కు రీచార్జ్ చేశారు. ఎక్కువగా ఈ మూడు రోజుల్లో రూ.50వేల చొప్పున వందలాది మంది రీచార్జ్ చేశారు. అమాయకుల నుంచి రూ.కోట్లలో డబ్బులను రాబట్టిన సైబర్ నేరగాళ్లు తమ యాప్‌ను ఏప్రిల్ 4వ తేదీన క్లోజ్ చేశారు. ఆ రోజు నుంచి బ్యాంక్ ఖాతాలకు ఐపీజీ యాప్ ద్వారా డబ్బులు జమ కాకపోవడం, యాప్ రీచార్జ్ పనిచేయకపోవడంతో మోసపోయామని బాధితులు గ్రహించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్, నల్లగొండ జిల్లా మునుగోడు మండలం పలివెల గ్రామాల్లో వందల సంఖ్యలో అమాయకులు ఈ మోసానికి గురయ్యారు. ఉమ్మడి జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ 1000 మంది ఐపీజీ బాధితులు సుమారు రూ.5 కోట్లకు పైగా మోసపోయినట్లు సమాచారం. చౌటుప్పల్‌కు చెందిన ఎండీ గౌస్ అనే వ్యక్తి ఏకంగా రూ.రూ.7.81 లక్షలు పోగొట్టుకున్నాడు. నారగోని శంకరయ్య రూ.1.50 లక్షలు మోసపోయాడు. ఐపీజీ యాప్‌తో మోసపోయిన ఉమ్మడి జిల్లాకు చెందిన సుమారు 150 మంది బాధితులు 2023 ఏప్రిల్ 10వ తేదీన ఎల్‌బీనగర్‌లోని రాచకొండ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

యాప్ బాధితుల మధ్య ఘర్షణ

యాప్ ద్వారా అధికంగా వడ్డీలు వస్తున్న సమయంలో మునుగోడు మండలం చీకటిమామిడి గ్రామానికి చెందిన మేకల మంగయ్య.. మరో బాధితుడైన చౌటుప్పల్ పట్టణానికి చెందిన నారగోని శంకరయ్యకు యాప్‌లో రీచార్జ్ చేయడానికి రూ.16 వేలను పంపించాడు. అయితే రీచార్జ్ చేసిన కొద్దిరోజులకే యాప్‌ను మూసివేయడంతో తాను పంపించిన రూ.16 వేలను తిరిగి ఇవ్వాలంటూ శంకరయ్యపై మంగయ్య ఒత్తిడి తెస్తున్నాడు. కొద్దిరోజులుగా వీరిద్దరి మధ్య ఈ వివాదం నడుస్తుండగా.. ఈ నెల 16వ తేదీన శంకరయ్యను చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌కు రప్పించిన మంగయ్య కొంతమందితో కలిసి అతనిపై దాడి చేశాడు. ఈ దాడిలో శంకరయ్య స్పృహ కోల్పోగానే అతడి ద్విచక్ర వాహనాన్ని తీసుకుని వెళ్లిపోయాడు. ఈ ఘటనపై ఈ నెల 21వ తేదీన శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

మావోయిస్టుల ఆయుధ తయారీ కేంద్రం సీజ్

» మన్యం జిల్లా వద్ద దట్టమైన అడవిలో గుర్తింపు

» హేండ్ బౌలర్, కత్తులు తదితరాలు స్వాధీనం



ఏవోబీలో గుర్తించిన మావోయిస్టుల ఆయుధ తయారీ కేంద్రం

సాలూరు రూరల్, మార్చి 25: సార్వత్రిక ఎన్నికల వేళ ఏవోబీ(ఆంధ్రా ఒడిసా సరిహద్దు ప్రాంతం)లో మావోయిస్టుల ఆయుధ తయారీ కేంద్రాన్ని భద్రతా దళాలు గుర్తించి సీజ్ చేశాయి. పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండల సమీపాన ఒడిశా రాష్ట్రంలోని సుంకి ప్రాంతం దట్టమైన అడవుల్లో ఆదివారం సాయంత్రం ఆ ఆయుధ తయారీ కేంద్రాన్ని గుర్తించారు. ఆ వివరాలను బీఎస్ఎఫ్ సీవోబీ డి.కాయ్ 65 బెటాలియన్‌కు చెందిన కమాండ్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ సందీప్ కెర్‌కెట్టా సోమవారం ఒడిశా మీడియాకు వెల్లడించారు. ఆయుధ తయారీ కేంద్రం మన్యం జిల్లా పాచిపెంట మండలం కుంతాం బడేవలస, పద్మాపురం గ్రామాలకు మూడు, నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఎన్నికల నేపథ్యంలో ఒడిశాలోని సుంకి క్యాంప్ బీఎస్ఎఫ్ జవాన్లు ఏవోబీ అడవుల్లో ఆదివారం గాలింపు చేపట్టారు. ఆ సమయంలో ఏవోబీ సరిహద్దు వద్ద సంచరిస్తున్న ఇద్దరిని వారు ప్రశ్నించారు. దీంతో ఆయుధ తయారీ కేంద్రం గురించి తెలిసింది. వెంటనే అక్కడకు చేరుకున్న జవాన్లు తుపాకీ తయారీకి వినియోగించే హేండ్ బౌలర్, టిగ్గర్ మెకానిజం, పిల్లర్లు, హేమర్, స్లీపర్, చేజల్, ఫైల్, కత్తులు, ఇనుప బిట్, రంపం తదితర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు ఏపీ పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఏవోబీకి వెళ్లే పి.కోనవలస, దండిగాం, పద్మాపురం తదితర ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

హైదరాబాద్ ఐఐఐటీలో
పీజీ, పీహెచ్‌డీ

హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ - ఎంటెక్, ఎంఎస్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ల్లో చేరేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. పోస్టు గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(పీజీఈఈ) 2024 ద్వారా అడ్మిషన్ పొందవచ్చు.

కోర్సులు: రెండేళ్ళ వ్యవధి కలిగిన ఎంటెక్, ఎంఎస్ బై రీసెర్చ్, అయిదేళ్ళ పీహెచ్‌డీ

విభాగాలు: ఎంటెక్(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్‌ఈ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ(సీఎస్‌ఐఎస్), కంప్యూటర్ ఎయిడెడ్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ (సీఏఎస్‌ఈ) ప్రొడక్ట్ డిజైన్ అండ్ మేనేజ్‌మెంట్(పీడీఎం), ఎంఎస్ బై రీసెర్చ్(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్‌ఈ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ), సివిల్ ఇంజనీరింగ్(సీఈ), బయోటెక్నాలజీ), పీహెచ్‌డీ(కంప్యుటేషనల్ లింగ్విస్టిక్స్(సీఎల్), కంప్యుటేషనల్ నేచురల్ సైన్సెస్ (సీఎన్‌ఎస్), స్పేషియల్ ఇన్ఫర్మేటిక్స్(ఎస్‌ఐ), కాగ్నిటివ్ సైన్స్(సీఎస్), హ్యూమన్ సైన్సెస్ (హెచ్‌ఎస్).

అర్హత: కోర్సును బట్టి బీఎస్సీ, బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్, ఎమ్మెస్సీ ఎంసీఏ, ఎంఏ, ఎంబీబీఎస్, ఎండీ ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంపిక: ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా
దరఖాస్తు రుసుము: రూ.2,500
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 1
ప్రవేశ పరీక్ష: మే 4
ఇంటర్వ్యూలు: ఎంఎస్ జూన్ 5, 6; పీహెచ్‌డీ జూన్ 7, 8
వెబ్‌సైట్: pgadmissions.iiit.ac.in/pgee/

INTERNATIONAL INSTITUTE OF INFORMATION TECHNOLOGY
HYDERABAD

భువనగిరి ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ప్రిపరేటరీ డిగ్రీ కాలేజ్
మహిళలకు 'మిలటరీ' శిక్షణ

స్టీరియోటైప్ కోర్సులకు భిన్నంగా ప్రత్యేకించి మహిళల కోసం భువనగిరి(బీబీనగర్)లో ఏర్పాటు చేసిన కాలేజీ - తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ప్రిపరేటరీ డిగ్రీ కాలేజీ ఫర్ ఉమన్. అండర్ గ్రాడ్యుయేట్, ఇంటిగ్రేటెడ్ ఎంఏ(ఎకనామిక్స్) కోర్సులకు తోడు ఇక్కడ మిలటరీలో చేరేందుకుకు శిక్షణ కూడా ఇస్తారు. నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ అందించే రెగ్యులర్ కోర్సు ఉంటుంది. అదనంగా రిటైర్డ్ డిఫెన్స్ అధికారులతో త్రివిధ దళాల్లో(ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్) చేరేందుకు ఉద్దేశించిన శిక్షణ కూడా ఉంటుంది. ఏఎఫ్‌క్యాట్, సీడీఎస్, ఎన్‌డీఏ తదితర పరీక్షలకు సన్నద్ధం చేస్తారు. ఎస్ఎస్‌బీ సెలక్షన్‌పై కూడా తర్ఫీదు ఉంటుంది.



కోర్సులు: బీఎస్సీ(ఎంపీసీ, ఎంఎస్‌సీఎస్, బీజెడ్‌సీ, ఎంజెడ్‌సీ) బీఏ(హెచ్‌ఈపీ), బీకామ్(కంప్యూటర్స్), ఇంటిగ్రేటెడ్ ఎంకామ్ - మొత్తం ఏడు కోర్సులు. ఒక్కో కోర్సులో 40 చొప్పున మొత్తం 280 సీట్లు ఉన్నాయి.

అర్హత: 2023-24 విద్యా సంవత్సరంలో అంటే ఈ సంవత్సరం ఇంటర్ రెండో ఏడాది/ 12వ తరగతి పరీక్షలు రాస్తున్న బాలికలు ఈ కోర్సుల్లో చేరేందుకు ఉద్దేశించిన కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ రాసేందుకు అర్హులు. బాలికలు తెలంగాణకు చెందిన వారై ఉండాలి. ఎత్తు 152 సెం.మీ అంతకు మించి ఉండాలి. బాలికల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం అర్బన్ ప్రాంతంలో రూ.రెండు లక్షలు, గ్రామీణ ప్రాంతాలైతే రూ.లక్షన్నరకు మించకూడదు. వయస్సు ఈ ఏడాది జూలై 1 నాటికి 16-18 సంవత్సరాలు అంటే 2006 జూలై 1 - 2008 జూలై 1 మధ్య జన్మించి ఉండాలి.

సీట్లు (శాతం): ఎస్సీ 75, బీసీ-సీ 2, ఎస్టీ 6, బీసీ 12, మైనార్టీలు 3, ఓసీ/ ఈబీసీ 2 శాతంగా నిర్ణయించారు.


ఎంపిక: మూడు దశలుగా ఉంటుంది. రాత పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. ఇంటర్‌లో చదివిన గ్రూప్ సబ్జెక్టులకు తోడు ఇంగ్లీష్‌పై కూడా ప్రశ్నలు ఉంటాయి. 100 మల్టిపుల్ చాయిస్ క్వశ్చన్లు అడుగుతారు. డిగ్రీలో గ్రూపును బట్టి ఇంగ్లీష్ సహ సబ్జెక్టులు ఉంటాయి. అలాగే ఇంటిగ్రేటెడ్ ఎంఏకు కూడా ఇంగ్లీష్‌కు తోడు మరో మూడు సబ్జెక్టుల్లో ప్రశ్నలు ఉంటాయి. రెండో దశగా 150 మార్కులకు స్క్రీనింగ్ టెస్టులు ఉంటాయి. ఇందులో ఫిజికల్, ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఆప్టిట్యూడ్, సైకో అనలిటికల్, కమ్యూనికేషన్ స్కిల్స్ టెస్ట్ ఉంటాయి. చివరిగా మెడికల్ ఫిట్‌నెస్ టెస్ట్ ఉంటుంది. ఈ మూడు దశలను విజయవంతంగా పూర్తిచేసుకున్న బాలికలకు మెరిట్, రిజర్వేషన్లకు లోబడి సీట్లు కేటాయిస్తారు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 15
- **రిటెన్ టెస్ట్:** మే 6
- **రెండో దశ టెస్టులు:** మే 24 నుంచి జూన్ 1
- **వెబ్‌సైట్:** tswrsplschools.cgg.gov.in OR http://tswreis.ac.in

ఐఐఎస్సీలో ఎంఈ, ఎంటెక్

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ)- మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్(ఎం ఇంజనీరింగ్), జాయింట్ ఎంటెక్ విత్ తైవానీస్ యూనివర్సిటీస్, ఎంటెక్ (సీఎఫ్‌టీఐ మోడ్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన ప్రకారం గేట్ వ్యాలిడ్ స్కోర్/అకడమిక్ మెరిట్, రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఆగస్టు నుంచి అకడమిక్ సెషన్స్ ప్రారంభమౌతాయి.

ఎంటెక్ సీఎఫ్‌టీఐ మోడ్



స్పెషలైజేషన్‌లు: కంప్యూటేషనల్ అండ్ డేటా సైన్సెస్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ ప్రొడక్ట్ డిజైన్, ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, రోబోటిక్స్ అండ్ అటానమస్ సిస్టమ్స్, సెమీకండక్టర్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్

అర్హత: సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి కనీసం 8 సీజీపీఏతో నాలుగేళ్ల డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. గేట్ స్కోర్ అవసరం లేదు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ స్పెషలైజేషన్‌కు రిటెన్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. మిగిలిన అన్ని స్పెషలైజేషన్‌లకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.

మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్



- ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. స్పెషలైజేషన్ సెమీకండక్టర్ టెక్నాలజీ. ఈ ప్రోగ్రామ్‌ని సంస్థకు చెందిన సెంటర్ ఫర్ నానోసైన్స్ అండ్ ఇంజనీరింగ్ నూతనంగా ప్రారంభించింది.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు గేట్(ఈసీ/ఈఈ/ఐఎన్/ఎంఈ/ఎంటీ/ఎక్స్‌ఈ-సీ) వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు; ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్)/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు గేట్(ఈసీ/ఐఎన్/పీహెచ్) వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి కనీసం 8 సీజీపీఏతో నాలుగేళ్ల డిగ్రీ పూర్తిచేసినవారు కూడా అర్హులే. వీరికి గేట్ స్కోర్ అవసరం లేదు.

జాయింట్ ఎంటెక్ విత్ తైవానీస్ యూనివర్సిటీస్


- ఈ నూతన ప్రోగ్రామ్‌ని ప్రస్తుత అకడమిక్ ఇయర్ నుంచి సెంటర్ ఫర్ నానోసైన్స్ అండ్ ఇంజనీరింగ్, తైవానీస్ యూనివర్సిటీస్ ఉమ్మడిగా నిర్వహిస్తున్నాయి. ఈ ప్రోగ్రామ్‌లో ప్రధానంగా ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి.

పార్టిసిపేటింగ్ తైవానీస్ యూనివర్సిటీలు: నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ తైవాన్, నేషనల్ చియో తుంగ్ యాంగ్ మింగ్ యూనివర్సిటీ, నేషనల్ సింగ్ హువా యూనివర్సిటీ, నేషనల్ సన్ యాట్ సెన్ యూనివర్సిటీ

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు; ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్) పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి 8 సీజీపీఏతో డిగ్రీ ఉత్తీర్ణులు కూడా అర్హులే.

ఎంపిక: గేట్ వ్యాలిడ్ స్కోర్/అకడమిక్ మెరిట్‌కు 70 శాతం, రిటెన్ టెస్ట్ స్కోర్/ ఇంటర్వ్యూ స్కోర్‌కు 30 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 29
- **రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు:** జూన్ 10 నుంచి 13 వరకు
- **వెబ్‌సైట్:** www.iisc.ac.in



సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

(సోమవారం దిక్సూచి తరువాయి)

పిటీషనర్ల ప్రముఖ వాదనలు


1. ముస్లిం శరణార్థులను అనుమతించకపోవడం, మత వివక్ష ప్రాతిపదికపై పౌరసత్వం ఇవ్వడం వంటి అంశాల ద్వారా ఈ పౌరసత్వ సవరణ చట్టం దేశ రాజ్యాంగ మౌలిక లక్షణాలైన సమానత్వం, లౌకికతత్వం వంటి ప్రాథమిక హక్కుల అంశాలను ఉల్లంఘిస్తోంది. అందువల్ల ఈ చట్ట సవరణ రాజ్యాంగ వ్యతిరేకం.

2. కేవలం పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి వచ్చే శరణార్థులను మాత్రమే అనుమతించడం, ఇతర సరిహద్దు దేశాలైన మయన్మార్, నేపాల్, శ్రీలంక వంటి దేశాలకు ఈ చట్టాన్ని వర్తించకపోవడం వంటి ప్రాంతీయ వివక్ష కూడా ఈ చట్ట సవరణ ద్వారా ఏర్పడింది.

3. అతి సున్నిత, సాంస్కృతికపరంగా వైవిధ్యమైన తెగలు గల ఈశాన్య రాష్ట్రాలు సరిహద్దు ప్రాంతాల నుంచి ఇప్పటికీ అక్రమ వలస సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ఇప్పుడు బంగ్లాదేశ్ నుంచి వచ్చిన శరణార్థులకు పౌరసత్వం కల్పించడం ద్వారా ఈ ప్రాంత తెగల సంస్కృతికి ముప్పు ఏర్పడుతుంది. ఈ ప్రాంతంలో కొరతగా ఉన్న వనరులపైన ఒత్తిడి అధికమౌతుంది. అక్కడి ఆదివాసీల ప్రత్యేక హక్కులకు భంగం కలుగుతుంది. ప్రస్తుతం ఈ చట్టం 2024 మార్చి 12 నుంచి అమలులోకి వచ్చింది.

ఈ చట్టం ప్రకారం భారత సరిహద్దున గల మూడు ముస్లిం దేశాలైన పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్‌ల నుంచి వచ్చిన ఆరు ముస్లిమేతర మతాల (హిందూ, క్రిస్టియన్, సిక్కు, జైన, బౌద్ధ, పార్సీ) శరణార్థులకు(ఎవరైతే ఆ దేశాల్లో మతహింసకు గురైతమ దేశాన్ని వీడి భారత్‌కు శరణార్థులుగా వచ్చారో వారికి) ఎటువంటి వీసా, పాస్‌పోర్ట్ వంటి ధృవీకరణ పత్రాలు లేనప్పటికీ, కొన్ని గుర్తింపు పత్రాలు సమర్పించడం ద్వారా భారత పౌరసత్వం కల్పించనున్నారు.

ఈ విధంగా పౌరసత్వం పొందడానికి ఆ శరణార్థులు 2014 డిసెంబరు 14లోగా భారత్‌కు వచ్చి ఉండాలి. వారు కనీసం అయిదు సంవత్సరాలు లేదా అంతకన్నా ఎక్కువకాలంగా భారత్ నివసిస్తున్నట్లు ధృవీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్ ద్వారానే జరుగుతుంది. వారు భారత రాజ్యాంగం గుర్తించిన షెడ్యూల్ 8లో గల భాషల్లో ఏదైనా ఒకటి మాట్లాడగలమని స్వయం ధృవీకరణ సమర్పించాలి. అంతేకాక తాము పౌరసత్వ చట్టం అనుమతిస్తున్న మూడు దేశాల్లో ఏదైనా ఒక దేశానికి చెందినవారిమని ధృవీకరించే ఆధారాలు అంటే ఆ దేశాలు జారీచేసిన జనన ధృవీకరణ, విద్యాసంస్థలు జారీచేసిన సర్టిఫికెట్లు, ఐడెంటిటీ కార్డులు, వీసా లేదా పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్ వంటివి, భూమిహక్కు లేదా కౌలుదారీ పత్రాలు వంటివి ఏవైనా అక్కడి ప్రభుత్వాలు జారీచేసిన పత్రాలను ఆధారంగా చూపవచ్చు. ఇవి తమ తల్లిదండ్రులు, తాతలకు, ముత్తాతలకు సంబంధించినవి ఏవైనా సరే ఆధారాలుగా చూపవచ్చు. వీటిద్వారా ఆ శరణార్థులు ఏ దేశానికి చెందినవారు, ఏ మతానికి చెందినవారు అనే అంశాలను ధృవీకరించవచ్చు.



అదే విధంగా ఆ శరణార్థులు భారతదేశానికి 2014 డిసెంబరు 14లోగా రావడం జరిగిందని నిరూపించడానికి ఈ చట్ట నిబంధనల ప్రకారం 20 రకాల డాక్యుమెంట్స్‌ను అనుమతించారు. అవి:

- ఫారిన్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్(ఎఫ్‌ఆర్‌ఆర్‌ఓ) ద్వారా పొందిన స్లిప్
- జనాభా లెక్కల అధికారులు అందించిన రశీదు
- ఆధార్‌కార్డు
- వ్యాలిడ్ వీసా
- డ్రైవింగ్ లైసెన్స్
- రేషన్‌కారు
- గవర్నమెంట్ లేదా కోర్టుల ద్వారా జారీ అయిన ఏదైనా పత్రాలు
- బ్యాంక్ పాస్‌బుక్
- పాన్‌కార్డు
- వివాహ లేదా జనన ధృవీకరణ పత్రాలు
- యుటిలిటీ బిల్లులు
- స్కూల్ సర్టిఫికెటు
- ఏదైనా స్థానికసంస్థకు ఎన్నికైన పదవిలోని వ్యక్తి లేదా రెవెన్యూ ఆఫీసర్ జారీ చేసిన ధృవపత్రాలు వంటి దాదాపు 20 రకాల పత్రాలను ఆధారాలుగా పరిగణిస్తారు.

ఈ మినహాయింపులను సులభతరం చేయడానికి పౌరసత్వ సవరణ చట్టంలోని అనేక అంశాలను చాలావరకూ కుదించారు. ఉదాహరణకు భారతదేశ పౌరసత్వాన్ని విదేశీయులు నేచురలైజేషన్ విధానం ద్వారా పొందాలనుకున్నప్పుడు వారు కనీసం 14 సంవత్సరాలపాటు దేశంలో నివసిస్తున్నవారై ఉండాలనే నిబంధనను ఈ చట్ట సవరణ ద్వారా అయిదు సంవత్సరాలకు కుదించారు.

అదేవిధంగా భారతీయ భాషల్లో వారికి ఒక్కటైనా వచ్చని నిర్ధారించే విద్యాసంస్థలు జారీచేసిన సర్టిఫికెట్ స్థానంలో స్వయం ధృవీకరణ సమర్పిస్తే సరిపోతుంది.

ఎటువంటి వాలిడ్ వీసా, లాంగ్‌టర్మ్ వీసాలు లేనప్పటికీ వాటి గడువు దాటిపోయినా వీరికి ఎటువంటి అడ్డంకులూ ఉండవు. కేవలం తమ జాతీయత, మతం, భారతదేశంలోకి నిర్ధారిత కటాఫ్ సమయం కంటే ముందే వచ్చామని నిరూపించుకుంటే సరిపోతుంది. అలాగే ఈశాన్య రాష్ట్రాల ప్రాంతాల్లోకి ప్రవేశించడానికి, సంచరించడానికి అవసరమైన లైన్ పర్మిట్ విధానం ఈ శరణార్థుకు వర్తించదు.

ఈవిధంగా అనేక మినహాయింపులు పొందడం ద్వారా అనేకమంది శరణార్థులు భద్రమైన జీవనం గడపడానికి ఏళ్లతరబడి చూస్తున్న ఎదురుచూపులకు తెరపడనుంది. ఈ పౌరసత్వ దరఖాస్తుదారులు స్థానిక అధికారుల, నాయకుల వ్యతిరేకతకు దోపిడీకి గురవకుండా ఆన్‌లైన్ విధానం ద్వారా మాత్రమే తమ దరఖాస్తులు సమర్పించే వెసులుబాటు తీసుకువచ్చారు. ఈ దరఖాస్తులను పరిశీలించడానికి కేంద్రప్రభుత్వం జిల్లాస్థాయిలో సాధికార డిస్ట్రిక్ లెవల్ కమిటీ(డీఎల్‌సీ)లను ఏర్పాటుచేసింది. దరఖాస్తులను ఈ కమిటీ ప్రాసెస్ చేయగా, పౌరసత్వం అందించే అధికారం ఒక ఎంపవర్డ్ కమిటీకి ఉంటుంది. ఈ కమిటీలో సెన్సెస్ డిపార్ట్‌మెంట్, హోంమంత్రిత్వశాఖ, పోస్ట్‌మాస్టర్ జనరల్, నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్లకు చెందిన స్టేట్ ఇన్ఫర్మాటిక్స్ ఆఫీసర్స్ వంటి శాఖలకు సంబంధించిన ప్రతినిధులను ఉంటారు. రైల్వేస్ నుంచి రాష్ట్ర హోంశాఖల నుంచి ప్రత్యేక ఆహ్వానితులు ఈ కమిటీ ఉంటారు. ఈ కమిటీకి సెన్సర్ విభాగానికి చెందిన అధికారి డైరెక్టర్‌గా ఉంటారు.

అదేవిధంగా డీఎల్‌సీల్లో ఆ జిల్లాలకు చెందిన డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ లేదా వారి ప్రతినిధి, కేంద్రప్రభుత్వం నామినేట్ చేసిన అధికారులు ఉంటారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ ప్రతినిధిగా తహసిల్దార్ హోదాకు తగ్గని వ్యక్తి, రైల్వేశాఖ ప్రతినిధిగా జ్యురిస్‌డిక్షనల్ స్టేషన్ మాస్టర్ ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారు.

ఈవిధంగా డీఎల్‌సీల ద్వారా దరఖాస్తులు పరిశీలించి, ఎంపవర్డ్ కమిటీ ద్వారా పౌరసత్వం జారీ చేస్తుంది. అయితే కొన్ని మతాల వారిని మాత్రమే శరణార్థులుగా గుర్తించి, అదీ కొన్ని దేశాలకు చెందినవారికి మాత్రమే పౌరసత్వం ఇచ్చి ఆదుకొనే ప్రయత్నం చేయడం వివక్షాపూరితంగా ఉందన్నది ప్రధాన విమర్శ. ఆ కారణంతోనే కేరళ, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు ఈ చట్టాన్ని అమలుచేయబోమని పేర్కొంటున్నాయి. ఈ రాష్ట్రాలకు తోడు ముస్లిం మతసంస్థలు, ఇతరత్రా సంఘాలు, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు కూడా చర్చను లేవదీశాయి.

అయితే ప్రభుత్వం మాత్రం తాము కొత్తగా వివక్ష చూపడం అంటూ ఏమీ లేదని అంటోంది. గతంలో 2004 నుంచి అమలులో ఉన్న ప్రభుత్వ ఆదేశాలకు ఒక నిర్దిష్ట చట్టరూపం తెచ్చామని వాదిస్తోంది. అదీ కాక చుట్టుపక్కల మూడు ముస్లిం దేశాల్లో మత హింసకు గురవుతున్న అక్కడి మైనారిటీ వర్గాల శరణార్థులకు ఆశ్రయం కల్పించడం మత ప్రాతిపదికన వివక్ష చూపడం కాదని, ఆ దేశాల్లో మెజారిటీలుగా ఉన్న ముస్లింలకు మన దేశ పౌరసత్వం కల్పించాల్సిన అవసరం లేదన్నది కేంద్రప్రభుత్వ వాదన. అదే విధంగా ఇతర దేశాలు, మతాలకు చెందిన శరణార్థులకు వారు అక్కడ మెజారిటీ మతాలకు చెందిన వారైనప్పటికీ శరణార్థులుగా వచ్చిన సందర్భాల్లో లాంగ్‌టర్మ్ వీసా(ఎల్‌టీవీ)లు కల్పించి వారిని సైతం ఆదుకోవడం జరుగుతోందని తెలిపింది. పరిస్థితులు చక్కబడిన వెంటనే ఆ మెజారిటీ వర్గాల వారు తిరిగి వెళ్లిపోవడానికి ఆసక్తి చూపుతారని, అందువల్ల వారికి శాశ్వత భారత పౌరసత్వం కల్పించనవసరం లేదని ప్రభుత్వం చెబుతోంది.

అంతేకాకుండా ఉప తెగల మధ్య పోరు కారణంగా ముస్లిం దేశాల నుంచి కొందరు ముస్లింలు శరణార్థులుగా వస్తుంటారని పేర్కొంది. అంతర్గతంగా జరిగే కుమ్ములాటల తో దేశం విడిచివచ్చే వారికి ఈ చట్టాన్ని వర్తింపచేయలేమని కేంద్ర ప్రభుత్వం వివరణ ఇస్తోంది.


ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

లిటిల్స్



పనికిరాని ఆలోచన

ఒక అడవిలో ఓ కుందేలు ఉండేది. ఆ కుందేలుకు తనే గొప్ప కావాలనే ఆలోచన ఉండేది. తనకంటే అందరూ తక్కువ. తనను చూసి అందరూ భయపడాలని అనుకునేది. కుందేలు పట్టాలని ఓ వేటగాడు వల పన్నాడు. కుందేలు రోజులానే తన ఆహారానికి వెళ్తోంటే.. అది చూసి ఓ కొంగ జాలిపడింది. 'అటు వైపు వెళ్లకు అని సలహా' ఇచ్చింది. కుందేలు అక్కడే ఆగిపోయింది. వేటగాడు పన్నిన ఆ ఉచ్చులో అడవి పంది పడింది. దీంతో కుందేలు హమ్మయ్య అనుకుంది. ఆ కొంగతో స్నేహం కొనసాగించింది.

కొంగ దగ్గరకు పోయి కుందేలు రోజూ బీరాలు పలికేది. కొంగ అవన్నీ పట్టించుకునేది కాదు. ఒక రోజు కొంగతో కుందేలు ఇలా అన్నది. 'ఓ నక్క ఉన్నది. దాన్ని భయపెట్టాలి' అన్నది. 'అది నీవల్ల కాదేమో' అన్నది కొంగ. 'నాకు దంతాలు బావున్నాయా?' అనడిగింది కుందేలు. 'చక్కగా ఉన్నాయి' అన్నది. 'నాకు కోర పండ్లు కావాలి. అమరుస్తావా?' అన్నది. 'నీకెందుకు కోర పండ్లు' అనడిగింది. 'నన్ను చూసిన తర్వాత ఆ నక్క భయపడాలి' అంటూ ఊగిపోయింది. చేసేది ఏమీలేక.. ఆ కుందేలుకు రెండు కోర పండ్లను అమర్చింది కొంగ.


ఆ కోరపండ్లను చూసి ఇతర జంతువులన్నీ భయపడతాయనేది



కుందేలు ఆలోచన. అడవిలోని ఓ కొలను దగ్గరకు వెళ్లి తన దంతాలను చూసుకుంది. 'నక్కలేమి కర్మ, పులులూ భయపడాల్సిందే' అనుకుంది మనసులో. ఆ కుందేలును చూసి తోటి కుందేళ్ళ భయపడి పరిగెత్తాయి. కుందేలుకు మరింత ఉత్సాహం వచ్చింది. నక్క ఉండే చోటకు కుందేలు నడిచింది. ఓ నక్క పొదలచాటున ఉంది. దాని దగ్గరకు కుందేలు పోబోయింది. నక్క పోతుందనేది కుందేలు ఆలోచన. కుందేలు దగ్గరకు వచ్చిన తర్వాత క్షణాలు నక్క దూకింది. కుందేలు క్షణాల్లో తప్పించుకుని పరిగెత్తింది. బాధతో కుందేలు తన మిత్రుడు దగ్గరకు చేరింది. అసలు ఈ దంతాలతో ఎవరూ భయపడలేదన్నది.

'మార్చాల్సినది దంతాలు కాదు. అయినా కోర పండ్లు ఉంటే ఎందుకు భయపడాలి?నువ్వు కుందేలువే కదా' అన్నది. 'అవును' అన్నది కుందేలు. 'మారాల్సింది నీ భయం. నీ పిరికిగుండెతో ఎన్ని కోరపండ్లు ధరించినా ఏం లాభం? ఏ వేషం వేసినా ఉపయోగమేమీ' అన్నది కొంగ. 'అంతేనంటావా?' అనడిగింది. 'అవును ఈ పనికిరాని ఆలోచలను పక్కనబెట్టేసి నీ బతుకు నువ్వు బతుకు' అన్నది.

ఏవి ఎన్ని?



సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 264

		3						2
	6				3		8	
	2		6	4	8	9		
	9	7						
8				2				5
						7	1	
		2	8	7	4		5	
	1		5				4	
5						2		

సుడోకు - 263 సమాధానం

2	1	6	3	9	4	7	5	8
9	5	7	8	6	1	2	3	4
3	4	8	5	7	2	1	9	6
6	8	3	1	2	7	9	4	5
5	7	4	6	3	9	8	1	2
1	2	9	4	8	5	6	7	3
4	6	2	9	1	3	5	8	7
7	9	5	2	4	8	3	6	1
8	3	1	7	5	6	4	2	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.